

## నక్సల్బరీ తరం సీనియర్ కమ్యూనిస్టు, మన పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ దా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో మనకు నిరంతరం ప్రేరణనిస్తూనే ఉంటారు!

సీనియర్ కమ్యూనిస్టు, మా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నక్సల్బరీ తరం మిగిలిన విప్లవకారులలో ఒకరు, కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ (బిజయ్, ప్రసాద్) క్యాన్సర్ వ్యాధితో 80 ఏళ్ల వయసులో 2017 ఏప్రిల్ 16వ తేదీన కోల్‌కత్తాలో తుది శ్వాస విడిచారు. తప్పుడు ఆరోపణలతో దాదాపు తొమ్మిది సంవత్సరాల పాటు శత్రువు ఆయనను జైలులో నిర్బంధించి వేధించాడు. పెరుగుతున్న వయసు, క్షీణిస్తున్న ఆరోగ్యం వల్ల 2014 నవంబరులో బెయిలు మీద విడుదల అయ్యారు. మరణించే నాటికి ఆయన మీద వివిధ రాష్ట్రాలలో పోలీసులు పెట్టిన అనేక తీవ్ర కేసులు నడుస్తున్నాయి. సుదీర్ఘ జైలు జీవితం, భారత ప్రభుత్వం ఆయనకు వైద్య సేవలు అందించడానికి నిరాకరించడం వల్ల అరెస్టు నాటికి ఉన్న అనారోగ్యం మరింతగా పెరిగింది. ఆయన అకాల మరణానికి భారత ప్రభుత్వమే కారణం. కామ్రేడ్ బిజయ్ అస్తమయంతో మా సీసీ, పార్టీ, విప్లవోద్యమం, దేశ శ్రామిక ప్రజానీకం దాదాపు అర్ధ శతాబ్దం పాటు పీడిత ప్రజల, విప్లవ ప్రయోజనాలనే మదిలో నిలుపుకుని తమకు నిస్వార్థంగా సేవ చేసిన తమ ప్రియమైన నాయకులలో ఒకరిని కోల్పోయారు. ఆయన మరణం మా పార్టీకి, భారత విప్లవానికి, ప్రజలకూ పెద్ద నష్టం. మా పార్టీ కేంద్ర కమిటీ మా ప్రియతమ కామ్రేడ్ బిజయ్‌దాకు బరువెక్కిన హృదయాలతో వినమ్రంగా విప్లవ నివాళులు అర్పిస్తున్నది. ఆయన ఏ ఆశయాల కోసం జీవించారో, మరణించారో వాటిని కొనసాగిస్తామని పిడికిలి బిగించి ప్రతిన బూనుతుంది. ఆయన కుటుంబానికి, స్నేహితులకు, దేశవ్యాప్తంగా ఆయనను ఎరిగి ఉన్న కామ్రేడ్స్‌కూ కేంద్ర కమిటీ సంతాపం తెలియజేస్తున్నది. యావత్తు పార్టీ, పీఎల్‌జీఏ, దేశవ్యాప్తంగా ఉన్న విప్లవ ప్రజా సంఘాలూ ఈ ఆదర్శ కమ్యూనిస్టుకు విప్లవ నివాళి అర్పించాలి, ఆయన కార్మికవర్గ లక్షణాలను నేర్చుకోవాలి, జీవితమంతా నక్సల్బరీ పంథాకు అంకితమయిన ఆయన నుంచి ప్రేరణ పొందాలి. దోపిడీ పీడనలు లేని సమాజం కోసం ఆయన కలలు కన్న

## బోల్షివిక్ విప్లవ శత వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

# క్రాంతి

### లోపలి పేజీల్లో...


బోల్షివిక్ విప్లవ శతవార్షికోత్సవం....7
డోక్లామ్ సంక్షోభ పరిణామాలు ....23
పార్టీ13వ వార్షికోత్సవ సందేశం ..28
సింగరేణిలో నిరుద్యోగ కార్మికులు..38
నేరేళ్ల దళితులపై దాడి ...42
మాడ్‌లో తలపెట్టిన రెవెన్యూసర్వే...44
'సమాధాన్'కు జవాబు ...48
అమరవీరుల జీవిత చరిత్రలు ....52



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 41 సంచిక: 2 ఏప్రిల్ 2017-సెప్టెంబర్, 2017 వెల: పది రూపాయలు

స్వప్నాన్ని సాకారం చేయడానికి ప్రతిన బూనాలి.

### ప్రారంభ రాజకీయ జీవితం

కామ్రేడ్ నారాయణ సన్యాల్ 1937లో పశ్చిమ బెంగాల్‌లో చదువుకున్న మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. తన చిన్నతనంలో వలస వ్యతిరేక పోరాటం, భారత విభజన, కమ్యూనిస్టు ఉద్యమం, ముఖ్యంగా బెంగాల్ తెభాగా ఉద్యమంతో ఆయన ఉత్తేజం పొందాడు. యవ్వనంలో కమ్యూనిజంతో ప్రభావితుడయ్యాడు. విద్యార్థి జీవితంలో స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యకర్త అయ్యాడు. త్వరలోనే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో సభ్యుడయ్యాడు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన కొద్ది కాలంలోనే ప్రభుత్వ రంగ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. భాకపాకు అనుబంధంగా ఉన్న బ్యాంకు ఉద్యోగుల సంఘంలో కార్యకర్తగా ఆయన తన రాజకీయ కృషి ప్రారంభించాడు. అప్పటికి భాకపా నాయకత్వం గొంతు లోతు రివిజనిజంలో మునిగిపోయి ఉన్నది. సీపీఎస్‌యూలో కృశ్చేవ్ రివిజనిస్టు ముఠాకు వ్యతిరేకంగా మావో నేతృత్వంలో సీపీసీ నిర్వహించిన గ్రేట్ డిబేట్ ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలలో రివిజనిస్టు వ్యతిరేక పోరాటాలు రగిలించింది. భారతదేశంలో కూడా నిజమైన కమ్యూనిస్టులు భాకపా రివిజనిస్టు నాయకత్వాన్ని ప్రశ్నించనారంభించారు. సైద్ధాంతిక పోరాటం ఆరంభమయింది. ఇండో-చైనా యుద్ధంలో ఈ పోరాటం మరింత తీవ్రతరమయింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఈ చర్చను కామ్రేడ్ బిజయ్ అత్యంత ఆసక్తితో గమనించారు. సీపీసీని సమర్థించి భాకపాలో విప్లవకారులతో మమేకమయ్యాడు. పార్టీ చీలిపోయి భాకపా (మార్క్సిస్టు) ఏర్పడినప్పుడు రివిజనిజంతో నిర్ణయాత్మకంగా విడివడి, విప్లవ పంథా చేపడుతుందని ఆశించి ఆయన నూతన పార్టీలో సభ్యుడయ్యాడు. అయితే భాకపా (మార్క్సిస్టు) నాయకత్వ మితవాద అవకాశవాదం దాని కార్యక్రమంలో, ఆచరణలో త్వరలోనే బయటపడింది. కామ్రేడ్స్ సీఎం, కేసీ వంటి నిజమైన విప్లవకారులు దాని మీద తీవ్రమైన విమర్శలు చేశారు. ప్రత్యేకించి కామ్రేడ్ సీఎం చారిత్రక ఎనిమిది డాక్యుమెంటులు విప్లవ పంథా అనుచరులపై గొప్ప ప్రభావం వేశాయి. వీరు మావో సే తుంగ్ ఆలోచనా విధానాన్ని, సీపీసీని ఎత్తిపట్టారు. భాకపా(మార్క్సిస్టు)లో ఈ తీవ్ర సైద్ధాంతిక పోరాటంతో కామ్రేడ్ బిజయ్ ఎంతగానో ప్రభావితమయ్యారు. చైనా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం, దేశంలో పెరుగుతున్న విప్లవ సంక్షోభాల నేపథ్యంలో ఈ పోరాటం తీవ్రతరమయింది. ఇది మహత్తర నక్సల్బరీ విప్లవ రైతాంగ తిరుగుబాటుగా బద్దలయింది. కామ్రేడ్ బిజయ్ సీఎం విప్లవ పంథాను దృఢంగా సమర్థించారు, నక్సల్బరీ విప్లవ రైతాంగాన్ని ఎత్తిపట్టారు. భాకపా(మార్క్సిస్టు)తో సమస్త బంధాలనూ తెగగొట్టుకుని విప్లవ కార్యకలాపాలలోకి దూకారు. నూతనంగా ఏర్పడిన భాకపా (మార్క్సిస్టు-లెనినిస్టు)లో సభ్యుడయ్యారు. ఆ తరువాత కొద్ది కాలానికే కామ్రేడ్ బిజయ్ తన బ్యాంకు ఉద్యోగం విడిచిపెట్టి వృత్తి విప్లవకారుడయ్యారు. నక్సల్బరీ జ్వాలలను విస్తరించడానికి, బేస్ ఏరియాలను నిర్మించే దృక్పథంతోనూ భాకపా(మా-లె) ఆయనను 1960 దశకం చివరిలో భూస్వామ్య పీడనలో అణగి ఉన్న రైతాంగాన్ని సంఘటితం చేయడానికి గ్రామీణ బీహార్‌కు పంపించింది. నక్సల్బరీ సృష్టించిన ప్రకంపనలు అప్పటికే బీహార్‌లో భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి దారి తీశాయి. కామ్రేడ్ బిజయ్ ఈ పోరాటంలో పూర్తిగా నిమగ్నమయిపోయారు. 1969-72 మధ్య భూస్వాముల గూండాల, పోలీసుల దాడులలో దేశవ్యాప్తంగా వందలాది మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. రాజ్య నిర్బంధంలో భాగంగా వేలాది మంది అరెస్టయ్యారు. ఈ కఠిన పరిస్థితిలో ఆయన నక్సల్బరీ పంథాను దృఢంగా ఎత్తిపట్టాడు, వికృత ముఖంతో బహిర్గతమయిన రివిజనిస్టు పంథా మీద పోరాటం చేశారు. 1970-71లో సత్యనారాయణ సింగ్ (మాలె పార్టీ సీసీఎం, పీబీఎం) విచ్ఛిన్నకర, మితవాద అవకాశవాద, దివాళాకోరు పంథాకు వ్యతిరేకంగా స్థిరమైన పోరాటాన్ని నడిపి, నక్సల్బరీ పంథాను ధైర్యంగా ఎత్తిపట్టాడు. పార్టీకి, ఉద్యమానికీ ఎస్ఎన్ఎస్ విద్రోహం తరువాత కామ్రేడ్ బిజయ్ బీహార్ రాష్ట్ర కమిటీకి కార్యదర్శి అయ్యారు. అయితే స్వల్ప కాలంలోనే 1972లో ఆయన అరెస్టు కావడంతో ఎక్కువ కాలం బీహార్ ఉద్యమానికి మార్గదర్శకం వహించే, దానిని పెంపొందించే అవకాశం ఆయనకు దక్కలేదు.

### విప్లవ శక్తుల ఐక్యతలో, భాకపా(మా-లె)పీయూ పార్టీ ఏర్పాటులో ఆయన పాత్ర

అరెస్టయిన తరువాత కామ్రేడ్ బిజయ్‌దాను ముందుగా బీహార్‌లో ఒక జైలులో ఉంచారు. ఆ తరువాత బెంగాల్‌లో ఉంచారు. ఆయన పోలీసు నిర్బంధంలో క్రూరమైన చిత్రహింస అనుభవించారు. కానీ స్థిరంగా నిలబడ్డారు. శత్రువును ఎదుర్కోవడంలో ఇతరులకు ప్రేరణగా నిలిచారు. ఇతర అనేక మంది నాయకత్వ కామ్రేడ్స్ మాదిరిగానే, ఆయనా ఇతర విప్లవకారులూ జైలు అధికారుల పలు దాడులలో నిలదొక్కుకున్నారు. వారందరితో కలిసి రాజకీయ ఖైదీల హక్కులతో సహా అనేక డిమాండ్‌లతో కొనసాగిన జైలు ఖైదీల

అనేక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించాడు. జైలులో ఉన్నప్పుడు ఆ తరువాత భాకపా(మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడయిన కామ్రేడ్ పరిమళ్ సేన్ (అజయ్), భాకపా(మావోయిస్టు) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యుడయిన కామ్రేడ్ అజిత్, మరి కొందరు నాయకత్వ కేడర్‌లతో కామ్రేడ్ నారాయణ సన్యాల్ సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకున్నాడు. అంతవరకు భాకపా(మాలె) నాయకత్వం వహించిన విప్లవోద్యమాన్ని వారు సమిష్టిగా సమీక్షించారు. కొన్ని మౌలిక అంశాలలో ఒకే విధమైన భావాలను పెంపొందించుకున్నారు. ఒక నిజమైన పార్టీ ఉంటే, ఈ సమీక్ష పునాదిగా నిజమైన విప్లవకారులతో ఐక్యత గురించి వారు ఒక అవగాహనకు వచ్చారు. భాకపా(మా-లె) పంథా, సీఎం పాత్ర మీద మితవాద అవకాశవాదులు నిర్దాక్షిణ్యమైన దాడులు సాగిస్తున్న వాతావరణంలో కామ్రేడ్ సీఎం అమరత్వం, నక్సల్బరీ వెనకడుగులతో చీలికలు, ఐక్యతా సమస్య, నైతికత సమస్యలు విప్లవ శిబిరాన్ని స్తంభింపజేశాయి. అప్పుడు నిజమైన విప్లవ శక్తులతో ఐక్యత కోసం, ఉద్యమాన్ని పునర్నిర్మించడం కోసం జరిగిన కృషిలో కామ్రేడ్ బిజయ్ జైలు నుంచి చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత కామ్రేడ్ బిజయ్‌తో పాటుగా అనేక మంది కామ్రేడ్స్ జైళ్ల నుంచి విడుదలయ్యారు. ఆయనా, ఆయనలా ఆలోచించే కామ్రేడ్స్ త్వరలోనే నిజమైన విప్లవ గ్రూపులు, వ్యక్తులతో చర్చలు నిర్వహించి, భాకపా(మాలె) ఎనిమిదో కాంగ్రెస్ అవలంబించిన పంథా, తమ గత సమీక్ష పునాదిగా ఐక్యం కావడానికి నిజాయితీగా కృషి చేశారు. అయితే ఆ కృషి ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. తమ సమీక్ష పునాదిగా విప్లవోద్యమాన్ని పెంపొందిస్తే తప్ప తమ కృషి సాకారం కాదని వారు గుర్తించారు. ఈ గుర్తింపుతో వారు 1978 నవంబరులో మహాసభ నిర్వహించారు. భాకపా(మా-లె) చారిత్రక ప్రాముఖ్యత గురించి, ఐక్యత గురించి, వర్గ శత్రు నిర్మూలన 'పంథా' గురించీ మూడు ముఖ్యమైన డాక్యుమెంట్లను ఆమోదించారు. ఈ చారిత్రక మహాసభలో భాకపా(మాలె)(పార్టీ యూనిటీ) అనే నూతన పార్టీ ఏర్పడింది. పార్టీకి నాయకత్వం వహించడానికి సీఓసీని ఎన్నుకున్నారు. కామ్రేడ్ బిజయ్ ఇందులో సభ్యుడయ్యాడు. దక్షిణ మధ్య బీహార్‌లో వ్యూహాత్మక దృష్టితో విప్లవ రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలని పార్టీ నిర్ణయించింది. అలాగే పశ్చిమ బెంగాల్‌లో నాదియా, ముర్షిదాబాద్ జిల్లాలలో కూడా రైతాంగంలో కృషి ప్రారంభించింది.

పార్టీ యూనిటీ ఏర్పాటు తరువాత సీఓసీ ఇతర విప్లవ గ్రూపులతో ఐక్యతా కృషి ప్రారంభించింది. మొదటి ఐక్యత 1980లో కమ్యూనిస్టు క్రాంతికారీ సంగఠన్ (సీకేఎస్)తో జరిగింది. ఇది భాకపా(మాలె)(యూఓ) ఏర్పాటుకు దారి తీసింది. మునుపటి సీఓసీ, భాకపా(మా-లె)లో ఒక సెక్షన్ కామ్రేడ్స్ శర్మ, అప్పలసూరి నాయకత్వంలో 1982 జనవరిలో యూఓతో కలిసి భాకపా(మాలె) పార్టీ యూనిటీ ఏర్పడింది. ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌లో చురుకుగా ఉన్న సీసీఆర్ఐ(మా-లె) బీహార్ ఫాక్షన్ 1988లో పీయూతో ఐక్యమయింది. పంజాబ్‌లో కోఆర్డినేషన్ సెంటర్ (లేదా సంగ్రామ్ గ్రూపు)గా ఉన్న భాకపా(మాలె)సీటీలో ఒక సెక్షన్ 1990లో పీయూతో ఐక్యమయింది. ఈ అన్ని ఐక్యతలలోనూ కామ్రేడ్ బిజయ్ ప్రధాన పాత్ర వహించారు.

**విప్లవోద్యమాన్ని పెంపొందించడంలో బిజయ్‌దాదా పాత్ర**

విలీనాలతో పటిష్టమైన పీయూ బీహార్ మగధ్ ప్రాంతంలో వ్యవసాయ విప్లవాన్ని పెంపొందించే లక్ష్యంతో కృషి చేయసాగింది. పార్టీ కేంద్ర నాయకత్వంలో ఒక గణనీయమైన సెక్షన్ ఈ కర్తవ్యం కోసం కేంద్రీకరించింది. కామ్రేడ్ ఈ కృషిలో అగ్ర భాగాన ప్రత్యక్షంగా కార్యక్షేత్రంలో ఉండి నాయకత్వం వహించారు. నక్సల్బరీ విప్లవ రైతాంగ పోరాట అనుభవం నుంచి నేర్చుకుంటూ, ప్రజా పంథాను అమలు చేస్తూ, కోయల్ కైమూర్, జహానాబాద్, ఔరంగాబాద్ ప్రాంతంలో శక్తివంతమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటం నిర్మించారు. పార్టీ యూనిట్‌లు ఏర్పరిచారు. కార్మికులు, రైతాంగ సంస్థ (ఎంకేఎస్ఎస్)ను నెలకొల్పారు. భూస్వాముల గూండాలను, రాజ్య సాయుధ బలగాలను ప్రతిఘటించడానికి ప్రజా మిలీషియాను, గెరిల్లా దళాలనూ ఏర్పరిచారు. ప్రజా సంఘాల నుంచి మిలీషియా నుంచి పార్టీలోకి, గెరిల్లా దళాలలోకీ సభ్యులను భర్తీ చేసుకుని ఉద్యమాన్ని పటిష్టం చేశారు. భూస్వాములు, పోలీసుల నుంచి ఆయుధాలు గుంజుకుని ఈ దళాలు విస్తరించాయి. ఉద్యమ ఫలితాలను సంఘటితం చేసుకుని పురోగమించడం కోసం పార్టీ ఎడ్యుకేషన్‌ను అందించారు. అలాగే బెంగాల్ మైదాన ప్రాంతాలలో, ముఖ్యంగా నాదియా, ముర్షిదాబాద్, మాల్డా జిల్లాలో సీపీఎం సోషల్ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ పార్టీ రైతాంగ విప్లవ పోరాటాన్ని పెంపొందించింది. పీయూ నాయకత్వంలో ఒక సెక్షన్ ఈ ఉద్యమాన్ని పురోగమింపజేయడానికి కేంద్రీకరించింది. ఇది పీయూ నాయకత్వంలో వర్గ పోరాటానికి ఒక ముఖ్యమైన ప్రాంతంగా ఆవిర్భవించింది.

బీహార్, బెంగాల్‌లలో భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో

పాటుగా, గత అనుభవం నుంచి నేర్చుకుంటూ, సామ్రాజ్యవాదం, భూస్వామ్యాలకు వ్యతిరేకంగానూ ఇతర ప్రజల సమస్యల మీదా రాజకీయ సమీకరణ జరిగింది. పాట్నా నగరం, కోల్‌కత్తా, కృష్ణనగర్‌లలో కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, ఇతర పీడిత సెక్షన్‌లను కార్మిక, విద్యార్థి, యువ రంగాలలో సంఘటితం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళా రంగం అభివృద్ధి అయింది. పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో కొన్ని ప్రాంతాలలోనూ గ్రామీణ విప్లవోద్యమం పెంపొందింది. ఈ రకంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజా పునాదితో పార్టీ తూర్పు భారతంలో విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేసింది. ఈ యావత్తు కృషిని రచించడంలో, అమలు చేయడంలో పార్టీ సీఓసీ సభ్యుడిగా కామ్రేడ్ బిజయ్ కీలక పాత్ర వహించారు.

**అంతర్గత పోరాటంలో పార్టీకి నాయకత్వం వహించడంలో పాత్ర**

గత అనుభవాన్ని క్రోడీకరించుకునేందుకు, నూతన ఉన్నత స్థాయి కర్తవ్యాలు రూపొందించుకుని ఉద్యమాన్ని పురోగమింపజేసేందుకు పరిస్థితులు పరిపక్వం అవుతూన్న తరుణంలో ఆనాటి పార్టీ కార్యదర్శి అశోక్ మితవాద అవకాశవాద పంథాను ముందుకు తెచ్చాడు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు పెంపొందినందువల్ల అర్థ వలస, అర్ధ భూస్వామ్య సంబంధాలలో మౌలిక మార్పులు వచ్చాయని, అందుకని వ్యవసాయ విప్లవం, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా అసంబద్ధం అని ఈ పంథా సమర్థకులు అన్నారు. అయితే మార్క్సిస్టు విశ్లేషణతో తమ వాదనలను వివరించడంలో వాళ్లు విఫలమయ్యారు. లేదా తమ పంథాను అమలు చేయడానికి నిర్దిష్ట వ్యూహం, ఎత్తుగడలు ముందుకు తీసుకురాలేకపోయారు. ఈ రివిజనిస్టు పంథా పార్టీ విప్లవ స్వభావాన్ని, అంతవరకు సాధించిన విజయాలనూ నీరుకార్చడానికి ప్రయత్నించింది. 1987లో పార్టీ కేంద్ర మహాసభలో ఈ సైద్ధాంతిక-రాజకీయ పోరాటం ఒక కొలిక్కి వచ్చింది. తప్పుడు పంథాకు వ్యతిరేకంగా ఈ పోరాటాన్ని కామ్రేడ్ బిజయ్ నిశ్చయాత్మకంగా నడిపారు. సరైన పంథాను సమర్థించి, పార్టీని పరిరక్షించారు. మహాసభలో ఈ తప్పుడు పంథాను ఓడించి, నూతన ప్రజాస్వామిక విప్లవం ఇరుసుగా వ్యవసాయ విప్లవం నడిపే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను పునరుద్ఘాటించారు. ఉన్నత పునాది మీద పార్టీ ఐక్యత సాధించింది. అశోక్, మరో సీఓసీఎం పార్టీని విడిచిపెట్టారు. కామ్రేడ్ బిజయ్‌దా పార్టీ కార్యదర్శి అయ్యారు. 1987 నుంచి 1998లో భాకపా(మా-లె)పీపుల్స్‌వార్‌తో విలీనమై, నూతన ఐక్య పార్టీ భాకపా(మాలె)[పీడబ్ల్యు]గా ఏర్పడే వరకు వరకు ఆయన కార్యదర్శిగా పార్టీకి సమర్థవంతంగా నాయకత్వం వహించారు.

**విలీనంలో, ఏకీకృత పార్టీలో పాత్ర**

పీయూ కార్యదర్శిగా, గత సాధారణ సమీక్ష పునాదిగా నిజమైన కమ్యూనిస్టు విప్లవకారులతో ఐక్యం కావాలన్న భాకపా(మాలె) ఎనిమిదో కాంగ్రెస్ అవగాహనను కామ్రేడ్ బిజయ్ నిరంతరం ఎత్తిపట్టారు. ముఖ్యమైన దేశీయ, అంతర్జాతీయ పరిణామాల గురించిన ఒకే రకమైన అవగాహన పునాదిగా భాకపా(మాలె)(పీడబ్ల్యు) భాకపా(మాలె)పీయూల మధ్య 1995లో ఐక్యతా చర్చలు ప్రారంభమై కొనసాగాయి. ఐక్యతా క్రమంలో భాగంగా 1997లో పీయూ కేంద్ర మహాసభ జరిగింది. ఈ మహాసభ పార్టీ నాయకత్వంలో జరిగిన 18 సంవత్సరాల ఉద్యమాన్ని సమీక్షించింది. ఈ మహాసభలో ఒక సీఓసీఎం పార్టీ పంథా గురించి కొన్ని కీలకమైన ప్రశ్నలను లేవనెత్తుతూ ఒక విమర్శనాత్మక డాక్యుమెంటును తెచ్చాడు. దీని తరువాత జరిగిన రెండు పంథాల మధ్య పోరాటం పీయూ రాజకీయ పంథాను సుసంపన్నం చేసేందుకు దారి తీసింది. ఈ విమర్శనాత్మక డాక్యుమెంటు చేసిన కొన్ని విలువైన, సరైన విమర్శలను పీఓఆర్‌లో జోడించారు. కామ్రేడ్ బిజయ్ ఈ రెండు పంథాల మధ్య పోరాటాన్ని సరైన పద్ధతిలో నిర్వహించడంలో ముఖ్యమైన పాత్ర వహించారు. మహాసభ విజయవంతం కావడంలో దోహదం చేశారు. పీయూ, పీడబ్ల్యుల ఐక్యత సాధించడంలో ఈ మహాసభ అత్యంత ముఖ్యమైన పాత్ర వహించింది. దాదాపు మూడు సంవత్సరాల ఐక్యతా క్రమం తరువాత సమస్త మౌలిక సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర, సైనిక అంశాల మీద ఉమ్మడి అవగాహనకు వచ్చిన రెండుపార్టీలూ విలీనమై భాకపా(మాలె)[పీడబ్ల్యు]గా ఏర్పడ్డాయి. పీయూ తరపున కామ్రేడ్ బిజయ్ ప్రధాన పాత్ర వహించారు. దాని ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించారు. ఐక్యతాకాంక్షతో ఆ పార్టీ వైఖరులను ముందు పెట్టారు. విలీనం తరువాత, కామ్రేడ్ సీఎం నాయకత్వంలో 1970 ఎనిమిదో కాంగ్రెస్ జరిగిన దాదాపు ముప్పై సంవత్సరాల తరువాత తొమ్మిదో కాంగ్రెస్ జరిపేందుకు ఐక్య పార్టీ సన్నాహాలు ప్రారంభించింది. ఒక సీనియర్ కామ్రేడ్‌గా, పీబీఎంగా కామ్రేడ్ బిజయ్ ఈ సన్నాహాలలో, కాంగ్రెస్ డాక్యుమెంట్లను రూపొందించడం, ఉద్యమాన్ని క్రోడీకరించడం, 2001లో కాంగ్రెస్ నిర్వహించడాలలో లోతుగా నిమగ్నమయ్యారు. ఈ కాంగ్రెస్‌లో అతివాద ఒంటెత్తుపోకడ

పంథా ముందుకు వచ్చినప్పుడు ఆయన సీసీలో సీనియర్ కామ్రేడ్‌గా దానిని ఓడించడంలో ముఖ్యమైన పాత్ర వహించారు. కాంగ్రెస్ విజయవంతం గావించడంలోనూ ముఖ్యమైన పాత్ర ఉన్నది.

సీసీ నుంచి పీబీ బాధ్యుడిగా కామ్రేడ్ బిజయ్ ఎస్‌డబ్ల్యుఆర్‌బి కార్యదర్శితో పాటుగా ఆ బ్యూరోకి మార్గదర్శకత్వం వహించారు. కర్నాటకలో మితవాద అవకాశవాద పంథా వికృత ముఖంతో ముందుకు వచ్చినప్పుడు ఇతర కామ్రేడ్స్‌తో కలిసి దానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ఓడించారు. అస్సాంలో నూతన విప్లవ శక్తులు ఆవిర్భవించినప్పుడు వారికి సైద్ధాంతిక రాజకీయ ఎడ్యుకేషన్‌ను అందించి వారు సంఘటితం కావడానికి, అక్కడ పార్టీ విస్తరించడానికీ సహాయపడ్డారు. కొన్ని ఈశాన్య జాతి విముక్తి సంస్థలతో కూడా ఆయన సంబంధాలు నెరపారు.

నక్సల్బరీ నాటి నుంచి విప్లవోద్యమంలో ఉన్న సీనియర్ కామ్రేడ్‌గా, భాకపా(మాలె)పీడబ్ల్యులో సీసీఎం, పీబీఎంగా కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ నూతన పార్టీకి నాయకత్వం వహించడంలో ముఖ్యమైన పాత్ర వహించారు. విప్లవోద్యమానికి, దానికి నాయకత్వం వహించే పార్టీకీ ఐక్యత నుంచి కలిగే లాభాలు, ఐక్యత లేకపోతే కలిగే హాని గురించి ఆయనకు అనుభవం ఉన్నది. పీయూ–పీడబ్ల్యు ఐక్యతతో దేశంలో మాలె శక్తులలో అతి పెద్ద మెజారిటీ శక్తులు ఐక్యమయ్యాయి. అయితే బీహార్‌లో పీడబ్ల్యు, ఎంసీసీల మధ్య జరుగుతున్న ఘర్షణలు (వీటిని ఆ తరువాత పార్టీ చరిత్రలో చీకటి అధ్యాయంగా ప్రస్తావించాం) ఆయనను ఎంతగానో కలతపరిచాయి. రెండు పక్షాల నుంచి, సౌహార్ద పార్టీల నుంచి నిజాయితీతో కూడిన కృషితో ఎంసీసీ, పీడబ్ల్యు పార్టీలు ఆత్మవిమర్శనా వైఖరితో ఈ ఘర్షణలను నిలిపివేశాయి. 2001లో తిరిగి ద్వైపాక్షిక సంబంధాలు ప్రారంభం కావడానికి మార్గం సుగమం అయ్యింది, ఐక్యతా చర్చలకు దారి తీసింది. భాకపా(మాలె)[పీడబ్ల్యు] సీసీ తరఫున కామ్రేడ్ బిజయ్ ఎంసీసీతో ఐక్యతా చర్చలలో, ఐక్య పార్టీ సుసంపన్నమైన అవగాహనతో డాక్యుమెంట్లు తయారు చేయడంలో ముఖ్యమైన పాత్ర వహించారు. ఇది పీడబ్ల్యు, ఎంసీసీఐల విలీనానికీ భాకపా(మావోయిస్టు)కూ దారి తీసింది. ఇది ఆయనకు చాలా సంతోషం కలిగించింది. నూతన పార్టీకి ఆయన సీసీఎం, పీబీఎంగా బాధ్యతలు నిర్వహించారు. ఈ పార్టీ నూతన కర్తవ్యాలు రూపొందించడంలోనూ ఉద్యమాన్ని విస్తరించడంలోనూ ఆయన ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. మధ్య–తూర్పు ప్రాంతీయ బ్యూరో పేరుతో పథకం ప్రకారం విస్తరణ పనిని నిర్వహించడం కోసం ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలను కలిపి ఒక నూతన ప్రాంతీయ బ్యూరో ఏర్పడింది. కామ్రేడ్ బిజయ్ ఈ ఆర్‌బీకి కార్యదర్శి అయ్యారు. దురదృష్టవశాత్తూ బ్యూరో ఏర్పడిన 15 నెలలలోనే ఈ బ్యూరో ఇంకా ప్రారంభం కాక ముందే ఆయన అరెస్టయ్యారు.

**జైలు జీవితం, విడుదల, బహిరంగ కార్యకలాపాలు**

2005 డిసెంబరు 28వ తేదీన కామ్రేడ్ నారాయణ సన్యాల్‌ను స్థానిక, కేంద్ర అధికారులతో కుమ్మక్కయి ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎస్ఐబీ రాయ్‌పూర్ నుంచి ఎత్తుకుపోయింది. జనవరి 4వ తేదీ సాయంత్రమే ఆయనను ఏపీలో ఒక జిల్లా కోర్టులో హాజరుపరిచారు. ఆయన మీద ఏపీలో తిరుపతిలో చంద్రబాబునాయుడి మీద దాడి కేసు, బీహార్‌లో జహానాబాద్ ఆపరేషన్ జైల్ బ్రేక్, ఝార్ఖండ్‌లో గిరిడి హోమ్‌గార్డ్ ఆయుధాగారం మీద దాడి, బీహార్‌లో మధుబన్ బహుళ రెయిడ్, ఛత్తీస్‌గఢ్‌లో 24 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని తుడిచిపెట్టివేసిన కేసులతో సహా అనేక కేసులు పెట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో ఒక స్థానిక కోర్టు మానవ హక్కుల కార్యకర్త డాక్టర్ వినాయక్ సేన్, వ్యాపారి పియుష్ గుహలతో కలిసి ఆయనకు తప్పుడు కేసులతో యావజ్జీవ కారాగారవాసం శిక్ష విధించింది. ఈ శిక్ష, సుదీర్ఘ జైలు జీవితాలు ఆయనలో ఉన్న విప్లవ దీక్షను, స్ఫూర్తినీ సడలించలేకపోయాయి. ఆయన జైలులో కూడా మాలెమాకు, పార్టీ విప్లవ పంథాకు స్థిరంగా అంకితమయ్యారు. ప్రతి కమ్యూనిస్టు నేర్చుకోవలసిన ఆదర్శాన్ని ఆయన నెలకొల్పారు. అయితే సుదీర్ఘ జైలు జీవితం, జైలులో ఉన్న కఠిన పరిస్థితులు, తగిన వైద్యం లేకపోవడంతో ఆయన ఆరోగ్యం తీవ్రంగా దెబ్బ తిన్నది. 2014 నవంబరులో తొమ్మిది సంవత్సరాల జైలు జీవితం తరువాత విడుదలయినప్పుడు ఆయన ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. అయితే తన అనారోగ్యాన్ని పట్టించుకోకుండా కామ్రేడ్ బిజయ్ త్వరలోనే పార్టీ అగ్ర స్థాయి సీనియర్ నాయకుడిగా బహిరంగ కార్యకలాపాలలో నిమగ్నమయ్యారు. ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ ఉద్యమ పురోగమనం కోసం సీసీకి కొన్ని ప్రతిపాదనలు చేసి, తన వంతు బాధ్యత చేపట్టడానికి తన సంసిద్ధతను తెలియజేశారు. ఈ రకంగా ఆయన తన తుది శ్వాస వరకు విప్లవోద్యమానికి సాధ్యమయినంతగా దోహదపడేందుకు శాయశక్తులా కృషి చేశారు. క్యాన్సర్ వ్యాధితో 2017 ఏప్రిల్ 16వ తేదీన తన కుటుంబ సభ్యులు, కామ్రేడ్స్, మిత్రుల మధ్య అంతిమ శ్వాస విడిచారు.

మన ప్రియమైన కామ్రేడ్ బిజయ్ దాదా అమరత్వం సీసీకి,

పార్టీకి, విప్లవోద్యమానికి, దేశ పీడిత ప్రజలకూ అత్యంత విషాదకరమైనది. దృఢమైన కమ్యూనిస్టుగా ఆయన జీవిత కాల దోహదం, నిజమైన కమ్యూనిస్టులతో ఐక్యతలో, పీయూ–పీడబ్ల్యుల, పీడబ్ల్యు–ఎంసీసీఐల విలీనంలో ఆయన పాత్ర, సీసీలో పార్టీలో ఆయన పాత్రా మనలను నిరంతరం ఉత్తేజపరుస్తూనే ఉంటాయి. ఆయన చెదరని స్ఫూర్తి, యువోత్సాహం, చొరవ, ప్రజల విముక్తి కోసం సర్వస్వాన్ని త్యాగం చేయడం, మాలెమా పట్ల, పార్టీ మౌలిక పంథా పట్ల ఏ మాత్రం ఊగిసలాడకుండా స్థిరంగా నిలబడడం, మితవాద, 'అతివాద' అవకాశవాదాలపై పోరాటం చేయడం, ఓడించడం, కమ్యూనిస్టులందరితో ఐక్యత గురించిన బలమైన ఆకాంక్ష, కామ్రేడ్స్, ప్రజలతో సమైక్యం కావడం, జైలులో ఉండగా ఆయన తొణకని కమ్యూనిస్టు సంకల్పం, జైలు నుంచి విడుదల అయిన తరువాత ఆయన ప్రదర్శించిన ఉత్సాహం మన జ్ఞాపకాలలో ఎప్పటికీ నిలిచిపోతాయి.

కామ్రేడ్ బిజయ్ గొప్ప కమ్యూనిస్టు లక్షణాలను నింపుకున్నారు. తనకంటూ గుర్తింపు కోసం ఎన్నడూ వెంపర్లాడలేదు. కామ్రేడ్స్‌తో పీడిత ప్రజలతో సన్నిహిత, స్నేహపూరిత సంబంధాలు నెరపారు. సాదా జీవనం, కఠిన పోరాట జీవితం గడిపారు. చదువులో లోతైన ఆసక్తి ఉండేది. ఆయన జ్ఞానం విశాలమైనది. నిర్మొహమాటంగా, సూటిగా తన అభిప్రాయం వ్యక్తం చేసేవారు. చర్చలో ఉన్న అంశం గురించి అధ్యయనం చేయకుండా, పరిశోధన చేయకుండా తను మాట్లాడేవారు కాదు. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని, సమిష్టి పని విధానాన్నీ ఎల్లప్పుడూ గౌరవించేవారు. తనకు ఏదైనా అంశంలో విభేదం ఉన్నప్పటికీ మెజారిటీ అభిప్రాయాన్నే అనుసరించేవారు. సీసీలో ఒక వయోజనుడిగా కామ్రేడ్స్‌కు దోహదం చేయడానికి, సహాయం అందించడానికీ ఎల్లప్పుడూ తయారుగా ఉండేవారు. జీవిత ఆద్యంతమూ అవివాహితుడిగా కేవలం విప్లవం కోసమే జీవించారు.

ఈ అన్ని లక్షణాలతో కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ సహజంగానే తన కామ్రేడ్స్‌లో, పీడిత ప్రజలలో భారత విప్లవ సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన ఐదు దశాబ్దాల విప్లవ జీవితం, ఆయన కమ్యూనిస్టు లక్షణాలు, ఆయన త్యాగ నిరతి మనకు ఎల్లప్పటికీ ప్రేరణనిస్తూనే ఉంటుంది. నక్సల్బరీ సాయుధ విప్లవ రైతాంగ తిరుగుబాటు బద్దలై 50 సంవత్సరాలు నిండినట్టుగానే కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ ఐదు దశాబ్దాల నిరంతర పోరాటం తరువాత మనలను విడిచి వెళ్లిపోయారు. ఆయన మనకు ఒక ఆదర్శం. పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజా సంఘాలలో ప్రతి ఒక్కరూ ఆయన నుంచి నేర్చుకోవాలని, ఆయన కమ్యూనిస్టు లక్షణాలను ఒంటబట్టించుకోవాలని, కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ నుంచి ప్రేరణ పొందడం ద్వారా పాలక వర్గాలు, సామ్రాజ్యవాదులు, వారికి సేవ చేస్తున్న బ్రాహ్మణీయ హిందు ఫాసిస్టు శక్తుల దాడులను తిప్పికొడుతూ దీర్ఘకాలిక ప్రజా యుద్ధాన్ని ధైర్యంగా పురోగమింపజేయాలని సీసీ పిలుపునిస్తున్నది. మన ప్రియతమ కామ్రేడ్ బిజయ్ దాదాకు ఎర్రెర్ర దండాలు, వినమ్ర నివాళి! ఆయన ఏ స్వప్నాలతో జీవించి, అమరుడైనారో ఆ స్వప్నాలను పరిపూర్తి చేయడం కోసం ప్రతి ఆటంకాన్నీ అధిగమించి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో కొనసాగుతామని ప్రతిన బూనుతున్నాం!

**విప్లవాభినందనలతో,**

**కేంద్రకమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

**తేదీ :ఏప్రిల్ 30, 2017**

**ప్రజాయుద్ధంలో నేలకొరిగిన అమరులకు అరుణాంజలి ఘటించండి!**

**విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో భారత పాలకవర్గాలు**

**కొనసాగిస్తున్న మిషన్-2017ను ఓడించండి!**

**పై నుంచి కింది వరకూ పార్టీ నాయకత్వాన్ని పరిరక్షించుకుంటూ**

**ఉద్యమాన్ని పురోగమింపజేద్దాం!**

# బోల్షివిక్ విప్లవం (నవంబర్,7) శత వార్షికోత్సవానికి విప్లవ జేజేలు!

## సిద్ధాంత రంగంలో కామ్రేడ్ లెనిన్ పోరాటం- స్వతంత్ర బోల్షివిక్ పార్టీ నిర్మాణం!!

## కామ్రేడ్ లెనిన్ నిజమైన వారసత్వాన్ని కొనసాగిద్దాం!!!

మొట్టమొదటిగా శ్రామికవర్గం రష్యాలో అధికారాన్ని కైవసం చేసుకుంది. ఇది పారిస్ కమ్యూన్‌లో అధికారం కోసం జరిగిన పోరాటం తర్వాత దాని గుణపాఠాలు తీసికొని కార్మికవర్గం అధికారాన్ని చేపట్టింది. కార్మికవర్గంకు సంఘటితమైన పార్టీగా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. సామ్రాజ్యవాద గొలుసులోని బలహీనమైన లింకును దెబ్బతీస్తు రష్యాలో బోల్షివిక్ పార్టీ నేతృత్వంలో కార్మికవర్గ విప్లవం విజయవంతమైంది. ఈ విప్లవ ప్రభావం ప్రపంచవ్యాపితమైంది. ముఖ్యంగా వలస, అర్థవలస దేశాల్లో జాతీయ ప్రజావిముక్తి పోరాటాలకు బలాన్ని ఇచ్చింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని 3వ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌గా సమీకరించింది. అంతర్జాతీయ గైడెన్స్‌ను అందించింది. సోషలిస్టు దేశంగా ఇది అనేక విజయాలు సాధించింది. బోల్షివిక్ విప్లవానికి సారధిగా కామ్రేడ్ లెనిన్ నేతృత్వం వహించాడు. లెనిన్ మరణానంతరం స్టాలిన్ నేతృత్వంలో సోషలిస్టు వ్యవస్థ పురోగమించింది. లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ పార్టీ రివిజనిజానికి వ్యతిరేకంగా గొప్ప అంతర్జాతీయ పోరాటాన్ని నిర్వహించింది. యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి సార్వత్రిక సాయుధ తిరుగుబాటు ద్వారా అధికారాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచంలో ఇది ఒక విప్లవ మార్గంగా ముందుకు వచ్చింది.

*[విప్లవ శతవార్షికోత్సవ సందర్భంగా బోల్షివిక్ పార్టీ అనుభవాల్లో భాగంగా ఈ సిద్ధాంత వ్యాసాన్ని అందిస్తున్నాం -సంపాదకులు]*



### రష్యాలో నరోద్నిజంకు వ్యతిరేకంగా ప్లెఖనోవ్, లెనిన్‌లు సాగించిన పోరాటం:

రష్యాలో ఇంకా సోషల్ – డెమోక్రటిక్ ఉద్యమం వేళ్ళూనకముందే, విదేశాలలోని రష్యన్ పత్రికలలో "కార్మిక విమోచన సమితి" మార్క్సిజం అనే నినాదాన్ని లేవదీసింది. మొదట అలాంటి ఉద్యమానికి తాత్విక భావజాల సిద్ధాంత పునాదిని తయారు చేయడం అవసరం. మార్క్సిజమూ, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమమూ వ్యాపించకుండా ఉండడానికి ప్రధాన సైద్ధాంతిక అవరోధం, నరోద్నిక్‌ల భావాలే. ఆ రోజులలో నరోద్నిక్ భావాలు, అభివృద్ధి చెందిన కార్మికులలోనూ, విప్లవ ధోరణిగల మేధావులలోనూ వ్యాపించి ఉండేవి.

రహస్య నరోద్నిక్ సంఘం ఒకటి స్థాపించారు. దీనిని 'నరోద్నియా వాల్యా" అనేవారు. అంటే "ప్రజాభీష్టం" అని అర్థం. ఈ సంఘం జార్‌ను హత్యచేయడానికి కుట్ర పన్నింది. 1881 మార్చి 1వ తేదీన, "నరోద్నియా వాల్యా" సభ్యులు బాంబులతో రెండవ అలెగ్జాండర్‌ను (జార్‌ను) చంపేశారు.

నరోద్నికులు జార్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి అవలంభించిన పద్ధతి అనగా వ్యక్తుల హత్య, వ్యక్తిగత హింసాకాండ తప్పు. విప్లవానికి హానికరమైనది. విప్లవంలో తమ నాయకత్వ పాత్రను అర్థం చేసుకోకుండా, కార్మిక వర్గానికి నరోద్నిక్‌లు అడ్డుతగిలారు. కార్మికవర్గ స్వతంత్ర పార్టీ నిర్మింపబడకుండా వారు ప్రతిబంధం లేదా అడ్డంకులు కల్పించారు.

నరోద్నిక్‌ల రహస్య నిర్మాణాన్ని జార్ ప్రభుత్వం నాశనం చేసినప్పటికీ, విప్లవ భావాలుగల మేధావులలో నరోద్నిక్ భావాలు చాలాకాలం వరకు నిలిచి ఉన్నాయి. మిగిలిపోయిన నరోద్నిక్‌లు రష్యాలో మార్క్సిజం వ్యాప్తి చెందకుండా తీవ్రంగా ప్రతిఘటించారు. కార్మికవర్గ నిర్మాణానికి అడ్డుతగిలారు. అందుచేత నరోద్నిజంను ఎదుర్కోవడం ద్వారానే, రష్యాలో మార్క్సిజం పెంపొంది బలాన్ని సంపాదించుకోగల్గింది.

### నరోద్నిక్కుల సిద్ధాంత వాదనలు ఇలా ఉన్నాయి:

మొదటిది: రష్యాలో పెట్టుబడిదారీ విధానం "యాదృచ్ఛికంగా" వచ్చినదనీ; అది వృద్ధికాజాలదనీ, అందుచే శ్రామికవర్గం పెరిగి పెద్దదికాదనీ, నరోద్నిక్‌లు వాదించారు.

రెండవది: విప్లవంలో అగ్రగామిగా నిల్చేది కార్మికవర్గమని

నరోద్నిక్‌లు భావించేవారు కాదు. శ్రామికవర్గం లేకుండానే సోషలిజం సాధించవచ్చునని వారు కలలుగన్నారు. మేధావి వర్గంచే నడుపబడే రైతాంగం సోషలిజం తేజమూ, పునాది అయిన రైతాంగ కమ్యూను ప్రధాన విప్లవశక్తి అని భావించారు.

మూడవది: యావత్ మానవ చరిత్ర పరిణామాన్ని గురించి కూడా నరోద్నిక్‌లకు గల దృష్టి తప్పుడుదీ, హానికరమైనదీ. సమాజం యొక్క ఆర్థిక, రాజకీయ అభివృద్ధి సూత్రాలు వారికి తెలియనూ, తెలియవు- అర్థం చేసుకోనూ లేదు. ఈ విషయంలో వారు పూర్తిగా వెనుకబడ్డారు. వారి దృష్టిలో చరిత్రను నిర్మించేది వర్గాలుగాని, వర్గ పోరాటాలు గాని కాదు. అద్భుతమైన వ్యక్తులు- 'హీరో'లు జనసామాన్యం, గుంపు ప్రజలు వర్గాలు వీళ్ళను గుడ్డిగా అనుసరిస్తారు.

ప్లెఖనోవ్ తన రచనల్లో మార్క్సిజం మూల సూత్రాలను వివరించారు. అందులో "చరిత్రను ఏకదృష్టి నుండి చూసే అభిప్రాయ అభివృద్ధిపై" (ఆన్ ద డెవలప్ మెంట్ ఆఫ్ ద మోనాస్టిక్ వ్యూ ఆఫ్ హిస్టరీ) గ్రంథం ప్రత్యేకంగా ప్రాముఖ్యమైనది. అది 1895లో ప్రచురించబడింది. "ఒక తరానికి చెందిన రష్యన్ మార్క్సిస్టులను ఇది సృష్టించింది" అని లెనిన్ అన్నాడు.

నరోద్నిక్‌లపై ప్లెఖనోవ్ సాగించిన పోరాటమూ, ప్లెఖనోవ్ రచనలు విప్లవ మేధావులలో నరోద్నిక్‌ల పలుకుబడిని పూర్తిగా నాశనం గావించాయి. అయినప్పటికీ సిద్ధాంతరీత్యా నరోద్నిజాన్ని నాశనం చేయడం ఇంకా పూర్తికాలేదు. మార్క్సిజానికి శత్రువైన నరోద్నిజాన్ని ఆఖరు దెబ్బ గొట్టడం లెనిన్ వంతు అయింది.

"కార్మిక విమోచన సమితి" దాని మొదటి ముసాయిదాలో ఇంకా నరోద్నిక్ భావాల ముద్రలున్నాయి. అది వ్యక్తిగత దౌర్జన్యపు ఎత్తుగడలను ఆచరణలో సమర్థించింది. ఇంతేగాక, విప్లవ గమనంలో రైతాంగాన్ని శ్రామికవర్గమే నడిపిస్తుందనీ, నడిపించాలనీ, రైతాంగ సమ్మేళనంతోనే శ్రామికవర్గం జార్ ప్రభుత్వంపై విజయాన్ని సాధించగలదనీ ప్లెఖనోవ్ గమనించ లేకపోయాడు.

బూర్జువావర్గం, శ్రామికవర్గం ఈ రెండూ తప్ప విప్లవ సమ్మేళనానికి గాని, లేక ప్రతికూల సమ్మేళనానికిగాని సహాయపడగల శక్తులేవీలేవు" అని అన్నాడు. ఈ తప్పుడు భావాలే తర్వాత ప్లెఖనోవ్ చూపిన మెన్షివిక్ భావాలకు అంకురాలు. సోషల్ డెమొక్రటిక్ ఉ ద్యమానికి సిద్ధాంతరీత్యా పునాదిని మాత్రమే "కార్మిక విమోచన సమితి" వేసిందనీ, కార్మికవర్గ ఉద్యమం వైపుకు మొదటి అడుగు మాత్రమే వేసిందనీ" లెనిన్ రాసాడు.

1890 ప్రాంతాలలో పరిశ్రమలు మంచి వికాసదశలో వున్నాయి. కార్మికుల సంఖ్య హెచ్చుతుంది. కార్మికవర్గ ఉద్యమం నానాటికీ బలపడుతోంది. 1895-99 సంవత్సరాల మధ్య, అసంపూర్ణమైన లెక్కలననుసరించి, రెండు లక్షల ఇరవై ఒక్క వేల (2,21,000) కార్మికులు సమ్మెలలో పాల్గొన్నారు. దేశ రాజకీయ జీవితంలో కార్మిక ఉద్యమం ఒక ప్రధాన శక్తిగా తయారవుతోంది. విప్లవోద్యమంలో కార్మికవర్గం ప్రధానపాత్ర వహించవలసి దుంటుంది -అని నరోద్నిక్‌లతో మార్క్సిస్టులు పోరాడుతూ తెలిపిన దృక్పథమే సరియైనదని తర్వాత ఘటనాక్రమం రుజువుచేసింది.

లెనిన్ నాయకత్వాన సెంట్ పీటర్ బర్గ్‌లోని "కార్మిక వర్గ విమోచన పోరాట సమితియే" రష్యాలో కార్మికవర్గ ఉద్యమంతో సోషలిజాన్ని ఐక్యపరచడానికి పూనుకొన్న మొదటి సంఘం. పీటర్స్‌బర్గ్ "కార్మికవర్గ విమోచన పోరాట సమితి" ప్రాముఖ్యతను లెనిన్ ఇలా తెలియజేశాడు; "కార్మికవర్గ ఉద్యమంచే బలపరచబడిన మొట్టమొదటి విప్లవ పార్టీ అంకురమే ఈ సమితి".

రష్యాలో మార్క్సిస్టు సోషల్ డెమొక్రటిక్ పార్టీని ముందు ముందు నిర్మించే కృషిలో, పీటర్స్‌బర్గ్ పోరాట సమితి విప్లవానుభవాన్ని లెనిన్ ఉపయోగించుకున్నాడు.

1881 ప్రాంతాలలో నరోద్నిక్ దృక్పథంపై ప్లెఖనోవ్ ముఖ్యమైన దెబ్బకొట్టినా, 1890 ప్రాంతాలలో నరోద్నిక్ భావాలు ఇంకా కొంతమంది యువకులలో సానుభూతిని పొందగలిగాయి. మార్క్సిజం ఇంకా వ్యాపించాలంటే, సోషల్- డెమొక్రటిక్ పార్టీ తప్పనిసరిగా నిర్మింపబడాలంటే, నరోద్నిజంను సిద్ధాంతరీత్యా పూర్తిగా నాశనం చేయాల్సి ఉంది. ఈ కర్తవ్యాన్ని లెనిన్ పూర్తి చేశాడు.

1894లో లెనిన్, "ప్రజా స్నేహితు లెలాంటివారు? సోషల్-డెమొక్రాట్లతో వారెలా పోరాడుతున్నారు?" అనే గ్రంథం రాసాడు. దీనిలో నరోద్నిక్‌ల నిజస్వభావాన్ని పూర్తిగా బయటపెట్టాడు. వారు ప్రజలకు 'కపట స్నేహితులనీ", వాస్తవంలో ప్రజలకు విరుద్ధంగా పని చేస్తున్నారనీ లెనిన్ తెలియజేశాడు.

ముఖ్యంగా, 1890 ప్రాంతాలనాటి నరోద్నిక్‌లు, జార్ ప్రభుత్వ ప్రతికూల విప్లవ పోరాటాన్ని ఎప్పుడో వదులుకొన్నారు. జార్ ప్రభుత్వంతో రాజీ మార్గాన్ని లిబరల్ నరోద్నిక్‌లు బోధించారు. ఆ కాలంలోని నరోద్నిక్‌లను గురించి లెనిన్, ఇలా రాశాడు; "ప్రభుత్వంతో తగినంత మర్యాదగా, విధేయతగానూ వాదిస్తే ప్రతిదీ దానంతకదే చక్కబడుతుంది అని నరోద్నిక్‌ల భావన."

ప్రజలకు నిజమైన స్నేహితులు మార్క్సిస్టులుగాని నరోద్నిక్‌లు కాదనీ, జార్ ప్రభుత్వాన్ని, పెట్టుబడిదారీ భూస్వామ్య బానిసత్వాన్ని కూలద్రోయదలచినది మార్క్సిస్టులేననీ, లెనిన్ నిరూపించాడు.

జార్ ప్రభుత్వాన్ని, భూస్వాములను, బూర్జువాలను కూలద్రోయడానికి ప్రధాన సాధనం 'కార్మిక రైతు విప్లవ సమ్మేళనమే' అన్న అభిప్రాయాన్ని, లెనిన్ మొట్ట మొదటిసారిగా, "ప్రజా స్నేహితులెట్టివారు" అనే తన గ్రంథంలో తెలియజేశాడు.

"ప్రజా స్నేహితులెట్టివారు?" అనే తన గ్రంథంలో లెనిన్, రష్యన్ మార్క్సిస్టుల ప్రధాన కర్తవ్యాలను స్పష్టపరచాడు. ఐక్యత లేకుండా వున్న వివిధ మార్క్సిస్టు సమితులనన్నిటినీ ఒకే "ఐక్య సోషలిస్టు వర్కర్స్ పార్టీ"గా కలపడం రష్యన్ మార్క్సిస్టుల మొదటి కర్తవ్యం అని లెనిన్ భావించాడు. లెనిన్ ఇంకా ఇలా తెలియజేశాడు. రష్యా కార్మికవర్గం, రైతాంగంతో కలిసి జార్ నిరంకుశ ప్రభుత్వాన్ని కూలదోస్తుంది. ఆ తర్వాత రష్యన్ శ్రామికవర్గం, పీడిత జన సామాన్యంతోనూ, దోపిడీకి గురైన ప్రజలతోనూ కలిసి ఇతర దేశాల శ్రామిక వర్గంతో పాటు కమ్యూనిస్టు విప్లవ విజయానికై జరిగే బహిరంగ రాజకీయ పోరాట పంథాను, నేరుగా అనుసరిస్తుంది.

నరోడ్నిజంకు వ్యతిరేకంగా లెనినూ, అతని అనుచరులూ 1890 ప్రాంతాలలో సాగించిన పోరాట ఫలితంగా,నరోడ్నిక్‌ల సిద్ధాంతానికి పూర్తిగా అపజయం సంభవించింది.

## 'లీగల్ (చట్టబద్ధ) మార్క్సిస్టుల'కు వ్యతిరేకంగా లెనిన్ సాగించిన పోరాటం:

రష్యా అంతటా మార్క్సిజం విశాలంగా వ్యాపింపసాగింది. అందుచేత బూర్జువా మేధావులు మార్క్సిస్టు ముసుగును అలంకరించుకోసాగారు. వారు శాసన బద్ధమైన దినపత్రికలలోను, పక్ష పత్రికలలోను...అనగా జార్ ప్రభుత్వం అనుమతించిన పత్రికలలో వ్యాసాలను ప్రకటించసాగారు. అందుచేతనే వారిని "లీగల్ మార్క్సిస్టులు" అని పిలిచేవారు. 'తోటి ప్రయాణికులు' అని లెనిన్ వారిని సంభోదించాడు. నరోడ్నిక్‌లపై సాగించే పోరాటంలో లీగల్ మార్క్సిస్టులతో తాత్కాలిక ఒడంబడిక చేసుకోవడంలో తప్పులేదని లెనిన్ భావించాడు.

"చట్టబద్ధ మార్క్సిస్టుల ముఖ్య నాయకుడైన స్ట్రూవేకు వ్యతిరేకంగా తొంభై దశకంలో ప్రధానంగా సిద్ధాంత రంగంలో పోరాటం జరిగింది. చట్టబద్ధ ప్రెస్సులో 1894 చివరలో, 1895 మొదట్లో పూర్తిగా మార్పు ఒకటి కనపడింది. విదేశాల్లో ఉన్న విమోచన సమితితోపాటు రష్యాలో ఉన్న సోషల్ డెమోక్రట్ల మార్క్సిస్టు భావనలు మొట్టమొదటి సారిగా వెల్లడి అయినాయి. ఈ సాహిత్య పునరుజ్జీవనం, మార్క్సిస్టుల, పాత నరోడ్నిక్కుల మధ్య జరిగిన, వేడియైన వివాదాలు ఉదాహరణకు మెకలోవస్కీ వాళ్ళ లాంటి వాళ్ళకు వ్యతిరేకంగా సమైక్యంగా సాగిన మన అభ్యుదయ సాహిత్యం కృషివల్ల రష్యాలో శ్రామిక ప్రజల ఉద్యమంలో ఎదుగుదలకు నాంది పలికింది.

1894లో సెంట్ పీటర్స్ బర్గ్‌లో జరిగిన సమ్మెలకు నేతృత్వం వహించిన రష్యా మార్క్సిస్టులు జరిపిన ఈ సాహిత్యపు కార్యకలాపాలతో, నిలకడయైన కార్మికవర్గ ఉద్యమాల దశలోకి ప్రవేశించింది. ఇది మన మొత్తం విప్లవంలో ఎక్కువ శక్తివంతమైన అంశంగా నిలుస్తుంది". -ప్రిఫేస్ టు ద కలెక్షన్ ఆఫ్ టువల్ ఇయర్స్-లెనిన్ -సెప్టెంబర్, 1907

చట్టబద్ధ మార్క్సిస్టులు కూడ, వారికి తోచిన విధంగా నరోడ్నిజంతో పోరాడారు. కాని, పెట్టుబడిదారీ సమాజ ప్రయోజనాలకు, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణ్యంగా కార్మికవర్గ ఉద్యమం ఉపయోగపడి లొంగిపోయేందుకు గాను పై పోరాటాన్నీ మార్క్సిస్టు జెండానూ ఉపయోగించుకోదలిచారు. మార్క్సిజం మూలసూత్రమైన శ్రామికవర్గ విప్లవమూ, శ్రామికవర్గ నియంతృత్వమూ అనే అంశాన్ని లీగల్ మార్క్సిస్టులు తోసిపుచ్చారు. చెప్పినదానికి బదులుగా, పెట్టుబడిదారీ వర్గాన్ని పొగుడుతూ ఇలా అన్నారు; "మనకు సంస్కృతి లేదన్న విషయం అంగీకరిస్తున్నాం. దీనిని నేర్చుకోవడానికి పెట్టుబడిదారీ విధానం వద్దకే పోవాలి."

స్ట్రూవే నాయకత్వంలో లీగల్ మార్క్సిస్టులకు వ్యతిరేకంగా కా. లెనిన్ ఈ క్రింది విధంగా పోరాడాడు.

"1885లో సెంట్ పీటర్స్ బర్గ్‌లో ప్రచురించి, సెన్సార్ అధికారులచే నాశనం చేయబడిన 'మెటీరియల్ ఆన్ ద క్వశ్చన్ ఆఫ్ ది ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ రష్యా' గ్రంథంను మూడు అవసరాల కోసం మళ్ళీ చదివాను. మొదటగా, 'ఎకనామిక్ కాంటెంట్ ఆఫ్ ద నరోడ్నిజం అండ్ ది క్రిటిసిజమ్ ఆఫ్ ఇట్ ఇన్ స్ట్రూవే బుక్', 1894-95ల్లో మార్క్సిస్టులకు వ్యతిరేకంగా నరోడ్నిక్కుల వ్యాసాలు చదువరులకు అందరికి పరిచయమే. ఇది స్ట్రూవే ఆలోచనను విమర్శించడానికి చాల ప్రధానమైన అంశం, రెండవది, దాని ప్రకారం తరుచుగా ఈ గుంపుతో కలవడంపై, వేస్తున్న నిందారోపణలకు సమాధానం చెప్పడానికి, దీనిపై ఆధారపడి స్ట్రూవే ప్రాముఖ్యత కల్గిన రాజకీయ జీవితాన్ని తనకుతానే మదింపు వేయడానికి, అలాగే ఒక సోషల్ డెమోక్రట్ స్ట్రూవేకు ఇచ్చిన హెచ్చరికతో పాటు సమాంతరంగా నరోడ్నిక్కులకు వ్యతిరేకమైన మా సాధారణ ప్రకటనలు. మూడవది, ఒక సూచనప్రాయమైన వుదాహరణగా స్ట్రూవేతో పాతది అయిన, అనేక విధాలుగా కాలం చెల్లిన రాజకీయ వాదోపవాదాలు, విప్లవకరమైన సోషల్ డెమోక్రట్లు జరిపిన రాజకీయంగా, ఆచరణాత్మకంగా విలువ కలిగిన రాజీపడని సిద్ధాంత చర్చలపై లెక్కలేనన్ని నిందారోపణలు "ఆర్థికవాదులు" బెర్న్‌స్టెయిన్స్, మెన్షివిక్‌లతో ఎక్కువ పాళ్ళు గాఢమైన అభిరుచితో జరిగాయి. ఆ కోణంలో పది సంవత్సరాల ముందు జరిగిన సంఘటనలను పరిశీలించినప్పుడు "స్ట్రూవేయిజం"తో ఏవైతే చాల

చిన్నగా కనపడే విభేదాలు క్రమంగా తీవ్రమైన రాజకీయ విభేదాలుగా ఎలా రూపు దిద్దుకోవడం జరుగుతుందో, అవి పార్లమెంటులో, ప్రెస్‌లో, బహిరంగ సభలో రాజీపడని పోరాటంగా ఎలా మారుతుందో స్పష్టంగా చూడవచ్చు.

"ద డెవలప్‌మెంట్ ఆఫ్ ద కాపిటలిజమ్" అనే వ్యాసం బూర్జువా విప్లవానికి ముఖ ద్వారంలో సకారాత్మకమైన (మార్క్సిస్టుల దృక్కోణం నుండి) లక్షణాలు, అంశాలు నరోడ్నిక్కుల విప్లవ డెమోక్రటిక్ ధోరణిగా దేశంలో ఎలా ఉన్నాయో వివరించింది. ఇందులో చేసిన సిద్ధాంతపరమైన ప్రతిపాదనలు 12, 13 సంవత్సరాల తర్వాత ఆ ప్రతిపాదనలు ఆచరణాత్మక, రాజకీయాల వ్యాఖ్యాలుగా రెండవ డ్యూమాలో పార్లమెంటు ఎన్నికల్లో 'లెఫ్ట్‌బ్లాక్' యొక్క ఎత్తుగడలుగా చూడవచ్చు.

1895లో సెంట్ పీటర్స్ బర్గ్‌లో జరిగిన సోషల్ డెమోక్రట్ల కార్యకలాపాల ద్వారా లభించిన అనుభవం ఆధారంగా 1987 చివరలో స్ట్రూవేకు వ్యతిరేకంగా "ద టాస్క్ ఆఫ్ ద రష్యన్ సోషల్ డెమోక్రట్లు" అనే వ్యాసం వచ్చింది. అందులో స్ట్రూవేకు సోషల్ డెమోక్రాట్లతో ఎలాంటి సంబంధం లేదు. ఆయన నమ్మదగిన మార్క్సిస్టు కాదని నొక్కి చెప్పడం జరిగింది.

1905-07 జన సామాన్య రాజకీయ కార్యకలాపాల్లో కొట్టవచ్చినట్లుగా కనపడిన రష్యా బూర్జువా వర్గ లిబరలిజం యొక్క లక్షణాలు, తర్వాత అది మొదటి, రెండవ డ్యూమాలో అవలంభించిన రాజకీయ గందరగోళం గురించి చాల సంవత్సరాల క్రింద విప్లవంలో పుట్టుకొచ్చిన కేడెట్ పార్టీ అని 1901లోనే చెప్పడం జరిగింది. మేము 1905-07లో కేడెట్ పార్టీ ప్రదర్శించిన రాజ్యాంగబద్ధ భ్రమలకు వ్యతిరేకంగా నిర్దాక్షిణంగా పోరాడాం."

-ప్రిపేస్ టు ద కలెక్షన్ ఆఫ్ టువల్ ఇయర్స్-లెనిన్ -సెప్టెంబర్, 1907

ఈ తోటి ప్రయాణికులలో చాలమంది ఆ తర్వాత రాజ్యాంగబద్ధ ప్రజాతంత్ర వాదులు (కాన్స్టిట్యూషనల్ డెమోక్రట్స్)గా మారారు. (ఇదే రష్యన్ పెట్టుబడిదారుల ప్రధానపార్టీ) తర్వాత అంతర్యుద్ధ కాలంలో వీరు నూటికి నూరుపాళ్ళు వైట్‌గార్డ్సు (విప్లవ శత్రువులు)గా తయారయ్యారు.


**ఇస్క్రా పత్రిక ఏర్పాటు**

'ఆర్థికవాదం' ఆధిపత్య ధోరణిగా ఉన్న సమయంలో దాన్ని ఓడించి, విప్లవమే వృత్తిగల వారితో పార్టీని నిర్మించడం అవసరమైంది. ఈ పనిని 1903లో లెనిన్ పూర్తి చేశాడు. ఈ విధానం వలన విప్లవ తుఫాను కాలంలో ఇస్క్రాయిస్టుల్లో చీలిక సంభవించినప్పుడు, సోషల్ డెమోక్రట్లలో అవే తప్పుడు ధోరణులు తల ఎత్తినప్పుడు పార్టీని కాపాడింది. అలాగే మొత్తం రష్యన్ విప్లవంనూ కాపాడింది 1901-02 నుండి 1907 కాలంలో విప్లవం కాపాడబడడంతో పాటు కొనసాగింది.

ఈ విధానమే, ఏ పెట్టుబడిదారీ దేశంలో లేని గొప్ప సామర్థ్యం గల కార్మికవర్గ పార్టీ రష్యాలో రూపొందింది. ఆనాటికి ఆర్థికవాది అయిన మార్టోవ్ 'యాదృచ్ఛికత- రాజకీయ చైతన్యంకు' సంబంధించిన లెనిన్ సిద్ధాంతాన్ని ఖండించడంతో మార్టోవ్ దివాళాకోరు అభిప్రాయాలను లెనిన్ ఈ రచనలో ఖండించాడు.

కార్మికవర్గ ఉద్యమపు పెల్లుబికే వెల్లువా, త్వరలోనే విప్లవం తధ్యమయ్యే సూచనా, విప్లవోద్యమాన్ని నడప సామర్థ్యం గల ఐక్య కేంద్రీకృత పార్టీ అవసరాన్ని తెలియజేశాయి. కానీ స్థానిక పార్టీ సంస్థలూ, స్థానిక కమిటీలూ, అధ్యయన కేంద్రాలూ, సమితులూ ఎంతో శోచనీయ పరిస్థితిలో ఉన్నాయి. సంఘ నిర్మాణంలో అనైక్యత బాగా ప్రబలింది. సిద్ధాంత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. కనుక అలాంటి పార్టీని నిర్మించడం చాలా కష్ట సాధ్యమైనపని.

ఒకే కేంద్రీకృత పార్టీని నిర్మించాలంటే, స్థానిక సంఘాలలోని ఈ వెనుకబడ్డతనం, జడత్వం, సంకుచిత దృష్టి వీటన్నిటినీ జయించాలి.



లెనిన్ ఇస్క్రా పత్రిక అవసరాన్ని గురించి ఇలా రాసాడు:

"మా అభిప్రాయంలో మనం కోరుకుంటున్న వ్యవస్థాగత నిర్మాణాన్ని సాధించే దిశగా తొలి ఆచరణాత్మక అడుగు వేయటంతో మన కార్యకలాపాలు ప్రారంభం కావాలి. అంతేకాదు, ఆ నిర్మాణాన్ని ఎటువంటి ఊగిసలాటలు లేకుండా అభివృద్ధి పరచటానికి, లోతుగా తీసుకువెళ్ళటానికి, వ్యాపింప జేయటానికి అవసరమైన, రష్యాకంతటికీ సరిపోయే ఒక రాజకీయ పత్రికను స్థాపించాలి.

అట్టి పత్రిక లేకుండా సర్వవ్యాపిత ప్రచారాన్ని, ఆందోళననూ నిరంతరం కొనసాగించలేం. మూలసూత్రాలకు అనుగుణ్యమైన అలాంటి ప్రచారమూ ఆందోళనా, సాధారణంగా సోషల్ డెమోక్రట్లకు నిరంతర ముఖ్య కర్తవ్యం, ఇక రాజకీయాలలోను, సోషలిస్టు సమస్యలలోను అభిరుచి, బహుళ ప్రజానీకంలో వృద్ధి చెందుతున్న ఈ రోజులలో, అలాంటి ప్రచారమూ ఆందోళనా సోషల-డెమోక్రట్లకు మరింత తక్షణ కర్తవ్యం, అందుచే అట్టి పత్రిక లేకుండా సర్వవ్యాపిత ప్రచారాన్నీ, ఆందోళననూ నిరంతరం కొనసాగించలేం." -(లెనిన్, కలెక్టెడ్ వర్క్స్, రష్యన్ ఎడిషన్, నాల్గవ వాల్యూం, 110వ పేజీ).

అలాంటి వార్తాపత్రిక పార్టీని సిద్ధాంతరీత్యా దృఢతరం చేయడమేగాక, పార్టీలోని స్థానిక సంస్థలను నిర్మాణరీత్యా ఐక్యపరుస్తుందని కూడా లెనిన్ భావించాడు.

ఇదే వ్యాసంలో లెనిన్ ఇంకా ఇలా వివరించాడు:

"మనం కోరే సంస్థ నిర్మాణం ఎలాంటిదై ఉండాలి? దేశమంతా విస్తరించినంత పెద్దదిగా ఉండాలి. ఖచ్చితమైన వివరమైన పని విభజన అనుకూలమైనంత విశాలంగాను, బహుముఖంగానూ వుండాలి. అన్ని పరిస్థితులలోను, కొత్త మార్గం తొక్కే సమయాలలోను, హఠాత్ ఘటనలన్నిటిలోను అది తన పనిని అచంచలంగా సాగించగల్గేందుకు అవసరమైన పరీక్ష నెగ్గేదిగాను, కాకలు తీరిందిగాను ఉండాలి. తన యావత్ శక్తులనూ ఒకచోట కేంద్రీకరించి అత్యధిక సంఖ్యాబలం కల్గిన శత్రువుతో ప్రత్యక్ష పోరాటం, తప్పించుకోగలిగిన చాకచక్యం కల్గిఉండాలి. అయినప్పటికీ శత్రువు విషమ పరిస్థితిని అదనుగా తీసుకొని, ఎప్పుడు, ఎక్కడ శత్రువు మన దాడిని తక్కువగా అంచనా వేస్తున్నాడో అపుడు, అక్కడ శత్రువుపై దాడి చేయగలిగినట్టిదిగా ఉండాలి. అలాంటి నిర్మాణానికి వార్తాపత్రిక ఏజెంట్ల అల్లిక అస్థిపంజరంగా ఉంటుంది." -(లెనిన్, కలెక్టెడ్ వర్క్స్, రష్యన్ ఎడిషన్, నాల్గవ వాల్యూం, 112వ పేజీ).

## 'ఏం చేయాలి' అనే లెనిన్ రచన

1901-1902 మధ్య కాలంలో ఇస్క్రా పత్రిక ఎత్తుగడలు, నిర్మాణపరమైన పాలసీకి సంబంధించిన సారాంశమే, 'ఏం చేయాలి' అనే గ్రంథం అని కామ్రేడ్ లెనిన్ వివరించాడు.

'ఏం చేయాలి' అనే గ్రంథం నుండి' ఇక పార్టీ అంగాలు, వాటి పొందిక గురించి లెనిన్ అభిప్రాయమిది: పార్టీ రెండు భాగాలను కలిగి ఉండాలి. 1. ముఖ్యమైన పార్టీ వర్కర్లయిన రెగ్యులర్ కార్యకర్తలతో కూడిన సన్నిహిత బృందం. వీరిలో ఎక్కువగా విప్లవమే వృత్తిగల వారు ఉండాలి: వారికి పార్టీ పని తప్ప మరోపని వుండరాదు. కనీస సిద్ధాంత పరిజ్ఞానమూ, రాజకీయ అనుభవమూ, నిర్మాణ విషయాలలో అలవాటూ, జార్ పోలీసులతో పోరాడే చాతుర్యమూ, తప్పించుకొనే నేర్పూ వారు కలిగిఉండాలి. 2) విస్తృతమైన అల్లికతో గూడిన పార్టీ స్థానిక సంస్థలు ఏర్పడాలి. లక్షలాది శ్రమజీవుల సానుభూతిని పొందగలిగిన పార్టీ సభ్యుల సంఖ్య బహుళంగా ఉండాలి.

నిర్మింపడుతున్న పార్టీ స్వభావం ఏమిటి? కార్మికవర్గంతో దాని సంబంధం ఏమిటి? పార్టీ ఆశయాలు, ఉద్దేశాలు ఏమిటి? ఈ విషయాలపై లెనిన్ అభిప్రాయం: పార్టీ, కార్మికవర్గానికి పురోగామిగా ఉండాలి. శ్రామిక జనవర్గ పోరాటాన్ని నడిపిస్తూ, సమన్వయిస్తూ, అది కార్మికవర్గ ఉద్యమానికి మార్గదాయక శక్తిగా ఉండాలి. పార్టీ అంతిమ ఆశయం పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి సోషలిజాన్ని స్థాపించడం. తక్షణ ఆశయం జార్ ప్రభుత్వాన్ని కూలద్రోసి ప్రజాతంత్ర విధానాన్ని నెలకొల్పడం. జార్ ప్రభుత్వాన్ని మొదట కూలదోయనిచో పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోయడం అసాధ్యం. కాబట్టి, ఈ సమయంలో పార్టీ ప్రధాన కర్తవ్యం కార్మికవర్గాన్నీ, ప్రజలందరినీ జార్ ప్రభుత్వ వ్యతిరేక పోరాటానికి ఉత్తేజపరచడం, ప్రజా విప్లవోద్యమాన్ని వృద్ధి చేయడం, సోషలిస్టు మార్గానికి మొదటి తీవ్ర ప్రతిబంధకమైన జార్ ప్రభుత్వాన్ని కూలదోయడం అని లెనిన్ అభిప్రాయం.

లెనిన్ ఇంకా ఇలా రాసాడు:

"పాక్షిక కోర్కెల కోసం ప్రభుత్వంతో జరిపే పోరాటం. పాక్షిక కోర్కెలను కొన్నింటిని సాధించడం, అంటే శత్రువులతో చిన్న చిన్న తగాదాలవంటివి మాత్రమే, శివారులలో శత్రువుతో చిన్నచిన్న ఘర్షణలవంటివి మాత్రమే అని మనం గుర్తించాలి. న్యాయాత్మక పోరాటం ఇక ముందు జరుపవలసి ఉంటుంది. మనముందు శత్రువు కోట తమ యావత్ శక్తితోనూ నిలబడిఉంది. మనపై అది తుపాకి గుండ్లను, ఫిరంగిగుండ్లను కురిపిస్తుంది. మన ఉత్తమ యోధులను రంపపుకోత కోస్తుంది. ఈ కోటను మనం పట్టుకోవాలి. జాగృతమవుతున్న శ్రామికవర్గ శక్తులతో, రష్యన్ విప్లవకారుల శక్తులన్నిటినీ కలిపి ఒక పార్టీని ఏర్పరచినట్లయితే ఆ కోటను పట్టుకోగలం. ఆ పార్టీలోకి రష్యాలోని ఉత్సాహవంతులను చిత్తుశుద్ధిగల వారినందరినీ ఆకర్షించాలి. అపుడే "లక్షల కొలది కష్టజీవుల దృఢహస్తం లేస్తుంది. సైనికుల బాయ్‌నెట్లచే కాపాడబడుతున్న నిరంకుశ ప్రభుత్వ దాస్యం తుత్తునియలై ధ్వంసమవుతుంది" అని రష్యన్ విప్లవ కార్మికుడు ప్యోటర్ అలెగ్జియెవ్ చెప్పిన ప్రవచనం నిజమౌతుంది."

నిరంకుశ జార్ ప్రభుత్వ రష్యాలో కార్మికవర్గ పార్టీని నిర్మించడానికి లెనిన్ వేసిన పథకం అది. లెనిన్ పథకంపై దాడి సల్పడానికి "ఆర్థికవాదులు" ఈ విధంగా వాదించారు.

జార్ ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ పోరాటం అన్నివర్గాలకు చెందినది. ముఖ్యంగా బూర్జువాలకు చెందినది. అందుచేత అది కార్మిక వర్గానికి అంత ముఖ్యమైనది కాదు. ఎక్కువ జీతాల కోసం, పనిచేసే పరిస్థితులు బాగుపడడం కోసం, యజమానులపై ఆర్థిక పోరాటం సాగించుటలోనే, కార్మికుల ముఖ్య ప్రయోజనం ఉంది. అందుచేత, సోషల్ డెమోక్రట్ల ప్రధాన తక్షణ కర్తవ్యం "యజమానులపైన, ప్రభుత్వం పైన కార్మికుల ఆర్థిక పోరాటాన్ని" సంఘటిత పరచుటేగాని, జార్ ప్రభుత్వంపై పోరాడటం గాని, దాన్ని కూలదోయటం గాని కాదు. ప్రభుత్వంపై ఆర్థికపోరాటం అంటే, ఎక్కువ సౌకర్యాలు కల్గించే ఫ్యాక్టరీ చట్టం కోసం పోరాటమన్నమాట. ఈ విధంగా "ఆర్థిక పోరాటానికి దానంతకదే రాజకీయ స్వభావం కల్గించటం" సాధ్యమని "ఆర్థికవాదులు" వాదించారు.

కార్మికవర్గానికి ఒక రాజకీయ పార్టీ కావలసిన ఆవశ్యకతను "ఆర్థికవాదులు" బహిరంగంగా ఎదిరించ సాహసించలేకపోయారు. కార్మికవర్గ ఉద్యమానికి మార్గదర్శక శక్తిగా పార్టీ ముందుండ రాదన్నారు. అప్రయత్నంగా వచ్చే కార్మికవర్గ ఉద్యమాన్ని నడపడం మాట అలా ఉంచి పార్టీ అసలు దానిలో జోక్యం కల్గించుకోరాదని, కాని ఆ ఉద్యమం తోక వెనుక పార్టీ నడిచి దానిని పరిశీలించి దానినుండి గుణపాఠాలు నేర్చుకోవాలన్నారు.

సోషలిస్టు చైతన్యానికి సోషలిస్టు సిద్ధాంతానికి గల నిర్మాణాత్మక మార్గదర్శక పాత్ర పూర్తిగా లేనే లేదని లేక దాదాపు లేనే లేదని ఆర్థికవాదులు వాదించారు. సోషలిస్టు చైతన్య స్థాయికి కార్మికుల ఆలోచనలను సోషల్ డెమోక్రట్లు తీసుకుపోరాదనీ, పైపెచ్చు సోషల్ డెమోక్రట్లే సాధారణ కార్మికుల స్థాయికి ఇంకా మాట్లాడితే చాలా వెనకబడ్డ కార్మికవర్గ ప్రజల స్థాయికి దిగి పోవాలనీ, సరిపుచ్చు కోవాలనీ ఆర్థికవాదులు వాదించారు. కార్మికవర్గానికి సోషలిస్టు చైతన్యాన్ని సోషల్ డెమోక్రట్లు అందించరాదనీ, అప్రయత్నంగా వచ్చిన కార్మికవర్గ ఉద్యమం దానంతట అది సోషలిస్టు చైతన్యాన్ని పొందేవరకు వారు వేచి ఉండాలనీ "ఆర్థికవాదులు" వాదించారు.

లెనిన్ "ఆర్థికవాదుల" ఈ అవకాశవాద తత్వంపై తీవ్రంగా దాడిచేసి, సమూలంగ నాశనం గావించాడు.

1. జార్ ప్రభుత్వ ప్రతికూలమైన రాజకీయ పోరాటం నుండి కార్మికవర్గాన్ని పెడమార్గం పట్టించి, ప్రభుత్వాన్నీ, యజమానులనూ ముట్టకుండా అలాగే వుంచి, వారితో ఆర్థిక పోరాటం మాత్రమే సాగించటం కార్మికుల కర్తవ్యమని నిర్ధారణ చేయటం అంటే కార్మికులను శాశ్వత దాస్యానికి లోను చేయడమే. ప్రభుత్వంతోనూ, యజమానులతోనూ కార్మికుల ఆర్థిక పోరాటం అంటే ఏమిటి? తమ శ్రమశక్తిని పెట్టుబడిదారులకు అమ్ముకోవడంలో మంచి షరతుల కోసం పోరాడే ట్రేడ్ యూనియన్ పోరాటం. పెట్టుబడిదారులకు తమ శ్రమ శక్తిని అమ్ముకోవడంలో మంచి షరతుల కోసమేగాక పెట్టుబడిదారీ విధానం రద్దుచేయడానికి కూడా కార్మికులు పోరాడదలచారు. ఎంచేతనంటే, తమ శ్రమశక్తిని పెట్టుబడిదారులకు అమ్ముకొనే దుర్గతికి తెచ్చినదీ, దోపిడీకి గురియై బాధపడేటట్లు చేసిందీ ఈ పెట్టుబడిదారీ విధానమే. అందుచేత ఈ పెట్టుబడిదారీ విధానాన్నే రద్దుచేయడానికి పోరాటం సాగించాలని కార్మికులు తలచారు. కాని పెట్టుబడిదారీ విధానం కావలికుక్క అయిన జార్ ప్రభుత్వం, వారి ఉద్యమ పంథాలో ప్రతిబంధకంగా వున్నన్నాళ్ళు కార్మికులు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగాను, సోషలిజం కోసమూ తాము జరిపే పోరాటాన్ని పూర్తిగా వృద్ధిచేయలేరు. అందుచేత మార్గమధ్యం నుండి జార్ ప్రభుత్వాన్ని తొలగించి సోషలిజానికి మార్గం సుగమం చేయడం పార్టీకి కార్మికవర్గానికి తక్షణ కర్తవ్యం.

2. కార్మికోద్యమంలో యాదృచ్ఛికత క్రమాన్ని ఎత్తిపట్టడం అంటే, పార్టీ నిర్వహించాల్సిన నాయకత్వ పాత్రను నిరాకరించటం, దాన్ని సంఘటనలను రికార్డు చేసేస్థాయికి కుదించటం, తోకపట్టుకుపోయే తత్వాన్ని బోధించటం. యాదృచ్ఛిక క్రమాన్ని వెంబడించేదిగా పార్టీని మార్చటం, దాన్ని ఉద్యమంలో నిష్క్రియాశక్తిగా చేయటం. యాదృచ్ఛికతా క్రమాన్ని ఎదురుచేసే శక్తిగా మాత్రమే దాన్ని తయారుచేసి, సంఘటనలు వాటి మార్గంలో అవి ప్రయాణించటాన్ని అనుమతించేటట్టు చేయటం అని అర్థం. దీన్ని ప్రచారం చేయటం అంటే పార్టీని నాశనం చేయటం. అంటే కార్మిక వర్గానికి పార్టీ లేకుండాచేసి దాన్ని నిరాయుధం చేయటం. ఒక వైపు పూర్తిగా సాయుధమైన జార్ ప్రభుత్వం, మరొకవైపు ఆధునిక పద్ధతులలో నిర్మాణమై కార్మికవర్గానికి వ్యతిరేకంగా తాను చేస్తున్న పోరాటాన్ని నిర్దేశిస్తున్న పార్టీని కలిగియున్న బూర్జువా వర్గం వంటి శత్రువులను ఎదుర్కొంటున్న కార్మికవర్గాన్ని నిరాయుధం చేయటం అంటే దాన్ని మోసం చేయటమే.

3. లెనిన్ ఈ కింది విధంగా వాదించాడు: యాదృచ్ఛికత కార్మికవర్గ ఉద్యమాన్ని పూజిస్తూ తలొగ్గడం అంటే చైతన్యం యొక్క సోషలిస్టు చైతన్యం, సోషలిస్టు సిద్ధాంతాల ప్రాముఖ్యతను తక్కువ చేయటమే. అంధకారంలో నుండి వెలుగులోకి ప్రవేశిస్తున్నట్లుగా చైతన్యం పొందుతున్న కార్మికులను అవమానపరచడం మొదటి తప్పు. పార్టీ దృష్టిలో సిద్ధాంత విలువను తగ్గించడం అనగా వర్తమానాన్ని అర్థం చేసుకొని భవిష్యత్తును స్పష్టంగా ఊహించ గలిగేందుకు పార్టీకి అవసరమయిన సాధనాన్ని తక్కువ అంచనా వేయడం రెండవ తప్పు. అవకాశవాదం అనే వూబిలో మళ్ళా తలయెత్తకుండా దిగజారడం మూడవ తప్పు.

లెనిన్ ఇలా అన్నాడు: "విప్లవ సిద్ధాంతం లేనిదే విప్లవోద్యమ మనేదే లేదు....బాగా అభివృద్ధి చెందిన సిద్ధాంతంచే నడుపబడే పార్టీయే, ముందుండి పోరాడే పాత్రను నిర్వహించగలదు."

– (లెనిన్, సెలెక్టెడ్ వర్క్స్. ఇంగ్లీష్ ఎడిషన్, మాస్కో 1947, వాల్యూం ఒకటి. 163, 164 పేజీలు).

4. యాదృచ్ఛిక కార్మిక ఉద్యమం నుండి సోషలిస్టు సిద్ధాంత తత్వం తలయెత్తవచ్చునని "ఆర్థికవాదులు" వాదించారంటే, వారు కార్మికవర్గాన్ని మోసగిస్తున్నారు. వాస్తవానికి సోషలిస్టు సిద్ధాంతం యాదృచ్ఛిక ఉద్యమం నుండిగాక విజ్ఞానశాస్త్రం (సైన్సు) నుండి తలయెత్తుతుంది. కార్మికవర్గానికి సోషలిస్టు చైతన్యాన్ని అందజేయ వలసిన ఆవశ్యకతను నిరాకరించుట ద్వారా, "ఆర్థికవాదులు", బూర్జువా సిద్ధాంతానికి దారి సుగమం చేస్తున్నారు. కార్మికవర్గంలో బూర్జువా సిద్ధాంతాన్ని చొప్పించి ప్రచారం చేయడానికి సహాయ పడుతున్నారు. తత్ఫలితంగా, కార్మికవర్గ ఉద్యమాన్నీ, సోషలిజాన్నీ ఐక్యం చేయాలనే భావాన్ని పాతిపెడుతున్నారు. ఆ విధంగా బూర్జువాజీకి సహాయపడుతున్నారు అని లెనిన్ నిరూపించాడు.

లెనిన్ ఇంకా ఇలా అన్నాడు: "యాదృచ్ఛిక కార్మికోద్యమాన్ని పూజించడం, 'చైతన్యాంశం' పాత్రను, సోషల్ డెమోక్రటిక్ పార్టీ పాత్రను చిన్న చూపు చూడటం, కార్మికులలో బూర్జువా సిద్ధాంత పలుకుబడిని బలపరచడమే. "ఇలా చేసేవారు తమకిష్టమై చేసినా, లేక ఇష్టంగాక చేసినా, ఫలితం మాత్రం ఒకటే."

–(లెనిన్, సెలెక్టెడ్ వర్క్స్. ఇంగ్లీష్ ఎడిషన్, మాస్కో 1947, వాల్యూం ఒకటి. 173వ పేజీ).

బూర్జువా సిద్ధాంతాన్నో, సోషలిస్టు సిద్ధాంతాన్నో ఈ రెంటిలో ఏదో ఒక దానిని ఎన్నుకోవాలి. మరో మధ్యే మార్గంలేదు ...ఏ విధంగానైనా సరే సోషలిస్టు సిద్ధాంతాన్ని చిన్నచూపు చూడటం అంటే, సోషలిస్టు సిద్ధాంతం నుండి స్వల్ప మాత్రంగానైనా తిరిగి పోవటం అంటే బూర్జువా సిద్ధాంతాన్ని బలపరచడం అన్నమాట."

5) "ఆర్థికవాదుల" ఈ తప్పులన్నిటినీ క్రోడీకరిస్తూ లెనిన్ ఈ కింది నిర్ణయాలకి వచ్చాడు: పెట్టుబడిదారీ విధానం నుండి కార్మిక వర్గాన్ని స్వతంత్రులను చేయడానికి కావలసిన సామాజిక విప్లవ పార్టీని వారు కోరుకోవటం లేదు. అందుకే "ఆర్థికవాదులు" శ్రామికవర్గ ప్రధాన ప్రయోజనాలకు ద్రోహం చేస్తున్న సంస్కరణ వాదులు.

6) ఆఖరు విషయం: "ఆర్థికవాదం" రష్యాలో అకస్మాత్తుగా సంభవించినది కాదు. కార్మికవర్గంపైన పెట్టుబడిదారుల పలుకుబడికి ఆర్థికవాదులు ఒక సాధనం. పశ్చిమ యూరోపియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలలో ఆర్థిక వాదులకు స్నేహితులున్నారు. వారు అవకాశవాది బెర్నస్టీన్ అనుచరులైన రివిజనిస్టులు. పశ్చిమ యూరప్‌లో సోషల్ డెమోక్రటిక్ పార్టీలలో అవకాశవాద ధోరణి బలపడుతుంది. మార్పును "విమర్శించే స్వాతంత్ర్యం" కావాలనే వంకతో వారు మార్క్సిస్టు సిద్ధాంతాలను తిరగదోడాలని అన్నారు. అందుచేతనే వీరికి రివిజనిస్టులని పేరు వచ్చింది. విప్లవాన్ని, సోషలిజాన్ని, శ్రామిక నియంతృత్వాన్ని వీరు డిమాండ్ చేసారు. విప్లవ పోరాటాన్ని సోషలిజాన్ని, శ్రామిక నియంతృత్వాన్ని, వదులుకోవడమే రష్యన్ ఆర్థికవాదుల పాలసీ కూడా అని లెనిన్ నిరూపించాడు.

1. మార్క్సిస్టు ఆలోచనా క్రమ చరిత్రలో మొట్టమొదటిసారిగా, అవకాశవాదం సిద్ధాంత బీజాలేమిటో బట్టబయలు చేశాడు. యాదృచ్ఛికత కార్మికోద్యమాన్ని పూజించుటలోను, కార్మికవర్గ ఉద్యమంలో సోషలిస్టు చైతన్యం పాత్రను చిన్నచూపు చూడటంలోనూ ముఖ్యంగా ఆ సిద్ధాంత బీజాలున్నాయని తెలియజేశాడు.

2. సిద్ధాంతం, చైతన్యాల పాత్రను, యాదృచ్ఛిక కార్మిక వర్గ ఉద్యమానికి దిక్సూచిగా ఉంటూ దాన్ని విప్లవీకరించడంతో పార్టీకున్న గొప్ప ప్రాధాన్యతలను ఆయన వెలికి తెచ్చారు.

3. మార్క్సిస్టు అంటే కార్మికవర్గ ఉద్యమంతో సోషలిజాన్ని మేళవించుటయే అన్న ప్రధాన మార్క్సిస్టుసిద్ధాంత ప్రతిపాదనను అత్యంత చాకచక్యంతో లెనిన్ నిరూపించాడు.

4. మార్క్సిస్టు పార్టీ సిద్ధాంత పునాదులను అత్యద్భుతంగా విశదపరచాడు. "ఏం చేయాలి?" అనే గ్రంథంలో లెనిన్ విశదీకరించిన సిద్ధాంత ప్రతిపాదనలే ఆ తర్వాత బోల్షివిక్ పార్టీకి సిద్ధాంత పునాది అయ్యాయి.

## రష్యాలో కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ విషయాల్లో బలోపేతం కావడం:

1904-07 మధ్య కాలంలో కామ్రేడ్ లెనిన్ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సూత్రాలు, ఎత్తుగడలను సూత్రబద్ధం చేయడానికి **ఏ.** ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి **బి.** సోషల్ డెమోక్రసీ రెండు ఎత్తుగడలు రచనలను చేశాడు. ఈ రచనల ద్వారా మెన్షివిక్‌ల తప్పుడు సిద్ధాంతాలను ఎండగట్టాడు.

**"ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి"** అనే తన వుత్కృష్ట గ్రంథంలో లెనిన్ ఈ తిరుగుదెబ్బ కొట్టాడు. ఈ గ్రంథం 1904 మే లో ప్రచురించబడింది.

మెన్షివిక్‌లు ప్లెఖనోవ్ నుండి తగినంత సహకారం పొందారు. మెన్షివిక్‌లతో రాజీ చేసుకోవాలని ప్లేఖనోవ్ నిశ్చయించుకున్నాడు. అదే అవకాశవాదం చివరికి అతనిని మెన్షివిక్‌ల్లోకి దిగజార్చింది.

ఇస్క్రా పత్రికా మెన్షివిక్‌ల చేతిలో కొత్త ఇస్క్రాగా మారింది. లెనిన్ ప్రారంభించిన ఆ పత్రిక ఇప్పుడు లెనినిజానికి వ్యతిరేక పత్రికగా మారింది. లెనిన్ 'ఒక అడుగు ముందుకు- రెండడుగులు వెనక్కి' అనే పుస్తకం ద్వారా మెన్షివిక్‌లను ఎదుర్కొన్నాడు. అందులో ముఖ్య నిర్మాణ సూత్రాలు చెప్పాడు. అవి బోల్షివిక్ పార్టీ నిర్మాణానికి ప్రాతిపదికగా నిలిచాయి.

1. మార్క్సిస్టు పార్టీ, కార్మిక వర్గంలో ఒక భాగమూ, ఒక దళమూ. కాని కార్మికవర్గం అనేక దళాలను కల్గియుంటుంది. కాబట్టి కార్మికవర్గపు ప్రతిదళాన్నీ పార్టీ అని పిలవడానికి వీలులేదు. కార్మికవర్గ ఇతర దళాలకూ పార్టీకి తేడా ఉంది. ముఖ్యంగా ఈ తేడాకు కారణం ఏమంటే, పార్టీ సాధారణ దళం కాదు. అగ్రగామి దళం. వర్గచైతన్యం గల దళం. కార్మికవర్గ మార్క్సిస్టు దళం. సమాజ జీవితం గురించి, సమాజాభివృద్ధి సూత్రాల గురించి, వర్గ పోరాట సూత్రాల గురించిన పరిజ్ఞానం కల మార్క్సిస్టు దళం. ఈ కారణం చేత అది కార్మికవర్గానికి నాయకత్వం వహించి దాని పోరాటాన్ని నడుపగల్గిన దేశం. అందుచేత పార్టీని, కార్మికవర్గాన్ని ఒకటిగా భావించి గందరగోళ పడరాదు. అలాగే ఒక మొత్తాన్ని, దాని భాగంతో జతచేసి గందరగోళ పరచరాదు. ప్రతి సమ్మెదారుడూ తాను పార్టీ సభ్యుడనని ప్రకటించుకోవడానికి అనుమతి నీయాలని కోరరాదు. ఎందువల్లనంటే, పార్టీని, కార్మికవర్గాన్ని జతచేసి గందరగోళ పరిచేవారు-పార్టీ చైతన్య స్థాయిని "ప్రతి సమ్మెదారుని" స్థాయికి దిగజారుస్తున్నారు. వర్గ చైతన్యంతో గూడిన అగ్రగామియగు పార్టీని నాశనం చేస్తున్నారు. పార్టీ కర్తవ్యం, తన స్థాయిని "ప్రతి సమ్మెదారుని" స్థాయికి దిగజార్చడం కాదు; కార్మిక జనసామాన్యాన్ని పై స్థాయికి కొనిపోవాలి. "ప్రతి సమ్మెదారుని" పార్టీ స్థాయికి పెకెత్తాలి.

2. పార్టీ, ఒక అగ్రగామీ, వర్గ చైతన్యంతో కూడిన కార్మికవర్గ దళమూ మాత్రమే కాదు. అది సంఘటితమైన కార్మికవర్గ దళం. దీనికి ఒక క్రమశిక్షణ వుంటుంది. ఆ క్రమశిక్షణకు దాని సభ్యులందరూ లోబడాలి. కాబట్టి పార్టీ సభ్యులు, పార్టీ సంస్థలలో ఏదో ఒకదాని సభ్యులై తీరాలి. పార్టీ గనుక ఒక వర్గం యొక్క సంఘటిత దళం కానట్లయితే, వ్యవస్థాగత నిర్మాణం వ్యక్తుల కలగూరగంపయే అవుతుంది.

"మార్టావ్ ప్రతిపాదన, పైకి శ్రామికవర్గ జన బాహుళ్య ప్రయోజనాలను రక్షిస్తున్నట్లు కనపడుతుంది. కాని వాస్తవంలో, శ్రామికవర్గ క్రమశిక్షణ అన్నా, నిర్మాణం అన్నా సంకోచించే బూర్జువా మేధావుల ప్రయోజనాలనే కాపాడుతుంది. వ్యక్తి అహంకార వాదం, క్రమశిక్షణకూ, నిర్మాణానికి లొంగని స్వభావమూ సర్వసాధారణంగా వారిని ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో ఒక ప్రత్యేక భాగంగా వేరుపరుస్తున్నాయన్న విషయాన్ని ఎవరూ కాదన సాహసించలేరు."

-(లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్-ఇంగ్లీష్ ఎడిషన్, మాస్కో 1947, 1వ వాల్యూం 298-299 పేజీలు.)

సంస్థాగత నిర్మాణమన్నా, క్రమశిక్షణ అన్నా కార్మికవర్గం భయపడదు. ఒక సంస్థలో చేరడానికి ఇష్టపడని విద్యార్థులని, ప్రొఫెసర్లను కేవలం వాళ్ళు ఒక సంస్థ అజమాయిషీ కింద వున్నంత మాత్రాన పార్టీ సభ్యులుగా గుర్తించడానికి శ్రామికవర్గం ఇష్టపడదు. నిర్మాణం, క్రమశిక్షణా వ్యవహారాలలో స్వయం శిక్షణలేనిది మన పార్టీలోని కొందరు మేధావులకు మాత్రమేగాని, కార్మికవర్గానికి కాదు.

3. పార్టీ ఒక సంఘటిత దళం మాత్రమే కాదు. కార్మికవర్గం "నిర్మాణ రూపాలన్నిటిలోకి ఉత్తమమైనది పార్టీ" కార్మికవర్గపు ఇతర సంస్థలన్నిటినీ నడపవలసిన కర్తవ్యం దానిదే. వర్గంలో కల్లా మంచి సభ్యులను కల్గియుండటం వల్లా, అభివృద్ధియైన సిద్ధాంతకవచం ధరించుటవల్లా, వర్గ పోరాట సూత్ర పరిజ్ఞానం కల్గియుండుటచేతా, విప్లవ ఉద్యమానుభవం కల్గియుండుటవల్లా, పార్టీ నిర్మాణ స్వరూపాలోకల్లా అతి ఉన్నతమైనది. కార్మికవర్గ ఇతర సంఘాలనన్నిటినీ నడిపేందుకు పార్టీకి అన్ని విధాల అవకాశం వుంది. నడుపవలసిన బాధ్యత కూడా దానికి ఉంది. పార్టీ నాయకత్వ పాత్రను చిన్నచూపు చూస్తూ తక్కువ అంచనా వేసే మెన్షివిక్‌ల ప్రయత్నం, పార్టీచే నడుపబడే ఇతర శ్రామికవర్గ సంస్థలను బలహీనపరుస్తుంది. తత్ఫలితంగా శ్రామిక వర్గాన్ని బలహీనపరిచి నిరాయుధులను చేస్తుంది. ఎందుచేతనంటే "అధికారం చేపట్టడానికి చేసే పోరాటంలో శ్రామికవర్గానికి నిర్మాణం తప్ప మరొక ఆయుధం లేదు." -(లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్-ఇంగ్లీష్ ఎడిషన్, మాస్కో 1947, 1వ వాల్యూం 340 వ పేజీ.)

4. లక్షలాది కార్మికవర్గ ప్రజలతో కార్మికవర్గ అగ్రగామి సన్నిహిత్వ స్వరూపమే పార్టీ. పార్టీ ఎంత మంచి అగ్రగామి అయినప్పటికీ ఎంత బాగా సంఘటితమయినప్పటికీ, పార్టీ సభ్యులుకాని ఇతర ప్రజా సామాన్యంతో సంబంధాలు పెట్టుకొననిదే, ఆ సంబంధాలను మరింత హెచ్చిస్తూ బలపరచనిదే, పార్టీ బతకలేదు- అభివృద్ధి కాజాలదు. తన చుట్టూ గూడు కట్టుకొని బయటకు కదలని పార్టీ ప్రజాసామాన్యం నుండి విడివడిపోయిన పార్టీ, తన వర్గంతో సంబంధాలను వదులుకొన్న లేక సడలించిన పార్టీ, ప్రజాసామాన్యం విశ్వాసాన్ని, అండను కోల్పోకతప్పదు. తత్ఫలితంగా తప్పనిసరిగా నశించక తప్పదు. సమగ్రంగా బ్రతికి పెంపొందాలంటే, పార్టీ ప్రజలతోటి సంబంధాలను ఎన్నో రెట్లు హెచ్చించుకోవాలి. తన వర్గం యొక్క లక్షలాది జన సామాన్యం విశ్వాసాన్ని చూరగొనాలి.

5. సరిగా పని నిర్వహించాలంటే, జన సామాన్యాన్ని క్రమపద్ధతిలో నడపాలంటే, పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనే సూత్రంపై పనిచేయాలి. అనగా పార్టీకి నిబంధనావళి ఉండాలి. అందరికీ వర్తించే పార్టీ క్రమశిక్షణ ఉండాలి. ఒక నాయకత్వ సంస్థ–అనగా పార్టీ కాంగ్రెస్ ఉండాలి. కాంగ్రెస్ సమావేశానికి మరో సమావేశానికి మధ్య పార్టీ సెంట్రల్ కమిటీ పనిచేస్తూ ఉండాలి. మెజారిటీ నిర్ణయాలకు మైనారిటీ, క్రింది సంస్థలు పై సంస్థలకూ, వివిధ సంస్థలన్నీ కేంద్రానికీ బద్ధులై ఉండాలి. ఈ షరతులను తప్పినట్లయితే, కార్మికవర్గ పార్టీ నిజమైన పార్టీ కాజాలదు. కార్మికవర్గాన్ని నడిపే తన కర్తవ్యాలను పూర్తి చేయజాలదు.

మెన్షివిక్‌లతో జరిగిన అంతర్గత పోరాటంకు సంబంధించిన ప్రాముఖ్యతను కా.లెనిన్ 1907లో ఇలా వివరించాడు.

1904 ఎండాకాలంలో 'ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి' అనే పుస్తకం జెనీవాలో ప్రచురించబడింది. ఆగస్టు 1903లో జరిగిన సోషల్ డెమోక్రట్ల రెండవ కాంగ్రెస్‌లో ప్రారంభమైన మెన్షివిక్‌లకు, బోల్షివిక్కుల మధ్య జరిగిన చీలికతో మొదటి దశకు సంబంధించిన విషయాలు ఈ పుస్తకంలో రివ్యూలు ఉన్నాయి.

కా. లెనిన్ ఈ పుస్తకంలోని సూక్ష్మమైన ఆర్గనైజేషన్ విషయాలు, పార్టీ సెంటర్స్ కాంపోజిషన్ విషయాలు ఈ రోజు పాఠకులకు పెద్దగా ఉపయోగపడవని చెబుతూ పుస్తకాన్ని సగం తగ్గించానని చెబుతాడు. అయితే ఆర్గనైజేషన్ విషయాల్లో మెన్షివిక్‌లతో జరిగిన రాజకీయ వాదోపవాదాలు, రెండవ కాంగ్రెస్‌లో ముందుకు వచ్చిన ఎత్తుగడలు, ఇతర సూత్రాల విషయంలో గల విభేదాలపై విశ్లేషణ అవసరం అని చెబుతాడు. రష్యా విప్లవంలో కార్మికవర్గ పార్టీ అనుసరించిన మొత్తం కార్యకలాపాల్లో మెన్షివిజం, బోల్షివిజం అనే ధోరణులను అర్థం చేసుకోవడానికి పై రెండు అంశాలు ముఖ్యమైనవని ఆయన చెబుతాడు.

"సోషల్ డెమోక్రటిక్ పార్టీ రెండవ కాంగ్రెస్‌లో జరిగిన చర్చల్లో, వ్యవసాయ కార్యక్రమంపై జరిగిన డిబేట్ గురించి చెబుతూ విప్లవకరమైన ప్రజాస్వామిక రైతాంగ ఉద్యమం శక్తి చాల పరిమితులతో, తక్కువ అంచనావేసి మనం (రిటర్న్ ఆఫ్ ద కట్ ఆఫ్ లాండ్స్) ఆనాడు కార్యక్రమాన్ని రూపొందించామనే విషయాన్ని జరిగిన సంఘటనలు స్పష్టంగా గోచరించాయి. ఈ విషయాన్ని చాల వివరాలతో ప్రస్తుతం అచ్చువుతున్న రెండవ వాల్యూంలో వివరించదలుచుకున్నాం. సోషల్ డెమోక్రట్లలో మితవాద ధోరణి గల మార్టినోవ్ ఇతర అర్థికవాదులు; ఎక్కువ మట్టుకు పరిమితులతో కూడిన ఆనాటి కార్యక్రమాన్ని, అది చాల విశాలంగా ఉందనే ఆధారంగా వ్యతిరేకించారనే విషయాన్ని ముఖ్యమైనదిగా ఇక్కడ నొక్కి చెబుతున్నాను. సోషల్ డెమోక్రట్ల స్వభావాన్ని సంకుచితం, కుదించడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకించడానికి అర్థికవాదానికి వ్యతిరేకంగా పాత ఇస్క్రా జరిపిన పోరాటం యొక్క ఆచరణాత్మక ప్రాముఖ్యతను తెలియజేస్తున్నది. 1904 మొదటి భాగంలో మెన్షివిక్‌లతో ఉన్న విభేదాలు పాలసీపరంగా నిర్మాణపరమైన విషయాలకు పరిమితం చేయబడినవి. 'ఆర్గనైజేషన్‌లో అవకాశవాద ప్రశ్నలుగా' మెన్షివిక్‌ల వైఖరి గురించి నేను వివరించాను. దీన్ని వ్యతిరేకిస్తూ అక్సెల్‌రాడ్, కౌట్స్కికి ఇలా రాసాడు. "కార్యక్రమానికి, ఎత్తుగడలకు నేరుగా సంబంధం లేని, స్వతంత్రమైన ఈ విషయాన్ని 'ఆర్గనైజేషన్‌లో అవకాశవాద ప్రశ్నలుగా'' ముందుకు తీసుకొని రావడాన్ని నేను అర్థం చేసుకోలేకపోతున్నాను అని పేర్కొన్నాడు.

1905–07లో పూర్తిగా వ్యక్తమైన మెన్షివిక్‌ల భావాల్లో ఆర్గనైజేషన్‌లో అవకాశవాదం, ఎత్తుగడల ఆలోచనలు నేరుగా సంబంధం ఉన్న విషయాలే. దీని ప్రకారం అక్సెల్‌రాడ్‌కు అర్థం కాని విషయం, నేను ఆ రోజు ఎత్తిపట్టిన 'ఆర్గనైజేషన్‌లో అవకాశవాదమనేది' నేను ఊహించని విధంగా ఎంతో బ్రహ్మాండంగా ఈ రోజు ఆచరణలో వ్యక్తమైంది. అక్సెల్‌రాడ్ లాంటి వారు చేస్తున్న ఆలోచనలు కార్మికవర్గ ఉద్యమంలో చీలికలకు దారి తీసి ఉద్యమం దెబ్బతింటుందనే విషయానికి సరిపోతుంది.

1904లో మెన్షివిక్ గ్రూపులోనే 'ఆర్గనైజేషన్ అరాచకత్వం' అనే ధోరణితో ప్లెహనేవ్ తలపడడాన్ని అక్సెల్‌రాడ్ తన వ్యాసంలో పేర్కొనడాన్ని, 1907లో అక్సెల్‌రాడ్, ప్లెహనోవ్‌లు 'ఆర్గనైజేషన్ అరాచకత్వం' అనే దాన్ని వలుకుబడిగల్గిన మెన్షివిక్‌ల్లో గుర్తించడాన్ని, నేను 1904లోనే 'ఆర్గనైజేషన్ అవకాశవాదం' అని చెప్పడంతో సమానం కాదా!" –ప్రిఫేస్ టు ద కలెక్షన్ ఆఫ్ టువల్ ఇయర్స్–లెనిన్ –సెప్టెంబర్, 1907

### ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ యొక్క రెండు ఎత్తుగడలు

"1905 వేసవి కాలంలో ఈ పుస్తకం జెనీవాలో అచ్చయింది. మెన్షివిక్‌లతో గల సైద్ధాంతిక ఎత్తుగడల విభేదాలపైన క్రమానుగతమైన ప్రకటనగా ఈ పుస్తకం ఉంది. కార్మికవర్గ కర్తవ్యాల దృష్ట్యా బూర్జువా ప్రజాస్వామిక విప్లవాన్ని ఎత్తిపట్టడంలో లండన్‌లో జరిగిన బోల్షివిక్ కాన్ఫరెన్స్, జెనీవాలో జరిగిన మెన్షివిక్‌ల కాన్ఫరెన్స్‌ల్లో చేసిన తీర్మానాల్లో ప్రధానమైన భిన్న ధోరణులు ముందుకు వచ్చాయి. ప్రజాతంత్ర విప్లవానికి కార్మికవర్గం నాయకత్వం వహించాలని బోల్షివిక్‌లు చెప్పారు. కార్మికవర్గ పాత్రను తగ్గిస్తూ 'తీవ్రమైన ప్రతిపక్షంగా' మాత్రమే ఉండాలని మెన్షివిక్‌లు చెప్పారు. కార్మికవర్గ రైతుల ''విప్లవకరమైన ప్రజాతంత్ర నియంతృత్వం'' అనేది విజయవంతమైన విప్లవం అంటే విప్లవం

యొక్క వర్గ స్వభావం, వర్గ ప్రాముఖ్యతగా, బోల్షివిక్‌లు పాజిటివ్ నిర్వచనంగా చెప్పారు. కార్మికవర్గ పాత్ర బూర్జువావర్గాలపై ఆధారపడుతూ లొంగి ఉండాలని(సబార్డినేట్‌గా) ఉండాలని మెన్షివిక్‌లు బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గ పాత్ర గురించి ఎప్పుడూ చెబుతూవచ్చారు.

ఈ ప్రధానమైన విభేదాలే ఆచరణాత్మక కార్యకలాపాల్లో వ్యక్తమవుతూ వచ్చాయి. బులిజిన్ డ్యూమాను బోల్షివిక్‌లు బహిష్కరిస్తే, మెన్షివిక్‌లు ఊగిసలాడారు. విట్టి డ్యూమాను బోల్షివిక్‌లు బహిష్కరిస్తే, మెన్షివిక్‌లు ఊగిసలాడుతూ ఓట్లు వేయండి కాని డ్యూమా కోసం కాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మెన్షివిక్‌లు మొదటి డ్యూమాలో కేడెట్ మంత్రి వర్గానికి సపోర్టుతో పాటు కేడెట్ పాలసీని సమర్థించారు. అందుకు భిన్నంగా బోల్షివిక్‌లు కేడెట్‌ల విప్లవ వ్యతిరేకతను, రాజ్యాంగ బద్ధ భ్రమలను బహిర్గతపరచడమే గాక, 'వామపక్ష కార్యనిర్వహణ కమిటీ' అనే ప్రత్యామ్నాయం గురించి ప్రచారం చేశారు. అంతేగాక, బోల్షివిక్‌లు రెండవ డ్యూమా ఎన్నికల్లో వామపక్ష గ్రూపు కోసం పనిచేశారు. కాగా మెన్షివిక్‌లు కేడెట్ పార్టీతో జతకూడటం (బ్లాక్) కోసం పని చేశారు. ఇలాంటివి మరికొన్ని ఉన్నాయి.

గత పన్నెండేళ్ళ (1895-1907)ను తరచి చూసినట్లయితే రష్యా మార్క్సిజం, సోషల్ డెమోక్రసీలో ఈ రెండు ధోరణుల మధ్య విభేదాలు, 'లీగల్ మార్క్సిజం', 'ఆర్థికవాదం' 'మెన్షివిజం' అనేవి అదే చారిత్రక ధోరణిలో ఒకే మూసలోని విభిన్న రూపాలు అని నిర్ధారణకు రాగలం. బూర్జువా లిటరేచర్‌లో మార్క్సిజం యొక్క ప్రతిబింబంగా స్ట్రూవే లీగల్ మార్క్సిజం' ను దాన్ని ఇష్టపడేవారిని చూడవచ్చు. 1897 ఆ తర్వాత సంవత్సరాల్లో ఆర్థికవాదం అనేది విభిన్నమైన ధోరణిగా సోషల్ డెమోక్రసీలో ఉంది. ఇది నిజానికి కార్మికవర్గం కోసం ఆర్థిక పోరాటాలు, లిబరల్స్ కోసం రాజకీయ పోరాటాలుగా బూర్జువా లిబరల్స్ (క్రైడో) అమలు చేసిన కార్యక్రమంగా ఉంది. మొదటి కాలం అయిన రష్యన్ విప్లవం 1905-07లో మెన్షివిక్‌లు ప్రత్యేక పాలసీగా 'కార్మికవర్గం బూర్జువా లిబరల్స్‌కు లొంగి ఉండే విధంగా ఆచరణను కొనసాగించడం, సోషల్ డెమోక్రసీలో ఒక ధోరణిగానే కాకుండా, బూర్జువా లిబరల్స్‌తో దగ్గరగా అంటకాగిన గ్రూపుగా కూడ చెప్పవచ్చు." -ప్రిఫేస్ టు ద కలెక్షన్ ఆఫ్ టువల్ ఇయర్స్-లెనిన్ -సెప్టెంబర్, 1907

**రష్యా ప్రథమ విప్లవం (1907) ఓటమి:**

1904 జనవరిలో రష్యా-జపాన్ యుద్ధం ప్రారంభమైంది. 1905 ఆగస్టు 23న రష్యా చక్రవర్తి జార్ ఓటమి పాలై ఒక అవమానకరమైన ఒప్పందం చేసుకొన్నాడు. గతం నుండి కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం, యుద్ధనష్టాలు, ఓటములు, జార్ రాచరికం బలహీనపడడానికి, విప్లవ పరిస్థితి బలపడడానికి తోడ్పడింది. ప్రజల్లో వున్న జార్ వ్యతిరేకత, ఆగ్రహం 1905 నాటి మహత్తర విప్లవంలో ప్రస్ఫుటంగా కనబడింది. 1905 జనవరి 9న సెయింట్ పీటర్స్ బర్గ్‌లో విప్లవ తుపాను ప్రారంభమైంది. రష్యా అంతట జనవరి, ఫిబ్రవరి నెలల్లో పోరాటాలు చెలరేగాయి. జనవరి 2న 1లక్ష 40వేల మంది ప్రజలు ఊరేగింపుగా వింటర్ ప్యాలెస్‌కు విజ్ఞాపన పత్రం ఇవ్వడానికి పోతుండగా రెండవ నికోలస్ (జార్) ఆదేశంతో సైనికులు కాల్పులు జరపగా, వేయి మంది కార్మికులు చనిపోయారు, రెండు వేల మంది గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన జనవరి 9 'బ్లడీ సండే' గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ వార్త రష్యా దేశం నలుదిశలా వ్యాపించగా, కార్మికులు ద్వేషంతో, క్రోధంతో నిరంకుశ ప్రభుత్వం నశించాలనే నినాదంతో వీధుల్లోకి వచ్చారు. ఇలా రష్యా విప్లవం ప్రారంభమైంది. 1905 జూన్‌లో నల్ల సముద్రం నౌక దళంలోని పొటెంక్విన్ అనే యుద్ధ నౌకలో తిరుగుబాటు వచ్చింది. కానీ ఆహార ఇంధన కొరతవల్ల చివరికి లొంగిపోవాల్సి వచ్చింది.

డిసెంబర్ 7న మాస్కోలో రాజకీయ సమ్మె ప్రారంభమైంది. దాన్ని దేశవ్యాప్త సమ్మెగా మార్చలేక పోయారు. జార్ నిరంకుశ ప్రభుత్వం తిరుగుబాటు దారులకు మించిన బలాన్ని ప్రయోగించి అత్యంత క్రూరంగా అణచివేయడంతో 1905లో జరిగిన రష్యా ప్రథమ విప్లవం తాత్కాలిక ఓటమికి గురయింది.

**'మాస్కో తిరుగుబాటు గుణపాఠాలు':**

వస్తుగత పరిస్థితులలో వచ్చిన మార్పునూ, సమ్మెనుండి తిరుగుబాటుకు పరివర్తన జరగవలసిన అవసరాన్నీ కార్మికవర్గం తన నాయకులకంటే ముందుగా పసికట్టింది. ఎప్పుడూ జరిగేటట్లే, ఆచరణ సిద్ధాంతం కంటే ముందు నడిచింది. శాంతియుత సమ్మెతోనూ, ప్రదర్శనలతోనూ కార్మికులు తృప్తిపడలేదు. తరువాత చేయవలసిందేమిటని వాళ్ళు అడిగినారు. వాళ్ళు మరింత కృతనిశ్చిత చర్యను డిమాండు చేసినారు. మార్గావరోధాలు నిర్మించడానికి ఇచ్చిన ఆదేశాలు పేటలకు చాలా ఆలస్యంగా చేరినాయి. అప్పటికే నగర కేంద్రంలో మార్గావరోధాలు నిర్మింపబడుతూ ఉండినాయి. కార్మికులు విస్తారమైన సంఖ్యలో పనికి పూనుకున్నారు. కానీ ఇది కూడా వాళ్లను తృప్తిపరచలేదు. తరువాత చేయవలసిందేమిటని వాళ్ళు అడిగినారు. చురుకైన చర్యలు వాళ్ళు డిమాండు చేసినారు. డిసెంబర్‌లో మనం, సోషల్ డెమోక్రటిక్ కార్మికవర్గ నాయకులం తన సైన్యాలలో అత్యధిక భాగం యుద్ధంలో క్రియాత్మకంగా పాల్గొనేనట్లు వ్యూహం తీర్చిన సేన నాయకుని లాగా ఉండినాము. కార్మిక జన బాహుళ్యం కృతనిశ్చిత సామూహిక చర్య కొరకు ఆదేశాలు డిమాండు చేసింది కానీ పొందలేకపోయింది.

కనుక, సమ్మె అకాలంలో జరిగిందనీ, సమ్మెను ప్రారంభించి ఉండకూడదనీ, "వాళ్ళు సాయుధ పోరాటానికి దిగి ఉండకూడదు" అనీ ప్లెహనోవ్ చెప్పగా అవకాశవాదులందరూ ఎగబడి సంగ్రహించుకున్న అభిప్రాయం కంటే హ్రస్వదృష్టి అభిప్రాయం వుండజాలదు. తద్వ్యతిరేకంగా, మనం మరింత కృతనిశ్చయంగా, చురుకుగా, పరాక్రమంగా సాయుధ పోరాటానికి దిగి ఉండాలి. శాంతియుత సమ్మెకు పరిమితం చేయడం అసాధ్యమనీ, భయం లేని సడలుబాటు లేని సాయుధ పోరాటం అవసరమనీ మనం జనాలకు వివరించి ఉండాలి. రాజకీయ సమ్మెలు చాలవని ఇక ఇప్పుడు మనం బాహాటంగా బహిరంగంగా ఒప్పుకోవాలి. సాయుధ పోరాటానికి అనుకూలంగా మనం జనాలలో అత్యంత విస్తృత ఆందోళన సాగించాలి. "ప్రాథమిక దశల" గురించని మాటలతో ఈ సమస్యను మరుగుపరచడానికి గానీ, మరే విధంగానైనా గందరగోళపరచడానికి గానీ మనం ప్రయత్నించకూడదు. రాబోయే విప్లవ చర్య యొక్క తక్షణ కర్తవ్యంగా తెంపరి, రక్తపాతపు ఘాతుక యుద్ధం యొక్క ఆవశ్యకతను మనం జనాల నుండి మరుగుపరిస్తే, మనం ఆత్మవంచనా, ప్రజావంచనా చేసినట్లవుతుంది.

ఇది డిసెంబర్ ఘటనల మొదటి గుణపాఠం. మరొక గుణపాఠం తిరుగుబాటు స్వభావానికీ, దానిని సాగించిన పద్ధతులకూ, సైనికులు ప్రజల పక్షానికి వచ్చేటట్లు చేసిన పరిస్థితులకూ సంబంధించినది. ఈ చివరి అంశం విషయంలో మన పార్టీలోని దక్షిణ పక్షంలో తీవ్రమైన దురభిప్రాయం ఉంది. ఆధునిక సైనికులతో పోరాడే అవకాశం లేదనీ, సైనికులు విప్లవకరం కావాలనీ వాళ్ళు అంటారు. నిజమే, విప్లవం సామూహిక స్వభావం పొంది, సైనికులకు వ్యాపిస్తే తప్ప గురుతరమైన పోరాటపు సమస్యే లేదు. మనం సైనికులలో పని చేయాలనేది చెప్పనక్కరలేదు. కానీ, మనం నచ్చజెప్పిన ఫలితంగా గానీ, తమ సొంత విశ్వాసాల ఫలితంగా గానీ వాళ్ళు ఒక్క దెబ్బతో మనవైపుకు వస్తారని మనం ఊహించకూడదు. ఇది ఎంత మక్కీకి మక్కీ, నిర్జీవపు అభిప్రాయం అయిందీ మాస్కో తిరుగుబాటు స్పష్టంగా నిరూపించింది. వాస్తవం ఏమిటంటే, ప్రతి నిజమైన ప్రజా ఉద్యమంలోనూ అనివార్యమైనట్టి సైనికుల తటపటాయింపు, విప్లవ పోరాటం తీవ్రమైనప్పుడల్లా, సైన్యం కొరకు సిసలైన పోరాటానికి దారితీస్తుంది. ప్రగతి వ్యతిరేకతకూ విప్లవానికి మధ్య సైన్యం కొరకు జరిగే ఆదుర్దాతో కూడిన తెంపరితనపు పోరాటానికి మాస్కో తిరుగుబాటు ఖచ్చితంగా ఒక ఉదాహరణగా ఉండింది.

తటపటాయించే సైనికుల కొరకు ప్రభుత్వం ఎలాంటి పోరాటం చేసి గెలిచిందో అలాంటి ధైర్యంతో, యుక్తితో పద్ధతితో కూడిన, చురుకైన పోరాటానికి మన వశంలో ఉండిన శక్తులను మనం వినియోగించలేదు. మనం సైన్యంలో పనిచేసినాము, సైనికులను మన వైపు తిప్పుకోవడానికి భవిష్యత్తులో సిద్ధాంతపరంగా మన కృషిని ద్విగుణీకృతం చేస్తాము. కానీ, తిరుగుబాటు సమయంలో సైనికుల కొరకు ప్రత్యక్ష పోరాటం కూడా సాగాలనే విషయం మనం మరచిపోతే, మనం దౌర్భాగ్యపు ఛాందసులమని రుజువు చేసుకుంటాము.

సిద్ధాంతపరంగా సైనికులను మనవైపు తిప్పుకోవడంలో, డిసెంబర్ రోజులలో మాస్కో కార్మికవర్గం మనకు అద్భుతమైన గుణపాఠాలు నేర్పింది. తిరుగుబాటు కాలంలో, తటపటాయించే సైనికుల కొరకు పోరాటం చేయడంలో మనం మన కర్తవ్యానికి సరితూగ లేకపోయినాము. మార్క్స్ చేసిన ప్రగాఢమైన సూత్రీకరణల్లో మరొకదాన్ని, అవకాశవాదులు మరిచిపోయినట్టిదాన్ని, డిసెంబర్ ఘటనలు ధ్రువపరిచినాయి. అదేమిటంటే, తిరుగుబాటు అనేది ఒక కళ. ఈ కళలో ప్రధాన నియమం తెంపరి సాహసంతో, తిరుగులేని కృత నిశ్చయంతో దాడి చేయడం. ఈ సత్యాన్ని మనం తగినంతగా జీర్ణం చేసుకోలేదు. ఈ కళను, ఎంత కష్టమైనా దాడి చేయాలనే నియమాన్ని, మనమే తగినంతగా నేర్చుకోలేదు, జనాలకు నేర్పనూ లేదు. ఈ లోపాన్ని మనం శాయశక్తులా పూరించుకోవాలి. రాజకీయ నినాదాల సమస్య మీద అటోఇటో ఉండడం చాలదు. సాయుధ తిరుగుబాటు సమస్య మీద కూడా అటోఇటో ఉండడం అవసరం. దీనిని వ్యతిరేకించే వాళ్ళను, దీనికి సన్నాహాలు చేయని వాళ్ళను, విప్లవ మద్దతుదార్ల శ్రేణుల నుండి నిర్దాక్షిణ్యంగా లాగిపారవేయాలి. విప్లవ శత్రువుల వద్దకు గానీ, ద్రోహుల వద్దకు గానీ, పిరికి పందల వద్దకు గానీ వెంటనే పంపించి వేయాలి. ఎందుకంటే, ఈ సూత్రం ప్రకారం శత్రువులనూ, మిత్రులనూ వింగడించేటట్లు ఘటనలు బలమూ,పోరాట పరిస్థితులూ మనలను నిర్బంధించే రోజు సమీపిస్తున్నది. మనం బోధించవలసింది నిష్క్రియపరత్వం కాదు, సైనికులు మన పక్షానికి వచ్చిందాకా ఊరక "కాచుకొని ఉండడం" కాదు. కాదు! సాహసపు చొరవకూ, సాయుధ దాడికీ గల అవసరాన్నీ, అలాంటి సమయాల్లో శత్రువులకు నాయకత్వం వహించే వ్యక్తులను హతమార్చడానికీ, తటపటాయించే సైనికుల కొరకు అత్యంత చురుకైన పోరాటం చేయడానికీ గల అవశ్యకతనూ మనం మిద్దె కప్పుల నుండి ప్రకటించాలి.

మాస్కో నేర్పిన మూడవ గొప్ప గుణపాఠం తిరుగుబాటు కొరకు అవలంబించే ఎత్తుగడలకూ, బలాలను సంఘటితపరచడానికీ సంబంధించినది. సైనిక ఎత్తుగడలు సాంకేతిక స్థాయి మీద ఆధారపడతాయి. ఈ కటిక సత్యాన్ని ఎంగెల్స్ నిరూపించి, మార్క్సిస్టులందరికీ కండ్ల ముందు పెట్టినాడు. సైనిక సాంకేతిక స్థాయి ఈనాడు పందొమ్మిదవ శతాబ్ది మధ్య భాగంలో ఉన్నట్లు లేదు. ఫిరంగి దళాన్ని గుంపులు ఎదిరించడమూ, రివాల్వర్లతో మార్గావరోధాలను రక్షించుకోవడమూ అవివేకం. మాస్కో ఘటనల

తర్వాత, ఎంగెల్స్ నిర్ణయాలను పునరాలోచించడం అవసరమనీ, "కొత్త మార్గావరోధాల ఎత్తుగడల"ను మాస్కో ప్రారంభించిందనీ కౌట్స్కీ రాయడం సరైనది. ఈ ఎత్తుగడలు గెరిల్లా యుద్ధపు ఎత్తుగడలు. ఇలాంటి ఎత్తుగడలకు కావలసిన సంఘటన ఎలాంటిదంటే, పదిమంది ఉన్న దళాలు, లేదా ముగ్గురు ఉన్న దళాలు, లేదా ఇద్దరు కూడా ఉన్న దళాలు. ఐదుగురో, ముగ్గురో ఉన్న దళాల మాట ఎత్తినప్పుడల్లా నిరసించే సోషల్ డెమోక్రట్లు ఇప్పుడు మనకు తరుచు కనపడుతున్నారు. కానీ ఆధునిక సైనిక సాంకేతిక స్థాయి విధించిన పరిస్థితులలో వీధి పోరాటం లేవనెత్తే ఎత్తుగడల, ఏర్పాట్ల నూతన సమస్యను ఉపేక్షించడానికి నిరసన అనేది చౌకబారు పద్ధతి మాత్రమే. పెద్దమనుషులారా, మాస్కో తిరుగుబాటు కథను జాగ్రత్తగా అధ్యయనం చేయండి. "ఐదుగురి దళాల"కూ, "కొత్త మార్గావరోధాల ఎత్తుగడల"కూ మధ్య గల సంబంధం మీకు అర్థమవుతుంది.

మాస్కో ఈ ఎత్తుగడలను ప్రతిపాదించింది. కానీ వాటిని తగినంతగా అభివృద్ధి చేయడంలోనూ, గణనీయమైన మేరకు, నిజంగా విస్తారమైన మేరకు వాటిని ప్రయోగించడంలోనూ విఫలమైంది. ఐచ్ఛిక పోరాట దళాలు మరీ తక్కువగా ఉండినాయి. సాహసపు దాడి అనే నినాదం కార్మిక జనాలకు ఇవ్వలేదు, వాళ్ళు దానిని ప్రయోగించలేదు. గెరిల్లా దళాలు స్వభావంలో మరీ ఏకరూపంగా ఉండినాయి. వాటి ఆయుధాలూ, పద్ధతులూ మరీ అరకొరగా ఉండినాయి. గుంపుకు నాయకత్వం వహించడానికి వాటి సామర్థ్యం దాదాపు అవికసితంగా ఉండింది. ఈ లోపమంతటినీ మనం భర్తీ చేసుకోవాలి. మాస్కో అనుభవం నుండి నేర్చుకోవడం ద్వారా, ఈ అనుభవాలను జనాలలో వ్యాప్తి చేయడం ద్వారా, దీనిని మరింత అభివృద్ధి చేయడానికి వాళ్ళ సృజనాత్మక కృషిని ప్రేరేపించడం ద్వారా మనం భర్తీ చేసుకుంటాము. డిసెంబర్ నుండి దాదాపు ఎడతెరిపి లేకుండా రష్యా అంతటా జరుగుతున్న గెరిల్లా యుద్ధమూ, సామూహిక హింసాకాండా సరైన తిరుగుబాటు ఎత్తుగడలు నేర్చుకోవడానికి జనాలకు నిస్సందేహంగా తోడ్పడతాయి. సోషల్ డెమోక్రసీ ఈ సామూహిక హింసాకాండని గుర్తించి, తన ఎత్తుగడలలో భాగంగా చేర్చుకోవాలి. దానిని ఏర్పాటు చేసి, సహజంగానే అదుపులో పెట్టుకోవాలి. దానిని కార్మికవర్గ ఉద్యమం, సాధారణ విప్లవ పోరాట ప్రయోజనాలకూ, పరిస్థితులకూ లోబరచాలి, కానీ ఈ గెరిల్లా యుద్ధ "ఆకతాయితనపు" వికృత రూపాన్ని, తిరుగుబాటు కాలంలో మన మాస్కో కామ్రేడ్లూ, పేరుకెక్కిన లాత్వియన్ రిపబ్లికన్ రోజుల్లో లాత్వియన్లూ దేనితో అంత అద్భుతంగా, నిర్దాక్షిణ్యంగా వ్యవహరించినారో దాన్ని తొలగించాలి, నిర్దాక్షిణ్యంగా కత్తిరించాలి.

ఇటీవలి కాలంలో సైనిక సాంకేతిక రంగంలో కొత్త పురోగతులు జరిగినాయి. జపాన్ యుద్ధం చేతి బాంబును రంగంలోకి తెచ్చింది. చిన్న ఆయుధాల ఫ్యాక్టరీలు ఆటోమాటిక్ రైఫిళ్ళు తయారు చేసి, అమ్ముతున్నాయి. ఈ రెండు ఆయుధాలూ ఇప్పటికే రష్యన్ విప్లవంలో విజయవంతంగా వాడబడుతున్నాయి. కానీ తగినంత స్థాయిలో కాదు. సైనిక సామాగ్రి మెరుగుదలలను వినియోగించుకోవడమూ, బాంబులను విస్తారంగా తయారుచేయడం కార్మిక దళాలకు నేర్పడమూ, ప్రేలుడు పదార్థాలూ, ఫ్యూజులూ, ఆటోమాటిక్ రైఫిళ్లూ సంపాయించుకోవడంలో కార్మిక దళాలకూ, మన పోరాట దళాలకూ తోడ్పడడమూ మనం చేయగలం. చేసి తీరాలి. పట్టణాలలోని తిరుగుబాట్లలో కార్మికులలో అధికభాగం పాల్గొంటే, శత్రువు మీద సామూహిక దాడులు జరిపితే, సైనికుల కొరకు –డ్యూమా తర్వాత, స్వేయాబొర్గ్, క్రోన్‌ష్టాట్ తర్వాత సైనికులు ఎప్పుడూ లేనంతగా ఊగిసలాడుతున్నారు. కృతనిశ్చితమైన, నేర్పుతో కూడిన పోరాటం చేస్తే, సాధారణ పోరాటంలో గ్రామీణ ప్రాంతాలు పాల్గొనడం మనం నిస్సందేహం చేస్తే, వచ్చే అఖిల రష్యా సాయుధ తిరుగుబాటులో విజయం మనదవుతుంది.

–"ప్రోలెతారిమ్", సంచిక 2, ఆగస్టు29, 1906

**స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక దినాలు:**

1907 జూన్ 3వ తేదీన జార్ ప్రభుత్వం రెండవ డ్యూమాను రద్దు చేసింది. మూడవ డ్యూమా కోసం కొత్త చట్టాన్ని ప్రకటించింది. ఆ జార్ మంత్రి అయిన స్టోలోపిన్ దేశమంతటా ఉరికంబాలను నెలకొల్పాడు. వేలాది మంది విప్లవకారులు ఉరి తీయబడ్డారు. ఆ రోజుల్లో ఈ ఉరికంబాలను స్టోలోపిన్ నెక్‌టైలు అనేవారు. కులక్‌లకు, భూస్వాములకు వ్యతిరేకంగా రైతు ఉద్యమం తీవ్రమైంది.

స్టోలోపిన్ అభివృద్ధి నిరోధక కాలమంతా రాక్షస దౌర్జన్యకాండ కొనసాగించారు. మార్క్సిస్టు సిద్ధాంత పునాదులను కూలదోయడానికి కపట శాస్త్రీయ సిద్ధాంత ధోరణులు ప్రభలంగా ముందుకు వచ్చాయి. వాటికి సమాధానంగా భౌతికవాదం–అనుభవవాద విమర్శ అనే తత్వశాస్త్ర సమస్యలపై లెనిన్ గ్రంథం, ఆ కువిమర్శలను శాస్త్రీయంగా ఖండించింది. పదార్థం వాస్తవమని, చలనము, మార్పు, అభివృద్ధి అనే మూడు గతి తార్కిక నియమాలు సరైనవని స్పష్టపరిచాడు.

విప్లవాభివృద్ధి కాలంలో కంటే అభివృద్ధి నిరోధక కాలంలోనే పార్టీ సంస్థలో పని చేయడం ఎక్కువ కష్టం. నిరాశ, నిస్పృహలు పెరుగుతన్న సమయంలోనే సైద్ధాంతిక గందరగోళం, నిర్మాణ అరాచకత్వం ముందుకు వస్తాయి. రహస్య, బహిరంగ కార్యకలాపాలతో మరో విప్లవ వెల్లువకు అవకాశాలను గుర్తించి కార్మికవర్గ శక్తులను సన్నద్ధపరచాల్సి వుంది.

జార్ ప్రభుత్వాన్ని కూలదోయటం, బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తి చేయడం. సోషలిస్టు విప్లవానికి ముందుకు పోవటం ఇవీ 1905లో బోల్షివిక్కుల ప్రధాన రాజకీయ ఆశయాలు. ఇవి ఇంకా ఇలాగే ఉండిపోయాయి. ఒక్క క్షణం కూడా బోల్షివిక్కులు ఈ ఆశయాన్ని మరచిపోలేదు. ప్రజాతంత్ర రిపబ్లిక్ స్థాపన, చుట్టు భూస్వాముల ఎస్టేట్లను వశపరచుకొనుట, దినానికి 8గంటల పనీ, మొదలగు ప్రధాన విప్లవ నినాదాలను ప్రజాసామాన్యం ఎదుట బోల్షివిక్కులు పెడుతూనే వచ్చారు.

కాని, 1905లోని విప్లవ తరంగ ఉధృతపు రోజులలోని పార్టీ ఎత్తుగడలే ఈనాడు కూడా ఉండజాలవు. ఉదాహరణకు విప్లవోద్యమం క్షీణదశలో ఉన్నప్పుడు కార్మికవర్గం పూర్తిగా అలసిపోయి వున్నప్పుడు, అభివృద్ధి నిరోధక వర్గాలు తగినంతగా బలపడి వున్నప్పుడు, వెన్వెంటనే సర్వవ్యాప్తి రాజకీయ సమ్మెకు లేక సాయుధ తిరుగుబాటుకు ప్రజాసామాన్యాన్ని ఆదేశించడం తప్పవుతుంది. పార్టీ నూతన పరిస్థితికి అనుగుణ్యంగా అంచనా వేసుకోవాలి. దాడి చేసే ఎత్తుగడలు మాని, సంరక్షించుకునే ఎత్తుగడలకు పూనుకోవాలి. ఈ ఎత్తుగడలేమంటే, శక్తులను కూడగట్టుకోవడం. కార్మిక, కర్షకులను రహస్య జీవితానికి తిరోగమింపచేయడం, రహస్య జీవితం నుండి పార్టీ రహస్య కార్యకలాపాలను కొనసాగించటం, బహిరంగంగా ఉన్న కార్మికవర్గ సంస్థల కార్యకలాపాలతో, రహస్య కార్యకలాపాలను మేళవించటం. దీనిని తాము నెరవేర్చగలమని బోల్షివిక్కులు నిరూపించారు.

లెనిన్ ఇలా అన్నాడు:

"విప్లవ పూర్వ దీర్ఘకాలంలో ఎలా పనిచేయాలో మనకు తెలుసు. మనం పర్వతంవలె దృఢంగా వుంటామని వారు (శత్రువులు) వూరికే చెప్పడం లేదు. సోషల్ డెమోక్రట్లు ఒక శ్రామికవర్గ పార్టీగా ఏర్పడ్డారు. మొదటి సాయుధ పోరాటం ఓడిపోయినంత మాత్రాన ఈ పార్టీకి గుండె జారిపోదు; బుర్ర చెడిపోదు; వెర్రి సాహస కృత్యాలచే కొట్టుకుపోదు." -(లెనిన్ సెలెక్టెడ్ వర్క్సు- ఇంగ్లీష్ ఎడిషన్ -మాస్కో 1947-1వ వాల్యూమ్ 467 పేజీ.)

స్టోలోపిన్ నిర్బంధ కాలంలో బోల్షివిక్‌లు ఈ కింది ఎత్తుగడలు అవలంభించారు.

ఇంకా మిగిలివున్న బహిరంగ సంస్థలు, పార్టీ రహస్య సంస్థలకు తెరగా ఉపయోగిస్తున్నాయి. ప్రజలతో సంబంధాన్ని కొనసాగించే సాధనాలుగా ఉపయోగిస్తాయి. ప్రజాసామాన్యంతో తమ సంబంధాలను కాపాడుకొనేందుకు గాను బోల్షివిక్కులు కార్మిక సంఘాలు, ఇతర బహిరంగ పౌర సంస్థలు, రోగగ్రస్తులకు సహాయం చేసే సంఘాలూ (Sick Benefit Societies), కార్మిక సహకార సంఘాలూ మొదలైనవాటిని ఉపయోగించుకున్నారు. జార్ ప్రభుత్వ విధానాన్ని బట్టబయలు చేయడానికీ,రాజ్యాంగ ప్రజాతంత్రవాదులను బట్టబయలు చేయడానికీ, శ్రామికవర్గానికి రైతుల అండను సంపాదించడానికీ, ప్రభుత్వ ద్యూమా వేదికను, బోల్షివిక్కులు ఉపయోగించుకున్నారు. రహస్య పార్టీ సంస్థను భద్రపరచుకొనుట, దీని ద్వారా ఇతర రాజకీయ కార్యరూపాలన్నింటినీ నడుపుట, పార్టీ సరియైన పంథాను అవలంభించేట్లు చేసింది. విప్లవ వెల్లువలో రాబోయే నూతన ఉత్తేజానికి తగిన సన్నాహం చేయ పార్టీ శక్తులను కూడగట్టుకునేటట్లు చేసింది.

### స్టోలోపిన్ నిర్బంధకాలంలో లిక్విడేటర్లకు వ్యతిరేక పోరాటం:

బోల్షివిక్కులు రెండు రంగాలలో పోరాడుతూ, తమ విప్లవకరమైన పంథాను కొనసాగించారు. పార్టీ లోపలనేవున్న రెండు రకాల అవకాశవాద ధోరణులమీద పోరాటం సాగించారు. ఒకటి, పార్టీకి బహిరంగ శత్రువులైన లిక్విడేటర్లపైన, రెండవది, మరుగునపడివున్న పార్టీశత్రువులగు ఆట్జోవిస్టులు అనబడే వారిమీద.

లెనినూ, బోల్షివిక్కులూ అవకాశవాద ధోరణి అయిన లిక్విడేషనిజం పుట్టిన నాటినుండీ, నిర్దాక్షిణ్యంగా దానితో పోరాటం సాగించారు. లిక్విడేటర్లు పార్టీలోనే వుండి, లిబరల్ బూర్జువాకు ఏజెంట్లుగా పని చేస్తున్నారని లెనిన్ పేర్కొన్నాడు.

1908 డిసెంబర్‌లో, పారిస్‌లో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ (యావత్ రష్యా) 5వ మహాసభ జరిగింది. లెనిన్ తీర్మానాన్ని అనుసరించి, ఈ మహాసభ లిక్విడేషనిజంను ఖండించింది. పార్టీ మేధావులలో ఒక భాగం (మెన్షివిక్కులు) "ప్రస్తుతమున్న రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ సంస్థను రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారు. దానిస్థానే, పార్టీ సాంప్రదాయాలనూ, ఎత్తుగడలనూ, కార్యక్రమాన్ని ఒక్కుమ్మడిగా పరిత్యజించియైనా సరే, ఎంత కష్టమైనసరే, చట్టబద్ధంగా నడిచే, స్పష్టతలేని సంస్థను నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే లిక్విడేషనిజం" -(సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు బోల్షివిక్ పార్టీ తీర్మానాలు, రష్యన్ ఎడిషన్-1వ భాగం 128వ పేజీ.)

ఈనాటి వర్గ సంబంధాల మీదా, జారిజం యొక్క నూతన విధానం మీదా మార్క్సిస్టు పరిశీలన; గతంలో లాగే ఇప్పుడు మన పార్టీ పెట్టుకుంటూనే వున్న తక్షణ పోరాట లక్ష్యం గురించి సూచన; విప్లవ సోషల్ డెమోక్రట్ల యెత్తుగడలు యెంతవరకు సరైనవనే విషయం మీద విప్లవం నేర్పిన గుణపాఠాలను గ్రహించడం; పార్టీ సంక్షోభపు కారణాలను వివరించడమూ, దానిమీద పోరాటం చేసిన పార్టీలోని కార్మికవర్గ అంశాల పాత్ర నొక్కి చెప్పడమూ; రహస్య సంఘాలకూ, చట్టబద్ధ సంఘాలకూ మధ్య గల సంబంధం గురించిన

సమస్యా పరిష్కారం, డ్యూమా వేదికను వినియోగించుకోవలసిన అవసరాన్ని గుర్తించడమూ, మన డ్యూమ బృందం పొరపాట్ల మీద సూటి విమర్శతో జతపరిచి, ఆ బృందాన్ని నడిపించడానికి కచ్చితమైన ఆదేశాలు రూపొందించడమూ-ఇది కార్మికవర్గ పార్టీ ప్రస్తుత కష్టదశలో కచ్చితమైన ఒక మార్గాన్ని యెన్నుకునే సమస్యకు సంపూర్ణమైన జవాబు యిచ్చే కాన్ఫరెన్సు తీర్మానాల ప్రధాన సారం.

-'దారిలో' -లెనిన్ "సోష్యల్ డెమోక్రట్", సంచిక2, జనవరి28 (ఫిబ్రవరి10), 1909.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. ఐదవ కాన్ఫరెన్సు రష్యన్ కార్మికోద్యమ అభివృద్ధిలో ఒక మూలమలుపు. కార్మికవర్గపు విప్లవకర శక్తుల్ని బోల్షివిక్ కేంద్రం చుట్టూ సమీకరించేందుకు ఇది పునాది వేసింది.

లిక్విడేటర్ల ప్రయత్నాలకు వ్యతిరేకంగా కృత నిశ్చయంతో పోరాటాన్ని సాగించవలసిందిగా పార్టీ సంస్థలను అన్నిటినీ ఈ మహాసభ ఆదేశించింది. కానీ, మెన్షివిక్కులు ఈ మహాసభ నిర్ణయాలకు బద్ధులై ఉండలేదు. మరింతగా లిక్విడేషనిజం అనే ఊబిలో దిగిపోయారు. విప్లవానికి ద్రోహం చేశారు. రాజ్యాంగబద్ధ ప్రజాతంత్రవాదులతో చేతులు కలిపారు. ప్రజాతంత్ర రిపబ్లిక్, దినానికి 8గంటల పని, ఎస్టేట్ల భూమిని వశపరచుకొనుట మొదలగు కోర్కెలను, శ్రామికవర్గ పార్టీ విప్లవ కార్యక్రమాన్ని మెన్షివిక్కులు రానురాను మరింత బహిరంగంగా వదిలిపెట్టడం మొదలెట్టారు. పార్టీ కార్యక్రమాన్నీ, ఎత్తుగడలను వదిలిపెట్టడం ద్వారా నామమాత్రపు బహిరంగ చట్టబద్ధ "కార్మిక" పార్టీ ఉనికికి జార్ ప్రభుత్వ సమ్మతిని పొందవచ్చునని వారు ఆశించారు. స్టోలోపిన్ ప్రభుత్వంతో రాజీపడటానికీ దాని కనుగుణ్యంగా ప్రవర్తించడానికీ వీరు తయారయ్యారు. అందుకనే ఈ లిక్విడేటర్లను "స్టోలోపిన్ లేబర్ పార్టీ" అని కూడా పిలిచేవారు.

1908 నుండి 1910 వరకు జరిగిన ఈ అంతర్గత పోరాట సారాంశాన్ని లెనిన్ ఈ కింది విధంగా వ్యాఖ్యానించాడు.

"పశ్చిమ యూరప్‌లోని కార్మికవర్గం కంటే రష్యన్ కార్మికవర్గం చాల తక్కువ చైతన్యం కలిగి ఉండవచ్చు గాక,1905-07 కాలంలోని అన్ని వర్గాల్లో కెల్లా కార్మికవర్గం ఉన్నతమైన చైతన్యాన్ని ప్రదర్శించింది. 1948లో జర్మనీలో బూర్జువావర్గం లాగా, రష్యన్ లిబరల్ బూర్జువా వర్గం నీచమైన, భయంతో కూడిన మోసకారితనంతో వ్యవహరించింది. ఈ కారణంగానే రష్యా కార్మికవర్గం బూర్జువా వర్గాన్ని వ్యతిరేకించడమే గాక, లిబరల్స్ యొక్క ఈ మోసకారితనాన్ని బహిర్గత పరచడం, బూర్జువా వర్గం నుండి నాయకత్వాన్ని లాగివేసుకోవడంలో 1905లో కార్మికవర్గం చాల చైతన్యాన్ని ప్రదర్శించింది."

లిబరల్ బూర్జువా, రైతాంగం మధ్య 1905-07 కాలంలో వైరుధ్యాలు చాల తీవ్రమైనాయి. రైతాంగ తిరుగుబాట్లు 1905 వేసవి నుండి 1906 వేసవి వరకు రష్యాలో మూడవ భాగం కంటే ఎక్కువ భూభాగంలో విస్తరించాయి. రెండువేలకు పైగా భూస్వాముల ఇళ్ళను రైతాంగం నాశనం చేసింది. ఈ చర్యలను కార్మికవర్గం ఒక్కటే మనస్ఫూర్తిగా సమర్థించడమే కాదు, నాయకత్వం వహించడం, గైడ్ చేయడంతో పాటు కార్మిక సమ్మెల ద్వారా వాటితో సమైఖ్యమైంది. లిబరల్ బూర్జువావర్గం ఎప్పుడూ విప్లవ పోరాటాలకు సహాయం అందించకపోగా, రైతాంగాన్ని శాంతింప చేసి, భూస్వాములతో, జార్‌తో రాజీ కుదర్చడానికి ప్రయత్నించింది. ఇదే విషయం మళ్ళీ 1906-07 కాలంలో రెండు డ్యూమాల సందర్భంలో పునరావృతమైంది. ఈ మొత్తం కాలంలో రైతాంగ పోరాటాలకు అడ్డంకిగా మారి వాటికి విద్రోహం చేయడంగా, లిబరల్స్ అనుసరించిన వైఖరిని కార్మికవర్గం, డిప్యూటీలు వ్యతిరేకిస్తూ రైతాంగానికి మద్దతు నిచ్చారు. మొదటి, రెండవ డ్యూమాల మొత్తం చరిత్రంతా రైతాంగానికి, సోషల్ డెమోక్రట్లకు వ్యతిరేకంగా లిబరల్స్ సాగించిన పోరాటంగా చూడవచ్చు. లిబరల్స్‌ను సపోర్టు చేయడమా లేదా రైతాంగంపై లిబరల్స్ యొక్క ఆధిపత్యాన్ని కూలదోయడమా అనే పోరాటానికి సంబంధించిన ప్రశ్నగా చారిత్రకంగా, బోల్షివిక్‌లు- మెన్షివిక్‌ల మధ్య జరిగిన పోరాటంతో ముడిపడి ఉంది. -హిస్టారిక్ మీనింగ్ ఆఫ్ ఇన్నర్ పార్టీ స్ట్రగుల్ ఇన్ రష్యా-లెనిన్-ఏప్రిల్29, 1911.

కామ్రేడ్ మార్టినోవ్ అభిప్రాయాలను ఖండిస్తూ కామ్రేడ్ లెనిన్ ఇలా చెప్పాడు.

"ఆ సమయంలో (కార్మికవర్గం ఓటమిపాలు అవుతున్నప్పుడు -అనువాదకుడు) కార్మికవర్గం మరింత దూకుడుగా ఆర్థిక పోరాటాలు చేయడానికి ప్రయత్నిస్తున్నదని, ఇది కార్మికవర్గం 'బలహీనత'గా ఉందని అక్టోబరిస్టుల, కేడెట్‌ల అభిప్రాయాలనే మార్టినోవ్ వల్లిస్తున్నాడు.

మా అభిప్రాయం ప్రకారం, తప్పనిసరి మొత్తం సంఘటనల ఫలితంగానే కార్మికవర్గం దృఢ నిశ్చయంతో, విస్తృతంగా, తొందరతో కూడిన ఆర్థిక, సాయుధ రాజకీయ పోరాటాలకు సిద్ధం కావడం లేదనే విషయంలో వారి బలహీనత దాగి ఉంది. కాని ప్రత్యేకమైన గ్రూపు లేదా పార్టీల స్వీయాత్మక కోర్కెలపైన లేదు. 1905 చివరలో ఏర్పడిన ఈ గండి నిజానికి వర్గాలకు సంబంధించినది తప్పా, మార్టినోవ్, లేదా ట్రాట్స్కీ చెప్పడంతోనో మేధావులు ప్రకటించిన 'అభిప్రాయాలతో' సంబంధం ఉన్నది కాదు. విప్లవ కార్మికవర్గం పోరాడగా, బూర్జువావర్గం అనుసరించిన మోసపూరితమైన విధానంతో ఈ విశాలమైన గండి ఏర్పడిందనేది మా అభిప్రాయం."

మార్టినోవ్ చెబుతున్నదానికి కార్మికవర్గ పోరాటాల ఓటమి స్వభావం అనేది 1905 చివరకు సంబంధించిన విషయమే కాదని, చేర్పుచేస్తున్నాను. 1895-1904 మధ్య పది సంవత్సరాల కాలంలో అప్పటి సమ్మెలను లెక్కించినప్పుడు, 51.6శాతం సమ్మెలో యజమానులు గెలువగా; 1905లో 29.4శాతం; 1906లో 33.5శాతం; 1907లో 57.6శాతం, 1908లో 68.8శాతం సమ్మెలు యజమానులు గెలిచారు. దీన్నిబట్టి చూస్తే కార్మికవర్గం నిర్వహించిన (1906-07) ఆర్థిక పోరాటాలు 'పిచ్చివి' 'సమయానుకూలం' కాదని 'ఉద్యమం యొక్క బలహీనత'ను తెలియజేస్తున్నాయని చెప్పగలమా? కాదు. 1905లో ప్రజల విప్లవ పోరాటం దాడి ఉండవలసినంతగా లేని స్థితిలో కార్మికవర్గం రాజకీయంగా, ఆర్థికంగా ఓటమి తప్పనిసరి అయింది. అయితే కార్మికవర్గం 1906-07లో తమ శక్తికి రెట్టింపుగా ఉద్యమం చేయలేకపోయిన పక్షంలో ఓటమి ఇంకా పెద్ద స్థాయిలో ఉండేది. 1907 జూన్‌లో జరిగిన అధికార కుట్ర ఒక సంవత్సరం లేదా మరింత ముందుగానే జరిగి, 1905లో అంతకు ముందు సాధించిన కార్మికవర్గ ఆర్థిక విజయాలు అన్నీ తుడుచుకుపోట్టుకు పోయేవి. మార్టినోవ్ ఈవిప్లవ పోరాటాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడంలో పూర్తిగా విఫలమైనాడు." -హిస్టారిక్ మీనింగ్ ఆఫ్ ఇన్నర్ పార్టీ స్ట్రగుల్ ఇన్ రష్యా-లెనిన్- ఏప్రిల్29, 1911.

**ఆట్జోవిస్టలతో బోల్షివిక్‌ల పోరాటం:**

డాన్, ఆక్సెల్‌రాడ్, పాట్రెస్సోవ్ మొదలగు వారి నాయకత్వాన ఉన్నట్టే, మార్టోవ్, ట్రాట్స్కీ ఇంకా ఇతర మెన్షివిక్కుల సహాయం కల్గినట్టి లిక్విడేటర్లతో పార్టీ బహిరంగ శత్రువులతో పోరాడుటకు, దాగివున్న లిక్విడేటర్లపై కూడా బోల్షివిక్కులు నిర్ణయాత్మకమైన పోరాటాన్ని కొనసాగించారు. వీరు ఆట్జోవిస్టులు. "అతివాద" పదజాలంతో తమ అవకాశవాదాన్ని కప్పిపుచ్చుకునేవారు. బహిరంగంగా ఉన్న సంఘాలలోని పనిని పూర్తిగా కట్టిపెట్టాలనీ, ప్రభుత్వ డ్యూమా నుండి కార్మిక ప్రతినిధులను పిలిపించి వేయాలనీ కొందరు మాజీ బోల్షివిక్కులు కోరారు. రష్యన్ భాషలో ఆట్జివ్ అనగా పిలిపించివేయుట. అందుచే వీరికి ఆట్జోవిస్టులని పేరు వచ్చింది.

1908లో కొందరు బోల్షివిక్కులు ప్రభుత్వ డ్యూమా నుండి సోషల్ డెమోక్రటిక్ ప్రతినిధులను పిలిపించివేయాలని కోరారు. ఆట్జోవిస్టులు తమ స్వంత ముఠాను ఏర్పరచుకున్నారు. (బొగ్దనోవ్, లూనాచెర్స్కీ, ఎలెగ్జిన్స్కీ, సోక్రవిస్కీ, బొబ్నావ్ మొదలగువారు) లెనిన్‌కు, లెనిన్ పంథాకు వ్యతిరేకంగా వీరు పోరాటం సాగించారు. ఆట్జోవిస్టులు కార్మిక సంఘాలలోనూ, ఇంకా బహిరంగంగా ఉన్న ఇతర సంఘాలలోనూ పని చేయడానికి మొండిగా తిరస్కరించారు. అలా చేయుట ద్వారా కార్మిక ఆశయానికి వారు చాలా హాని చేశారు. ఆట్జోవిస్టులు, పార్టీకి కార్మికవర్గానికి మధ్య ఒక అఘాతాన్ని కల్పిస్తున్నారు. పార్టీకి చెందని ప్రజాసామాన్యంతో పార్టీకి సంబంధాలు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. తాము రహస్య సంస్థలలో గూడుకట్టుకుని కూర్చోవాలనుకున్నారు. కాని చట్టబద్ధమైన ముసుగును ఉపయోగించుకొనే అవకాశాన్ని నిరాకరించి, వారు, ఈ రహస్య సంస్థలకు సైతం అపాయం తెచ్చిపెట్టారు. ప్రభుత్వ డ్యూమాలో వుండి, ఆ డ్యూమా ద్వారానే బోల్షివిక్కులు రైతాంగాన్ని తమ పలుకుబడిలోకి లాక్కోవచ్చునని ఆట్జోవిస్టులు గ్రహించలేదు. రైతాంగాన్ని మోసంచేసి వారి అండను సంపాదించ ప్రయత్నిస్తున్న రాజ్యాంగ ప్రజాతంత్రవాదుల విధానాన్ని, జార్ ప్రభుత్వాన్నీ డ్యూమా ద్వారానే బట్టబయలు చేయవచ్చునని కూడా వీరు గ్రహించలేదు. విప్లవం మరో అడుగు ముందుకు వేయడానికి కావలసిన శక్తులను కూడగట్టడాన్ని ఆట్జోవిస్టులు ఆటంకపరిచారు. అందుచేత ఆట్జోవిస్టులు "సంపూర్ణంగా లిక్విడేటర్లే". వీరు బహిరంగంగా ఉండే సంస్థలను ఉపయోగించుకునే అవకాశాన్ని నాశనం చేయడానికి యత్నించారు. పార్టీ సభ్యులుకాని ప్రజా బాహుళ్యానికి శ్రామికవర్గం నాయకత్వం వహించాలనుటను వీరు వదిలిపెట్టారు. వాస్తవానికి విప్లవ కార్యకలాపాలనే వీరు వదిలిపెట్టారు.

1909లో ఆట్జోవిస్టుల ప్రవర్తనను చర్చించడానికై బోల్షివిక్ వార్తాపత్రిక "ప్రొలిటరీ" విస్తృత సంపాదకవర్గ సమావేశం జరిగింది. ఆ సమావేశం ఆట్జోవిస్టులను ఖండించింది. బోల్షివిక్కులు ఆట్జోవిస్టులతో తమ కెట్టి సంబంధమూ లేదని ప్రకటించి, బోల్షివిక్ సంస్థలనుండి వారిని వెళ్ళగొట్టారు.

లిక్విడేటర్లు, ఆట్జోవిస్టులు, శ్రామికవర్గం యొక్క శ్రామికవర్గ పార్టీయొక్క పెటీబూర్జువా తోటి ప్రయాణీకులు తప్ప మరేమిగారు. శ్రామికవర్గానికి కష్ట దినాలు సంప్రాప్తించినపుడు లిక్విడేటర్లు, ఆట్జోవిస్టుల నిజస్వభావం ప్రత్యేకమైన స్పష్టతతో బయటపడింది.

**ట్రాట్స్కీజానికి, పార్టీ వ్యతిరేక ఆగస్టు కూటమికి వ్యతిరేకంగా జరిపిన బోల్షివిక్కుల పోరాటం:**

శ్రామికవర్గ పార్టీ ఖచ్చితమైన పంథాను బోల్షివిక్కులు సమర్థిస్తున్న సమయంలో, మెన్షివిక్ లిక్విడేటర్లను ట్రాట్స్కీ సమర్థించాడు. ఈ రోజులలోనే ట్రాట్స్కీని లెనిన్ "జుడాస్ ట్రాట్స్కీ" (క్రీస్తుకు ద్రోహం చేసిన శిశ్యుని పేరు జూడాస్. నమ్మక ద్రోహి అర్థం-అనువాదకుడు) అని పేరుపెట్టాడు. ట్రాట్స్కీ వియన్నాలో (ఆస్ట్రియా) కొందరు రచయితలతో ఒక ముఠాను ఏర్పరచాడు. ఏ చీలికకూ చెందని పత్రిక అని చెప్పుకుంటూ, వాస్తవానికి మెన్షివిక్ వార్తాపత్రికను ఒక దానిని ప్రచురించసాగాడు. "ట్రాట్స్కీ తుచ్ఛమైన పదవీ వ్యామోహపరుడు. ముఠాతత్వవాది. (ఫాక్షనిలిస్టు)...పార్టీకి

నామమాత్ర సానుభూతి అతడు ప్రకటిస్తాడు గాని, ఏ ఇతర ముఠాతత్వ వాదికంటే కూడా నీచంగా ప్రవర్తిస్తాడు" అని ఆ కాలంలో లెనిన్ రాసాడు.

1912లో ట్రాట్స్కీ ఆగస్టు కూటమిని సంఘటిత పరచాడు. లెనిన్‌కు, బోల్షివిక్ పార్టీకి వ్యతిరేకమైన, అన్ని బోల్షివిక్ వ్యతిరేక ముఠాలు, ధోరణులు ఈ ఆగస్టు కూటమిలో ఉన్నాయి. ఈ బోల్షివిక్ వ్యతిరేక కూటమిలో లిక్విడేటర్లు, ఆట్జోవిస్టులు ఐక్యమయ్యారు. ఆ విధంగా తమ బంధుత్వాన్ని చాటుకున్నారు. అన్ని ప్రధాన విషయాలలోనూ ట్రాట్స్కీ అనుచరులు, లిక్విడేషనిస్టుల వైఖరిని అవలంభించారు. కాని ట్రాట్స్కీ తన లిక్విడేషనిజమ్‌కు "సెంట్రిజమ్" అనే ముసుగు వేశాడు. దీని అర్థం మధ్యేమార్గ విధానమన్నమాట. తాను బోల్షివిక్‌లకు గాని, మెన్షివిక్‌లకు గాని చెందననీ, వారిద్దరినీ సమాధాన పరచ ప్రయత్నిస్తున్నాననీ చెప్పాడు. ఇదే సెంట్రీజం. ఈ సందర్భంలో లెనిన్ ఇలా అన్నాడు. "ట్రాట్స్కీ బహిరంగ లిక్విడేటర్లకంటే తుచ్ఛమైనవాడు, ప్రమాదకారి. ఎందువల్లనంటే తాను "ఏ పక్షానికీ చెందనివాడినని" అతడు కార్మికులను మోసగించ ప్రయత్నిస్తున్నాడు. కాని వాస్తవంలో మెన్షివిక్ లిక్విడేటర్లను అతడు పూర్తిగా బలపరుస్తున్నాడు. మధ్యేమార్గం పోషించిన ప్రధాన ముఠా ట్రాట్స్కీయిస్టులే.

"1903-10 మధ్యలో ప్రజాసామాన్య కార్మిక ఉద్యమంలో వచ్చిన ప్రతి ధోరణిలో మార్టినోవ్ బహిరంగంగా తన అభిప్రాయాలను ఒక ముద్ర రూపంలో వెలిబుచ్చేవాడు. కాని మరో వైపు కాట్స్కీ తన వ్యక్తిగత ఊగిసలాటకు ప్రాతినిధ్యం వహించేవాడు. 1903లో ట్రాట్స్కీ మెన్షివిక్, 1904లో మెన్షివిజాన్ని వదిలివేసాడు; 1906లో మళ్ళీ ఒకసారి వదిలివేసాడు; 1906 చివరలో కేడెట్స్‌తో ఎన్నికల ఒప్పందాల కోసం అర్రులుచాచాడు. (దీని ద్వార ఆయన మరొక్కసారి మెన్షివిక్‌లతో జత కలిసాడు)

ట్రాట్స్కీ ఒక రోజు ఒక గ్రూపు యొక్క సిద్ధాంత భాండాగారం నుండి గ్రంథం చౌర్యం చేసి వ్యాపారం చేస్తే, మరునాడు మరో గ్రూపు భాండాగారాం నుండి గ్రంథం చౌర్యం చేసి వ్యాపారం చేస్తాడు. ఇలా తను ఏ గ్రూపుకు చెందిన వాడిని కానని చెప్పు కుంటాడు. సిద్ధాంత రంగంలో ట్రాట్స్కీ లిక్విడేటర్లతో, ఓట్జోవిస్టులతో ఏ ఒక్క అంశంతో అగ్రిమెంటు లేదు. సరికదా! ఆయనకు ఆచరణలో గ్లోసోసిస్టుల, వైపరాడిస్టులతో పూర్తిగా అగ్రిమెంటు ఉంది."

–హిస్టారిక్ మీనింగ్ ఆఫ్ ఇన్నర్ పార్టీ స్ట్రగుల్ ఇన్ రష్యా –లెనిన్–ఏప్రిల్29, 1911.

## స్వతంత్ర మార్క్సిస్టు పార్టీగా బోల్షివిక్ పార్టీ ఆవిర్భావం:

శ్రామికవర్గ రహస్య పార్టీని రక్షించడంలో బోల్షివిక్‌లు విజయం సాధించారు. కొత్త పార్టీని, సోషల్ డెమోక్రటిక్ పార్టీకంటే భిన్నమైన పార్టీని, అవకాశవాద వ్యక్తులు లేనటువంటి పార్టీని, రాజ్యాధికారం శ్రామికవర్గాన్ని నడపగల శక్తివంతమైన పార్టీని ఏర్పరచాలి. మెన్షివిక్‌లు, ఆక్సెల్‌రాడ్, మార్టినోవ్ మొదలుకుని మార్టోవ్, ట్రాట్స్కీల వరకు పశ్చిమ యూరోపియన్ సోషలిస్టు తప్పుడు సిద్ధాంతాలను అనుసరించారు. ఎంగెల్స్ మరణానంతరం పశ్చిమ యూరోపియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలు తమ పార్లమెంటు ముఠాకు తోకలుగా మారాయి. నిజమైన మార్క్సిస్టు పార్టీ అవకాశవాదుల పట్ల రాజీపడకుండా, బూర్జువాల పట్ల విప్లవకరంగా ఉండాలి. అది సామాజిక విప్లవ పార్టీ, శ్రామికవర్గ నియంతృత్వ పార్టీ, ఎకానమిస్టులు, మెన్షివిక్‌లు టాట్స్కీవాదులు, ఆట్జోనిస్టులలోనూ, అన్ని రకాల భావవాదులు మొదలుకుని, అనుభవవాద విమర్శకుల వరకు అన్ని రకాల విప్లవ వ్యతిరేక భావజాలాలను ఓడించారు. బోల్షివిక్‌ల మధ్య ఐక్యతను సాధించారు. మెన్షివిక్‌లతో వాస్తవంగా తెగతెంపులు పూర్తి చేయాలంటే నిర్మాణరీత్యా తెగతెంపులు చేసుకోవాలి. పార్టీ నుండి మెన్షివిక్‌లను వెళ్ళగొట్టాలి. శ్రామికవర్గ పార్టీని ఒక కార్యక్రమం, ఎత్తుగడలు కలిగిన వర్గ సంస్థగా పునరుద్ధరించే మార్గం ఇదే. అలాంటి పార్టీ నిర్మాణానికి సైద్ధాంతిక సన్నాహాలు "ఏం చేయాలి?" గ్రంథ రచన నుండి మొదలయ్యాయి. నిర్మాణ సన్నాహాలు "ఒక అడుగు ముందుకు–రెండడుగులు వెనక్కి" అనే గ్రంథం చేసింది. "ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ యొక్క రెండు ఎత్తుగడలు" అనే లెనిన్ గ్రంథం రాజకీయ సన్నాహాన్ని చేసింది. ఇంకా "భౌతికవాదం, అనుభవవాద విమర్శ" పార్టీకి తాత్విక సన్నాహాన్ని చేసింది.

పరిస్థితులు పరిపక్వమై, సన్నాహాలు పూర్తయి, విప్లవకర శ్రామికవర్గ పార్టీ ఏర్పాటు బాధ్యత 1912 జనవరి ప్రాగ్‌లో (జెకోస్లోవేకియా) జరిగిన ఆరవ అఖిల రష్యన్ మహాసభ కర్తవ్యం అయ్యింది. బోల్షివిక్ సెంట్రల్ కమిటీని ఎన్నుకోవడం (స్టాలిన్, స్వెర్డలోవ్‌లు ప్రవాసంలో వుండి ఎన్నికయ్యారు) పార్టీ నుండి మెన్షివిక్‌లను తొలగించడం ద్వారా రష్యన్ డెమోక్రటిక్ పార్టీ బ్రాకెట్‌లో బోల్షివిక్ అనే పదాన్ని చేర్చి పిలువడం మొదలైంది. ఈ మహాసభ చరిత్రలో కీలకమైనది. మెన్షివిక్‌లతో విభజన రేఖ గీయబడింది. బోల్షివిక్ పార్టీ ఆ తరువాత మరింత గట్టిపడి బలపడింది. శ్రామికవర్గ పార్టీ నుండి అవకాశవాదం అనే చెత్తను తుడిచివేశారు.

ఇటువంటి ఒక నూతన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కాకుంటే రాజ్యాధికారాన్ని స్వాధీనపరుచుకోవడం, శ్రామికవర్గ నియంత్రత్వాన్ని నెలకొల్పడం, అంతర్యుద్ధం నుండి బయటపడడం, సోషలిజం నిర్మించడం సాధ్యమయ్యేవి కావు. 1912-14 మధ్య కార్మికవర్గ జనసామాన్యాన్ని విప్లవోద్యమంలో నూతన ఉత్సాహంతో నడుపగలిగి ఉండేది కాదు. ○

# చైనా, భారత ప్రభుత్వాల ఆధిపత్య ధోరణుల వల్లనే నేడు ముదిరిన 'డోక్లామ్' సంక్షోభం

చుంబీ లోయలో నెలకొన్న సంక్షోభం, 1961లో భారత ప్రభుత్వం 'ముందడుగు విధానం' చేపట్టిన నాటి కంటే తీవ్రంగా ఉంది. ఆ రోజు నెహ్రూ ప్రభుత్వం చేపట్టిన 'ముందడుగు విధానం' ద్వారానే 1962లో చైనాతో యుద్ధం జరిగింది. భారత సైన్యాలు, చైనా పీపుల్స్ ఆర్మీ దళాలు జూన్ మధ్యలో హిమాలయా పీఠభూమిలోని సిక్కిం బార్డర్‌లో డోక్లామ్ / డోక్‌లాంగ్ ఏరియాలో ప్రక్క ప్రక్క మోహరించడంతో (స్టాండ్ ఆఫ్) ఈ సంక్షోభం ముందుకొచ్చింది.



చైనా పిఎల్‌ఏ డోక్లామ్ ఏరియాలో డోక్‌లా నుండి వాహనాలు తిరగగలిగే రోడ్డు నిర్మాణం తల పెట్టడంతో భారత్, భూటాన్, చైనా ట్రైజంక్షన్‌లో ఉద్రిక్తత పెరిగింది. చైనా ఈ రోడ్డు నిర్మాణం కనుక పూర్తి చేస్తే వివాదస్పదమైన ట్రైజంక్షన్ భూభాగంలో టిబెట్ కాపిటల్ లాసా నుండి చుంబీలోయ మధ్య రోడ్డు నిర్మాణం పూర్తి కాగలదు అని భారత్ అంటున్నది. దీనితో భారత జాతీయ భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడ బోతున్నదని భారత్ చెబుతున్నది.

భూటాన్ విదేశాంగ శాఖ జూన్‌లో చైనాకు ఒక ఫిర్యాదు చేసింది. ఈ రోడ్డు నిర్మాణం భూటాన్ భూభాగంలో, జుంపురే అనే భూటాన్ మిలిటరీ క్యాంపు ద్వారా ముందుకు పోతున్నది. ఇది రెండు దేశాల మధ్య 1988, 1998ల్లో జరిగిన రాతపూర్వక అగ్రిమెంట్లకు విరుద్ధంగా సాగుతున్నదని పేర్కొన్నది.

భారత సైన్యాలు సిక్కిం బార్డర్ దాటి 180 మీటర్లు లోపలికి రోడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలోకి చొచ్చుక వెళ్ళాయి. భారత ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ సిక్కిం బార్డర్‌లో ఆ ఏరియాలకు వెళ్ళి, భూటాన్ అభ్యర్థన మేరకు మా సైన్యాలు బార్డర్ దాటి వెళ్ళాయని ప్రకటన చేశాడు. అదే సందర్భంలో 17వ మౌంటెన్ డివిజన్‌ను సందర్శించాడు. 3500 కి.మీ బార్డర్‌ను కాపల కాస్తున్న ఈ డివిజన్ సంఖ్యను (స్ట్రాంగ్ ఎలైట్ మౌంటెన్ కోర్స్‌ను) 80 వేలకు పెంచుతున్నామని ప్రకటించాడు.

భారత సైన్యాలు సిక్కిం బార్డర్‌ను దాటి చైనా భూభాగంలోకి అడుగు పెట్టాయని, తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని చైనా డిమాండ్ చేసింది. సిక్కిం-చైనా సెక్టార్‌లో వాస్తవాధీన రేఖపై (ఎల్ఏసీ) 1890లో గ్రేట్ బ్రిటన్ - చైనా దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. "ఆర్టికల్ వన్ ఆఫ్ ద కన్వెన్షన్ బిట్వీన్ గ్రేట్ బ్రిటన్ అండ్ చైనా రిలేటింగ్ టు సిక్కిం అండ్ టిబెట్" ప్రకారం ఇరుదేశాల మధ్య పరిష్కారం కుదిరిందని చైనా పేర్కొంటున్నది. ఈ ఒప్పందంకు కట్టుబడనిచో ఇండియాలో సిక్కింను కలుపుకొన్నప్పుడు చైనా-ఇండియా ఒప్పందంలోని సిక్కిం సెక్షన్ ద్వారా ఇండియాకు లభించిన చట్టబద్ధతనుతిరిగి పునఃసమీక్షస్తానని చైనా హెచ్చరించింది. డోక్‌లాంగ్ తమ అంతర్గత భూభాగమని, భారత సైన్యాలు ఈ ప్రాంతంకు రావడం బార్డర్‌ను అతిక్రమించడమేనని పేర్కొంది. డోక్‌లాంగ్ సమస్య చైనా - టిబెట్ దేశాల మధ్య సమస్య అని భారత్ ఇందులో కలుగజేసుకోవడం సరికాదని అంది. భారత సైన్యాలు ఈ ప్రాంతంనుండి వుపసంహరించుకొంటేనే ఇరుపక్షాల మధ్య చర్చలు సాధ్యమని చైనా ప్రకటించింది.

ఈ సంఘటనలు జరిగిన వెంటనే ఇరుదేశాల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. భారతదేశం 1962లో జరిగిన యుద్ధాన్ని మరిచిపోవద్దని చైనా విదేశాంగ మంత్రి పేర్కొనగా, భారతదేశం 1962 నాటిలా లేదని 2017 నాటి పరిస్థితి వేరని రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అన్నాడు. దీనితో భారత, చైనా మీడియాలు జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టడం ప్రారంభించాయి. బిపిన్ రావత్ మాట్లాడుతూ ఇండియా రెండున్నర ఫ్రంట్లలో (చైనా, పాకిస్థాన్) ఒకే సారి పోరాడడానికి సిద్ధంగా ఉందని ప్రకటించాడు. దీనితో ఇరు దేశాల్లో ఈ సమస్య ప్రతిష్టకరంగా మారింది.

## డోక్లామ్ భౌగోళిక స్థితి

డోక్లామ్ హిమాలయ పీఠభూమిలో భాగంగా ఉంది. భారత్ -చైనా- భూటాన్ ల మధ్య ట్రైజంక్షన్‌గా ఏర్పడిన చుంబీవాలీ ప్రాంతానికి దిగువన 'డోక్లామ్' ఉంది. ఇది సరిగ్గా ఈ మూడు దేశాల ప్రస్తుత సరిహద్దుల్లో ఆనుకొని ఉంది. డోక్లామ్ వ్యూహాత్మక ప్రాంతం కావడంతో మూడు దేశాల మధ్య పోటీ ఏర్పడింది.

చైనా- భూటాన్ బార్డర్ ప్రధాన సమస్య ఇండియా- భూటాన్ -చైనా ట్రైజంక్షన్‌ను సూచించడం పై ఆధారపడి ఉంది. చైనా -భూటాన్ మధ్య సరిహద్దులో పశ్చిమోత్తర ప్రాంతంలో డోక్లామ్, సించులుంగ్, సమస్తేలో ఉన్న డ్రామన, షాకటాన్ లు, హెూ, పారో జిల్లాల్లో ఉండగా, మధ్య భాగాల్లో పాసమ్‌లుంగ్, జార్‌లుంగ్

లోయలు వాంగ్‌డూ పొదరాంగ్ జిల్లాల్లో ఉన్నాయి.

డోక్లామ్ సమస్య పూర్తిగా చైనా-భూటాన్‌కు చెందిందని, బ్రిటీష్-చైనా మధ్యలో 1890లో జరిగిన ఒప్పందంలో ట్రైజంక్షన్ (ఇండియా, భూటాన్, చైనా)ను గుర్తించడం జరిగిందని, దీని ప్రకారం భూటాన్ సరిహద్దులోని గిప్‌మోచి అనే పర్వతాన్ని ఫిక్స్ చేయడం జరిగిందని పేర్కొంది. దీని ప్రకారం డోక్లామ్ ఏరియా చైనాలోని టిబెట్ భూభాగంలోకి వస్తుందని, ఇండియా సైన్యాలు ఈ వాస్తవాధీన రేఖను దాటి వస్తున్నాయని చైనా పేర్కొంది.

### ఇండియా-భూటాన్ మధ్య రహస్య ఒప్పందం- అసలు నిజాలు

ఇండియా -భూటాన్ మధ్యలో 2007లో జరిగిన ఫ్రెండ్‌షిప్ ట్రీటీ సెక్షన్ 2 ప్రకారం (1914లో జరిగిన రహస్య ఒప్పందం, ఈ ట్రీటీతో చట్టబద్ధమైంది) భూటాన్ భూభాగాల రక్షణ కోసం సైన్యాలను పంపామని భారత్ పేర్కొంటున్నది. 1949లో జరిగిన ఒక రహస్య ఒప్పందం వల్లనే చైనా -భూటాన్‌ల మధ్య సమస్యలు నలుగుతున్నాయి. నాటి భూటాన్ రాజు, ప్రస్తుత రాజు తండ్రి అయిన రాజు జిమ్ పింగ్సీ వాంగ్‌చుక్ 1979 సెప్టెంబర్‌లో భారత పాత్రికేయుడు సయ్యద్ నక్వీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విధంగా చెప్పాడు.

'1949 నాటి రహస్య ఒప్పందంలోని 2వ క్లాజు ప్రకారం భూటాన్ విదేశాంగ వ్యవహారాల నిర్వాహణ విషయంలో భారత ప్రభుత్వ జోక్యం ఉంటుంది. కాని భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా భూటాన్‌కు చైనాతో సంబంధాలు అనివార్యమని 1949 నాటి భూటాన్ -భారత్ రహస్య ఒప్పందంలోని రెండవ క్లాజు చైనాతో సంబంధాలకు అవరోధం కల్గిస్తున్నదని రాజు పేర్కొన్నాడు. ఇలా భూటాన్ దేశ పాలకవర్గం ఇండియా -చైనా మధ్య ఊగిసలాటలో ఉంది.

చైనా - భూటాన్ దేశాల మధ్య సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవడానికి 24సార్లు సమావేశాలు జరిగాయి. చైనా పశ్చిమ భూటాన్‌లోని 4 ప్రాంతాల్లో కర్తియాంగ్, సించులుంపా, డ్రామనీ, డోక్లామ్‌లను కోరగా, అందుకు బదులుగా చైనా 495 చ.కి.మీ. పాసమ్‌లుంగ్, జకిర్ లుంగి ప్రాంతాల్లో తమ భూభాగాన్ని ఇస్తానని, దీనికి బదులుగా భూటాన్ 269చ.కి.మీ. మాత్రం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ పశ్చిమ ప్రాంతాలు చైనాకు వ్యూహాత్మక మైనవి. చైనా - భూటాన్‌తో 24 సార్లు జరిపిన చర్చల్లో భూటాన్‌ను పై ప్రతిపాదనలపై చాల వరకు ఒప్పించగలిగింది. భూటాన్‌తో ఒప్పందం చివరి దశలో ఉంది. ఈ ప్రాంతాలు చైనా ఆధీనంలోకి వెళితే చుంబీవ్యాలీకి చైనాకు మరొక్క త్రోవ లభిస్తుందని, ఇది ఇండియాలోని కోడిమెడ లాంటి 20 కి.మీ. వెడల్పుతో ఉండే సన్నని మార్గమైన (Chicken Neek) సిలిగిరి కారిడార్‌పై కత్తిలాగా వేళాడుతుందని, చైనా ఈ చికెన్‌నెక్‌ను మూసివేసి భారత్ నుండి ఈశాన్య రాష్ట్రాలను కట్ చేయగల్గుతుందని భారత్‌లో కొన్ని వర్గాలు పేర్కొనగా, చికెన్ నెక్ ద్వారా కాకుండ ఇతర మార్గాల్లో ఈశాన్య రాష్ట్రాల్లో ఏదైన అత్యవసరపరిస్థితిలో సంబంధాలు ఏర్పాటు చేసుకోవచ్చని మరికొన్ని వర్గాలు అంటున్నాయి. ఏదైనా దీని ద్వారా చైనా వ్యూహాత్మకంగా పై చేయి సాధిస్తుందని ఇండియా చెబుతోంది.

### సరిహద్దు వివాదాలు- చారిత్రక అంశాలు

1890లో బ్రిటిష్ - చైనా మధ్యలో ఒప్పందం జరిగింది. దీని ప్రకారం సరిహద్దులకు తూర్పున ఇండియా, నేపాల్, చైనా ట్రై జంక్షన్‌లో మెక్‌మోహన్ రేఖపై, పశ్చిమాన ఇండియా, అఫ్ఘనిస్థాన్, చైనా ట్రై జంక్షన్‌లోని లడాఖ్‌లోని అక్సాయిచిన్ ప్రాంతం వాస్తవాధీన రేఖగాగుర్తించారు. అయితే ట్రైజంక్షన్ల పై ఒప్పందం కుదిరినప్పటికీ, ముఖ్యంగా మెక్‌మోహన్ రేఖ కేవలం పటంపై సన్నని, చిక్కటి రేఖగా మాత్రమే గుర్తులతో ఉండి, క్షేత్రస్థాయిలో నేల మీద గుర్తుపెట్టకుండా సరిహద్దులను వదిలివేసారు. ఇది క్షేత్రస్థాయిలో పరిష్కరించుకోవాల్సిన సమస్య. అందుకని ఆ యా ప్రాంతాల్లో ఆయా దేశాల మధ్య చర్చలు జరుపుకొని సరిహద్దులను క్షేత్రస్థాయిలో నిర్ధారించుకోవాలని ఆ రోజు జరిగిన ఒప్పందంలో ఉంది. బ్రిటన్ ప్రభుత్వం 1949లోనూ ఈ విషయాన్ని ఆ దేశాలకు తెలియజేసింది. ఈ సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవడానికి చైనా-ఇండియా దేశాల మధ్య 1959 నుండి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ బార్డర్ వివాదాలను పరిష్కరించుకోవడానికి జన చైనా నేత, ప్రధానమంత్రి చౌఎన్‌లై నాయకత్వంలో భారత ప్రధానమంత్రి నెహ్రూకు స్నేహ హస్తం చాపాడు. ఇండియా, చైనా బాయిబాయి అని, మాకు ముప్పుగా పరిణమించిన అమెరికా సామ్రాజ్యవాదం శత్రువని, ఇండియాను మా స్నేహితుడిగా చూస్తున్నామని కామ్రేడ్ చౌఎన్‌లై ఆ రోజు భారత ప్రభుత్వానికి చెప్పాడు. కాబట్టి బార్డర్ సమస్యలను శాంతి యుతంగా పరిష్కరించుకోవాలని సూచించాడు. కామ్రేడ్ మావో కూడా పలుమార్లు ఇదే విషయాన్ని భారత అంబాసిడర్ ఆర్.కె.నెహ్రూతో చెప్పాడు. అయితే ఆ రోజు చైనా-భారత్ మధ్య గల బార్డర్ వివాదాల పరిష్కారం కోసం న్యూ ఢిల్లీలో ఏప్రిల్ 22,23- 1960లో జరిగిన సమావేశంలో చౌఎన్‌లై చేసిన రాజీ ప్రతిపాదనను నెహ్రూ-వల్లభాయ్ నేతృత్వంలోని ప్రభుత్వం తిరస్కరించింది. ఆ ప్రతిపాదనలో ఇలా ఉంది. "తూర్పు ప్రాంతంలోని మెక్‌మోహన్ రేఖకు గల దక్షిణ ప్రాంతాలను మేము కావాలని అడగడం లేదు. కాని ఇండియా పశ్చిమాన అలాంటి భూభాగాల కోసం అడుగుతున్నది. అంగీకరించడం కష్టం. దీనికంటే మంచి విషయమేమంటే

ఇరుపక్షాలు ఇలాంటి టొరిటోరియల్ భూభాగాలను కోరుకోవద్దు. అయితే ఒంటరి ప్రాంతాలు కొన్నింటిలో రీ అలైన్‌మెంట్స్‌ను విడిగా చేసుకోవాలి. అలాంటి ఒంటరి ప్రాంతాల్లో టొరిటోరియల్ భూ భాగాలను కోరుకోవద్దు. దీని ప్రకారం చైనా మెక్ మోహన్ రేఖను అంగీకరిస్తుందని, అక్సాయిచిన్‌లో యధాతథా స్థితిని కొనసాగించాలని" భారత్‌ను కోరాడు. చైనాలోని జిన్‌పింగ్ నుండి టిబెట్‌కు రహదారి అక్సాయిచిన్‌లోనే ఉంది.

అక్సాయిచిన్‌లో భారత్‌కు వ్యూహాత్మకంగా ఎలాంటి ప్రయోజనాలు లేవని స్వయాంగా నెహ్రూనే నవంబర్ 7, 1950లో సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఉత్తరం రాశాడు. అయితే జులై 1, 1954లో ఏకపక్షంగా అప్పటి మ్యాపులను ధ్వంసం చేయించాడు. తర్వాత బ్రిటిష్-చైనా మధ్యలో 1890లో జరిగిన ఒప్పందం కేవలం 'దురాక్రమణలు చేసుకోవద్దు' అనే ఒప్పందం మాత్రమే అంటూ చౌఎన్‌లై చేసిన ప్రతిపాదనలను నెహ్రూ ప్రభుత్వం తిరస్కరించింది. 1961లో ఇండియా ప్రభుత్వం 'ముందడుగు పాలసీ' ద్వారా అక్సాయిచిన్‌లో చైనా కంట్రోల్‌లో ఉన్న భూభాగాల నుండి చైనాను ఖాళీ చేయించడానికి అనుసరించిన విధానం వల్లనే ఇండియా-చైనా మధ్య యుద్ధం జరిగిందనేది చారిత్రక సత్యం. యుద్ధం పిదప కూడ చౌఎన్‌లై 1963లో నెహ్రూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ "ఒప్పందాలు చేసుకోవడంలో భారత ప్రజల నుండి ఏమైనా ఒత్తిడిలు ఉంటే, కాలం గడుస్తున్నకొద్దీ ఒప్పందాలకు రావచ్చు. అంతవరకు చైనా ఓపిక పడుతుందని" కూడా చెప్పాడు.

సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవడానికి చైనా-ఇండియా మధ్యలో 1981 నుండి చర్చలు జరుగుతున్నాయి. చైనా 1959లో చౌఎన్‌లై చేసిన ప్రతిపాదనలకే పూసల్లో దారంగా కట్టుబడి చర్చల్లో ప్రతిపాదనలు చేస్తున్నది. అయితే ఈ చర్చలను అధికారుల మధ్య కాకుండా రాజకీయ నేతృత్వం మధ్యలో చర్చలు చేసి పరిష్కరించు కోవాలని, అలా అయితేనే సరియైన పరిష్కారం లభిస్తుందని చైనా పేర్కొంటున్నది.

డోక్లామ్ సంక్షోభం కొనసాగుతున్నప్పుడే షీ జిన్‌పింగ్ చైనా పిఎల్ఏ ఆర్మీ పరేడ్‌లో ఒక ప్రకటన చేశాడు. చైనా బార్డర్ విషయాల్లో తన సార్వభౌమాన్ని వదులుకోదని ఆ ప్రకటనలో చెప్పాడు. ఈ ప్రకటన ప్రకారం చైనా ఏ వైఖరితో ఉంది. దీన్ని పరిశీలించాలి. చైనా తన చుట్టు ఉన్న దేశాలైన 14 దేశాలతో 20వేల కి.మీ. భూభాగంలో, సముద్ర జలాల్లో, 18వేల కి.మీ. వివాదాలున్నాయి. చైనా సరిహద్దుల్లో ఆఫ్ఘనిస్తాన్, ఇండియా, భూటాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, లావోస్, మంగోలియా, మయన్మార్, నేపాల్, నార్త్ కొరియా, పాకిస్థాన్, రష్యా, వియత్నాం మరియు తజకిస్తాన్ దేశాలు ఉన్నాయి.

సముద్రజలాల్లో బార్డర్‌లో బ్రూనే, ఇండోనిషియా, జపాన్, నార్త్‌కొరియా, సౌత్‌కొరియా, మలేషియా, తైవాన్, ఫిలిప్పైన్స్ మరియు వియత్నాంలు ఉన్నాయి. ఇందులో ఇండియా, భూటాన్‌లతో గల భూభాగంలో బార్డర్ల సమస్యలను పరిష్కరించు కోలేకపోగా మరో రెండు దేశాలతో సముద్ర జలాలతో వివాదాలను పరిష్కరించుకోలేక పోయింది. ఇక తక్కిన అన్ని దేశాలతో సమస్యలు పరిష్కరించుకొంటూ ఒప్పందాలు చేసుకొంది. అందుకు ఆయా దేశాలకు ఎన్నో రాయితీలు కూడా ఇచ్చిందని అంటున్నారు. అయితే భారత్, భూటాన్‌తో గల సమస్యలు బ్రిటన్ వదలివెళ్లిన వారసత్వ సమస్యలు. ఇవి ఎన్నో చిక్కులతో కూడుకొన్నవి. వీటిని పరిష్కరించు కోవడానికి ఎంతో సంయమనం, ఇచ్చి పుచ్చుకునే ధోరణి అవసరం. ప్రస్తుతం చైనా, భారతదేశాలు ఆ స్థితిలో లేవు.

చైనా-ఇండియా బార్డర్‌లో సైనికులు తరచుగా పక్కపక్కగా మోహరించడం జరుగుతూనే ఉంది. 2013 నుండి దౌలతబాద్ ఒల్డి, డేస్పాంగ్‌లో జరగగా, ఈసారి డోక్లామ్‌లో పునరావృతమైంది. ఇలాంటి ఘటన 1986లో అరుణాచల్‌ప్రదేశ్ లోని తవాంగ్ దగ్గరలోని సుమ్‌జోరాంగ్ లో జరిగింది. దాదాపు 8 నెలల పాటు ఈప్రతిష్టంభన కొనసాగింది. ఇండియా ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ చైనా పర్యటనతో ఇరు సైన్యాలు వెనక్కి తగ్గాయి.

చైనా ఈ బార్డర్ ప్రాంతాల్లో చాల సంవత్సరాలుగా సైనిక అవసరాల కోసం రహదారులను అనుసంధానం చేస్తున్నది. అందులో భాగంగా పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం అభివృద్ధి చేస్తున్నది. చైనా తన వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా ఇది చేస్తున్నది. దీని ద్వారా పిఎల్ఏ, ఇండియా ఆర్మీ కంటే ఎంతో శీఘ్రంగా ఈ బార్డర్‌లో తన బలగాలను మోహరించే పరిస్థితి ఉండేలా ప్రయత్నిస్తున్నది. మరో వైపు ఇండియా కూడా రోడ్ల నిర్మాణం చేపడుతున్నది. వాస్తవాధీన రేఖను చేరడానికి ఇండియా 2005లో 73 బార్డర్ రోడ్లను అనుమతించింది. అయితే నేటి వరకు 29 మాత్రమే పూర్తికాగా 44 రోడ్లు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇది చైనా నిర్మాణాలతో పోలిస్తే ఎంతో వెనకబడి ఉంది.

### రెండు దేశాల మధ్య సంబంధాలు

భారతదేశంలో మోడీ అధికారానికి వచ్చిత తర్వాత షీ జిన్‌పింగ్ వెంటనే మోడీకి అభినందనలు తెలిపాడు. 'చైనాతో సంబంధాలు మెరుగుపరుచుకోవడం భారతదేశం దౌత్యనీతిలో ప్రధానంగా వుంటుందని' షీ జిన్‌పింగ్ తో చెప్పగా, అందుకు బదులుగా షీ జిన్‌పింగ్ చైనా కూడా ఇరుదేశాల మధ్య పరస్పర విశ్వాసం కోసం పాటుపడుతుందని చెప్పాడు. తర్వాత బంగ్లాదేశ్, చైనా, ఇండియా,

మయన్మార్ ఎకనామిక్ కారిడార్ (బిసిఐమ్–ఇసి)కు సహకరిస్తామని పేర్కొన్నాడు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారతదేశ పర్యటనలో ఉండగానే లడాఖ్ బార్డర్‌లో ఇరుదేశాల సైన్యాల మధ్య మోహరింపు జరిగింది.

2014లో మోడీ జపాన్ పర్యటనలో ఉన్నప్పుడు 'కొన్ని దేశాలు తమ విస్తరణవాద కాంక్షను వదులు కోవాలని' ప్రకటన చేశాడు. అదే సమయంలో హిందూ మహా సముద్రంలో చైనా విస్తరణ వాదానికి ఒడిగడుతుందని అమెరికా, జపాన్‌లు ఆరోపిస్తున్నాయి. ఒబామా ప్రభుత్వం చైనాను చుట్టుముట్టే పథకంలో భాగంగా 'కీలకమైన తూర్పు' (పీవోట్‌టుఈస్ట్) అనే పాలసీని రూపొందించింది. దీనికి గత మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం సహకారం అందించింది. మోడీ అధికారానికి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వాలు అనుసరించిన 'వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం'' స్థానంలో అమెరికా అనుసరిస్తున్న చైనా వ్యతిరేక ప్రపంచ వ్యూహంలో ముందువరుస (ఫ్రంట్‌లైన్) దేశంగా పశ్చిమ దేశాలకు చైనాకు మధ్య పెరుగుతున్న ఘర్షణలో భారతదేశాన్ని నిలబెట్టాడు. ఇవి చైనాకు గుర్రుగా వుండగా, చైనా తలపెట్టిన చైనా –పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సిఇపిఇసి) నిర్మాణంపైన భారతదేశానికి అభ్యంతరాలు ఉన్నాయి. షీ జిన్‌పింగ్ మానసపుత్రిక లాంటి ప్రాజెక్టు అయిన వన్‌బెల్ట్–వన్ రోడ్ (ఓబీఓఆర్) ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ఇండియా పాల్గొనలేదు. బ్రిక్స్ దేశాల కూటమి ద్వారా ప్రపంచంలో అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా బహుముఖ ప్రపంచాన్ని నిర్మించాలనే ఆశయం కల్గిన బ్రిక్స్ సంస్థలో సభ్యురాలుగా ఉంటూనే, అమెరికాతో ఇండియా వహిస్తున్న 'వ్యూహాత్మక భాగస్వామ్యం' పై చైనాకు అసంతృప్తి ఉంది. అంతేగాక ఈ మధ్యలో మలబార్ నావిక దళాల సంయుక్త విన్యాసాలు జరిపింది. ఇవి మలక్కాజలసంధి ద్వారా హిందూ మహాసముద్రంలో గల చైనా ఓడలను, జలాంతార్గాములను టార్గెట్ చేసే విన్యాసాలుగా జరపడంతో చైనాకు భారతదేశంపై పలు అనుమానాలు కలిగాయి. ఇవే గాకుండా ఇరు దేశాల మధ్య మరిన్ని సమస్యలు ఉన్నాయి. న్యూక్లియర్ సప్లయ్ గ్రూపులో భారత సభ్యత్వానికి చైనా మోకాలడ్డు తున్నదని భారతదేశం కోపంగా ఉంది. ఇవన్నీ చాల సీరియస్ రాజకీయ సమస్యలుగా ముందుకు రాగా ఇరు దేశాల మధ్య వుండవలసిన పరస్పర విశ్వాసం క్రమంగా సడలుతున్నది.

ఇలాంటి సందర్భంలో డోక్లామ్ సంఘటన జరగడం, దీనిపై ఇరు దేశాలు మొండి పట్టు పట్టడం, ఇరు దేశాల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపడం ఇరు పాలకవర్గాలు చేసిన ఘోరమైన తప్పిదం.

ఒక వైపు డోక్లామ్ సమస్యపై ఇరు దేశాల మధ్య ఘర్షణ కొనసాగుతున్నప్పుడే, సమాంతరంగా చర్చలు కూడా ఇరు దేశాలు జరిపాయి. ఈ చర్చల్లో భారత్ తరపున విదేశాంగ శాఖ అధికారులతో పాటు, ప్రధానమంత్రికి భద్రతా సలహాదారు అయిన అజిత్ దోవాల్ ఈ చర్చలకు నాయకత్వం వహించాడు. దీని వలన 72రోజులుగా కొనసాగిన ప్రతిష్టంభన ఆగస్టు 28న అంతమై ఇరుదేశాల మధ్య 'తాత్కాలిక ఉపశమన సమానమైన ఒప్పందం' ఒకటి జరిగింది. దీని ప్రకారం ఇండియా తన సేనలను వెనక్కి తీసుకోవాలని, చైనా తన రోడ్డు నిర్మాణ కార్యక్రమాలను నిలుపుదల చేస్తుందని, ఇరుపక్షాలు నిర్ణయానికి వచ్చాయి.

చైనాలో జరగబోతున్న బ్రిక్స్ సమావేశంలో మోడీ పాల్గొనడమా! లేదా అనే సంశయానికి కూడ ఈ ఒప్పందం తెరదించింది. ఈ ఒప్పందం తర్వాత మోడీ బ్రిక్స్ సమావేశంలో పాల్గొన్నాడు.

ఈ ఒప్పందంతో ఇరు దేశాలు తమ ప్రజలను సంతృప్తి పరచడానికి తామే ఈ సమస్యలో విజయం సాధించామని చెప్పుకుంటున్నాయి. తాము భారతసైన్యాలను వెనక్కి పంపించాం కాని మన సైన్యం అక్కడే ఉందని చైనా చెప్పుకోగా, రోడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయటం కోసమే మన సైన్యాలు వెళ్ళాయని, అలా రోడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయించి మన సైన్యాలు వెనక్కి వచ్చాయని ఢిల్లీ ప్రభుత్వం చెప్పుకుంటున్నది. ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెంచడానికి దారీ తీస్తాయి. బ్రిక్స్ సమావేశం తర్వాత కూడ డోక్లామ్ సమస్యకు పరిష్కారం లభించకపోగా, ఆ సమస్య మరింత జఠిలంగా ముంచుకొచ్చే అవకాశాలున్నాయి.

**రెండు దేశాల ప్రభుత్వాల ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలి.**

నాటి చైనా ఒక సోషలిస్టు దేశంగా వర్ధిల్లింది. అది ఇరుగు పొరుగు దేశాలతో పంచశీల సూత్రాల ప్రాతిపదికపై స్నేహహస్తం చాపింది. అమెరికాతో పాటు సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా పోరాడింది. కాని నేటి చైనా సామ్రాజ్యవాద దేశంగా మారింది. అది అమెరికాతో ఆర్థికంగా పోటీ పడడంతో పాటు మిలిటరీ పరంగా ఎదగడానికి తీవ్రమైన కృషి చేస్తున్నది.

భారతదేశం బ్రిటిష్ వలస నుండి అర్ధవలస దేశంగా మారింది. ఆ రోజు ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉండి. ఈ 70 సంవత్సరాల్లో భారతదేశం ఆర్థిక, మిలిటరీ రంగాల్లో ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశంగా ముందుకొచ్చింది. ప్రస్తుతం చైనాతో పాటు భారతదేశం కూడా అణు పాటవాన్ని కల్గిఉంది. ఈ కారణంగా అది చైనాతో పోటీ పడుతున్నది.

ఇరు దేశాలకు విస్తరణ వాద కాంక్ష ఉంది. భారతదేశం

దక్షిణాసియాలోని చిన్న దేశాలపై విస్తరణవాద కాంక్షతో ఆధిపత్యం చెలాయిస్తున్నది. చైనా సామ్రాజ్యవాద దేశంగా ప్రపంచంలో గొప్ప శక్తిగా (గ్రేట్ పవర్) మారడానికి ప్రయత్నిస్తున్నది. ఈ సందర్భంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సమస్యలు శాంతియుతంగా పరిష్కారం కావడం అంత సులువేమి కాదు. డోక్లామ్ సమస్య ద్వారా ఇరు దేశాల మొండివైఖరిని మనం స్పష్టంగా చూడవచ్చు.

అయితే చైనా, భారతదేశాల బలబలాల్లో చాల తేడా ఉంది. చైనా ఆర్థికంగానే కాకుండా ప్రపంచంలో గొప్ప శక్తిగా ఆవర్భవించడానికి సన్నాహాలు చేసుకుంటున్నది. ఈ సమయంలో డోక్లామ్ లాంటి సమస్యల్లో ఇరుక్కొని యుద్ధానికి తలపడితే, ప్రపంచంలో దాని ఉద్దేశ్యాలు తొందరగా బహిర్గతమౌతాయి. ఇది ఆ దేశం వేసుకొన్న పథకానికి ఆటంకంగా మారుతుంది. వన్ బెల్ట్-వన్ రోడ్ లాంటి వ్యూహాత్మక పథకాలకు నష్టం జరుగుతుంది. కాబట్టి చైనా సమయానుకూలంగా, పథకం ప్రకారమే డోక్లామ్‌లో వెనక్కి తగ్గింది. దీన్ని చూసి ఇండియా ఇచ్చిన గట్టి ప్రతిఘటనతోనే చైనా వెనక్కి తగ్గిందని భావించకూడదు. భారత్ కూడ అమెరికా సహాయంతో చైనాతో పోటీ పడడం కోసం శీఘ్రగతిన సన్నాహాలు చేసుకుంటున్నది.

రెండు దేశాల ప్రజల్లో ఈదేశాల మధ్య మైత్రి, శాంతి, సహకారం ఉండాలని ఆకాంక్ష ఉంది. ఆ దేశాల పాలకవర్గాలు ప్రజల్లో జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయనే విషయాన్ని డోక్లామ్ దృష్టాంతం ద్వారా చూడవచ్చు. ఇరుదేశాలు శాంతియుతంగా సహ జీవనం చేయడం ద్వారానే ఆర్థిక ప్రగతిని సాధించవచ్చు. అందుకు ఇరు దేశాలు రాజకీయ స్థాయిలో సరిహద్దు వివాదాల పరిష్కారం కోసం చర్చలు జరుపుకోవాలి. చర్చలు ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో ఉండాలి. దేశాల మధ్య సమగ్రమైన పరిష్కారాలు కుదిరేంత వరకు సరిహద్దులో యధాతథాస్థితి కొనసాగించాలి. ఈ ట్రైజంక్షన్‌లో చైనా, ఇండియా, భూటాన్‌లు వ్యూహాత్మక ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం వెంటనే నిలుపుదల చేయాలి. చారిత్రకంగా పరిశీలిస్తే బ్రిటిష్, చైనా మధ్య జరిగిన 1890 ఒప్పందం మేరకు డోక్లామ్ చైనాలో అంతర్భాగమేనని ఇండియా గుర్తించాలి. డోక్లామ్ ప్రాంతం విషయంలో చైనా -భూటాన్ మధ్య సంప్రదింపులు జరుపుకొని పరిష్కరించుకోవాలి. చైనా-భారత్ దేశాల ప్రజలు తమ దేశాల పాలకవర్గాలు విస్తరణవాద కాంక్షతో జరుపుతున్న ఈ చర్యలను తీవ్రంగా ఖండించాలి. ○

***(...........43వ పేజీ తరువాయి)***

అనుకూలమైన కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నడిచింది. ఇపుడు టీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నడుస్తుంది. ఎవరు అధికారంలో ఉంటే వారు నడుపుతారు తప్ప, ప్రజల బాగోగుల పట్టించుకోరు. నేరెళ్లలో ఇసుక మాఫీయా వల్ల ఉత్పన్నమయిన అసలు సమస్యను పక్కన బెట్టి, ఇసుక మాఫీయాను కాపాడడానికి చట్టం పేరుతో ప్రజలను, ప్రజా సంఘాలను భయభ్రాంతులకు గురిచేసి ఇసుక మాఫీయాకు సహకరిస్తున్న ఎస్.పి. విశ్వజిత్ కంపాటిని కాపాడడం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

పోరాడి సాధించుకున్న తెలంగాణకు కేసిఆర్ ముఖ్యమంత్రి అయినాడు. తమ ఎన్నికల మానిఫెస్టోలో దళితునికే ముఖ్యమంత్రి పదవి అని, ప్రతి దళిత కుటుంబానికి 3ఎకరాలు భూమి ఇస్తామని చెప్పిన కేసీఆర్ 3 సంవత్సరాలు అయిననూ ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాకుండా దళితులపై అనేక దాడులకు పాల్పడు తున్నాడు. తెలంగాణలో కేసీఆర్ గడీల పాలన, పోలీసుల రజాకార్ల ఆగడాలు మీతిమిరుతున్నాయి. ప్రశ్నించిన ప్రతివారిని అరెస్టులు, జైలు, హత్యలు చేస్తున్నారు. 3ఎకరాల భూమి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం భూమి ఇవ్వడమే కాదు దళితుల ప్రాణాలను తీసుకుంటున్నది.

ప్రతిపక్ష పార్టీలు తమ ఓటుబ్యాంకు కోసం నేరెళ్ళ సంఘటనను వాడుకుంటున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ దేశంలో జరుగుతున్న దళితులు, ప్రజాస్వామిక వాదులు, హేతువాదులపై హత్యలను ప్రోత్సహిస్తున్నది కానీ తెలంగాణలో అధికారంలో రావడానికి సకల విధాల ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇవే విధానాలను కొనసాగించింది. టి.డి.పి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఇవే విధానాలు అవలంభిస్తున్నది. ఈ పార్టీలన్నింటి వెనక కాంట్రాక్టర్ల మాఫీయాలు ఉన్నాయి. అందుకే ఈ పార్టీలు ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రయత్నించడం లేదు.

నేరెళ్ళ ప్రజల్లాగే సహజ వనరులున్న ఏ ప్రాంతాలైనా అక్కడి ప్రజలు భవిష్యత్‌తరాలకు అందించడానికి నిత్యం పోరాడుతున్నారు. అది తెలంగాణ కావచ్చు, బస్తర్ కావచ్చు, విశాఖ కావచ్చు, అమరావతి కావచ్చు, నియంగిరి కావచ్చు. ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రజలు ఐక్యంగా పోరాడాలి. ఇక్కడ మరీ ముఖ్యమైనదేమంటే, వారి చావు బతుకుల సమస్యగా ముందుకొచ్చింది.

దళితులు, పేద ప్రజలు, మత మైనారిటీలు, ఆదివాసులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థి, మేధావులు ఐక్యంగా ప్రజా సమస్యలపై మిలిటెంట్ పోరాటాల ద్వారానే తమ దైనందిన సమస్యలను పరిష్కరించుకోవాలి. మరో సిరిసిల్ల, జగిత్యాలలను సృష్టించడం ద్వారా మాత్రమే దళితులకు, పేదలకు ఆత్మగౌరవం, రాజ్యాధికారం దక్కుతుంది. దానికై ప్రజలు, ప్రజాసంఘాలు ప్రజల పక్షాన పోరాడాలే తప్ప, కాంగ్రెస్, బిజెపీ, బూర్జువా పార్టీలు పోరాడలేవు. ○

(సందేశం)

# ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేస్తూ విప్లవ ప్రతీఘాతుక దాడి-మిషన్ 2017ను దృఢంగా ప్రతిఘటిద్దాం! ఓడిద్దాం!

### *పార్టీ 13వ వార్షికోత్సవాన్ని సెప్టెంబర్ 21 నుంచి 27 వరకూ దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో, విప్లవ స్ఫూర్తితో నిర్వహించండి!*

మొట్టమొదట మన పార్టీ 13వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ స్థాయి పార్టీ కమిటీలకూ, సభ్యులకూ, ప్రజా విముక్తి గెరిల్లా సైనిక (పిఎల్‌జిఏ) కమాండర్లకూ, యోధులకూ, పార్టీ సానుభూతిపరులకూ, విప్లవ ప్రజా కమిటీల (ఆర్‌పిసి) నాయకత్వానికీ-సభ్యులకూ, విప్లవ ప్రజాసంఘాలకూ, విప్లవ ప్రజానీకానికీ పార్టీ కేంద్రకమిటీ హృదయపూర్వకంగా విప్లవాభినందనలు తెలియజేస్తోంది. అలాగే మన పార్టీ నేతృత్వంలో దేశంలో సాగుతున్న ప్రజాయుద్ధానికి అంతర్జాతీయ స్థాయిలో మద్దత్తును కూడగట్టే ఉద్యమాన్ని నిర్వహిస్తున్న వివిధ దేశాల మావోయిస్టు పార్టీలకూ, సంస్థలకూ ఈ సందర్భంగా మన సిసి విప్లవాభినందనలు తెలుపుతున్నది.



**ప్రియమైన కామ్రేడ్స్!**

మన పార్టీకీ, విప్లవ ప్రజానీకానికీ అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజు సెప్టెంబర్ 21. 2004 సెప్టెంబర్ 21 నాడు దేశంలోని రెండు ప్రధాన విప్లవ ప్రవంతులు విలీనమై మన పార్టీ - భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. పార్టీ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేస్తూ విప్లవ ప్రతీఘాతుక దాడి-మిషన్ 2017ను దృఢంగా ప్రతిఘటిస్తూ ఓడించే లక్ష్యంతో సెప్టెంబర్ 21 నుండి 27 వరకూ పార్టీ వార్షికోత్సవాన్ని దేశవ్యాప్తంగా మన ఉద్యమ ప్రాంతాల్లో, పట్టణాల్లో, నగరాల్లో విప్లవోత్సాహంతో, విప్లవ స్ఫూర్తితో జరపాల్సిందిగా పార్టీ కమిటీలకూ, సభ్యులకూ, ప్రజా విముక్తి గెరిల్లా సైనిక (పిఎల్‌జిఏ) కమాండర్లకూ, యోధులకూ, పార్టీ సానుభూతిపరులకూ, విప్లవ ప్రజా కమిటీల (ఆర్‌పిసి) నాయకత్వానికీ-సభ్యులకూ, విప్లవ ప్రజాసంఘాలకూ, విప్లవ ప్రజానీకానికీ కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో శత్రువు దేశవ్యాప్తంగా కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక నిర్బంధకాండలో భాగంగా నీలంబూర్ వంటి బూటకపు ఎన్‌కౌంటర్లలో, శత్రు బలగాలతో జరిగిన రాంగూడ (ఏఓబి), బుధా నది (బిజె) వంటి ఎన్‌కౌంటర్లలో, కోవర్టు ఆపరేషన్లలో, పిఎల్‌జిఏ బలగాలపై శత్రువు జరిపిన ఆంబుష్‌లలో, బీహార్-ఝార్ఖండ్‌లో టిపిసి, జెజెఎంపి వంటి విప్లవ ప్రతీఘాతుక హంతక ముఠాల దాడులలోనూ; పోలీసు, కమాండో, పారా మిలటరీ బలగాలపై మన పిఎల్‌జిఏ బలగాలు అత్యంత సాహసోపేతంగా నిర్వహించిన దాడుల్లోనూ, వృద్ధాప్యం, అనారోగ్యం, పాముకాటు తదితర కారణాలతోనూ దేశవ్యాప్తంగా గత సంవత్సర కాలంలో సుమారు 180 మంది మన ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలు తమ విలువైన ప్రాణాలను అర్పించారు. వీరిలో 50 మందికి పైగా మహిళా కార్యకర్తలు, గ్రామీణ మహిళలు ఉన్నారు.

ఈ సంవత్సర కాలంలో ఇద్దరు భారత విప్లవ నాయకులు, మన పార్టీ కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ (బిజయ్‌దా) (80), కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ కుప్పు దేవరాజ్ (రమేష్, యోగేష్) (62)ల అమరత్వం విప్లవోద్యమానికి తీరని నష్టం. తీవ్ర అనారోగ్యానికి గురై వైద్యం కోసం కోజికోడ్ వెళుతున్న కామ్రేడ్స్ దేవరాజ్, అజితలను 'ఆపరేషన్ బ్రహ్మగిరి'లో భాగంగా అరెస్టు చేసిన శత్రు కేంద్ర-రాష్ట్ర ఇంటలిజెన్స్ అధికారులు తీవ్ర చిత్రహింసలకు గురిచేసి నవంబర్ 24న కేరళ రాష్ట్రం నీలంబూర్ అటవీ ప్రాంతంలో కాల్చి చంపారు. కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ కేన్సర్ వ్యాధితో ఏప్రిల్ 16న కోల్‌కతాలో అమరులైనారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బీహార్-ఝార్ఖండ్ (బిజె)లో సీనియర్ కామ్రేడ్ రఘునాథ్ మహతో, ఆంధ్ర-ఒడిశా బార్డర్ (ఏఓబి)లో కామ్రేడ్స్ ప్రసాద్, దయ, పశ్చిమ కనుమల (డబ్ల్యుజి)లో కామ్రేడ్ అజిత (కావేరి) అమరులయ్యారు. అలాగే రీజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ సంగ్రామ్ ముర్మూ (బిజె), జిల్లా కమిటీ సభ్యులు ఏఓబిలో కామ్రేడ్స్ ప్రభాకర్, కిరణ్, బిజెలో కామ్రేడ్స్ యతీన్ (కోయల్-శంఖ్), శైలేష్, అజిత్ యాదవ్, దండకారణ్యం (డికె)లో కామ్రేడ్స్ జగత్ (పశ్చిమ బస్తర్), పాలీ (దర్భ), కైలాశ్ (తూర్పు బస్తర్), సబ్‌జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ నాగేంద్ర యాదవ్ (బిజె); ఏరియా కమిటీ కార్యదర్శి కామ్రేడ్ షమీల (ఆర్‌కెబి); ఏరియా కమిటీ, ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యులు 38 మంది (ఇందులో పిఎల్‌జిఏకు చెందిన అనేక మంది దళం, సెక్షన్, ప్లాటూన్ కమాండర్లు/డిప్యూటీ కమాండర్లుగా పనిచేశారు), గ్రామ పార్టీ కమిటీల, విప్లవ ప్రజా కమిటీల (ప్రభుత్వాల) నాయకులు ముగ్గురు, ప్రజా మిలీషియా కమాండర్లు ఐదుగురు, విప్లవ ప్రజా సంఘాల నాయకులు ముగ్గురితో పాటు పదుల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, పిఎల్‌జిఏ, ప్రజా మిలీషియా పోరాట యోధులు, విప్లవ సానుభూతిపరులు-ప్రజలు మొదలైనవారు ప్రజాయుద్ధంలో అమరులయ్యారు.

మహిళా కేడర్లలో ఏఓబిలో కామ్రేడ్స్ మమత, లత (భారతి), కాంత నానా వంటి సీనియర్ పార్టీ కార్యకర్తలు, కామ్రేడ్స్ బుద్రి, మంజుల (ఉంగి), టుబ్రి (కోరాపుట్); డికెలో కామ్రేడ్స్ హేమ్లా

అంజు (దక్షిణ బస్తర్), రమ్మో (ఆర్‌కెబి), దర్భలో కామ్రేడ్స్ సుక్కి జోగి, తూర్పు బస్తర్‌లో కామ్రేడ్స్ జగ్‌బత్తి యాదవ్ (సోనీ), రాజ్‌బత్తి; మాడ్‌లో కామ్రేడ్స్ మాలి, కరుణ; బిజెలో కామ్రేడ్ అనుప్రియ (కోయల్–శంఖ్) మొదలైనవారు శత్రు బలగాలతో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో వీరోచితంగా పోరాడుతూ అమరులయ్యారు. కొంతమంది మహిళా కామ్రేడ్స్‌ను ఎన్‌కౌంటర్లలో గాయపడి పడిపోయిన స్థితిలో పట్టుకొని లేదా ఇళ్ల వద్ద పట్టుకొని సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారు. వీరిలో కొందరు గ్రామీణ మహిళలు కూడా ఉన్నారు.

భారత విప్లవ మహా నాయకులు, పార్టీ సంస్థాపకులు, ఉపాధ్యాయులు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీతో సహా నక్సల్‌బరీ సాయుధ రైతాంగ విప్లవోద్యమం నుండి నేటి వరకూ అమరులైన వేలాది మంది వీరయోధులందరినీ సంస్మరించుకుంటూ, మనతో భుజం–భుజం కలిపి ప్రజాయుద్ధ సమరాన శత్రువుతో సాహసోపేతంగా పోరాడుతూ ఆశయ సాధనలో గత సంవత్సర కాలంలో అసువులు బాసిన వీరయోధులందరినీ మన పార్టీ 13వ వార్షికోత్సవం సందర్భంగా పేరు పేరునా స్మరించుకుంటూ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిద్దాం. ఈ సందర్భంగా అమరుల బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ వీరందరికీ మన పార్టీ అండగా ఉంటుందని కేంద్రకమిటీ హామీ ఇస్తోంది.

ఇదే సందర్భంగా, ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో వివిధ దేశాలలో మావోయిస్టు పార్టీలు, సంస్థలు, గ్రూపుల నాయకత్వంలో సాగుతున్న ఉద్యమాలలో నేలకొరిగిన వీరయోధులకు మన సిసి విప్లవ జోహార్లు అర్పిస్తోంది.

గత సంవత్సర కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న భూస్వామ్య అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక, పర్యావరణ విధానాలకు వ్యతిరేకంగా పార్టీ నాయకత్వంలో ప్రజలు పోరాడారు. ప్రత్యేకించి సామ్రాజ్యవాదుల దన్నుతో అత్యంత దుర్మార్గంగా, క్రూరంగా నడుపుతున్న ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వాన పార్టీ క్యాడర్లు, పిఎల్‌జిఏ పోరాట యోధులు, విప్లవ ప్రజా కమిటీలు, విప్లవ–ప్రజాస్వామిక సంస్థలు, దేశ ప్రజలు, ప్రత్యేకించి ఉద్యమ ప్రాంతాల ప్రజలు కొనసాగించిన ప్రతిఘటనా యుద్ధంలో నేలకొరిగిన వీరుల త్యాగాలు అత్యంత విలువైనవీ, త్యాగపూరితమైనవీ, ఆదర్శనీయమైనవీ, అనుకరణీయమైనవీ. వీళ్లు అసమానత, వివక్ష, మనిషిని మనిషి దోచుకునే వీలులేని ఒక నూతన, న్యాయమైన సమాజం కోసం తమ అమూల్యమైన ప్రాణాలు ధారపోశారు. మన పార్టీ 13వ వార్షికోత్సవం సందర్భంగా అమరవీరులు చూపిన బాటలో ముందుకు సాగుతామనీ, ఒక నూతన ప్రపంచ సాధన కోసం వారి ఆశయ పరిపూర్తికై దృఢసంకల్పంతో, త్యాగనిరతితో సాహసోపేతంగా పోరాడుతామనీ బిగిపిడికిళ్లెత్తి ప్రతిన బూనుదాం.

అమరుల త్యాగాల ఫలితంగా గత సంవత్సర కాలంలో శత్రు నిర్బంధ క్యాంపెయిన్లను ఎదుర్కొంటూ మనం సాధించిన విజయాలను, అధిగమించాల్సిన బలహీనతలను చూద్దాం. వాటిని పార్టీ శ్రేణులు, పిఎల్‌జిఏ బలగాలు, విశాల ప్రజారాసుల ముందుంచి, ప్రజాయుద్ధంలో వారందరి క్రియాశీల, సమరశీల పాత్రను పెంపొందిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

**గత సంవత్సర కాలంలో మన విజయాలు :**

**1) దోపిడీ పాలకవర్గాల విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్ని ప్రతిఘటిస్తూ నిలదొక్కుకుంటున్న ప్రజాయుద్ధం :** కేంద్రంలో బిజెపి మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచి అనేక రాష్ట్రాలలో బిజెపి/ఎన్‌డిఏ ప్రభుత్వాలు ఏర్పడడంతో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు దాడి దేశవ్యాప్తంగా తీవ్రస్థాయికి చేరుకుంది. ఇందులో భాగంగా సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతున్న మన పార్టీని, దాని నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించడం కోసం ఎల్‌ఐసి వ్యూహంతో మిషన్ 2016, మిషన్ 2017 పేర్లతో గత సంవత్సర కాలంలో విప్లవోద్యమ ప్రాంతాలన్నిటా తెల్ల బీభత్స (వైట్ టెర్రర్) క్యాంపెయిన్ మరింత తీవ్రతరమైంది. ఫాసిస్టు కిరాయి పోలీసు, కమాండో, పారామిలటరీ బలగాలు పిఎల్‌జిఏ బలగాలపై దాడులు, బూటకపు ఎన్‌కౌంటర్లలో విప్లవకారులపై, ప్రజలపై హత్యాకాండను తీవ్రతరం చేశాయి. కేవలం 2017లో ఇప్పటి వరకూ 78 మంది విప్లవకారులను, ప్రజలను హత్య చేశాయి. గ్రామాలపై పెద్దెత్తున దాడులు చేస్తూ ప్రజల ఆస్తులనూ, పంటలనూ ధ్వంసం చేశాయి. ఇళ్లను తగులబెట్టాయి. బీహార్, ఝార్ఖండ్ రాష్ట్రాలలో మన పార్టీ కార్యకర్తల ఆస్తులను జప్తు చేసుకుంటున్నాయి. ఉద్యమాన్ని అణచివేసేందుకు మహిళలపై అత్యాచారాలను ఒక ఆయుధంగా ఎటువంటి అడ్డూ ఆపూ లేకుండా వినియోగిస్తున్నాయి. బూర్జువా సంస్కరణలను పెద్దెత్తున అమలు చేస్తూ విప్లవ ప్రజానీకంలో చీలికలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉద్యమ ప్రాంతాల్లో రాజ్య ఉగ్రవాదాన్ని బయట ప్రపంచం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించే విలేకరులపై, నిరసన తెలుపుతున్న ప్రజాస్వామికవాదులపై, సామాజిక కార్యకర్తలపై, మానవహక్కుల కార్యకర్తలపై, మహిళా సంఘాల కార్యకర్తలపై, ప్రొఫెసర్లపై, విద్యార్థులపై, చివరికి ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై, ప్రభుత్వ ఉన్నతాధికారులపై సైతం ఫాసిస్టు దాడి కొనసాగిస్తున్నాయి. 'మావోయిస్టులు', 'దేశద్రోహం' పేరుతో క్రూరమైన ఉపా తదితర ఫాసిస్టు చట్టాల కింద వీరిని అరెస్టు చేసి జైళ్లల్లో పెడుతున్నాయి. వివిధ బూర్జువా కోర్టులు విప్లవకారులకు విప్లవ ప్రజానీకానికీ, వారికి అండగా నిల్చిన మేధావులకు, ప్రజాస్వామిక శక్తులకు, వ్యాపారులకు దీర్ఘకాల కఠిన కారాగార శిక్షలు, ఉరిశిక్షలు విధిస్తున్నాయి. ఈ విధంగా విప్లవోద్యమం కొనసాగుతున్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బంగ్,

అసోం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో తెల్ల భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి.

శత్రు తెల్ల బీభత్సానికి వ్యతిరేకంగా ఈ సంవత్సర కాలంలో మన పార్టీ నాయకత్వంలో ప్రజా ప్రతిఘటన, పిఎల్‌జిఏ, ప్రజా మిలీషియా బలగాల ప్రతిఘటన కొనసాగింది. గ్రామాలపై పోలీసు, పారామిలటరీ బలగాలు సాగిస్తున్న విధ్వంసకాండకు, అమాయక ప్రజలపై సాగిస్తున్న హత్యాకాండకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు, మహిళలపై సామూహిక అత్యాచారాలకు, హత్యలకు వ్యతిరేకంగా చట్టబద్ధ-చట్టవ్యతిరేక రూపాల్లో ప్రజలు ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తున్నారు. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం విప్లవ ప్రజానీకం మద్దతుతో ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లను, చర్యలను నిర్వహించింది. ముంగారు గుమ్మి-సుంకి ఆంబుష్ (కోరాపుట్, ఒడిశా), భావే ఆంబుష్-1, భావే ఆంబుష్-2 (రాజనాంద్‌గావ్, ఛత్తీస్‌గఢ్), చెర్లీ ఆంబుష్ (బీజాపూర్, ఛత్తీస్‌గఢ్), తుమ్డివాల్ ఆంబుష్ (కొండగావ్, ఛత్తీస్‌గఢ్), హరియల్ ఆంబుష్ (బీజాపూర్, ఛత్తీస్‌గఢ్), కొత్తచెరువు-బెజ్జి ఆంబుష్ (సుక్మా, ఛత్తీస్‌గఢ్), బూర్గుం పహాడ్ కౌంటర్ దాడి (దంతేవాడ, ఛత్తీస్‌గఢ్), బుర్కపాల్ ఆంబుష్ (సుక్మా, ఛత్తీస్‌గఢ్), కారంపల్లి మైన్‌ప్రూఫ్ వాహనంపై ఆంబుష్ (గడ్చిరోలి, మహారాష్ట్ర), పోఖ్రీ ఆంబుష్ (కంధమాల్, ఒడిశా), తొండమర్క కౌంటర్ దాడి (సుక్మా, ఛత్తీస్‌గఢ్), చిన్న బొడ్కెల్ ఆంబుష్ (సుక్మా, ఛత్తీస్‌గఢ్) వంటి చోట్ల చెప్పుకోదగిన స్థాయిలో శత్రు బలగాలను దెబ్బతీసింది. విప్లవోద్యమ ప్రాంతాల్లో మనకు యుద్ధ సామగ్రి అందకుండా శతృవు సప్లయి మార్గాలను మూసివేసిన స్థితిలో స్థానిక వనరులతో, పరిమిత వనరులతో గెరిల్లాయుద్ధాన్ని సాగిస్తూ కేవలం గత 10 నెలల కాలంలో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఏఓబి, ఒడిశా, తెలంగాణా, పశ్చిమ బంగ్, పశ్చిమ కనుమలు మొదలైన రాష్ట్రాలలో వివిధ గెరిల్లాజోన్లు, ఎర్రప్రతిఘటనా ప్రాంతాల్లో సుమారు 170 గెరిల్లా దాడులను పిఎల్‌జిఏ నిర్వహించింది. ఈ గెరిల్లా దాడుల్లో 85 మందికి పైగా పోలీసులు మరణించగా, సుమారు 140 మంది పోలీసులు గాయపడ్డారు. సుమారు 80 మంది ప్రజా శత్రువులు, ప్రజా వ్యతిరేక రాజకీయ నాయకులు, విప్లవ ప్రతీఘాతకులు, ఇన్‌ఫార్మర్లు-కోవర్టులు మట్టిగరిచారు. పిఎల్‌జిఏ నిర్వహించిన ఈ ఎత్తుగడల ఎదురుదాడి చర్యలు ప్రత్యేకించి బుర్కాపాల్ ఆంబుష్ దోపిడీ పాలకవర్గాలలో కలవరం సృష్టించాయి.

**2) పెరిగిన ప్రజా ఉద్యమాలు, ఐక్య కార్యాచరణ కార్యకలాపాలు** : ఉద్యమ ప్రాంతాలంతటా ఐక్యసంఘటనా కార్యకలాపాలు పెరిగాయి. విస్థాపన సమస్యకు వ్యతిరేకంగా, రాజ్యహింసకు వ్యతిరేకంగా, ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా మన పార్టీ చేపట్టిన ఐక్య కార్యాచరణ కార్యకలాపాలలో ఆదివాసీ, ఆదివాసేతర రైతాంగం, విద్యార్థులు, మేధావులు, కార్మికులు, మహిళలు, కళాకారులు పోరాడుతున్నారు. కామ్రేడ్ కుప్పు దేవరాజ్, అజితల బూటకపు ఎన్‌కౌంటర్‌కి నిరసనగా కేరళ, తమిళనాడు, కర్నాటకలలో అనేక ప్రజాసంఘాల నాయకత్వంలో పీడిత ప్రజలు పెద్దెత్తున కదిలి పోలీసు బలగాలకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడారు. రాజ్యహింస, ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేక ర్యాలీలు, సభలు, పోరాటాలు జరిగాయి. ఉద్యమ ప్రాంతాల్లో సాయుధ ప్రతిఘటన, బంద్‌లు, నిరసన దినాలు నిర్వహించబడినాయి. గోరక్ష పేరుతో రోజు రోజుకూ తీవ్రతరమవుతున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు ఉద్యమిస్తున్నారు. వీటికి మన పార్టీ మద్దతు నిస్తున్నది. విప్లవోద్యమ ప్రాంతాల్లో హిందూ సంఘ్ పరివార్ సాగిస్తున్న ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను పార్టీ సంఘటితం చేస్తున్నది. ఐక్యసంఘటన వేదికలు నిర్మించి పోరాడుతున్నది. ఈ పోరాటాల ద్వారా అశేష ప్రజానీకం, ముఖ్యంగా నవతరం మన రాజకీయాలతో ప్రభావితమవుతూ మన సంబంధాల్లోకి వస్తున్నది. ఈ మొత్తం పోరాటాలు పార్టీకి నూతన అనుభవాలను అందించాయి.

**3) విస్థాపన వ్యతిరేక పోరాటాలు** : రాజ్యం దన్నుతో సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు వనరుల దోపిడీ కోసం గనుల తవ్వకాలు, పెద్ద డ్యాములు, అభయారణ్యాలు, మెగా స్టీల్ ప్లాంట్లు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకాలు, రైలు మార్గాల నిర్మాణం వంటి అనేక భారీ ప్రాజెక్టులను, పరిశ్రమలను స్థాపిస్తున్నారు. జల్-జంగల్-జమీన్ నుంచి ప్రజలను విస్థాపితం చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో ప్రజలు, పీఎల్‌జీఏ సమైక్యంగా నిలిచారు. అనేక ప్రజా పోరాటాలు, ప్రజా ప్రతిఘటన చర్యలు, గెరిల్లాయుద్ధం తదితర రూపాల్లో ప్రజాయుద్ధం కొనసాగింది. ఛత్తీస్‌గఢ్‌లోని కువ్వెమారి గనులు, డిలిమిలి ప్రాజెక్టు, అభయారణ్యాలకు వ్యతిరేకంగా, ఝార్ఖండ్‌లో ఛోటానాగపూర్ టెనన్సి యాక్ట్ (సిఎన్‌టి), సంతాల్ పరగణా టెనన్సి యాక్ట్ (ఎస్‌పిటి)లలో ఆ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సవరణలకు, ఇతర గనులకు, ప్రాజెక్టులకు వ్యతిరేకంగా, మహారాష్ట్రలో సూర్జాగఢ్ తదితర గనులకు వ్యతిరేకంగా, తెలంగాణలో ఓపెన్ కాస్ట్ గనులు, పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ బాక్సైట్‌కు, ఒడిశాలో వివిధ గనులకు, అభయారణ్యాలకు వ్యతిరేకంగా, కేరళ, తమిళనాడులో వివిధ అభయారణ్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగాయి. ప్రజా ప్రతిఘటనా చర్యలలో కోట్లాది రూపాయల బహుళజాతి కంపెనీల, వారి దళారీ నిరంకుశ బూర్జువా వర్గ కంపెనీల ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఉద్యమ ప్రాంతాలకు వెలుపల విస్థాపన వ్యతిరేక పోరాటాలకు పార్టీ పరోక్షంగా మద్దతునిచ్చింది. వివిధ ప్రజా ప్రతిఘటనా వేదికలను సంఘటితం చేసేందుకు తోడ్పడింది. ఫలితంగా దేశవ్యాప్తంగా సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు, వారి దళారీలకు వ్యతిరేకంగా విస్థాపన వ్యతిరేక పోరాటాలు కొనసాగాయి. దీని వల్ల ఛత్తీస్‌గఢ్‌లోని లోహండిగూడా, ధుర్లీలలో

టాటా, ఎస్సార్ల స్టీల్ ప్లాంట్లు, ఒడిశాలో పోస్కో ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ బాక్సైట్ తదితర చోట్ల వివిధ గనుల, ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయి. కొన్ని ప్రాజెక్టులను దోపిడీ పాలకవర్గాలు తమ ప్రభుత్వ కిరాయి పోలీసు, పారామిలటరీ బలగాల ద్వారా బలవంతంగా తెరిపిస్తున్నాయి/వాటిలో పనులు కొనసాగేలా పశు బలాన్ని ప్రయోగిస్తున్నాయి. ఈ విధంగా మన పార్టీ నాయకత్వంలో సాగిన విస్థాపన వ్యతిరేక పోరాటాలు దేశవ్యాప్త విస్థాపన వ్యతిరేక పోరాటాలకు సరైన మార్గాన్ని చూపిస్తున్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువావర్గ వ్యతిరేక పోరాటాలను నడపడంలో మనకు మంచి అనుభవాల్ని అందిస్తున్నాయి.

**4) సత్ఫలితాలు ఇస్తున్న బోల్షివీకరణ క్యాంపెయిన్ :** మన పార్టీ చేపట్టిన బోల్షివీకరణ కేంపెయిన్ ఆశించిన దిశలో ఒక మేరకు సత్ఫలితాలను ఇస్తున్నది. దీంతో పాటు వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్న ఫీల్డ్ ట్రైనింగ్, నాయకత్వ శిక్షణా కార్యక్రమం (ఎల్‌టిపి), మిలటరీ నాయకత్వ శిక్షణా కార్యక్రమం (ఎంఎల్‌టిపి) ఉద్యమం గడ్డు పరిస్థితిని అధిగమించేందుకు తోడ్పడుతున్నాయి. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం, మహత్తర నక్సల్బరీ 50వ వార్షికోత్సవాల సందర్భంగా ఆ అనుభవాలను మొత్తం పార్టీకీ, ప్రజలకూ అందించడం, శిక్షణ గరపడం జరిగింది. పిఎల్‌జిఏలో పార్టీ నాయకత్వాన్ని పటిష్టం చేసుకునేందుకు వివిధ గెరిల్లాజోన్లలో రాజకీయ-సైనిక శిక్షణా క్యాంపులు జరిగాయి. ఈ విధంగా కొన్ని రాష్ట్రాలు/స్పెషల్ జోన్లలో ఈ కేంపెయిన్ పూర్తి కాగా, మరికొన్ని రాష్ట్రాలు/స్పెషల్ ఏరియాల్లో కొనసాగుతున్నది. ఈ కేంపెయిన్ ద్వారా వస్తున్న అనుభవాలతో పార్టీని బోల్షివీకరించే విధంగా నిరంతరం ఆచరణను కొనసాగించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పై నుంచి కింది వరకూ పార్టీ శ్రేణులు దృఢ సంకల్పంతో కార్యాచరణను కొనసాగిస్తున్నాయి. గత సంవత్సరం రాష్ట్ర/స్పెషల్ జోన్/స్పెషల్ ఏరియాల నుంచి ఏరియా స్థాయి వరకూ నిర్వహించుకున్న ప్లీనాల్లో చేపట్టిన నిర్ణయాలను, ఎత్తుగడలను దృఢంగా అమలు చేసే విధంగా కార్యాచరణను రూపొందించుకొని అమలు చేస్తున్నాయి.

**5) సామాజిక పరిశీలన, వర్గ విశ్లేషణ :** మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజాయుద్ధ ఎత్తుగడలను అభివృద్ధి చేసుకునే లక్ష్యంతో పార్టీ నాయకత్వ శ్రేణులు గత సంవత్సరం చేయగా మిగిలిన మరికొన్ని రాష్ట్ర/స్పెషల్ జోన్/స్పెషల్ ఏరియాల్లోని పార్టీ కమిటీలు ఈ సంవత్సరం సామాజిక పరిశోధన, వర్గ విశ్లేషణను నిర్వహించాయి. పార్టీ వ్యూహం-ఎత్తుగడలకు, నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా నూతన ఎత్తుగడలను రూపొందించుకుంటున్నాయి. వాటిని అమలు చేసేందుకు పార్టీని, పిఎల్‌జిఏను, వివిధ స్థాయిల విప్లవ ప్రజా కమిటీలను, విప్లవ ప్రజా సంఘాలను సంఘటితం చేసే క్యాంపెయిన్, ఎడ్యుకేషన్ క్యాంపెయిన్‌లతో సహా నిర్దిష్ట పథకాలను తయారు చేసుకొని అమలు చేస్తున్నాయి.

**6) సాయుధ విప్లవ వ్యవసాయ సంస్కరణ కార్యక్రమం :** పార్టీ నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో భాగంగా వివిధ రాష్ట్రాలలో ప్రజలు భూ ఆక్రమణ పోరాటాలు నిర్వహించారు. భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న భూములను భూమిలేని పేదరైతులకు పంపిణీ చేశారు. దోపిడీ వర్గాల అధికారాన్ని కూలదోసిన చోట గ్రామ, ఏరియా, డివిజన్ స్థాయి ఆర్‌పిసిలను నిర్మాణం చేస్తూ, వాటిని అభివృద్ధి చేస్తూ వ్యవసాయ విప్లవ సంస్కరణలు అమలు చేశారు. విప్లవ ప్రజలు తీవ్రమైన శత్రు దాడుల మధ్యనే, వాటిని ప్రతిఘటిస్తూ విప్లవ సంస్కరణలను అమలు చేస్తున్నారు. బీజరూపంలో ప్రత్యామ్నాయ నూతన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. గెరిల్లా బేస్‌లను నిలబెడుతున్నారు. అయితే తీవ్ర శత్రుదాడిలో కొన్ని గెరిల్లా బేస్‌లు బలహీనపడ్డాయి.

**లోపాలు-బలహీనతలు-పరిమితులను అధిగమిద్దాం**

- **నష్టాలను తగ్గించుకోవాలి.** మన పార్టీకి చెందిన వివిధ స్థాయిల నాయకత్వాన్ని నిర్మూలించడం ద్వారా విప్లవాన్ని అణచివేయాలని దోపిడీ పాలకవర్గాలు కుట్ర చేస్తున్నాయి. దీన్ని ఓడించాలి. విప్లవోద్యమంలో ప్రాణత్యాగం అవసరమే అయినప్పటికీ ప్రజాయుద్ధంలో విప్లవ శక్తులు వీలైనంత వరకూ అనవసర నష్టాలను, అనివార్యం కాని నష్టాలను తగ్గించుకొని తమ బలగాలను పరిరక్షించుకుంటూ శత్రు బలగాలను వీలైనంత వరకూ దెబ్బతీయడం ద్వారానే బలహీనమైన స్థితి నుంచి బలమైన శక్తిగా అభివృద్ధి కాగలుగుతాయి. తద్వారానే విప్లవాన్ని విజయవంతం చేయగలుగుతాయి.
- **శత్రువు అవలంబిస్తున్న కౌంటర్ గెరిల్లా ఎత్తుగడలను అర్థం చేసుకోవడంలో లోపాలను సరిదిద్దుకోవాలి.** శత్రువు ఎల్‌ఐసి వ్యూహం-ఎత్తుగడలతో నిరంతరం తన బలగాలను తర్ఫీదు చేస్తున్నాడు. దీనికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వాడి ఎత్తుగడలలో వేగంగా మార్పులు తీసుకొస్తున్నాడు. వేగంగా మారే ఈ ఎత్తుగడలను మన పార్టీ కమిటీలు లోతుగా అధ్యయనం చేయకపోవడం వల్ల శత్రు బలాన్ని, బలహీనతలను అర్థం చేసుకోలేక పోతున్నాయి. కనుక అవి శత్రు ఎత్తుగడలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి వాటిని తిప్పికొట్టే ఎత్తుగడలను రూపొందించుకోవాలి. వాటికి అనుగుణంగా పార్టీ శ్రేణులను, పిఎల్‌జిఏ బలగాలను తర్ఫీదు చేసుకొని విజయవంతంగా కార్యాచరణను కొనసాగించాలి.
- **కోవర్టులను, ప్రతీఘాతకులను గుర్తించడంలో నేర్పును పెంపొందించుకోవాలి.** అటువంటి వారి విషయంలో నిరంతరం జాగరూకతతో ఉండాలి. దృష్టికి వచ్చిన విషయాల పట్ల తగిన శ్రద్ధ పెట్టకపోవడం వల్ల తీవ్ర నష్టాలకు గురవుతున్న నేపథ్యంలో ఈ బలహీనత నుండి వెంటనే

బయటపడేందుకు కృషి చేయాలి.

- **సరెండర్లను తగ్గించాలి.** పార్టీ శ్రేణులలో విప్లవ రాజకీయ కృషిని చైతన్యవంతంగా నిర్వహించడం ద్వారా వర్గ కసిని, వర్గ చైతన్యాన్ని వారిలో పెంపొందించాలి. వారిని బోల్షివీకరించేందుకు రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించి ఉద్యమాన్ని, పనిని సమీక్షించాలి. సమస్యలను, లోపాలను తగ్గించడం ద్వారా, జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకొని సరైన గైడెన్స్‌ను అందించడం ద్వారా సరెండర్లను తగ్గించాలి.
- **ప్రజలలో రాజకీయ కృషి కొనసాగించడంలో లోపాలను తొలగించుకోవాలి.** ప్రజలను రాజకీయంగా చైతన్యవంతం చేసే కృషి మన కార్యాచరణ అంతటికీ కేంద్రంగా ఉండాలి. దోపిడీ పాలకవర్గాలు, ఎన్‌జిఓలు పెద్దెత్తున్న ముందుకు తెస్తున్న సంస్కరణల పట్ల, పార్లమెంటరీ ఎన్నికల పట్ల ప్రజలలో నిరంతరం తలెత్తే రకరకాల భ్రమలను తొలగించేందుకు కృషి చేయాలి. తద్వారా ప్రజలలో వర్గ కసిని, చైతన్యాన్ని పెంపొందించి ప్రజాపునాదిని బలోపేతం చేసుకోగలుగుతాం.
- వ్యవసాయక విప్లవ సంస్కరణలను గెరిల్లా యుద్ధంతో, విప్లవ రాజకీయ అధికారంతో జోడించి నిర్వహించడంలో లోపాలను అధిగమించాలి. అంటే రాజకీయ సమీకరణ, సాయుధ చర్యలు, వ్యవసాయక విప్లవ సంస్కరణలను సమన్వయంతో నడపాలి.
- సంఘటితీకరణలో కొనసాగుతున్న లోపాలను అధిగమించాలి. వివిధ ఆందోళనలలో ముందుకు వస్తున్న ప్రజలను వివిధ ప్రజాసంఘాలలో సంఘటితం చేయడం, వారి నుంచి పార్టీ, పిఎల్‌జిఏ, ఐక్యసంఘటనల్ని అభివృద్ధి చేయడం, రిక్రూట్‌మెంట్‌ను పెంచడం అనే ప్రక్రియ నిరంతరం కొనసాగించాలి. వీటిలో జరుగుతున్న లోపాలను తొలగించుకోవాలి.

## ప్రియమైన కామ్రేడ్స్!

ఈ నేపథ్యంలో ప్రస్తుత అంతర్జాతీయ, దేశీయ పరిస్థితిని అర్థం చేసుకొని తగిన కర్తవ్యాలను చేపట్టడం అవసరం.

**అంతర్జాతీయ పరిస్థితి :** ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ సంక్షోభం ఊబిలో కూరుకొని పోయే ఉంది. ఈ సంక్షోభ పరిష్కారానికి సామ్రాజ్యవాదులు చేపట్టిన ఆర్థిక, ద్రవ్య, రాజకీయ విధానాలన్నీ విఫలమయ్యాయి. మరోవైపు, చైనా సోషలిజం-కమ్యూనిజాన్ని వల్లిస్తూనే నూతన సోషల్-సామ్రాజ్యవాద దేశంగా ముందుకు రావడంతో ప్రపంచ ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరం అవుతున్నది. చైనా సూపర్ లాభాల కోసం వెనుకబడిన ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల ప్రాకృతిక వనరులను, కార్మిక శ్రమశక్తిని తీవ్రంగా దోచుకుంటున్నది. తమకు తలొగ్గని చాద్ (ఆఫ్రికా) వంటి దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నది. ప్రపంచంలో చైనా తన ఆధిపత్యాన్ని విస్తరించుకోవడం కోసం ప్రయత్నాం, ఫిలిప్పైన్స్‌లకు చెందిన దక్షిణ, తూర్పు చైనా సముద్ర జలాలలో, పాకిస్తాన్, జిబూతీ వంటి దేశాలలో సైనిక బలగాలను మోహరిస్తూ వాటి సార్వభౌమాధికారానికి బెడదగా మారుతున్నది. చైనా సోషల్-సామ్రాజ్యవాదం చైనా ప్రజలకే కాకుండా ప్రపంచ పీడిత జాతులకు, ప్రజలకు శత్రువుగా మారింది.

అమెరికాను తిరిగి 'గొప్ప దేశం'గా మార్చుతానని జాత్యహంకారాన్ని రెచ్చగొడుతూ అధ్యక్షుడిగా ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడు ముస్లిం దేశాలపై ఆంక్షలు విధించాడు. హెచ్1బి వీసా చట్టం సవరించి వలస నిబంధనల్ని కఠినతరం చేశాడు. బహిరంగంగా పర్యావరణ వ్యతిరేక విధానాలను చేపట్టాడు. అణ్వాయుధాలు తయారు చేసుకుంటున్నారనే బూచిని చూపిస్తూ ఇరాన్, ఉత్తర కొరియాలను లొంగదీసుకునేందుకు తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను విధించడంతో పాటు వాటిపై యుద్ధ బెదిరింపులను తీవ్రతరం చేశాడు. ఉత్తర కొరియాపై యుద్ధానికి కాలుదువ్వుతున్నాడు. మెక్సికో, క్యూబా వంటి దేశాలపై రాజకీయ, ఆర్థిక దాడి కొనసాగిస్తున్నాడు. వెనిజులా అంతర్గత వ్యవహారంలో జోక్యం చేసుకుంటూ సైనిక దాడికి సన్నాహాలు చేస్తున్నాడు.

నిజానికి అమెరికా సామ్రాజ్యవాదం 2008 సంక్షోభం వల్ల, దాని యుద్ధ ఆర్థిక వ్యవస్థ సమాజానికే మరింత భారంగా మారిపోవడం వల్ల దాని వనరులు మరింత హరించుకుపోతుండడంతో అది రాజకీయంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా బలహీనపడింది. తన ఆర్థిక సంక్షోభ పరిస్థితుల రీత్యా ఆర్థిక రంగంలో అమెరికాకు, ఇయుకు మధ్య పెరుగుతున్న పోటీ రీత్యా, నాటో కూటమి కోసం గతంలో లాగా తాను అత్యధిక నిధుల్ని కేటాయించలేకపోతున్నది. ఈ స్థితిలో అది నాటో కూటమిని మునుపటిలా సమైక్యంగా ఉంచలేకపోతోంది, మునుపటి వలే దాన్ని తన పక్షాన నిలబెట్టుకోలేకపోతోంది. దీంతో అది తన పరిస్థితిని సంఘటితం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది.

ఈ స్థితిలో సామ్రాజ్యవాద రష్యా తన ప్రభావ పరిధులను నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నది. డోనాల్డ్ ట్రంపు అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా, రష్యాల మధ్య కొన్ని విషయాల్లో సయోధ్య కనిపించడంతో అమెరికా పాలకవర్గాలలో తీవ్ర వ్యతిరేకతను ట్రంపు ఎదుర్కోవలసి వచ్చింది. సిరియా, ఉక్రెయిన్, ఇరాన్ తదితర వ్యూహాత్మక విషయాలను దృష్టిలో పెట్టుకొని రష్యాపై అమెరికా కొత్తగా ఆంక్షలు విధించింది. దీనికి వ్యతిరేకంగా అమెరికా రాయబారులను పెద్ద సంఖ్యలో తన దేశం నుంచి ఉపసంహరించాలని రష్యా నిర్ణయించింది.

మరోవైపు చైనా సామ్రాజ్యవాద శక్తిగా ఎదిగి ఆర్థిక రంగంలో ప్రపంచ పునర్విభజన కోసం అమెరికాకు గట్టి ప్రత్యర్థిగా నిలబడుతోంది. ఆసియాలో తన పట్టును పెంచుకుంటోంది. ప్రస్తుతం ఒన్ బెల్ట్, ఒన్ రోడ్ (ఓబిఓఆర్) పథకంతో ప్రపంచాధిపత్యం కోసం అది పరుగులు తీస్తోంది.

ఆర్థిక, రాజకీయ, సైనిక రంగాల్లో తమ ప్రత్యర్థి సామ్రాజ్యవాద దేశంగా ఎదుగుతున్న చైనాను దెబ్బతీసేందుకు అమెరికా 2011వ సంవత్సరంలోనే ఆసియా కేంద్రిత విధానాన్ని (ఆసియా-పివోట్ పాలసీ) రూపొందించుకుంది. ట్రంప్ కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తూ చైనా వ్యతిరేక దూకుడును పెంచుతున్నాడు. దక్షిణ చైనా సముద్ర జలాలపై తన హక్కు కోసం ఫిలిప్పైన్స్ చేసిన వాదనల్ని సమర్థిస్తూ హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయాలయం వెలువరించిన తీర్పును సాకుగా చూపుతూ అమెరికా ఆ ప్రాంతంలోని తన మిత్ర దేశాల తరపున యుద్ధ నౌకల్ని మోహరిస్తూ చైనాతో ఘర్షణల్ని తీవ్రతరం చేస్తోంది. దక్షిణ చైనా, తూర్పు చైనా సముద్రంలోని చమురు, సహజవాయు నిక్షేపాలపై, జల మార్గాలపై పెత్తనం కోసం చైనా-అమెరికాల మధ్య పెరుగుతున్న పోటీ ఆసియా-ఫసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలను పెంచుతూ ఉంది. అంతర్జాతీయ రంగంలో సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాల తీవ్రతకు ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన రంగంగా మారుతున్నది.

చైనా సోషల్-సామ్రాజ్యవాదం అనేక వెనుకబడిన దేశాల ప్రత్యేకించి దాదాపు 20 పైగా అరబ్బు దేశాలలోని సహజ వనరులను, మార్కెట్లను కొల్లగొడుతుండడంతో దానికీ అమెరికాతో పాటు వివిధ సామ్రాజ్యవాదుల మధ్య పోటీ పెరుగుతున్నది. యూరప్‌లో ఆధిపత్యం కోసం జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్‌ల మధ్య పోటీ పెరుగుతున్నది. ఈ స్థితిలో ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక-రాజకీయ సమీకరణలు మారుతున్నాయి.

సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాలకు వ్యతిరేకంగా, దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ప్రపంచ పీడిత జాతులు, ప్రజలు సాగిస్తున్న విప్లవ, ప్రజాస్వామ్య, జాతి విముక్తి పోరాటాలను అణచివేయడం కోసం సామ్రాజ్యవాదులు, ఆయా దేశాల్లోని వారి దళారీలు ఫాసిజాన్ని అమలు చేస్తున్నారు. మతోన్మాదాన్ని, జాత్యహంకారాన్ని, జాతీయ దురభిమానాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజలను పోరాటమార్గం నుండి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్పోరేట్ మీడియా ఈ భావాలతో ప్రజల మెదళ్ళను నిరంతరం కలుషితం చేస్తున్నది. మరోవైపు ప్రజల సమరశీలతను, పోరాట చేవను దెబ్బతీసేందుకు సామ్రాజ్యవాద ప్రాయోజిత ఎన్‌జీఓలు వెనుకబడిన దేశాల్లో క్రియాశీలంగా పనిచేస్తున్నాయి. పీడిత వర్గాలను వర్గ ప్రాతిపదికన ఏకం కాకుండా చూసేందుకు పోస్టు మాడర్నిజం సైద్ధాంతిక దాడి కొనసాగుతున్నది. ప్రచండ-అవాకిన్‌ల నయా రివిజనిజంతోపాటు రకరకాల రివిజనిజం, పార్లమెంటరిజం, మన దేశంలో గాంధీయిజం కూడా ప్రజల్ని పోరాట మార్గం నుండి పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయి.

జాత్యహంకారం పునాదిగా ఫాసిస్టు భావజాలాన్ని పెంపొందిస్తూ అమెరికా, యూరప్ దేశాల్లో మితవాద, కన్జర్వేటివ్, ఫాసిస్టు పార్టీలు క్రమంగా బలం పుంజుకుంటూ అధికారంలోకి వస్తున్నాయి. జర్మనీలో గత సంవత్సరం అక్టోబర్-నవంబర్ నెలల్లో జరిగిన రాష్ట్రాల ఎన్నికల్లో ఏంజెలా మర్కెల్ పార్టీ ఓటమి పాలయ్యి, ఫాసిస్టు పోకడలున్న పార్టీలు గెలిచాయి. అమెరికాలో ఒబామా అనుసరించిన ఆర్థిక, రాజకీయ, సైనిక, విదేశాంగ విధానాలు ఏవీ అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించలేక ఘోరంగా విఫలమయ్యాయి. ఈ స్థితిలో నూతన రాష్ట్రపతి డోనాల్డ్ ట్రంప్ నాయకత్వాన అమెరికా పాలకవర్గాలు శ్వేత జాతి అహంకారాన్ని రెచ్చగొడుతున్నాయి. ఆ దేశంలో నల్ల జాతీయులపై, ముస్లింలపై, అమెరికనేతర వలస ప్రజలపై జాతి ఉన్మాద దాడులు పెరిగిపోతున్నాయి.

మొత్తంగా చూసినప్పుడు అంతర్జాతీయంగా మౌలిక వైరుధ్యాలు – సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులకు, ప్రజలకు మధ్యనున్న వైరుధ్యం; సామ్రాజ్యవాద దేశాల్లో/పెట్టుబడిదారీ దేశాల్లో-బూర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికీ నడుమ వైరుధ్యం; సామ్రాజ్యవాదుల నడుమ వైరుధ్యం రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా విప్లవ పరిస్థితులు మరింత అనుకూలంగా పెంపొందుతున్నాయి.

అనుకూలమైన విప్లవ పరిస్థితులను ఉపయోగించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా విప్లవోద్యమాలు, ప్రజాస్వామిక పోరాటాలు, జాతివిముక్తి పోరాటాలు తీవ్రతరమవుతున్నాయి. పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద దేశాలలో కార్మికవర్గ, మధ్యతరగతి ప్రజల పోరాటాలు, రేసిస్టు వ్యతిరేక, మతదురహంకార వ్యతిరేక పోరాటాలు పెరుగుతున్నాయి. సామ్రాజ్యవాదుల దోపిడీ విధానాలకు, జోక్యందారీ విధానాలకు, దురాక్రమణ యుద్ధాలకు వ్యతిరేకంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలోని ప్రజలు ఉద్యమిస్తున్నారు. పాలస్తీనా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, కుర్దిస్తాన్, యెమెన్ తదితర వెనుకబడిన దేశాలలో జాతి విముక్తి పోరాటాలు అనేక సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. పర్యావరణాన్ని సమూలంగా ధ్వంసం చేస్తున్న సామ్రాజ్యవాదుల విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలు పెరుగుతున్నాయి. ఫిలిప్పైన్స్, భారతదేశం, టర్కీ, పెరూ తదితర దేశాల్లో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో విప్లవోద్యమాలు సామ్రాజ్యవాదులకూ, బడా భూస్వామ్య, దళారీ నిరుంకుశ బూర్జువా వర్గాలకూ సవాలుగా నిలుస్తున్నాయి.

**దేశీయ పరిస్థితి :** సామ్రాజ్యవాదుల దిశానిర్దేశంలో దేశంలో బిజెపి మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు గత మూడేళ్లుగా సామ్రాజ్యవాద ప్రాయోజిత ప్రపంచీకరణ విధానాలను మరింత దూకుడుగా అమలుచేస్తున్నాయి. 'సబ్ కే సాథ్, సబ్ కే వికాస్,' 'మేక్ ఇన్ ఇండియా,' 'స్టార్టప్ ఇండియా' పేరుతో మోడీ ప్రభుత్వం చేస్తున్నదంతా దేశాన్ని సామ్రాజ్యవాదులకు, భారత పాలకవర్గాలకు దోచిపెట్టడమే. సామ్రాజ్యవాద బహుళజాతి కార్పొరేషన్లు, భారత దళారీ కార్పొరేట్ ఘరానాలు దేశాన్ని తమ ఇష్టానుసారంగా దోచుకునేందుకు, వారికి సూపర్ లాభాలను చేకూర్చేందుకూ ఆర్థిక

వ్యవస్థలోని అన్ని రంగాలనూ ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల (ఎఫ్.డి.ఐ.) కోసం తెరవడం, దేశ మార్కెట్‌ను సామ్రాజ్యవాద దేశాల సరుకుల డంపింగ్ కేంద్రంగా మార్చివేయడంతో కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి ప్రజల బతుకులు అతలాకుతలం అవుతున్నాయి. అయితే ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఫలితంగా ఆశించిన రీతిలో దేశంలోకి సామ్రాజ్యవాదుల పెట్టుబడులు రాకపోవడం వల్ల అది అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలు గడిచినా మోడీ చెబుతున్న 'మేక్ ఇన్ ఇండియా'లో కూడా పురోగతి ఏమీ లేదు. దేశ పారిశ్రామిక రంగం కునారిల్లుతూనే ఉంది. నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు, వ్యవసాయ సంక్షోభం పెరిగి ఆయన చెబుతున్న 'అభివృద్ధి'లోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నాయి. పేదరికం నిర్మూలన పేరుతో అది ముందుకు తెచ్చిన వివిధ పథకాలు విఫలమయ్యాయి. మోడీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ సంక్షోభం పెరుగుతుండడంతో ప్రతి సంవత్సరం 12 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీన్ని కప్పిపుచ్చుతూ రైతాంగంలో భ్రమలు సృష్టించడానికి మరో నాలుగేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేట్ కంపెనీలకు సూపర్ లాభాలను తెచ్చిపెట్టే ప్రధాన మంత్రి పంటల భీమా పథకం లాంటి బూటకపు పథకాలను ప్రవేశపెడుతున్నది.

సామ్రాజ్యవాద అనుకూల, రైతాంగ వ్యతిరేక విధానాల దుష్ఫలితాల వల్ల వ్యవసాయ సంక్షోభ తీవ్రత పెరిగి జాట్లు, పటేళ్ళు, మరాఠాలు, కాపులు లాంటి వ్యవసాయ ఆధారిత 'అగ్ర' కులాల ప్రజలు కూడా పోరాడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో దళితులకు, ఓబిసిలకు రిజర్వేషన్లను వ్యతిరేకించిన ఈ కులాలు ఇప్పుడు తమకు విద్య-ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి.

మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసమూ 'ఒకే దేశం, ఒకే పన్ను' పేరుతో ప్రజలపై, చిన్న, మధ్య తరహా వ్యాపారస్థులపై పన్నుల పెనుభారాన్ని వేస్తూ, రాష్ట్రాల అధికారాలను కాలరాచివేస్తూ పరోక్ష పన్నుల విధానాన్ని సవరించి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)ను ప్రవేశపెట్టింది. ఇది అన్ని సరకుల ధరలను తగ్గించి ప్రజలకు తోడ్పడుతున్నదని మోసపూరిత ప్రచారం చేస్తున్నది. జీఎస్‌టీ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రభుత్వం టోకు ధరల సూచికను ప్రకటించలేదు. దేశంలో అయోమయం పరిస్థితి నెలకొని ఉంది. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలలో మార్పు లేదు. నిజానికి బహుళజాతి సంస్థల, వాటి దళారీల ప్రయోజనాలను నెరవేర్చడానికి హిందూ ఫాసిజం ఆర్థిక రంగంలో చేస్తున్న దాడిలో భాగంగానే జిఎస్‌టి దేశ ప్రజలపై రుద్దబడింది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీడిత ప్రజలలో పెంపొందుతున్న అశాంతి, అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు, ప్రజా ఉద్యమాలను నీరుగార్చేందుకు మోడీ-అమిత్‌షా-మోహన్ భాగవత్‌ల ముఠా బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు భావజాలాన్ని, కశ్మీర్ సమస్యలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా, సరిహద్దు సమస్యలో చైనాకు వ్యతిరేకంగా జాతీయోన్మాదాన్నీ, కుహనా దేశభక్తినీ రెచ్చగొడుతున్నది. నిజానికి ఈ ముఠా ఎన్నికల సమయంలో 'హిందూ రాజ్య స్థాపన, అయోధ్యలో రామాలయ నిర్మాణం, కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే 370 ఆర్టికల్ రద్దు, కామన్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌర స్మృతి) అమలు' అనేవి తన ఎజెండాలో లేవనీ, 'అభివృద్ధి' తన ఎజెండా అనీ ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చింది. అయితే అది అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హిందూ రాజ్య స్థాపన లక్ష్యాన్ని సాధించడానికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా సంఘ్‌పరివార్‌కు చెందిన అనేక బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు సంస్థలు చురుగ్గా పనిచేస్తున్నాయి. కొత్తవి వివిధ పేర్లతో పుట్టుకొస్తున్నాయి. ఇవి హిందూ రాజ్య స్థాపన లక్ష్యంతో పైన పేర్కొన్న తమ అసలు ఎజెండాను అమలు జరపడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. వీటి కనుసన్నల్లో గోరక్షణ పేరుతో యావత్తు దేశంలో మత మైనారిటీలపై, దళితులపై 'మాస్ లించింగ్' (సామూహికంగా కొట్టి చంపడం) పెరిగిపోతూ వారిలో భయానక వాతావరణం ఏర్పడుతున్నది. ఇవి ఆదివాసులు, విద్యార్థులు, ప్రొఫెసర్లు, మహిళలు తదితర సెక్షన్లపై హత్యాకాండలు చేస్తూ అడ్డూఆపూ లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నాయి. గ్రామాల పేర్లనూ, రైల్వేస్టేషన్ల పేర్లనూ హైందవీకరణ చేస్తున్నాయి. ఉదాహరణకు, బీహార్‌లో షేర్‌పురాను శివపురిగా, మొగల్‌సరాయి రైల్వేస్టేషన్‌ను దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రైల్వేస్టేషన్‌గా మార్చారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా గోవధను నిషేధించడం, అయోధ్యలో రామాలయాన్ని నిర్మించడం మోడీ ప్రభుత్వ ఎజెండాలో ఉన్నది. సుప్రీం కోర్టు సైతం రెండు పక్షాలు రాజీపడితే మంచిదనే కాలంచెల్లిన సలహాను ఇవ్వడంతో, ఇప్పటి వరకూ సుప్రీం కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తామన్న సంఘ్ పరివార్, చొరవను తన చేతిలోకి తీసుకొని కుట్రపూరితంగా బాబ్రీ మసీదు కేసులో పోరాడుతున్న ముస్లిములలో షియా, సున్నీల మధ్యనే చిచ్చుపెడుతూ వారిలో తన తొత్తులను సృష్టిస్తున్నది. న్యాయవ్యవస్థను కాషాయీకరణ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూ తన ఫాసిస్టు పాలనకు చట్టబద్ధత కల్పించడానికి పూనుకుంది.

దేశంలో నెలకొని ఉన్న ఈ పరిస్థితుల కారణంగా సామ్రాజ్యవాద అనుకూల, పచ్చి దేశద్రోహకర విధానాలతో, కాలం చెల్లిన ప్రగతి నిరోధక విధానాలతో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం పీడిత వర్గాలకు, జాతులకు, పీడిత సాంఘిక సముదాయాలకు ఉమ్మడి శత్రువుగా తయారయింది. దీనికి వ్యతిరేకంగా వివిధ రూపాలలో ప్రజా ప్రతిఘటన పెంపొందుతున్నది. ఇది మన దేశ రాజకీయాల్లో గత మూడు సంవత్సరాలలో జరిగిన నూతన పరిణామం.

ఇటీవల హిందూ ఫాసిస్టు మోడీ నేతృత్వంలోని ఈ సంఘ్ పరివార్ ముఠా దేశంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా సిద్ధాంతాన్ని మార్చుకోవాలనీ, 2022 కల్లా టెర్రరిజాన్ని, మత

ఛాందసవాదాన్ని, కులతత్వాన్ని నిర్మూలించాలనీ, దేశ అభివృద్ధి కోసం 'నూతన భారత నిర్మాణం' చేయాలనీ, దేశంలో పేదరికాన్నీ, పౌష్టికాహార లోపాన్నీ, అవినీతి రూపుమాపాలనీ అంటూ 'కరేంగే, కర్ కే రహేంగే' అనే నినాదాన్ని ఇచ్చింది. 'సంకల్ప్ సే సిద్ధ్' అనే ప్రచార క్యాంపెయిన్‌ను పెద్దెత్తున ప్రారంభించింది. అవినీతిని నిర్మూలించే పేరుతో పెద్దనోట్లను రద్దుచేసి ప్రజల సొమ్మునంతటినీ దౌర్జన్యపూరితంగా భారీయెత్తున కొల్లగొట్టి బ్యాంకుల్లో జమ చేయించి బహుళజాతి కంపెనీల, బడా నిరంకుశ బూర్జువా వర్గ ప్రయోజనాల్ని నెరవేర్చిన ఈ ముఠా, సామ్రాజ్యవాద అనుకూల ప్రపంచీకరణ విధానాలను అనుసరిస్తూ పేద, మధ్య తరగతి ప్రజానీకాన్ని, రైతాంగాన్ని, చిన్న వ్యాపారస్థుల-పెట్టుబడిదారుల బతుకుల్ని దుర్భరం చేస్తున్న ఈ ముఠా అత్యంత మోసపూరిత నినాదాలతో, పథకాలతో ప్రజలను మరోసారి దగా చేయాలని చూస్తున్నది. నిజానికి నేడు ఈ ముఠా చేపడుతున్న ఈ క్యాంపెయిన్ ప్రధాన లక్ష్యం హిందూ ఫాసిస్టు రాజ్యాన్ని స్థాపించడం; మావోయిస్టు ఉద్యమాన్నీ, కశ్మీర్, ఈశాన్య జాతుల విముక్తి పోరాటాలను రూపుమాపడం; ఇస్లాం, క్రైస్తవ తదితర మత మైనారిటీలను, ఆదివాసీ ఉద్యమ శక్తులను తుడిచిపెట్టడం; బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ప్రతిఘటించే శక్తులను, అన్ని విప్లవ, ప్రజాస్వామిక శక్తులను, పీడిత కులాల ప్రజలు, ఆదివాసులు తదితర పీడిత సెక్షన్లను లొంగదీసుకోవడం; ప్రతిపక్ష రాజకీయ పార్టీలను దెబ్బతీయడం తప్ప మరొకటి కాదు.

కేంద్రంలోనే కాకుండా అనేక రాష్ట్రాల్లో బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఏ అధికారంలోకి రావడంతో సంఘ్ పరివార్ దూకుడుతనం మరింతగా పెరిగింది. మొదట భారతదేశాన్ని కాంగ్రెస్ రహితంగా చేస్తానన్న మోడీ, ప్రస్తుతం దేశంలో ఎటువంటి పార్లమెంటరీ ప్రతిపక్షం లేకుండా చేయడంపై కేంద్రీకరించాడు. వివిధ రాష్ట్రాలలో ప్రతిపక్షాల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలను పడగొట్టడం, వారి నాయకులను నయాన-భయాన లొంగదీసుకోవడం, కొనేయడం, రహస్య అవకాశవాద ఒప్పందాలను కుదుర్చుకోవడం, లొంగని వారిపై ఇంటలిజెన్స్ యంత్రాంగాన్ని వినియోగించి, పోలీసు బలగాలను ప్రయోగించి దాడులు చేయడం, అక్రమ కేసుల్లో ఇరికించడం చేస్తున్నాడు.

రోజు రోజూ దేశ ప్రజలపై పెరుగుతున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు దాడిని తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా విప్లవ, ప్రజాస్వామ్య, లౌకిక, దేశభక్తయుత శక్తులు పలు ఐక్య వేదికలపై సమైక్యమవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని దాదరి నుండి మొదలుకుని సాహరన్‌పూర్, గుజరాత్‌లోని ఉనా, రాజస్థాన్‌లోని అల్వర్ వరకూ సాగిన ఈ దాడుల నేపథ్యంలో దళితులు, ముస్లింలతోపాటు ఆదివాసీ, ఇతర పీడిత కులాలకు చెందిన శక్తులు ఉనాలో సంఘటితమై హిందూ మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించుకున్నాయి. కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, మేధావులు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, హెల్త్ వర్కర్లు, నిరుద్యోగులు పోరాడుతున్నారు. ఢిల్లీలో రాంజస్ కాలేజీలో ప్రగతిశీల విద్యార్థులపై హిందూ సంఘ్ పరివార్ చేసిన దాడులకు వ్యతిరేకంగా 14 రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో పెద్దెత్తున విద్యార్థుల-ప్రొఫెసర్ల ఐక్య ఉద్యమం ఇందుకు నమూనాగా నిలుస్తుంది.

మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష ట్రేడ్ యూనియన్ల నాయకత్వంలో దేశవ్యాప్తంగా గత సంవత్సరం సెప్టెంబర్‌లో 15 కోట్ల మందికి పైగా కార్మికులు దేశవ్యాప్త సమ్మె చేశారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 28న 10 లక్షల మంది ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు కార్మిక చట్టాల సంస్కరణలతో పాటు ఔట్‌సోర్సింగ్ వంటి ఇతర ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సాధారణ సమ్మె చేశారు. మిలిటెంట్‌గా సాగుతున్న కార్మికోద్యమాలకు నాయకత్వం లేకుండా దెబ్బతీసేందుకు పాలక వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. కొద్ది నెలల క్రితమే మారుతీ సుజుకీ కంపెనీలో కార్మిక నాయకత్వాన్ని జైళ్లల్లోకి నెట్టి వారికి జీవిత ఖైదు విధించారు. కార్మికవర్గం దీన్ని సమైక్యంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం వివిధ రూపాల్లో పోరాడుతున్నారు. పంజాబ్, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఇలా అనేక రాష్ట్రాల్లో రైతులు బ్యాంకు రుణాల మాఫీ, గిట్టుబాటు ధరలు, సబ్సిడీలను డిమాండ్ చేస్తూ మిలిటెంట్ పోరాటాలు చేస్తున్నారు. వీరిపై ప్రభుత్వాలు ప్రభుత్వ సాయుధ బలగాలను ప్రయోగించి క్రూరమైన దమనకాండను అమలు చేస్తున్నాయి. ఈ ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలను వ్యతిరేకించిన సంస్థలపై, మేధావులపై 'ఉపా' తదితర ఫాసిస్టు చట్టాలను ప్రయోగించి జైళ్లల్లో కుక్కుతున్నాయి. దేశంలో పోరాడుతున్న ప్రతి పీడిత వర్గమూ, సెక్షనూ, జాతీ తీవ్ర నిర్బంధానికి గురవుతున్నది.

కశ్మీర్, నాగాలాండ్, మణిపూర్, అసోం ప్రజలు జాతులకు స్వయంనిర్ణయాధికారంతో సహా విడిపోయే హక్కు కోసం, బోడో, గూర్ఖా ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్నారు. గత సంవత్సరం జులైలో భారత సైనిక బలగాలు హిజ్‌బుల్ ముజాహిద్దీన్ సంస్థకు చెందిన బుర్హాన్‌వానిని కాల్చి చంపినప్పటి నుంచి తీవ్రతరమైన వర్తమాన కశ్మీర్ జాతి విముక్తి పోరాట వెల్లువ ఇప్పటికీ కొనసాగుతున్నది. కశ్మీర్ ప్రజలు 'రాళ్ల'తో భారత సైనిక, పారామిలిటరీ బలగాలను ఎదుర్కొంటూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను బెంబేలెత్తిస్తున్నారు. ఈ సంవత్సర కాలంగా కశ్మీర్ విద్యార్థినీ విద్యార్థులు కూడా అత్యంత సమరశీలంగా ఇందులో భాగమయ్యారు. ఈశాన్య భారతంలోని జాతి విముక్తి పోరాట సంస్థలు తిరిగి సంఘటితపడి, ఐక్యసంఘటనగా ఏర్పడి భారత విస్తరణవాదులకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. మోడీ ప్రభుత్వం

జాతి విముక్తి పోరాటకారులను, ప్రత్యేకించి కశ్మీర్‌లో పెద్దెత్తున ఊచకోత కోస్తూ ఆ పోరాటాలను రూపుమాపడానికి తీవ్ర అణచివేతను కొనసాగిస్తున్నది. ఇటీవల కశ్మీర్ స్వయంప్రతిపత్తికి చివరి ఆసరాగా ఉందనుకుంటున్న 'ఆర్టికల్ 35 ఏ'ను రద్దు చేసేందుకు కూడా పూనుకుంటున్నది. దీనికి వ్యతిరేకంగా కశ్మీర్ ప్రజలలో తీవ్రమైన ఆక్రోశం పెల్లుబుకుతోంది. అక్కడి రాజకీయ పార్టీలు కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. గూర్ఖాలాండ్ కోసం 57 రోజుల నుంచి నిరవధిక బంద్ కొనసాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం పెద్దెత్తున పోలీసు బలగాలను మోహరించినా, సైన్యాన్ని రప్పించినా నిషేధాజ్ఞలు, అరెస్టులు, భాష్పవాయువు ప్రయోగాలు జరిపినా, కాల్పులు జరిపి ప్రజలపై హత్యాకాండకు దిగినా వీర గూర్ఖా ప్రజలు సమరశీలంగా పోరాడుతున్నారు.

దేశంలో మహిళలపై అత్యాచారాలు రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నాయి. వెలుగులోకి వచ్చిన లెక్కల ప్రకారం దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒక మహిళపై హింస జరుగుతున్నది. వరకట్న సమస్య వల్ల ప్రతి సంవత్సరం 8 వేల మంది మహిళలు మరణిస్తున్నారు, 50 వేల అత్యాచార ఘటనలు జరుగుతున్నాయి, 40 వేల మంది మహిళలు అపహరణకు గురవుతున్నారు. యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, వేశ్యావృత్తిలోకి నెట్టడం, భ్రూణ శిశువులను-చిన్న వయస్సు ఆడపిల్లలను చంపడం మొదలైనవి పెద్దెత్తున భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతి పెచ్చరిల్లిపోతున్న కారణంగానే జరుగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మహిళల, ప్రజాస్వామిక ఉద్యమాలు జరుగుతున్నాయి.

**ప్రియమైన కామ్రేడ్స్!**

మన ప్రజా గెరిల్లాలు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మార్చి, ఏప్రిల్ మాసాలలో జరిపిన రెండు వేర్వేరు ఆంబుష్‌లలో 37 మంది సీఆర్‌పీ జవాన్‌లను అంతమొందించి మరో 10 మందిని గాయపర్చిన నేపథ్యంలో మే 8 నాడు కొత్త ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మావోయిస్టు ఉద్యమం కొనసాగుతున్న 10 రాష్ట్రాల ముఖ్యమంత్రుల, పోలీసు ఉన్నతాధికారుల, జిల్లా కలెక్టర్లతో అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఇందులో ఆయన 'ప్రతి అంశంలోనూ దూకుడుగా ఉండాలనీ, ఆత్మరక్షణా ధోరణితో వ్యవహరించడం అంతిమంగా ఎదురుదాడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందనీ' ఉపదేశించాడు. ఈ దూకుడుతనం కేవలం మిలటరీ రంగానికే పరిమితమైనది కాదు. ఇది ప్రధానంగా భావజాల రంగానికి సంబంధించింది. ఇప్పటికే కాషాయ సేన, తమ రాజ్యాంగ యంత్రం నుంచి పూర్తి మద్దతుతో ఈ దాడిని ప్రారంభించింది. ఇందులో భాగంగా 'తెల్లబట్టల' నక్సలైట్లను, అంటే, పౌరహక్కుల, సామాజిక కార్యకర్తలను, ప్రజాస్వామికవాదులను లక్ష్యంగా చేసుకుంటామని కూడా ప్రకటించారు. అంటే ఈ దాడి కేవలం మావోయిజం పైనే లేదు. మొత్తంగా ప్రగతిశీల భావాలపైనా, చివరకు ఉదారవాద ప్రజాస్వామిక ఆలోచనలపైనా కూడా కొనసాగుతున్నది. వాళ్ల ఈ దూకుడుతనాన్ని చూస్తే 'నామమాత్రపు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి' కూడా నూకలు చెల్లుతాయని స్పష్టమవుతున్నది.

దేశంలో మన పార్టీ నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధం అనేక ఆటుపోట్లనూ, ఎగుడుదిగుళ్లనూ, కష్టనష్టాలను, మలుపులను-మెలికలనూ అధిగమిస్తూ ముందుకు సాగుతుండడంతో దేశ ప్రజల ముందు ఒక ప్రత్యామ్నాయ విప్లవ మార్గం అభివృద్ధి చెందుతున్నది. దీన్ని భారత దోపిడీ పాలకవర్గాలు అత్యంత ప్రమాదకరమైనదిగా భావిస్తున్నారు. సామ్రాజ్యవాద ప్రాయోజిత విప్లవ ప్రతీఘాతుక ఎల్‌ఐసి వ్యూహంతో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే పథకాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా మే 8 సమావేశంలో ఉద్యమ ప్రాంతాలలో భారత సైన్యాలను మోహరించే ప్రసక్తి లేదంటూనే సైనికాధికారుల మార్గదర్శకత్వంలో ఉద్యమ నిర్మూలనా పథకాలను రూపొందించారు. ఇందులో భాగంగానే సీఆర్‌పీఎఫ్ (ఎల్.డబ్ల్యు.ఇ.) సెంట్రల్ జోన్ కమాండ్ సెంటర్‌ను కలకత్తా నుండి రాయపూర్‌కు మార్చాలని; యూనిఫైడ్ కమాండ్లను జిల్లా స్థాయి వరకు ఏర్పరచి టాక్టికల్-ఆపరేషనల్ లెవల్‌లో కమాండ్లను పటిష్టం చేయాలని; రాష్ట్ర-కేంద్ర బలగాల మధ్య సమన్వయాన్ని మెరుగ్గా కొనసాగించడానికి కమిటీని ఏర్పరచాలని; రాయపూర్‌లో ఉన్న నక్సల్ ప్రత్యేక డీజీ కార్యాలయాన్ని జగదల్‌పూర్ (బస్తర్)కు మార్చాలని; ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత విస్తరించి పటిష్టం చేయాలని; ప్రత్యేకించి హ్యూమన్ మరియు ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్‌ను పటిష్టపరచాలని; ఎలక్ట్రానిక్ వ్యవస్థ (యుఎవిలు, సాటిలైట్స్, జిపిఎస్‌లు, థర్మల్ ఇమేజింగ్, ఇన్‌ఫ్రారెడ్ టెక్నాలజీ, సిసిటివి కెమెరాలు, రాడార్లు తదితరాల) ద్వారా రియల్‌టైం ఇంటెలిజెన్స్ సేకరణతో పాటు ఆపరేషన్స్‌లో ఈ వ్యవస్థను శక్తివంతంగా ఉపయోగించుకోవాలని; ఎయిర్ ఫోర్స్‌ను ఆపరేషన్స్‌లో కూడా వినియోగించాలని; (కమాండో బలగాలను హెలికాప్టర్లతో తరలించి దాడి చేయడంతో పాటు వాటి నుండే (స్ట్రాఫింగ్ అంటే కిందిగా ఎగిరే హెలికాప్టర్ల నుండి ఫైరింగ్ చేయడం, డ్రోన్ దాడులు చేయడం), బలగాలకు నూతన తరహా శిక్షణ ఇవ్వాలని; సుక్మా, బీజాపూర్‌లలో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని; కేంద్ర-రాష్ట్ర బలగాల మధ్య సమన్వయాన్ని పెంచాలని; ఉద్యమ ప్రాంతాల్లో రోడ్లను పారామిలటరీ బలగాల రక్షణలో ఆధునిక టెక్నాలజీని వినియోగించుకొని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని; మరిన్ని కమ్యూనికేషన్ టవర్లను నిర్మించాలని మొదలైన నిర్ణయాలు చేశారు. ఇకపై జాతీయ భద్రతా మండలి సలహాదారు అజిత్ దోభాల్, దేశ అంతర్గత భద్రతా సలహాదారు కె. విజయకుమార్‌లు మావోయిస్టుల నిర్మూలనా క్యాంపెయిన్‌ను గైడ్ చేస్తారని ప్రకటించారు. ఇందులో తీసుకున్న నిర్ణయాల్లో అతి ముఖ్యమైనది సర్జికల్ స్ట్రయిక్స్ చేయడం. ఇవన్నీ 2019లో రానున్న పార్లమెంటరీ ఎన్నికలకు ముందే పథకం ప్రకారం మన పార్టీ

విప్లవ నాయకత్వాన్నీ, విప్లవ స్వీయాత్మక శక్తులనూ నిర్మూలించి భారత విప్లవోద్యమాన్ని ఓడించాలన్న లక్ష్యాన్ని వెల్లడిస్తున్నాయి. ఈ లక్ష్యంతోనే మిషన్ 2017 చాలా దూకుడుగా హంతక దాడులతో ప్రారంభమైంది. రానున్న రెండు సంవత్సరాలు భారత విప్లవోద్యమానికి తీవ్రమైన సవాలుగా ఉంటాయి.

ప్రజా పోరాటాలను అణచివేయడానికి దోపిడీ పాలకవర్గాలు ఎంతటి క్రూర అణచివేతకు పాల్పడినా అంతిమంగా అది విఫలంకాక తప్పదనీ చరిత్ర పదే పదే రుజువు చేసింది. ఈ అనుభవంతో విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో భారత పాలకవర్గాలు కొనసాగిస్తున్న మిషన్-2017ను ఓడించడం, పై నుంచి కింది వరకూ పార్టీ నాయకత్వాన్ని పరిరక్షించుకుంటూ ఉద్యమాన్ని పురోగమింపజేయడం తక్షణ కర్తవ్యంగా చేపట్టాలి. ప్రజాపునాదిని పెంపొందించుకుంటూ వర్గపంథా-ప్రజాపంథాపై ఆధారపడి ప్రజాయుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాలి. ఇందులో విజయం సాధించాలంటే, వీలైనంత వరకూ మన శక్తులను కాపాడుకోవాలి. శత్రు బలహీనతలను వినియోగించుకొని అవకాశం దొరికిన వెంటనే పిఎల్‌జిఏ బలగాలను కేంద్రీకరించి శత్రు బలగాల విడి యూనిట్లపై లేదా వాటిని విభజించి దాడి చేసి నిర్మూలించాలి, ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలి. ఇందుకోసం గెరిల్లా యుద్ధ నియమాలను, సూత్రాలు - రహస్యం, వేగం, దృఢసంకల్పం, స్థల మార్పిడిలతో కూడిన ఆత్మరక్షణ-దాడి ఎత్తుగడలను చొరవతో అమలు చేసి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేద్దాం. ఆత్మరక్షణ, ప్రజాపునాదిని పెంపొందించుకోవడం, స్వీయాత్మక శక్తులను పెంపొందించుకోవడం-సంఘటితపరచుకోవడం, ఉద్యమాన్ని విస్తరించడం, తదితర తక్షణ లక్ష్యాల సాధన కోసం త్యాగనిరతితో పోరాడుతూ ప్రజాయుద్ధాన్ని మరో అడుగు పురోగమింపజేద్దాం. ఇందుకోసం ఈ కింది కర్తవ్యాలను చేపట్టి కృషి చేద్దాం :

## కర్తవ్యాలు

★ మిషన్-2017ను ఓడించండి! విప్లవోద్యమ గడ్డు స్థితిని అధిగమించడం కోసం ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ నిర్దేశించిన కేంద్ర కర్తవ్యం అమలులో భాగంగా ప్రజాయుద్ధంలో మరిన్ని విజయాలు సాధించే లక్ష్యంతో పురోగమించండి!

గత సంవత్సర కాలంలో పాలకవర్గాలు కొనసాగించిన మిషన్-2016, మిషన్-2017కు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో సాగించిన ప్రజాయుద్ధాన్ని మదింపు చేసుకోవాలి. అందులో మన అనుభవాలను సంశ్లేషించి వాటి నుంచి పాజిటివ్, నెగటివ్ పాఠాలను నేర్చుకోవాలి. మనం మరిన్ని విజయాలు సాధిస్తూ పురోగమించేందుకై వర్గపంథా-ప్రజాపంథాలపై ఆధారపడి తగిన ఎత్తుగడలను, కర్తవ్యాలను రూపొందించుకోవాలి.

మిషన్-2017లో భాగంగా విప్లవోద్యమ ప్రాంతాల్లో ప్రజలపై, ప్రజాస్వామికవాదులపై దోపిడీ పాలకవర్గాలు కొనసాగిస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా స్థానిక స్థాయి నుండి కేంద్ర స్థాయి వరకు ప్రజాస్వామిక శక్తులను కూడగట్టి ఐక్య వేదికల్ని నిర్మించాలి. ఇప్పటికే ఉన్న వేదికల్ని క్రియాశీలంగా పని చేయించాలి.

★ బోల్షివీకరణ క్యాంపెయిన్ అనుభవాలపై ఆధారపడి పార్టీని నిరంతరం బోల్షివీకరించండి!

మన పార్టీ చేపట్టిన బోల్షివీకరణ కేంపెయిన్ ఆశించిన దిశలో ఒక మేరకు సత్ఫలితాలను ఇస్తున్నది. ఈ కేంపెయిన్ ద్వారా వస్తున్న అనుభవాలతో పార్టీని బోల్షివీకరించే విధంగా నిరంతరం ఆచరణను కొనసాగించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పై నుంచి కింది వరకూ పార్టీ శ్రేణులు దృఢ సంకల్పంతో కార్యాచరణను కొనసాగించాలి. ఈ క్యాంపెయిన్ పూర్తికాని చోట్ల కార్మికవర్గ స్ఫూర్తితో విజయవంతంగా పూర్తి చేసే విధంగా ప్లాన్ చేసుకోవాలి, దాన్ని అమలు చేయాలి.

★ మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజాయుద్ధ ఎత్తుగడలను అభివృద్ధి చేసుకునే లక్ష్యంతో అన్ని రాష్ట్రాలు/స్పెషల్ ఏరియాలు/స్పెషల్ జోన్లలో సామాజిక పరిశీలన, వర్గ పరిశీలన నిర్వహించండి! సరైన ఎత్తుగడలను రూపొందించి నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించి ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయండి!

★ 2017 నవంబర్ 7 నుండి 13 వరకు ప్రపంచాన్ని కుదిపివేసిన రష్యన్ బోల్షివిక్ విప్లవ శత వార్షికోత్సవాన్నీ, 2018 మే 5 నుండి 11 కార్ల్ మార్క్స్ ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలను నిర్వహించండి!

★ నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రధాన అంతస్సారంగా ఉన్న విప్లవకర భూసంస్కరణలపై కేంద్రీకరించండి!

విప్లవకర భూసంస్కరణలు అనేవి ప్రజాస్వామిక విప్లవ ప్రధాన అంతస్సారంగా ఉంటాయి. అవి విశాల ప్రజానీకంలో మెజారిటీగా ఉన్న రైతాంగ ప్రజారాశుల్ని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా విముక్తి చేస్తాయి. రైతాంగ ప్రజారాశుల నుంచి దృఢమైన, పటిష్టమైన మద్దతును సంపాదించుకొని, నూతన జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా విజయవంతం చేసే మార్గం ఇదే. మనం చేపట్టే విప్లవకర భూసంస్కరణలు విప్లవానికి అనుకూలతల్ని సృష్టిస్తాయి.

★ సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా విస్థాపన తదితర సామాజిక, రాజకీయ, ఆర్థిక, పర్యావరణ సమస్యలపై పీడిత ప్రజల్ని, వ్యవసాయ సంక్షోభంతో తీవ్రమైన

*(మిగతా 41వ పేజీలో......)*

# బొగ్గుగనుల్లో-ఎమర్జెన్సీ వాతావరణం
# కార్మికుల రక్షణ గాల్లో - సింగరేణిలో భారీగా నిరుద్యోగం
# వంద ఏళ్ల బోల్షివిక్ విప్లవ స్పిరిట్‌తో కార్మికవర్గం పోరాడాలి.

దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలుగా ఉన్న కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలతో పాటు సింగరేణి పరిస్థితి ప్రస్తుతం సంక్లిష్టంగా మారింది. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న జెన్‌కోకు బొగ్గు సరఫరా బకాయిలు దాదాపు రూ॥4600 కోట్లు సింగరేణికి అందని పరిస్థితి. మరో వైపు ఇతర పరిశ్రమలకు బొగ్గు సరఫరా చేసినా వెయ్యికోట్ల రూపాయల బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా దాదాపు రూ॥6 వేల కోట్ల బకాయిలు సింగరేణికి రావాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం చర్యలు లేవు. మరోదిక్కు కేంద్ర ప్రభుత్వం వినియోగదారులపై టన్ను బొగ్గు కోనుగోలుకు రూ॥ 200 ఉన్న క్లీన్ ఎనర్జీ సెస్‌ను రూ॥400 లకు పెంచారు. దీని ప్రభావం ఇపుడు 'మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా' మారింది. సింగరేణిలో మొత్తం 29 భూగర్భ గనులు, 16 ఓపెన్‌కాస్ట్‌లు పని చేస్తున్నాయి. ఇందులో ఒకే ఒక్క గని మినహా 28 గనులు భారీ నష్టాల్లో ఉన్నాయి. గడిచిన రెండు సం॥రాలలో ఈ గనుల నష్టం దాదాపు రూ॥400 కోట్లకు చేరుకున్నది.



1990లో ఆర్థిక సంస్కరణలు (ఎల్‌పీజీ విధానాలు) భారత దేశంలో అమలు చేసిన నుంచి ఏదో రూపంలో కార్మికవర్గం పై దాడి జరుగుతూనే ఉంది. కార్మిక అనుకూల చట్టాలను అమలుకు నోచుకోకుండా చేసారు. ఇది చాలదన్నట్లు యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాల సవరణకు తెగబడ్డున్నారు. ఈ విధానాల విషయంలో యు.పీ.ఏ., ఎన్.డీ.ఏ.లు బొమ్మా, బొరుసులే తప్పా నాణెం ఒక్కటే. ముఖ్యమంత్రి స్థాయిలో 'లేబర్ అధికారులు చీటికి మాటికి పరిశ్రమల విజిట్ చేయరాదని" హుకుం జారి చేస్తున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా "కార్మిక చట్టాల సవరణను ఆపాలి, వాటిని పకడ్బంధిగా అమలు చేయాలనే" డిమాండ్‌తో కార్మికులు సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నారు.

### బొగ్గు గనుల్లో ఎమర్జెన్సీ వాతావరణం

సింగరేణి బొగ్గుగనుల్లో ఎమర్జెన్సీ వాతావరణం తలపిస్తోంది. కార్మికులపై రకరకాల ఆంక్షలు విధించి అధిక పనిభారం మోపడంతో బిక్కుబిక్కుమంటున్నారు. సూపర్ వైజర్లపై ఒత్తిడి పెంచడంతో పరోక్షంగా కార్మికులపై భారం పడుతున్నట్లు కార్మికవర్గం చెబుతుంది. గతంలో ఉన్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఇపుడు పూర్తిగా కనుమరుగయ్యాయని కార్మికులు వాపోతున్నారు.

### గనుల్లో ఏం జరుగుతుంది..

భూపాలపల్లి, గోదావరిఖని, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాలలో సింగరేణి అధికారులు గనుల్లో ఆంక్షలు విధించారు. నిమిషం ఆలస్యం అయినా లోపలికి వెళ్ళేందుకు అనుమతి లేకుండా నిరాకరించడమే కాకుండా మ్యాన్‌రైడింగ్ సిస్టం వద్ద గేట్లకు తాళం వేస్తున్నారు. పలు గనుల ప్రధాన ద్వారాలకు సైతం తాళాలు వేస్తున్నారు. జనరల్ మజ్దూర్ కార్మికులను పలానా పనిలో అని ఖచ్చితత్వం లేకుండా ఇష్టం వచ్చిన పనులు చేయిస్తున్నట్లు కార్మికులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. గతంలో గనుల్లో స్వేచ్ఛ ఉండేదని, ప్రస్తుతం అది కరువైందని వాపోతున్నారు. గాలి, నీరు, ఇతర సౌకర్యాలు మెరుగైన విధంగా ఉండేవని చెబుతున్నారు. కానీ, ప్రస్తుతం అందుకు భిన్నంగా పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా గనుల్లో ఎమర్జెన్సీ వాతావరణం తలపిస్తున్నదని కార్మికులు స్పష్టంగా ప్రకటిస్తున్నారు.

### మాట్లాడితే చార్జీషీట్లు, సస్పెన్షన్‌లు

ఏదైన సమస్య పరిష్కారం కోసం కార్మికులు, సూపర్ వైజర్లు అధికారులను ప్రశ్నిస్తే వారికి చార్జీషీట్లు, సస్పెన్షన్ ఆర్డర్‌లు ఇస్తున్నారని పలువురు కార్మికులు చెబుతున్నారు. గేట్లకు తాళాలు వేసన్లా ఎవరూ రావద్దు...ఎవరు పోవద్దు...అన్నట్లుగా నిర్బంధిస్తున్నారు. సూపర్ వైజర్లపై తీవ్రమైన ఒత్తిడి తీసుకరావడంతో వారు కార్మికులపై విరుచుకుపడుతున్నారు. వెరసి 8గంటలు పని చేయాల్సిన కార్మికులు ఒక్కో సారి 9గంటల వరకు పని చేయాల్సి వస్తుంది. గతంలో ఇచ్చిన టార్గెట్ పూర్తయితే కార్మికులు గని బయటకు వచ్చే పరిస్థితి ఉండేది. కానీ, నేడు పని గంటలు ఖచ్చితంగా ఉండేందుకు యాజమాన్యం ఆంక్షలు విధించింది. దీంతో మానసిక ఆందోళనకు కార్మికులు గురి అవుతున్నారు.

### రక్షణ గాల్లో...

జయశంకర్, భద్రాద్రి, ఖమ్మం, మంచిర్యాల, కుమ్రం భీం, పెద్దపల్లి జిల్లాల్లో సింగరేణి విస్తరించి ఉంది. 33 భూగర్భ గనులు, 15 ఉపరితల గనులు ఉన్నాయి. బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి

యాజమాన్యం పని స్థలాల్లో ఆశించిన స్థాయిలో రక్షణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. పని స్థలాలకు వెళ్లి తిరిగి వచ్చే వరకు కార్మికుల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది. ఒక్కో గని ప్రమాదంలోనే 27 మంది చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. 2005 నుంచి 2015 వరకు వివిధ ఏరియాల్లో 125 మంది కార్మికులు వేర్వేరు గని ప్రమాదాల్లో మృతి చెందడం కలవరపరిచే విషయమే. 120 ఏళ్ళకు పైగా చరిత్ర ఉన్న సింగరేణి ప్రమాదాల సంఖ్యను తగ్గించుకుంటూ వస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో జరగకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవడం లేదు. యాంత్రీకరణ అందుబాటులోకి వస్తున్నా...మానవశక్తిపై ఆధారపడి పని చేసే స్థలాల్లో సరైన రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా కార్మికులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా మరి కొంత మంది క్షతగాత్రులై వికలాంగులుగా మిగిలి పోతున్నారు.

**అంతంత మాత్రమే రక్షణ...**

పని స్థలాల్లో సరైన రక్షణ చర్యలు చేపట్టాల్సిన సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. అధికారుల నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణమవుతుంది. సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపైనే దృష్టి సారించి రక్షణకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోతున్నాయి. పై కప్పు కూలే ప్రమాదం ఉందని కార్మికులు అనేక సందర్భాలలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇలాంటి ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సింగరేణిలో అనేకం. గనిలో విష వాయువులు వెలువడిన సమయంలో కూడా కార్మికులను పంపించడం వల్ల చనిపోయిన సందర్భాలున్నాయి. బొగ్గు పొరలను పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో జరిగిన ప్రమాదాలు కూడా ఎక్కువే. భూపాల్‌పల్లి ఏరియాలోని కే.టీ.కే. 5వ గనిలో మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ (ఎం.జి.టి.)గా పని చేస్తున్న బండారి వెంకటేష్ గత సం॥రం గని ప్రమాదంలో మృతి చెందాడు. గనిలో విధులు ముగించుకొని భూ ఉపరితలానికి బయలు దేరి వస్తుండగా...బొగ్గును రవాణా చేసే బెల్టులు తాకడంతో చనిపోయాడు. గని లోపల రక్షణ చర్యలు పటిష్టంగా లేకపోవడమే ప్రమాదానికి కారణం. భూపాలపల్లి ఏరియాలోని కే.టీ.కే. 1వ గనిలో సపోర్టుమెన్‌గా పని చేస్తున్న నర్సయ్య రెండేళ్ళ కిందట గనిలో జరిగిన ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. పని స్థలంలో పై కప్పుకు సపోర్టులు పెడుతున్నాడు. ఈ క్రమంలో బొగ్గు పెళ్ళ మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సైడ్‌వాల్‌కు రక్షణ చర్యలు అంతంత మాత్రంగా ఉండటంతో ప్రమాదం సంభవించింది.

**రక్షణ నిరంతర ప్రక్రియగా సాగడం లేదు.**

బొగ్గు బావుల్లో రక్షణ అనేది నిరంతర ప్రక్రియగా ఉండాలి. కేవలం వార్షికోత్సవాలకు మాత్రమే బొగ్గు బావులను ముస్తాబు చేస్తున్నారు. రక్షణ చర్యలు లేకపోవడంతో కార్మికుల మరణాలు, ప్రమాదాలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. అండర్ గనుల్లో ఆరోగ్యకరమైన గాలి, శుద్ధి చేసిన నీరు, మైన్స్ రూల్స్ ప్రకారం శానిటేషన్ తదితరాలు అమలు కావడం లేదు. ఉపరితల గనుల్లో కూడా ప్రమాదాల సంఖ్య పెరుగుతుంది. రాత్రి వేళల్లో యంత్రాలు నడిపే సమయాల్లో సరైన రక్షణ చర్యలు పాటించడం లేదు. అంతేకాదు క్వారీలు ఏర్పాటు చేసే రహదారుల్లో భద్రత ప్రమాణాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

చాలామంది కార్మికులు 50 సం॥రాలకు పైబడిన వారు వుండడం వల్ల సహజంగానే బీ.పీ., షుగర్ మొదలైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పని పరిస్థితులను, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచాలి. మరణాలను, ప్రమాదాలను నివారించాలి.

**గడిచిన పదేళ్ళలో జరిగిన ప్రమాదాలు**

| ఏరియా | మరణాలు | తీవ్ర గాయాలు | స్వల్ప గాయాలు |
|---|---|---|---|
| శ్రీరాంపూర్ | 21 | 1011 | 1542 |
| మందమర్రి | 17 | 485 | 1251 |
| బెల్లంపల్లి | 3 | 101 | 333 |
| రామగుండం-1) | 13 | 685 | 1383 |
| రామగుండం-2 ) | 9 | 358 | 568 |
| రామగుండం-3 ) | 18 | 282 | 421 |
| భూపాలపల్లి | 9 | 481 | 1342 |
| అడ్రియాల | - | 13 | 14 |
| కొత్తగూడెం | 15 | 189 | 447 |
| మణుగూరు | 16 | 102 | 58 |
| ఇల్లెందు | 4 | 44 | 154 |

**సింగరేణిలో భారీగా నిరుద్యోగం**

ఓపెన్‌కాస్ట్ గనుల విస్తరణ, యాంత్రీకరణ ఫలితంగా దేశవ్యాప్తంగా బొగ్గు సంస్థలలో కార్మికుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. పెద్దెత్తున ఓపెన్‌కాస్ట్‌ల వల్ల పర్యావరణ జీవన విధ్వంసం కొనసాగుతున్నది. 100 శాతానికి పైగా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగింది. మరో వైపు భారీగా కార్మికుల సంఖ్య తగ్గింది. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టీకరణ బొగ్గు సంస్థలలో విచ్చల విడిగా పెరుగుతూ పోతుంది. వాస్తవ పరిస్థితిని ప్రశ్నించే వారు, పరిశీలించేవారే లేని పరిస్థితి. 2011 సం॥ నుంచి కోల్ ఇండియా పరిస్థితి పరిశీలించినట్లయితే 2011-12లో కోల్‌ఇండియాలో 3,71,546 మంది కార్మికులు, అధికారుల సంఖ్య ఉండగా వుత్పత్తి లక్ష్యం

435.84 మిలియన్ టన్నులు ఉంది. అదే 2014-15 సం॥నాటికి కార్మికుల సంఖ్య 40 వేలు తగ్గింది. 3,33,097 మంది కార్మికులతో 494.238 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడం జరిగింది. 2016 మార్చి నాటికి 3లక్షల మంది కార్మికులకు తగ్గించారు. ఉత్పత్తి 545 మిలియన్ టన్నులకు పెరిగింది. 110 మిలియన్ టన్నుల బొగ్గు ఎక్కువగా ఉత్పత్తి జరుపగా, గత ఏడాదితో పోలిస్తే 63వేల మంది కార్మికులు తగ్గిపోయారు. అతి తక్కువ మంది కార్మికుల సంఖ్యతో అత్యధిక ఉత్పత్తిని సాధించడం జరిగింది. ఇక ఉద్యోగాల విషయానికొస్తే, ఉద్యోగ నియామకాలు 10శాతం కూడా జరుగలేదు. ఉద్యోగాల నియామకాలు అసలుకే లేవు. అంతంత మాత్రంగానే నియామకాలు జరుగుతున్నాయి.

**సింగరేణిలో అనూహ్యంగా పెరిగిన వృద్ధిరేటు...తగ్గిన కార్మికుల సంఖ్య**

సింగరేణిలో వృద్ధిరేటు 2015-16 ఆర్థిక సం॥ం ముగింపు వచ్చే నాటికి 18శాతం పెరిగింది. ఇక్కడ పరిశీలించినట్లయితే 1989-90లో ఉత్పత్తి కేవలం 17 మిలియన్ టన్నులు ఉండగా, కార్మికుల సంఖ్య ఒక లక్షా 16వేల ఉండేది. అది ఉత్పత్తి 45 మిలియన్ టన్నులకు పెరిగినప్పటికీ కార్మికుల సంఖ్య 2011-12 నుంచి 67,615 మంది నుంచి 58,837కు కార్మికుల సంఖ్య పడిపోయింది. అది 2020 నాటికి 33వేలకు కార్మికుల సంఖ్య కుదించే అవకాశం ఉంది. 2015-16లో 58వేల పై చిలుకు కార్మికుల సంఖ్య కంటే ఉత్పత్తి 60 మిలియన్ టన్నులకు పెరిగింది. అయినప్పటికీ కార్మికుల సంఖ్య కుదించుకుపోతూనే ఉంది. ఎంతో మంది పదవీ విరమణ తదితర కారణాల చేత తగ్గినప్పటికీ నియామకాల సంఖ్య పెరగడం లేదు. ఈ మధ్య కాలంలో వారసత్వ ఉద్యోగాల కొరకు జూన్ 2017లో సింగరేణి కార్మికులు సమ్మెను కొనసాగించారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలోని తెలంగాణ, పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తి భారీగా జరుగుతున్నప్పటికీ, అందులో ఉద్యోగాల కొరత మాత్రం బొగ్గు గనుల మీదనే ఆశలు పెట్టుకున్న ఆ యా ప్రాంతాల 'నిరుద్యోగ యువత' ఆశలపై నీళ్ళు చల్లినట్లు పరిస్థితి ఉంది.

ఇంతేకాదు, ఏక కాలంలో ఓపెన్‌కాస్ట్ గనులలో, ఇతర డిపార్టుమెంటులలో దేశవ్యాప్తంగా లక్షా 25వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తుండగా, సింగరేణిలో 26వేల మంది వరకు ఔట్ సోర్సింగ్‌లో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నవారు ఉన్నారు.

**గుడ్డు, రొట్టె, బెల్లం, నూనెలు బంద్**

గనుల్లో పని చేసే కార్మికులు అనారోగ్యాల పాలుకాకుండా వుండడానికి గతంలో గుడ్డు, రొట్టె, బెల్లం, నూనె ఇచ్చే వాళ్ళు. గనుల్లోకి దిగే ముందు, ఎక్కిన తరువాత కార్మికులకు వీటిని ఇచ్చేవారు. వీటివల్ల దుమ్ము, దూళి నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని భావించేవారు. కానీ, గత రెండు దశాబ్దాలుగా వీటిని బందు చేసారు. గతంలో ఇచ్చే డస్ట్ ప్రూఫ్‌లు కూడా ఇవ్వడం లేదు. దీంతో కార్మికులు రోగాల పాలవుతున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు, గనులశాఖ నిబంధనలను పాటించాలని, కార్మిక సంక్షేమాన్ని పట్టించుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సింగరేణి ప్రాంతంలో కార్మికులకు ఇచ్చే (రక్షణ కొరకు) బూట్లను నాసిరకం వాటిని సింగరేణి యాజమాన్యం అందించింది. దీనిలో వేలాది రూ॥ల కుంభకోణం జరిగింది.

నిత్యావసర వస్తువుల ధరలు అడ్డు అదుపూ లేకుండా పెరుగుతున్నాయి. ధరలకు అనుగుణంగా వేతనలు పెరగడం లేదు. 15వ జాతీయ కార్మిక సదస్సు (ఐ.ఎల్.సి.) ప్రకారం ముగ్గురు సభ్యులు గల కుటుంబానికి రోజుకు 2,700 కేలరీలతో కూడిన ఆహారం కావాలి. ఏడాదికి 18 రోజుల వస్త్రం కావాలి. ఆహారం మరియు వస్త్రాలపై పెట్టే ఖర్చుపై 10శాతం ఇంటి అద్దె రూ॥20 శాతం విద్యుచ్ఛక్తికీ, ఇందనాలకూ కావాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పైన పేర్కొన్న నాలుగు అంశాలకు 25శాతం అదనంగా జోడించాలి. దేశంలోని 7 నగరాలలోని (ఢిల్లీ, ముంబాయి, చెన్నై, కలకత్తా, బెంగుళూరు, భువనేశ్వర్, హైదరాబాద్) రిటైల్ ధరల ఆధారంగా 15వ ఐ.ఎల్.సీ. మరియు సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం నైపుణ్యం లేని కార్మికునికి నెలకు 20,861 రూ॥లకు అంచనా వేయడం జరిగింది. దీనికి భిన్నంగా 7వ వేతన సంఘం రూ॥18,000 లకు సిఫారసు చేసింది. అది కాదని మాజీ కేంద్ర కార్మికమంత్రి బండారు దత్తాత్రేయ నెలకు రూ॥ 6098 ఖరారు చేశామని 2015 సెప్టెంబర్ 1న ప్రకటించాడు.

కార్మికవర్గం ఎదుర్కొంటున్న పైన తెలిపిన సమస్యలపై ఎమర్జెన్సీ అనంతర కాలంలో కార్మికవర్గం 'సింగరేణి కార్మిక సమాఖ్య' నాయకత్వంలో పోరాడి అనేక విజయాలు సాధించింది. కార్మికవర్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, యాజమాన్య నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా మిలిటెంట్ ఆందోళనలు జరిపి తమ హక్కులు సాధించుకున్నారు. పిట్ కమిటీల మాటే చెల్లుబాటు అయ్యేలా ఆ రోజు పోరాడారు. ఈ స్ఫూర్తితో కోల్ ఇండియా బొగ్గుగని కార్మికులు కూడా పోరాడి విజయాలు సాధించారు. పాలకవర్గాలు పాశవిక హత్యాకాండతో 'సింగరేణి కార్మిక సమాఖ్య'ను అణచివేయడంతో నేడు కార్మికవర్గానికి పోరాడే నాయకత్వం లేకపోగా తాము సాధించిన హక్కులు అన్ని కోల్పోయారు. కార్మికవర్గం ఈ విషయాన్ని ఈరోజు త్వరత్వరగా గుర్తిస్తోన్నది.

అక్టోబర్ 5న సింగరేణిలో గుర్తింపు సంఘం కోసం ఎన్నికలు జరగబోతున్నాయి. ఈసారి ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రమేయం పెరిగి, శాసనసభకు జరిగే ఎన్నికల్లాగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

చివరకు ముఖ్యమంత్రి కూడ కార్మికవర్గంను ఉద్దేశించి ప్రకటనలు చేస్తున్నాడు. మా కాలంలోనే సింగరేణిని అభివృద్ధి చేసామని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. వారసత్వ ఉద్యోగాల డిమాండ్ పైన ప్రచారం కేంద్రీకరించి ఉంది. టిఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన వారసత్వ ఉద్యోగాల జీ.వో ను హైకోర్టు కొట్టివేయడంతో, ఈ సమస్యపై కార్మికులు ఆందోళనతో ఉన్నారు. టి.ఆర్.ఎస్. పార్టీ అనుబంధ సంఘం 'తెలంగాణా బొగ్గుగని కార్మికుల సంఘం' (టి.బి.జి.కె.ఎస్.) ఈ డిమాండ్‌పై మరొక్క మారు అధికారాన్ని సంపాదించవచ్చని భావించింది. కాని హైకోర్టు కొట్టివేయడంతో కార్మికుల్లో ఆ సంఘం పట్ల వ్యతిరేకత పెరుగుతున్నది. అందుకే ముఖ్యమంత్రి కేసిఆర్ కార్మికులకు వాగ్దానం చేస్తూ 'కారుణ్య ఉద్యోగాలు' నియమిస్తానని, అవి వద్దనుకునే వారికి 25లక్షల మొత్తం లేదా నెల జీతం ఇస్తానని ప్యాకేజీ ప్రకటించాడు. టి.ఆర్.ఎస్. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ వాగ్దానాలు చేస్తున్నది కాని దానికి కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదు. జాతీయ సంఘాలైన ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టి.యు.సి.లు కలిసి ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. వారసత్వ ఉద్యోగాలు రద్దు చేసిన సమయంలో యాజమాన్యంతో కలిసి ఒప్పందం చేసుకొని కార్మికులకు ద్రోహం చేసాయి. అలాంటి సంఘాలు ఈ రోజు వారసత్వ ఉద్యోగాలపై మాట్లాడే అర్హతను కోల్పోయాయి. ఇక ఎచ్.ఎం.ఎస్., బి.ఎం.ఎస్., ఎ.ఐ.ఎఫ్.టి.యు లాంటి సంఘాలు ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి.

జాతీయ, స్థానిక కార్మిక సంఘాలు అన్ని కార్మిక వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయి. సింగరేణి ప్రైవేటీకరణకు, ఓపెన్‌కాస్ట్ గనుల నిర్మాణానికి, కార్మికుల తగ్గింపుకు యాజమాన్యానికి పూర్తి మద్దతునిస్తున్నాయి. కార్మికుల పైన అధిక శ్రమభారాన్ని పెంచడంలో, క్రమశిక్షణ పేరిట కార్మికులను తొలగించే కార్మిక వ్యతిరేక విధానాలకు మద్దతునిస్తున్నాయి. 'సింగరేణి కార్మిక సమాఖ్య' విప్లవకర ట్రేడ్ యూనియన్ పని చేసిన రోజుల్లో పై సమస్యలపై కార్మికుల తరపున పోరాడి కార్మికవర్గ కోర్కెలను సాధించడంలో బ్రహ్మాండమైన కృషి చేసి విజయం సాధించింది. నేడు అలాంటి విప్లవకర ట్రేడ్ యూనియన్ ఉనికి లేకపోవడంతో కార్మికులు ఆ వెలితిని ఎదుర్కొంటున్నారు. మళ్ళీ విప్లవకర ట్రేడ్ యూనియన్‌ను కార్మికులు నిర్మించుకోవడం ద్వారానే కార్మికులు పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి తమ హక్కులు సాధించుకోగలరు.

రష్యా సోషలిస్టు విప్లవానికి వందేళ్ళు నిండినాయి. ఈ స్ఫూర్తితో కార్మికశక్తి ఐక్యమై రాజకీయ పార్టీలకు అతీతంగా రాజకీయ శక్తిగా ఎదగాలి. ఎందుకంటే కేవలం కార్మికవర్గం మాత్రమే సమీప వర్గాలకు వర్గ సంకెళ్ళ నుంచి స్వేచ్ఛ ప్రసారిస్తుంది. అందుకని పోరాడి స్వేచ్ఛను సంపాదించుకోవాలి. ○

*(..........37 పేజీ తరువాయి)*

అసంతృప్తితో ఉన్న రైతాంగాన్ని సమీకరించి పెద్దెత్తున ఆందోళనలు నిర్మిస్తూ వాటిని ప్రజాయుద్ధంతో జోడించండి! విప్లవ, ప్రజాస్వామిక సంఘాలు, శక్తులు, వ్యక్తులు మరియు విశాల ప్రజారాసులను సమీకరిస్తూ విశాల ప్రాతిపదికన బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించండి!

★ బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా విప్లవ శక్తులను, ప్రజాస్వామికవాదులను, ప్రగతిశీల శక్తులను, సంస్థలను, మైనార్టీ ప్రజలను, లౌకికవాదులను కలుపుకొని బలమైన సమరశీల ఉద్యమాన్ని నిర్మించండి!

★ ఆదివాసీ, దళిత, మహిళా, మతపరమైన మైనారిటీల సమస్యలపై కేంద్రీకరించి ఉమ్మడి వేదికలపై ప్రజల్ని సంఘటితం చేస్తూ విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించండి!

★ ప్రచండ-అవాకిన్‌ల నయా రివిజనిజంతో సహా రకరకాల రివిజనిజం, గాంధీయిజం, చట్టబద్ధ పోరాటవాదం, సంస్కరణవాదం, ఆర్థికవాదం, పార్లమెంటరిజం, పోస్ట్ మోడర్నిజం వంటి బూర్జువా సిద్ధాంతాలను ఎండగట్టండి! మార్క్సిజం-లెనినిజం- మావోయిజమే సామ్రాజ్యవాదాన్ని భూస్థాపితం చేసి ప్రపంచ పీడిత జాతుల, ప్రజల విముక్తి చేసే ఏకైక సిద్ధాంతమని చాటిచెప్పండి!

★ విప్లవోద్యమ ప్రాంతాల్లో మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్న ప్రభుత్వ కిరాయి పోలీసు, కమాండో, పారామిలటరీ బలగాలకూ, రాజ్య ప్రాయోజిత విప్లవ ప్రతీఘాతక సంస్థలూ, ముఠాల రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజల్ని, ప్రజాస్వామిక శక్తుల్ని కదిలించి పోరాడండి! బలమైన ప్రజా ప్రతిఘటనా ఉద్యమాన్ని నిర్మించండి!

★ జాతులకు స్వయంనిర్ణయాధికారంతో సహా విడిపోయే హక్కు కోసం పోరాడుతున్న కశ్మీర్, నాగాలాండ్, అసోం, మణిపూర్ తదితర జాతి విముక్తి పోరాటాలపై, ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్న బోడోలాండ్, గూర్ఖాలాండ్ వంటి ఉద్యమాలకు మద్దతుగా పెద్దెత్తున ప్రజలను కదిలించండి!

★ ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు మద్దత్తుగా ప్రజల్ని కూడగట్టండి! వాటి నుంచి భారత విప్లవానికి మద్దతును సమీకరించండి!

**విప్లవాభినందనలతో,**

**కేంద్రకమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# నేరెళ్ళ దళితులపై ప్రభుత్వ, ఇసుక మాఫీయ హత్యాకాండ

సిరిసిల్ల రాజన్న జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల శివారులో ఎరుకుల కులానికి చెందిన 55 ఏండ్ల బదనపురం భూమయ్య రామచంద్రాపురం– హనుమాన్ గుడి దగ్గర– బస్‌స్టాప్ ప్రాంతంలో జులై 2న ఒక ఇసుక టిప్పర్ ఢీ కొనడంతో మరణించాడు. గత రెండు సంవత్సరాల కాలంలో ఇసుక లారీలు ఢీ కొనడం వల్ల 5గురు చనిపోయారు. అందులో నేరెళ్ల గ్రామానికి చెందిన గంధం మల్లేశం (58), బొల్లవేని రమేష్ (45), వడ్ల రవి (31), బంగారపు భూమయ్య (55), జిల్లెలకు చెందిన కారంగుల కరుణాకర్ రావు (32) ఉన్నారు, 46మంది గాయాలపాలయ్యారు. ఇలా చనిపోయిన సందర్భాలలో కాంట్రాక్టర్లు, తాము లారీ యజమానులం కాదని స్థానిక టీ.ఆర్.ఎస్. నాయకుల, పోలీసుల మద్దతుతో తప్పించు కుంటున్నారు. కావాలంటే కోర్టులో కేసు వేసుకొమ్మని చెబుతున్నారు. గతంలో ఇదే తరహాలో సంఘటనలు జరిగినపుడు ప్రజలు ఆందోళన చేసి, 1. స్పీడ్ బ్రేకర్లు ఉండాలి. 2. స్పీడ్ నియంత్రించాలి. 3. డ్రైవర్లు మద్యం తాగి నడపకుండా పరీక్షలు చేయాలి. 4. ఆ ప్రాంతం నుంచి లారీలు రాకుండా నిలిపివేయాలని డిమాండ్ చేసారు. ఆ ఆందోళనకు అక్కడి రెవెన్యూ అధికారులు, తహశీల్దారులు, పోలీసులు డిమాండ్లకు తలొగ్గినట్లు నటించారు కానీ వాళ్లు ఏమి చేయలేకపోయారు. ఈ లారీల ప్రమాదం నుండి తప్పించుకోవడానికి ప్రజలు అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డుమీద పెట్టడానికి ప్రయత్నిస్తే విగ్రహానికి కూడా అనుమతి ఇవ్వలేదు. ఇసుక లారీలు మాత్రం ఎటువంటి ఆటంకం లేకుండా స్థానిక రాజకీయ నాయకులు, పోలీసుల అండతో రోజు తిరుగుతున్నాయి. పేద ప్రజల ప్రాణాలంటే లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారు. ప్రశ్నించిన వారిని జైలుకు పంపడమో, చంపడమో ఏదో ఒకటి జరుగుతుంది. ఇక్కడి వనరులు దోచుకుంటున్నారని అన్నందుకే ఈ దాడులకు పాల్పడుతున్నారు.

ఇదే క్రమంలో జులై 2న భూమయ్య చనిపోయిన విషయం తెలియడంతో నేరెళ్ళ, జిల్లెల, రామచంద్రాపురం గ్రామాల ప్రజలు ఆవేదనతో తమ ప్రాణాలను తీస్తున్న లారీలకు నిప్పు పెట్టగా, నాలుగు లారీలు కాలిపోయాయి. మరో 5లారీలు అద్దాలు పగిలాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానిక ఎస్.ఐ. సైదారావు కానిస్టేబుళ్లతో సంఘటన స్థలానికి వచ్చి, అక్కడి ప్రజలపై లాఠీచార్జీ చేయడంతో, 'మేము శవాలుగా మారుతుంటే స్పందించని వారు మమ్మల్ని కొట్టడమేమిటని' నిలదీశారు. దీంతో ఎస్.ఐ. పై అధికారులకు సమాచారం ఇచ్చాడు. జిల్లా ఎస్.పి. విశ్వజిత్ కంపాటి, సి.ఐ. శ్రీనివాసరావు పోలీసు బెటాలియన్‌తో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అయిననూ ప్రజలు చెదిరిపోకుండా ఆరు గంటల పాటు రోడ్డుపైన కూర్చున్నారు. కాలుతున్న లారీల మంటలను ఆర్పడానికి వచ్చిన ఫైర్ ఇంజన్లను సహితం ప్రజలు అడ్డుకున్నారు. ఆయిల్ ట్యాంకులు పేలిపోతాయనడంతో చివరకు వదిలారు. ఇలా పోలీసులను, ప్రభుత్వాన్ని లెక్కచేయని ప్రజలపై పోలీసులకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

మరునాడు జులై 3న నేరెళ్ల, జిల్లెల, రామచంద్రాపురం గ్రామాల ప్రజలు సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమండ్ చేస్తూ బైటాయించారు. ఎవరూ పట్టించుకున్నది లేదు. అన్నింటికి పోలీసులే సమాధానాలు చెపుతున్నారు. ప్రజలు వ్యక్తం చేసిన ఆగ్రహం ప్రభుత్వానికి, పోలీసులకు చట్టవ్యతిరేకమైనదిగా అనిపించింది. వెంటనే స్థానిక పోలీసులు లారీ దగ్ధం కేసులో అనుమానితులు అనే పేరుతో నేరెళ్ల గ్రామంలోని ఇండ్లలోకి అర్ధరాత్రి బలవంతంగా సివిల్ డ్రెస్‌లో చొరబడి అరెస్టు చేసి, ఎదురుతిరిగిన కుటుంబ సభ్యులతో 'ఎస్.పి. విశ్వజిత్ కంపాటి వారితో మాట్లాడిన తర్వాత పంపిస్తామని' చెప్పి కారులో 8మంది యువకులను తీసుకుపోయారు. వారిలో పెంట బాలయ్య(మాజీ సర్పంచ్), కోలా హరీష్, చెప్యాల బాలరాజ్, పసుల ఈశ్వర్, గంధం గోపాల్, బత్తుల మహేష్, చీకటి శ్రీనివాస్, గణేశ్‌లు ఉన్నారు. సాయంత్రమైన తిరిగి వారిని ఇంటికి పంపియ్యక పోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు జూలై 6న ఎస్.పి.ని కలువగా 'మీరు గనుక మీ పిల్లలకోసం రోడ్డెక్కితే మీ పిల్లలు శవాలుగా వస్తార'ని బెదిరించాడు.

పట్టుకెళ్లినప్పటి నుండి పోలీసులు వరుసగా నాలుగు రోజులు వారిపై థర్డ్ డిగ్రీ పద్ధతులు ప్రయోగించారు. కడుపులో తొక్కడం, అనేక రకాలుగా దూషిస్తూ కొట్టడం, ఆసనాలలో కర్రలు దింపడం, చెవులకి, మర్మాంగాలకు కరెంట్ షాకులు పెట్టి, వేడి నీళ్ళు పోసుకుంటు కొట్టారు. ఈ విషయాలను కోర్టులో, మీడియాతో చెబితే మీ భార్యలపై బ్రోతల్ కేసులు పెడతామని, మిమ్మల్ని ఎన్‌కౌంటర్లో కాల్చిచంపుతామని బెదిరించి, 8వ తేదీన ఎనిమిది మందిని సిరిసిల్ల కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపారు. వారిపై తీవ్రగాయాలు ఉండడంతో జైలర్ జైల్లో తీసుకోకపోవడంతో, పోలీసులు మెడికల్ సర్టిఫికెట్ తీసుకువచ్చి జైలుకు పంపారు. జ్యుడిషియల్ కస్టడీలోకి తీసుకునేందుకు నిరాకరించడంతో అపుడు మాత్రమే ఇది బయటి ప్రపంచానికి తెలిసింది.

నేరెళ్ల సంఘటనపై దాదాపు 150 సంఘాలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, హక్కుల సంఘాలు, బయటి ప్రపంచానికి తెలిపారు. ఘటనకు బాధ్యులైన ఎస్.పి. కంపాటి పై ఎస్సి/ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, హత్యానేరం కేసు పెట్టాలని, మొదటగా అతన్ని సస్పెండ్ చేయాలని, దళిత సంఘాల

నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తెరచిన రౌడీ షిట్లపైన, బైండ్ ఓవర్‌లపైన పూర్తి విచారణ జరిపించాలనే డిమాండ్‌తో జూలై 31న 'చలో సిరిసిల్ల'కు పిలుపునిచ్చారు. పోలీసులు 'చలో సిరిసిల్లా' కార్యక్రమాన్ని అడ్డుకున్నా, ఢిల్లీ నుండి వచ్చిన లోకసభ మాజీ స్పీకర్, కాంగ్రెస్ నాయకురాలు మీరా కుమార్‌ను మాత్రం అడ్డుకోలేక పోయినారు.

ఇంత జరిగినా, సోషల్ మీడియాలో ప్రపంచమంతా ప్రచార మయిన, ముఖ్యమంత్రి కేసీఆర్ నెల రోజుల వరకు స్పందించలేదు. తెలంగాణ ఉద్యమ కాలంలో పౌరహక్కుల సంఘానికే అధ్యక్షున్ని అవుతానన్న ముఖ్యమంత్రి 'బాధితులు దళితులని వారి నొసటిపై రాతలున్నాయా'? అని అడ్డంగా మాట్లాడాడు. పోలీసులు చట్ట ప్రకారమే నడుచుకోవడంలో కొంత అతిగా ప్రవర్తించారని మాత్రమే పోలీసు అధికారులకు వంత పాడుతున్నాడు. యువరాజు (కేటీఆర్) నేరెళ్ల సంఘటన జరిగి నెల రోజులయిననూ, తన సొంత నియోజకవర్గమైననూ ఆ సంఘటన తనకు ఇంతవరకు తెలువలేదని ప్రజలకు విచారం వ్యక్తం చేస్తూ, సరియైన వైద్యం అందిస్తామని అంటూ, జరిగిన సంఘటన దురదృష్టకరమని, దీనిని ప్రతిపక్షాలు, దళిత సంఘాలు, హక్కుల సంఘాలు మాత్రమే సమస్యను సృష్టిస్తున్నారని మసిబూసి మారేడుకాయ చేయ ప్రయత్నిస్తున్నాడు.

పాలకులు తమ బంధువర్గానికి ఏలాంటి ఆటంకం కల్గించకుండా పేద ప్రజలను, దళితులను హత్యలు చేస్తున్నారు. "బంగారు తెలంగాణ అంటూ బీరాలు పలుకుతున్న ఈ ప్రభుత్వం అక్రమాలు అడ్డుకున్నవారిని హత్యలు చేయడమేనా బంగారు తెలంగాణా! ఒక చావు మరిచిపోక ముందే మరొక చావు, వరుస ప్రమాదాలు, దాదాపు 45 మంది కొద్ది నెలలలోనే గాయపడినట్లు" అక్కడి ప్రజలు వెల్లడించారు. ఆగస్టు 2న ముస్తాబాద్ మండలం గన్నెవానిపల్లెలో గన్నె శంకరయ్య అనే రైతు అదే రీతిలో ఇసుక లారీ ఢీకొని మరణించాడు.

సెప్టెంబర్ 5న సిరిసిల్లా జిల్లా నేరెళ్ల ఘటనలో బాధితుల గాయాలపై చికిత్స అందించిన ఆసుపత్రి వైద్యుల నివేదికకు, జైలు వైద్యాధికారి నివేదికకు తేడాలుండడంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రహస్య భాగాల్లో కమిలిన గాయాలున్నట్లుగా ఉందని, వైద్యులు ఇచ్చిన నివేదికను పోల్చి ఓ పట్టికను తయారు చేసి సమర్పించాలని ఏజీ ప్రకాశ్‌రెడ్డిని ఆదేశించింది. మానవహక్కుల సంఘం స్పందించి, ఎస్సీ, ఓబీసిలయిన 8మందిని అరెస్టులు చేసి చిత్రహింసలు పెట్టడాన్ని తప్పుబట్టింది. నాలుగు వారాల్లో తమకు నివేదిక ఇవ్వాలని డిజిపిని ఆదేశించింది. బాధితుల పిర్యాదు మేరకు జాతీయ ఎస్సీ కమీషన్ విచారణ చేపట్టి దాదాపు 3గంటల పాటు బాధితులు, పోలీసులు, గ్రామపెద్దలను విచారించారు. విచారణ అనంతరం రాములు మాట్లాడుతూ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి సిఫార్సు చేస్తామని తెలిపారు.

అయినప్పటికీ ప్రభుత్వం ఈవేవి పట్టించుకోకుండా ఈ సంఘటనలో ఎస్.ఐ. చట్టవిరుద్ధంగా ప్రవర్తించాడని, దర్యాప్తు సమయంలో దళితులను కొట్టాడని, అందుకే అయన్ను సస్పెండ్ చేశామని ఏజీ తెలిపారు. ముఖ్య సూత్రదారులైన ఉన్నతాధికారులను సస్పెండ్ చేయకుండా ఎస్ఐ పై మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**ఇసుక అక్రమ రవాణా లారీల అసలు గుట్టు:**

మిడ్ మానేరు ప్రాజెక్టు కింద 14 ఊర్లు మునిగిపోతున్నాయి. కొన్నింటికి నష్టపరిహారం, ఆర్ఆర్ ప్యాకేజీ కింద డబ్బు ఇచ్చినారు. ఒక్క మనువాడ ఊర్లో 18 సంవత్సరాలు నిండిన వారికి 8లక్షలు ఇచ్చి మిగిలిన గ్రామాలలో 2లక్షలు ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో రెండు ఇసుక రీచ్‌లు ఉన్నాయి. 1000 లారీలు అధికారికంగా మరొక 500 లారీలు అనాధికారికంగా తిరుగుతాయని ఒక అంచనా. ఇక్కడి నుండి వచ్చే ఇసుక లారీల లెక్క ఎవరికీ తెలియదు. ఇసుక తవ్వకాలు గత కొన్ని సంవత్సరాలుగా యధేచ్చగా జరుగుతున్నాయి. రోజు వందల లారీలు నేరెళ్ళ నుంచి హైదరాబాద్‌కు పోతాయి.

కేసీఆర్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న 'ఇసుక పాలసీ' విధానం ద్వారా కాంట్రాక్టర్లకు గోదావరి, కృష్ణ పరివాహక ప్రాంతాలలో, వాగులలో పర్మిషన్ ఇస్తూ రీచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీని వలన స్థానిక యువకులకు జీవనోపాధి దెబ్బతింటున్నదని, పర్యావరణం పాడైతున్నదని ప్రజలు, ప్రజాసంఘాలు వ్యతిరేకించి ననూ ఇసుక వేలం విధానాన్ని అమలు చేస్తున్నారు. తాము పెద్ద ఎత్తున నీటి పారుదల పథకాలు, డబుల్ బెడ్ రూం ఇళ్ళు, భవనాలు, రహదారులు చేపడుతున్నందువల్ల భారీగా ఇసుక అవసరం అవుతుందనే తప్పుడు ప్రచారంతో ఇసుక మాఫీయాను యధేచ్చగా కొనసాగిస్తున్నారు.

ఒక లారీ ఇసుక తవ్వుకు పోయినందుకు ప్రభుత్వం వసూలుచేసేది రూ. 8,250 కాగా ఒక లారీ ఇసుకను మార్కెట్‌లో అమ్మితే కనీసం 80వేల వరకు వస్తున్నది. దీనితో కాంట్రాక్టర్లు, అధికార పార్టీ నాయకులకు, అధికారులకు ఎంత ముడుపులు చెల్లిస్తున్నారో అర్థమవుతుంది. ఈ టెండర్ సంపాదించిన గోల్డ్‌లైన్ మినరల్స్ కంపెనీ నలుగురు యజమానులలో ఇద్దరు ముఖ్యమంత్రి కేసీఆర్ కు సన్నిహిత బంధువులు. వారిలో ఒకరు టిఆర్ఎస్ అధికార పత్రిక 'నమస్తే తెలంగాణ' మేనేజింగ్ డైరెక్టర్.

కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఇసుక మాఫీయా వారికి

*(మిగతా 27వ పేజీలో......)*

## దండకారణ్యం

# మాడ్‌లో దోపిడీ ప్రభుత్వం తలపెట్టిన రెవెన్యూ సర్వేను వ్యతిరేకించండి
# మాడ్‌లోని సకల సంపదలపై ఆదివాసుల అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం పోరాడండి
# లూటీ సర్కార్‌ను తన్నితరుముదాం, జనతన సర్కారును కాపాడుకుందాం

**ప్రియమైన ప్రజలారా!**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రప్రభుత్వం మాడ్‌లో ఏప్రిల్ 21నాడు రెవెన్యూ సర్వేను (భూమి సర్వే/రాజస్వ సర్వేక్షణ్) ప్రారంభించింది. ఏప్రిల్ 21నాడు నారాయణపూర్ జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌లు పెద్దఎత్తున పోలీసు, రెవెన్యూ బలగాలతో ఆకబేడకు వచ్చి ఈ రెవెన్యూ సర్వేను ప్రారంభించారు. 1947 ఆగష్టు 15 తరువాత (అంటే అధికార మార్పిడి జరిగిన తరువాత) 70 ఏళ్ళయినప్పటికీ ఇప్పటివరకు మాడ్‌లో సర్వే జరగలేదనీ; అందుకే ఇప్పుడు రెవెన్యూ సర్వే చేస్తున్నామని ఆకబేడ సభలో కలెక్టర్ మాట్లాడాడు. మాడ్‌లో రైతుల ఆధీనంలో ఉన్న భూములను గుర్తించి శాశ్వతపట్టాలు అందించడం, ఆ పట్టాల ఆధారంగా ప్రభుత్వ బ్యాంకుల నుండి రైతాంగానికి రుణాలు అందజేయడం, ఇతర ప్రభుత్వ పథకాల లాభాల్ని రైతాంగానికి అందజేయడం ఈ రెవెన్యూ సర్వే లక్ష్యాలని నారాయణపూర్ జిల్లా కలెక్టర్ ఆకబేడ సభలో మాట్లాడాడు.

***మాడ్‌లో రెవెన్యూ సర్వే అవసరం ఏమిటి? రెవెన్యూ సర్వే ప్రకటిత లక్ష్యాలు నిజమేనా?***

***ఈ సర్వే ద్వారా దోపిడీ ప్రభుత్వం సాధించదలచిన లక్ష్యాలు ఏమిటి?***

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)- భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ తన ఉపగ్రహాల ద్వారా మాడ్‌పై చేపట్టిన టోపోగ్రాఫికల్ సర్వే 2016 నాటికే పూర్తయ్యింది. దీంతో మాడ్ భూభాగంలోని ప్రతి గుట్ట, చెట్టు, నది, వాగు, గ్రామం, దారి అన్నింటి గురించి ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉంది. గత 5-6 సంవత్సరాలుగా ఆధార్‌కార్డ్ లేకుంటే ప్రభుత్వ పథకాల ఫలితాలు ఏవీ అందవని, ఆధార్‌కార్డ్ లేని వాళ్ళంతా నక్సలైట్లేనని రకరకాల పుకార్లు వ్యాపింపజేసి, ప్రజల్ని భయాందోళనలకు గురిచేస్తూ, మాడ్‌లోని ప్రజలందరికీ ఆధార్‌కార్డులు అందించి వాటిద్వారా స్థానిక ఆదివాసులను కూడా నిరంతర నిఘాలోకి తీసుకెళ్ళింది ఈ దోపిడీ ప్రభుత్వం. ఆధార్‌కార్డులకు ముందు మాడ్‌లోని అత్యధిక ప్రజలకు ఓటర్ కార్డులుండేవి. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కల్ని సేకరించడమేకాకుండా, అంగన్‌వాడీల ద్వారా ప్రతినెల మాడ్‌లోని జనన-మరణాల లెక్కలను కూడా ఈ ప్రభుత్వం నమోదు చేస్తూనే ఉంది. మాడ్ నాలుగువేల చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగి ఉందని, ఇందులో 207 జనాభా ఉన్న గ్రామాలూ, 30 పాడులు (ప్రజలు వదిలేసిన గ్రామాలు/వీరాన్‌గ్రామ్) ఉన్నాయనీ, వీటిలో దాదాపు 35వేల జనాభా ఉందని ఈ ప్రభుత్వం ఇక్కడి స్థితి గురించి ప్రకటిస్తున్న స్థితిలో రెవెన్యూ సర్వే అవసరం ఏమిటి? టోపోగ్రాఫికల్ సర్వేద్వారా మాడ్ నైసర్గిక స్థితిగురించిన స్పష్టమైన రిపోర్టు తనవద్ద ఉండగా ఈ ప్రభుత్వానికి రెవెన్యూ సర్వే అవసరం ఏమిటి? ఈ దోపిడీ ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లుగా ఇక్కడ ప్రజల ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వడం కోసమే ఈ రెవెన్యూ సర్వేనా? ముమ్మాటికీ కాదు. మరయితే ప్రభుత్వ ప్రకటిత లక్ష్యాల వెనుక దాగిన నిజమైన లక్ష్యాలు ఏమిటి?

***రెవెన్యూ సర్వే వెనుక దాగిన నిజమైన లక్ష్యాలు ఏమిటి?***

గత 70 సంవత్సరాలుగా మాడ్ ప్రజల వ్యవసాయాభివృద్ధి కోసం ఈ దోపిడీ ప్రభుత్వాలు ఎలాంటి కృషి చేయని ఫలితంగా ఇక్కడి ప్రజల్లో అత్యధికులు ఇప్పటికీ పోడు వ్యవసాయమే చేస్తున్నారు. పోడు వ్యవసాయం ఫలితంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిస్సారమయిన భూమిని వదిలి మరోచోట పోడు నరుకుతారు. ఇలా ప్రతిగ్రామంలో ప్రజలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మార్చి-మార్చి తమ పరిసరాల్లోని కొండలను, అడవులను నరుకుతూ వ్యవసాయం చేస్తారు. అందులో ప్రధానంగా కోహాల, కొద్ద లాంటి తృణ ధాన్యాల్ని పండించుకుంటారు. మాడ్‌లోని కొన్ని గ్రామాల్లో కొద్దిమంది మాత్రమే స్థిర వ్యవసాయం చేస్తున్నారు. ఈ స్థిర వ్యవసాయం చేస్తున్న వాళ్లల్లో అత్యధికులు కేశ్‌కల్, భానుప్రతాప్‌పూర్, లోహండిగూడ పరిసరాల నుండి వలస వచ్చిన ఆదివాసులే. ఈ స్థితిలో రైతుల ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వడమే తమ నిజమైన లక్ష్యం అనుకుంటే పోడు వ్యవసాయం జరిగే కొండలన్నింటిపై-గుట్టలన్నింటిపై ప్రజలకు పట్టాలు ఇవ్వాల్సిందే. నిజానికి అలా చేయాలనుకుంటే రాజ్యాంగం 5వ షెడ్యూల్ ద్వారా, పెసా చట్టం ద్వారా ఆదివాసులకు కల్పించిన అధికారాలను అనుసరించి మాడ్ ప్రజలందరికీ తమ సమీప గ్రామ అడవులపైనున్న అధికారాల్ని గుర్తిస్తున్నామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒక ప్రకటన ద్వారా తెలియజేయవచ్చు. దానికోసం రెవెన్యూ సర్వే అవసరమే లేదు. కానీ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, ఈ రకంగా మాడ్ భూభాగంపై మాడ్ ప్రజలకున్న అధికారాలను

గుర్తించదలుచుకోలేదు. తద్విరుద్ధంగా 5వ షెడ్యూల్ ద్వారా రాజ్యాంగం కల్పించిన, పెసా చట్టం ద్వారా స్థానిక ఆదివాసులకు కల్పించిన అధికారాలను కాలరాయడం కోసం తలపెట్టిందే ఈ రెవెన్యూ సర్వే. పోడు వ్యవసాయం చేసే రైతులు సమిష్టిగానే పోడు నరుకుతారు కాబట్టి వ్యక్తిగతంగా ఇది నా భూమి అంటూ చెప్పుకోలేరు. ఈ స్థితిలో ఈ ప్రభుత్వం గ్రామ పరిసరాల్లోని కొద్దిపాటి సమతల భూముల్ని పొలాలుగా సాగు చేసుకునే అతికొద్ది మందికి, కొద్దిపాటి భూములకు మాత్రమే పట్టాలు కల్పించి, మిగతా అడవిని, కొండల్ని, గుట్టల్ని–మొత్తంగా మాడ్ భూమినంతటినీ ప్రజల నుండి లాక్కొని, తన గుప్పిట్లో పెట్టుకోవడం కోసమే ఈ రెవెన్యూ సర్వే. కేశ్‌కల్, భానుప్రతాప్‌పూర్, లోహండిగూడ ప్రాంతాల నుండి వచ్చిన ఆదివాసులకు కూడా ఈ సర్వేలో లాభించేది అత్యల్పమే. ఈ ప్రాంతాల నుండి వలస వచ్చిన పేదరైతులు, మధ్యతరగతి రైతుల్లో అత్యధికుల్లో తమ ఆర్థిక, సామాజిక స్థితిరీత్యా సమతల భూముల్ని సాగు చేసుకోలేక పోడు వ్యవసాయాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ ప్రాంతాల నుండి వలస వచ్చిన వారిలో ధనికరైతులు, మధ్యతరగతి రైతుల్లో ఒక సెక్షన్ మాత్రమే సమతల భూముల్లో సాగు చేస్తున్నారు. వీరిలో ఎవరైతే ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వగలుగుతారో వారికే, కొద్దిపాటి భూమికి పట్టాలు దొరుకుతాయి. కోహకమెట్ట పరిసరాల్లో స్థానికుల్లో అత్యధికులు సమతల భూముల్లో వ్యవసాయం చేస్తున్నప్పటికీ వారిలో పేద, మధ్యతరగతి రైతుల వద్దనున్న భూమి తక్కువే. ఈ స్థానికుల్లోని మధ్యతరగతి రైతుల్లో, ధనిక రైతుల్లో ఎవరయితే ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇస్తారో వారికే కొద్దిపాటి భూమికి పట్టాలు దొరకుతాయి. ఈ కొద్దిమందికి, కొద్దిపాటి భూమికి పట్టాలు ఇచ్చి మిగతా భూమినంతటినీ రెవెన్యూ భూమి, అటవీ భూమిగా ప్రకటించి, ప్రభుత్వం కబ్జా చేస్తుంది. రెవెన్యూ భూమిగా, అటవీ భూమిగా ప్రకటించే భూములను ప్రభుత్వం సామ్రాజ్యవాద, బహుళజాతి కార్పోరేట్లకు, దేశీయ బడా పెట్టుబడిదారీ కార్పోరేట్లకు మైనింగ్ అవసరాల కోసం కట్టబెడుతుంది.

రావుఘాట్ నుండి మొదలుకుని పక్కనే గడ్చిరోలిలో ఉన్న సూర్జాగఢ్ వరకు ఉన్న విశాల ప్రాంతాన్నంతటినీ సామ్రాజ్యవాద, బడా దళారీ పెట్టుబడిదారీ కార్పోరేట్లకు అప్పగించి మైనింగ్ హబ్‌గా మార్చనున్నాయి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు. దానిప్రకారం అంతాగఢ్–రావుఘాట్–నారాయణపూర్–సోన్‌పూర్–గార్పా–చిత్రం–గట్ట–ఏటపల్లి వరకు రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. మరోవైపు కాంకేర్–భానుప్రతాప్‌పూర్–కోయిలిబేడ–పకంజూర్–బాందే–ఇర్పనార్ వరకున్న రోడ్డు కోసం వందకోట్ల రూపాయలు కేటాయించి డబుల్ లైన్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. కాంకేర్–బాందే; కాంకేర్–అంతాగఢ్–నారాయణపూర్–చిత్రం వరకున్న రోడ్ల మధ్యనున్న బుదియారిమాడ్, కువ్వెమాడ్, రావుఘాట్, చార్‌గావ్, ఆహ్లాది తదితర గనులన్నింటిని కలిపి ఈ ప్రాంతాన్నంతా మైనింగ్ హబ్‌గా మార్చనున్నారు. ఒకవైపు గనుల్ని తవ్వుతూ, వాటి రవాణా కోసం ఎక్స్‌ప్రెస్ హైవేలను నిర్మిస్తూ, ఈ పరిసరాల్లో వాగులపై, నదులపై అనేక రిజర్వాయర్లను నిర్మిస్తూ, అనేక డంపింగ్ యార్డ్‌లను నిర్మిస్తూ, ఈ ప్రాంతాన్నంతటినీ విశాలమైన మైనింగ్‌హబ్‌గా మార్చనున్నారు. మరోవైపు మిగతా మాడ్ భూభాగాన్ని భారతసైన్యం కోసం, వాయుసేన కోసం శాశ్వత సైనిక స్థావరంగా, వైమానిక స్థావరంగా మార్చి మాడ్ నుండి ప్రజలను తరిమివేయనున్నారు.

ఈ భారీ వినాశకర పథకానికి చట్టబద్ధత కల్పించేదే ఈ రెవెన్యూ సర్వే. రెవెన్యూ సర్వే ద్వారా ఈ దోపిడీ ప్రభుత్వం సాధించాల్సిన నిజమైన లక్ష్యాలు ఇవే.

### రెవెన్యూసర్వే ఫలితంగా దుష్ఫలితాలు :

తరతరాలుగా స్థానిక ఆదివాసులు సాంప్రదాయికంగా మాడ్‌లోని జల్–జంగల్–జమీన్‌పై అనుభవిస్తున్న హక్కులన్నీ ఈ సర్వేతో కాలరాచివేయబడతాయి. మాడ్ భూమినంతటినీ దోపిడీ ప్రభుత్వం కబ్జా చేసుకున్న తరువాత పోడు వ్యవసాయం నిషేధించబడుతుంది. మాడ్‌లోని వలస వచ్చిన ఆదివాసులకు, తరతరాలుగా ఇక్కడ ఉంటున్న స్థానికులకు నడుమ చీలికలు, వైరుధ్యాలు పెరుగుతాయి. తరతరాలుగా పోడు చేసుకుంటున్న మాకు పట్టాలు ఇవ్వకుండా, వలస వచ్చిన వారికి ప్రభుత్వం పట్టాలు ఇస్తుందంటూ స్థానికులూ; తమకు ప్రభుత్వం పట్టాలు ఇస్తే స్థానికులు తమను పరాయివారిగా చూస్తున్నారంటూ వలస వచ్చిన ఆదివాసులు చీలిపోయి, పరస్పరం ఘర్షణ పడుతారు. ఫలితంగా ఆదివాసుల ఐక్యత దెబ్బతింటుంది. స్థానికులకయినా, వలస వచ్చిన వారికయినా పిడికెడు మందికి, కొద్దిపాటి భూమిపై మాత్రమే పట్టాలు ఇచ్చి, అధికారం కల్పించడంతోపాటు, పోడు వ్యవసాయాన్ని నిషేధించడంతో గ్రామ జీవితాన్ని నడిపే 'భూంకాల్'లు (గ్రామసభ) అధికారాన్ని కోల్పోతాయి. పోడు నిషేధించబడి, పిడికెడు మందికి పట్టాలు దొరకడంతో, గ్రామ జీవితాన్ని ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా నియంత్రించే భూంకాల్ (గ్రామసభ)లు తమ అధికారాల్ని కోల్పోయి ఆదివాసుల సమిష్టి జీవితం దెబ్బతిని వ్యక్తులుగా విడిపోతారు. మాడ్ భూభాగం ఒకవైపు మైనింగ్ హబ్‌గా, మరోవైపు సైనిక స్థావరంగా, వైమానిక స్థావరంగా మారే క్రమంలో ఈ ప్రాంత ప్రజల్లో అత్యధికులను విస్థాపితుల్ని చేసి, ఇక్కడి నుండి ఈ దోపిడీ ప్రభుత్వం తరిమేస్తుంది. మిగిలినవారిని కూలీలుగా మారుస్తుంది. వీటన్నింటితో మాడ్ ప్రజలు తమ అస్థిత్వాన్ని, అస్మితను, ఆత్మగౌరవాన్ని కోల్పోతారు.

గత 30–35 సంవత్సరాలుగా మాడ్ ప్రజలంతా మనపార్టీ

నాయకత్వంలో సంఘటితమయి, దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతూ జల్-జంగల్-జమీన్‌పై అధికారాన్ని అనుభవిస్తూ, జనతన సర్కార్లను ఏర్పరచుకుని మన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవితాన్ని అభివృద్ధి చేసుకుంటున్న స్థితి నుండి భారీ వినాశనం వైపు నెట్టివేయబడుతారు. అంటే మన జనతన సర్కార్లు దెబ్బతింటాయి.

మాడ్ భూమినంతటినీ కబ్జాచేసి, స్థానిక ఆదివాసులను అత్యధికులను విస్థాపితుల్ని చేయడానికి కుట్రపడుతున్న ఈ దోపిడీ ప్రభుత్వాలు పట్టాలున్నవారికి బ్యాంకు రుణాలు అందించడమనేది, ఇతర ప్రభుత్వాల పథకాల ఫలితాల్ని అందించడమనేది బూటకమే. ప్రభుత్వం చెప్పే మాటల్ని నమ్మకోవడం అంటే మోసపోవడమే. దేశవ్యాప్తంగా పేద రైతులకు, మధ్యతరగతి రైతులకు ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు అప్పులు ఇవ్వని స్థితిలో వారంతా వడ్డీ వ్యాపారుల దారుణ దోపిడీకి గురవుతూ, ఆ అప్పులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న స్థితిని గమనిస్తే మాడ్‌లో పట్టాలు దొరికే వారికి ప్రభుత్వ బ్యాంకులు అప్పులు ఇస్తాయనే మాటను నమ్మడం అంటే మోసపోవడమే. ఒకవేళ పట్టాలున్న వారిలో కొద్దిమందికి ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు అప్పులిచ్చినా, ఇప్పటివరకు అప్పుల సమస్యను ఎదుర్కొనని ఇక్కడి ఆదివాసులను అప్పుల ఊబిలోకి లాగడానికే దారితీస్తది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రైతాంగంలో 72% పేద రైతాంగమే. వీరందరికీ ఒకటి, రెండు డిసిమల్ల చొప్పున మాత్రమే భూమి ఉంది. వీరిందరికీ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుండి రుణాలు అందకపోవడంతో వీళ్ళు 18-20% వడ్డీతో షావుకార్ల వద్ద, వడ్డీ వ్యాపారస్థుల వద్ద అప్పులు తీసుకునే దుస్థితి నెలకొంది. వీరికి అప్పులు ఇవ్వలేని ప్రభుత్వం మాడ్ ఆదివాసులకు పట్టాలుంటే రుణాలు కల్పిస్తాననడం వట్టి బూటకమే.

### మాడ్ భూమిపై మాదే హక్కు/మాకే అధికారం అంటూ పోరాడుదాం-దోపిడీ ప్రభుత్వాన్ని తన్ని తరుముదాం :

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన దండకారణ్యాన్ని ఆక్రమించుకోక ముందు ఇక్కడ రాచరిక ప్రభుత్వాలు ఉన్నప్పటికీ మన భూమిపై, అడవిపై మనకే అధికారాలుండేవి. ఆ స్థితిలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భూమిసెటిల్‌మెంట్ (భూమిసర్వే) పేరుతో 1861లో రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టి, భూమిపై వ్యక్తిగతంగా పట్టాలు ఇచ్చి భూములపై మన అధికారాల్ని గుంజుకున్నారు. 1894లో అటవి చట్టాన్ని రూపొందించి అడవిపై మనకున్న అధికారాన్ని గుంజుకున్నారు. 1901లో అబ్కారీ విభాగాన్ని ఏర్పాటుచేసి మనం తాగే కల్లుపై టాక్సు వేయడం మొదలుపెట్టారు. మరోవైపు రోడ్లు వేయడం మొదలుపెట్టి ఇక్కడి సంపదలన్నింటినీ కొల్లగొట్టుకపోవడం మొదలుపెట్టారు. ఇలా అడవిపై, భూమిపై అధికారాల్ని కోల్పోతున్న స్థితిలో గేండ్‌సింగ్, సద్మెక్ బాబూరావుల నాయకత్వంలో మన పూర్వీకులు గొప్ప తిరుగుబాట్లు చేశారు. ఆ తిరుగుబాట్ల కొనసాగింపుగా జల్-జంగల్-జమీన్‌పై అధికారం కోసం 1910లో గూండాదూర్ నాయకత్వంలో 'మహాన్ భూంకాల్ సంఘర్ష్' నడిచింది. అప్పటినుండి 1947 వరకు దేశమంతటా అడవిపై అధికారం కోసం ఆదివాసులు, భూముల కోసం రైతాంగం ఎన్నో పోరాటాలు చేశారు. ఆ పోరాటాలన్నింటి ఫలితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దేశాన్ని వదలివెళ్ళడంతోపాటు, వారి తరువాత అధికారంలోకి వచ్చిన దోపిడీవర్గాలు రాజ్యాంగంలో ఆదివాసులకు, రైతాంగానికి కొన్ని హక్కుల్ని, అధికారాల్ని కల్పించాల్సి వచ్చింది. అందులోభాగమే 5వ, 6వ షెడ్యూల్లు, కౌలుదారీ చట్టాలు. ఈ చట్టాలకు తూట్లు పొడుస్తూ బడా భూస్వామ్య, బడా బూర్జువా వర్గాలకు కొమ్ముగాస్తూ వచ్చిన దోపిడీ ప్రభుత్వాలకు, దోపిడీదార్లకు వ్యతిరేకంగా నక్సల్బరీ, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో ఆదివాసులు, రైతులు వీరోచిత పోరాటాలు చేశారు. వీటి ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ప్రజానుకూల చట్టాలు చేయక తప్పలేదు. అందులో భాగమే పెసాచట్టం, అందులో భాగంగానే మాడ్‌ను రక్షిత ప్రాంతంగా ప్రకటించాయి. కొద్ది సంవత్సరాల కిందట రమణ్‌సింగ్ ప్రభుత్వం మాడ్‌కున్న రక్షిత ప్రాంత హోదాను ఎత్తివేసి దీన్ని రెవెన్యూ ప్రాంతంగా మార్చే కుట్ర చేసింది.

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులు వెనకబడిన దేశాల వనరులను పెద్దఎత్తున కొల్లగొట్టుతుండడంతో మనదేశ దళారీ పాలకులు వారితో కుమ్మక్కయ్యి మన దేశాన్ని, వారికి తెగనమ్ముతూ, మన సంపదలన్నింటినీ వారికి అప్పగిస్తున్నారు. అందులోభాగమే మాడ్ రెవెన్యూ సర్వే. అందుకోసం జల్-జంగల్-జమీన్‌పై అధికారం కోసం భూంకాల్ పోరాట వీరులలాగా పోరాడుదాం. దోపిడీ ప్రభుత్వాన్ని తన్నితరుముదాం. రెవెన్యూ, సర్వే పేరుతో గ్రామాల్లోకి వచ్చే కలెక్టర్, తహసీల్దార్, పట్వారీలను, వారికి మద్దతుగా వచ్చే పోలీసులను తన్ని తరుముదాం. ఈ రెవెన్యూ సర్వేలో దోపిడీ ప్రభుత్వ అధికార్లకు మద్దతుగా నిలబడే సర్పంచ్‌లను, సచీవ్‌లను, ప్రజా వ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక పెద్ద మనుషులను కూడా తరిమేద్దాం. జానెడు భూమికోసం లూటీ సర్కారు ఇచ్చే పట్టాలు మాకు అక్కరలేదని, మాడ్ భూమి అంతా మాదే, మాడ్ భూమిపై మాదే అధికారం, మాకే హక్కు అని పోరాడుదాం. తరతరాలుగా మాడ్ భూమిపై మనకున్న హక్కు-అధికారాల్ని కాపాడుకుందాం. లూటీ సర్కారు ఇచ్చే బియ్యానికీ, సోలార్ లైట్లకు మోసపోవద్దు. ఈ లూటీ సర్కారు వేసే రోడ్లను, కరెంట్ లైన్లను చూసి అభివృద్ధి అని మోసపోవద్దు. ఈ రోడ్లు, కరెంట్ అన్నీ ఇక్కడి సంపదల దోపిడీ కోసమే, మన

జల్-జంగల్-జమీన్‌ను గుంజుకోవడానికే. దోపిడీ ప్రభుత్వపు బూటకపు ప్రచారాన్ని నమ్మి మోసపోకుండా నిజానిజాల్ని గుర్తిద్దాం.

### గైర్ సర్కారీ సంస్థలకు (ఎన్‌జీఓలకు) హెచ్చరిక :

మాడ్ రెవెన్యూ సర్వేలో రామకృష్ణ మిషన్, టాటా చారిటీ ట్రస్టులు ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యాన్ని, మద్దతును ఇస్తున్నాయి. ఈ సర్వే మాడ్ ప్రజల అస్థిత్వానికి, అస్మితకు ప్రమాదం కాబట్టి ఇలాంటి ఆదివాసీ వ్యతిరేక సర్వేలో, కార్యకలాపాల్లో పాల్గొనవద్దని ఈ సంస్థలను హెచ్చరిస్తున్నాం.

### తెగపెద్దలకు విజ్ఞప్తి :

దోపిడీ ప్రభుత్వం చెప్పే మోసపు మాటలు నమ్మి మోసపోవద్దని మీకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ దోపిడీ ప్రభుత్వం మాడ్ నుండి పేద ఆదివాసులతో సహా మిమ్మల్ని కూడా తరిమేస్తుంది. మొదట్లో కొంతకాలం మీకు జానెడు భూమికి పట్టలు ఇచ్చినా అది ఆదివాసులను చీలదీయడం కోసమే. కాబట్టి ఆదివాసీ తెగ పెద్దలుగా మీరు ఆదివాసీ ప్రజలతో కల్సి దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రభుత్వం చూయించే పట్టాలు తదితర ప్రలోభాలకు లొంగవద్దని కోరుతున్నాం. రెవెన్యూ సర్వేలో ప్రభుత్వ దళారులుగా మారవద్దని విజ్ఞపి చేస్తున్నాం.

### ఇతర ప్రాంతాల నుండి మాడ్‌కు వలస వచ్చిన ఆదివాసీ ప్రజలకు విజ్ఞప్తి :

లోహండిగూడ, కేశ్‌కల్, భానుప్రతాప్‌పూర్ ప్రాంతాల నుండి వలస వచ్చిన అందరినీ స్థానిక ప్రజలు ఇప్పటివరకు తోటి ఆదివాసులుగానే చూస్తున్నారు. జనతన సర్కారు కూడా మీ వలసల్ని ఆమోదించి స్థానికులతో కలసి జల్-జంగల్-జమీన్ కోసం జరిగే పోరాటాల్లో కలుపుకుని పోతోంది. మీలో అత్యధికులు వర్గ రీత్యా పేద, మధ్యతరగతి వారే. రెవెన్యూ, సర్వే పేరుతో దోపిడీ ప్రభుత్వం మీలో కొంతమంది ధనికరైతులకు, కొద్దిమందికి మధ్యతరగతి వారికే పట్టాలు ఇవ్వవచ్చు. అదికూడా జానెడు భూమిపైననే. కానీ ఇప్పటివరకు స్థానిక ఆదివాసులతో కలిసి మీరంతా జనతన సర్కార్ల నాయకత్వంలో మాడ్‌లోని జల్-జంగల్-జమీన్‌పై పట్టాలతో సంబంధం లేకుండానే అధికారాల్ని అనుభవిస్తున్నారు. దోపిడీ ప్రభుత్వం ఇచ్చే పట్టాలను ఆమోదించడమంటే మాడ్ మొత్తంపై అధికారాల్ని కోల్పోయి జానెడు భూమి కోసం మాత్రమే ఆశపడడం అన్నమాట. అందుకోసం ప్రభుత్వ మాటల్ని నమ్మి మోసపోవద్దని మీకు విజ్ఞప్తి చేస్తున్నాం. స్థానికులకు వ్యతిరేకంగా ప్రభుత్వ పక్షాన నిలబడవద్దని కోరుతున్నాం. ఇప్పటిలాగే స్థానికులతో కలసి జల్-జంగల్-జమీన్ కోసం మాడ్ భూమిపై మాకే అధికారం అంటూ జనతన సర్కార్ల నాయకత్వంలో పోరాడాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

### ఆదివాసీ విద్యార్థి-మేధావులకు, ఆదివాసీ శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి :

దేశవ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాల్లోని ఆదివాసులకు భారత రాజ్యాంగం 5వ, 6వ షెడ్యూల్ల ద్వారా అడవిపై అధికారాల్ని, స్వయం ప్రతిపత్తిని (అటానమస్) కల్పించాయి. అలాగే పెసాచట్టం (ఆదివాసీ ప్రాంతాలకు పంచాయితీల విస్తరణ చట్టం) కూడా అడవిపై ఆదివాసులకు కొన్ని అధికారాల్ని కల్పించింది.

ప్రస్థుతం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రెవెన్యూ సర్వే పేరుతో చేపడుతున్న సర్వే 5వ షెడ్యూల్‌కు, పెసా చట్టానికి వ్యతిరేకం. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, పెసా చట్టానికి తూట్లు పొడుస్తూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మాడ్‌లో రెవెన్యూ సర్వే చేయడానికి వ్యతిరేకంగా మీరంతా ఒక్కటయ్యి చట్టబద్ధ, చట్ట వ్యతిరేక పద్ధతుల్లో పోరాడాల్సిందిగా కోరుతున్నాం. మాడ్ ప్రజల సంతకాల సేకరణ చేసి గవర్నర్‌కు, రాష్ట్రపతికి పంపడం, హైకోర్టులో దానికి వ్యతిరేకంగా రిట్ వేయడం, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వ కుట్రను ప్రజలకు అర్థం చేయించడం; ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించడం లాంటి చట్టబద్ధ పద్ధతుల్లో మాడ్ సర్వేకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాన్ని నడపాల్సిందిగా కోరుతున్నాం. మీరు చట్టబద్ధంగా చేసే పోరాటాల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెడితే చట్ట వ్యతిరేక పద్ధతుల్లో కూడా పోరాడి మాడ్ ప్రజల అస్థిత్వాన్ని కాపాడడానికి ముందుకు రావాల్సిందిగా కోరుతున్నాం. మాడ్ సంపదను దోచుకువెళ్ళడానికి బహుళజాతి కార్పోరేషన్లు, దేశీయ బడా బూర్జువా కార్పోరేషన్లు రాజ్యం దన్నుతో చేస్తున్న దుష్ట ప్రయత్నాలను తిప్పి కొట్టడానికి ఆదివాసీ ప్రయోజనాల పరిరక్షణ కోసం, దేశభక్త పౌరులుగా ముందుకు రావాల్సిందిగా కోరుతున్నాం.

### ఆదివాసీ, గైరాదివాసీ ప్రజలారా!

తరతరాలుగా మన ఆదివాసీ, గైరాదివాసీ ప్రజలందరి అస్థిత్వానికి, అస్మితకు, ఆత్మగౌరవానికి ఆలంబనగా నిలిచిన మన మాడ్ భూమిని కాపాడుకుందాం. మాడ్‌లోని సకల సంపదలను కొల్లగొట్టడానికి ఉవ్విళ్ళూరుతున్న సామ్రాజ్యవాద, దేశీయ బడా పెట్టుబడి కార్పోరేట్ గద్దలను, వేట కుక్కలను తన్ని తరుమేద్దాం. వారికి ఊడిగం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తన్ని తరిమేదాం. స్వేచ్ఛాయుత, స్వతంత్ర, స్వావలంబన, ప్రజాస్వామిక జీవన వికాసం కోసం చీలిపోకుండా మనమంతా ఐక్యమయ్యి పోరాడుదాం. దోపిడీవర్గాలు ఎప్పుడూ మన విజ్ఞప్తులను ఖాతరు చేయవు. కాబట్టి వారికి తగిన బుద్ధి చెప్పడానికి సాయుధమయ్యి పోరాడుదాం. భూంకాల్ పోరాట వీరులలాగా పోరాడుదాం. మాడ్ భూమిని కాపాడుకుందాం. జనతన సర్కార్ల నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపన కోసం అలుపెరుగక పోరాడుదాం. అంతిమ విజయం మనదే. ○

## 'సమాధాన్' ఫాసిస్టు దాడికి జవాబు మరిన్ని బుర్కపాల్‌లను సృష్టించడమే అంటున్నారు బస్తర్ ప్రజలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా మావోయిస్టు ఉద్యమాన్ని అణచడానికి వేలాది పోలీసు, అర్ధ సైనిక బలగాలను మోహరిస్తు, కొత్త క్యాంపులను ఏర్పరుస్తు, ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను పెంచుతూ, రోడ్లు, కమ్యూనికేషన్ నిర్మాణాలు, ఫైబర్ ఆప్టికల్ నెట్‌వర్క్ నిర్మాణం, కరెంటు లైన్ నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ ప్రజలపై పాశివిక నిర్బంధాన్ని కొనసాగిస్తున్నాయి. కార్పోరేట్ అభివృద్ధి నమూనాలో భాగంగా బూటకపు సంస్కరణలను అమలు పరుస్తున్నాయి.

పార్టీ నాయకత్వంలో ప్రజలు, పీ.ఎల్.జీ.ఏ. గెరిల్లాలు కిరాయి పోలీసు అర్ధసైనిక బలగాలను ప్రతిఘటిస్తున్నారు. రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా, మహిళలపైజరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. జనతన సర్కార్లలో ప్రజలు ఉత్పత్తిని అభివృద్ధి చేయడం వైపు దృష్టి మళ్లించి నమిష్టి పనులను విజయవంతం చేస్తున్నారు. బీజాపూర్ లాంటి పట్టణ ప్రాంతాలకు వేలాదిగా కదిలి నిరసన ప్రదర్శనలు చేస్తూ, హక్కులను డిమాండ్ చేస్తూ పోరాడుతున్నారు. ప్రజల, ప్రజాస్వామిక వాదుల నిరసనకు తలఒగ్గి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఐజి కల్లూరిని తాత్కాలికంగా ఈ ప్రాంతం బాధ్యతల్లో లేకుండా పంపివేసింది. ప్రజా వ్యతిరేకంగా రూపొందించిన 'అగ్ని'ని ఫిబ్రవరి 9న రద్దు చేసుకుంది. అగ్ని ద్వారా నడుపుతున్న 5 వాట్సప్ గ్రూపులు: 1. రాష్ట్రవాది, 2. నక్సల్ ముక్త్ బస్తర్, 3. ఆటంక్ ముక్త్ బస్తర్, 4. ఫైట్ అగైనెస్ట్ నక్సల్స్, 5. హంచో బస్తర్-సుందర్ బస్తర్ గ్రూపులను రద్దు చేస్తున్నట్లు 'అగ్ని' కన్వీనర్ ఆనంద్ మోహన్ మిశ్రా ప్రకటించాడు.



బుర్కపాల్ దాడిలో పీఎల్‌జీఏ స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

కొండగావ్ జిల్లాలోని మర్దాపాల్ ప్రాంతంలో గ్రామాలపై దాడులు చేస్తున్న ఎస్.టీ.ఎఫ్. కమాండో బలగాలపై పీ.ఎల్.జీ.ఏ. చేసిన దాడిలో ఇద్దరు కమాండోలు చనిపోయారు.

దంతెవాడ జిల్లాలో ప్రభుత్వానికి చెందిన బైలాదిల్లా ఎన్ఎండీసీ పై ఫిబ్రవరి 7న దాడి చేసి వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు మైనింగ్‌లో ఉపయోగించే జెలిటిన్, డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు. మార్చ్ 3న బీజాపూర్ జిల్లా మిర్తూల్ వద్ద రోడ్ ఓపెనింగ్ పార్టీపై పీ.ఎల్.జీ.ఏ. బలగాలు చేసిన దాడిలో ఇద్దరు సీ.ఆర్.పీ.ఎఫ్. జవానులు చావగా, మరో ఇద్దరు జవానులు గాయపడ్డారు.

సుక్మా జిల్లా బెజ్జి దగ్గర మార్చ్ 12న సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలపై పీ.ఎల్.జీ.ఏ. సాహసిక దాడి చేసి అర్ధసైనిక బలగాలకు చెందిన 12 మంది జవానులను నిర్మూలించి, ఇద్దర్ని గాయపర్చి, పోలీసుల నుండి 12 ఆధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. ఈ ఘటన తర్వాత ఖంగు తిన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హుటాహుటినా ఉన్నత పోలీసు అధికారుల పర్యటనకు ఆదేశించారు. లోక్‌సూరజ్ అభియాన్‌లో భాగంగా రమన్‌సింగ్ స్వయంగా బెజ్జి ఘటన స్థలాన్ని సందర్శించాడు. సుక్మా, జగదల్‌పూర్‌లో పోలీసు పున్నతాధికారుల సమావేశం నిర్వహించి నక్సలైట్ వ్యతిరేక అభియాన్లను సమీక్షించాడు. పోలీసుల మనో స్థైర్యాన్ని నిలబెట్టడానికి పదరాని పాట్లు పడ్డాడు. బస్తర్ సంబాగ్‌లో కల్లూరి స్థానంలో ఐ.జీ.గా వివేకనంద్ సిన్హాను నియమించారు. ఫిబ్రవరి నెలలో దంతెవాడ కేంద్రంగా డీ.ఐ.జీ. పి.సుందర్ రాజ్‌ను, ఏప్రిల్‌లో కాంకేర్ కేంద్రంగా డి.ఐ.జీ. రతన్‌లాల్ డాంగీ లను నియమించారు. రద్దుచేసిన అగ్ని సంస్థను ఏప్రిల్ 5న మళ్ళీ పునరుద్దరించారు. పట్టణాలలో నివిసిస్తున్న మావోయిస్టు మద్దతుదారులను, వాళ్ళ భావజాలాన్ని అడ్డుకుంటామని ప్రకటించారు. నాగపూర్ హెడ్‌క్వార్టర్‌లో ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వాన లీగల్ అడ్వయిజరీ గ్రూపు అనే మరో సంస్థను ఏర్పర్చి మావోయిస్టు ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తున్న మేధావులకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం, దాడులు చేయడం తమ లక్ష్యాలుగా ప్రకటించుకుంది. మహారాష్ట్రలో భూంకాల్ సంఘటన్ పేరుతో కౌంటర్ రెవెల్యూషనరీ సంస్థ ఆర్ఎస్ఎస్ మద్దతుతో కొనసాగుతూ విప్లవ వ్యతిరేక ప్రచారం చేస్తున్నది.

మిషన్-2017లో భాగంగానే కోర్టులు పని చేస్తున్నాయి. రాయపూర్‌లో అరెస్టయిన రైతులు, వ్యాపారులపై పేలుడు పదార్థాలు దొరికాయనే నేపంతో జిల్లా కోర్టు 5గురికి 10ఏళ్ళ జైలు శిక్ష విధించింది. గడ్‌చిరోలి జిల్లా కోర్టు మావోయిస్టులతో సంబంధాలున్నాయనే తప్పుడు ఆరోపణలతో ఢిల్లీ ప్రొ॥ సాయిబాబా (90శాతం అంగవైకల్యం)ను మరో నలుగురికి మార్చి 19న జీవిత ఖైదీ శిక్ష విధించాయి.

ప్రజల సహకారంతో మిలీషియా, పీఎల్‌జీఏ లోని సెకండరీ, ప్రధాన బలగాలు పోలీసుల దాడులను ప్రతిఘటిస్తు చిన్న చిన్న సైనిక చర్యలు, చికాకు పరిచే చర్యలు, రోడ్ నిర్మాణంలో పాల్గొంటున్న వాహనాలను ధ్వంసం చేయడం, బూబీ ట్రాప్‌లను ఏర్పరుస్తు పోలీసులను చంపడం, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడం దండకారణ్య వ్యాప్తంగా కొనసాగింది.

సుక్మా జిల్లాలో ఏప్రిల్ 24న బుర్కపాల్ పోలీసు క్యాంపు వద్ద రోడ్ నిర్మాణానికి సెక్యూరిటీగా ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలపై పీ.ఎల్.జీ.ఏ. చుట్టిముట్టి సాహసవంతంగా దాడి చేసింది. రెండున్నర గంటల పాటు అర్ధ సైనిక బలగాలతో జరిగిన హోరాహోరి పోరాటంలో పీ.ఎల్.జీ.ఏ. 25 మంది పోలీసు బలగాలను నిర్మూలించి, నలుగుర్ని గాయపర్చి, 23 ఆధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. ఈ హోరా హోరి పోరాటంలో శత్రువు మూకలతో తలపడుతూ వీర గెరిల్లాలు కామ్రేడ్స్ అనిల్, రవిలు అసువులు బాసారు. ఈ సైనిక చర్య 50 సంవత్సరాల మహత్తర నక్సల్బరీ వార్షికోత్సవాల సందర్భంగా దేశంలోని అశేష పీడిత ప్రజలకు, కార్మికులకు, రైతులకు గొప్ప స్ఫూర్తి నిచ్చింది. మావోయిస్టు ఉద్యమాన్ని తీవ్రంగా అణచివేస్తాము, వారు కేవలం తమ ఉనికిని చాటుకోవడానికే అసహనంగా కొన్ని చర్యలు చేస్తున్నారు అని ప్రకటిస్తున్న దోపిడీ దళారీ పాలకవర్గాలకు, సామ్రాజ్యవాదులకు విప్లవోద్యమం ఒక సవాల్ విసిరింది.

బుర్కపాల్ దాడి అనంతరం కేంద్ర, రాష్ట్ర దళారీ దోపిడీ పాలక వర్గాలు, పోలీసు అధికారులు తీవ్రంగా ఆందోళనకు గురైనారు. బుర్కపాల్ ఘటన తర్వాత నుండి మొదలుకొని మే 8 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమ నిర్మూలన కోసం నూతన వ్యూహ రచన కోసం తలమునకలయినాయి. ఏప్రిల్ 29నుండి మొదలుకొని మే 5 వరకు ఆంతరంగిక భద్రత సలహాదారు కె. విజయ్ కుమార్ బస్తర్ సంభాగ్‌లో విస్తృతంగా పర్యటించి పోలీసు ఉన్నతాధికారులతో అనేక తడవులుగా సమావేశాలు చేశాడు. మే 5 నాడు రాయపూర్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమన్‌సింగ్ అధ్యక్షతన యూనిఫైడ్ కమాండ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రపోలీసు ఉన్నతాధికారులతో పాటు, ఆంతరంగిక భద్రత సలహాదారు, భారత సైన్యానికి చెందిన కల్నల్, వాయుసేనకు చెందిన కమాడోర్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ ఉన్నతాధికారులు, రాష్ట్ర పోలీసు, పారా మిలిటరీలకు చెందిన ఇంటిలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు మే 4నాడు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ అహిర్ పోలంపల్లి పోలీసు క్యాంపుకు చేరుకుని నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్స్‌ను సమీక్షించి, పోలీసుల మొరేల్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. మే 2నాడు కేంద్ర ఇంటిలిజెన్స్ బ్యూరో చీఫ్ ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి బస్తర్ సంభాగ్‌లోని 7 జిల్లాల కలెక్టర్లతో, పోలీసు సూపరింటెండెంట్‌లతో మాట్లాడాడు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బస్తర్ సంభాగ్‌లోని మావోయిస్టు వుద్యమస్థితి, దాన్ని ఎదుర్కోవడానికి సాగుతున్న మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్స్ స్థితి –వాటిలో సమస్యల గురించి ఇంటిలిజెన్స్ బ్యూరో చీఫ్ చర్చించాడు. ఏప్రిల్ 29 నుండి మొదలుకుని మే 5 వరకు అన్ని రకాల సన్నాహాలు చేసుకుని మే 8నాడు ఢిల్లీలో మావోయిస్టు ఉద్యమ ప్రభావిత 10 రాష్ట్రాల ముఖ్యమంత్రులతో, ఉన్నతాధికారులతో కేంద్ర హోంశాఖ మంత్రి అధ్యక్షతన వున్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 10 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అరడజనుకు పైగా కేంద్ర మంత్రులు, భారతసేన, వాయుసేనలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ పారా మిలిటరీ బలగాల ఉన్నతాధికారులు, 10 రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు, రాష్ట్ర, కేంద్ర ఇంటిలిజెన్స్ ఉన్నతాధికారులు, మావోయిస్టు ప్రభావిత 35 జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో భారతదేశంలో మావోయిస్టు ఉద్యమ నిర్మూలన కోసం నూతన విప్లవ ప్రతీఘాతక పథకాలను, వ్యూహాలను రూపొందించి 'సమాధాన్' పేరుతో ప్రకటించారు. సీ.ఆర్.పీ.ఎఫ్. కమాండింగ్ ఆఫీస్‌ను కలకత్తా నుండి రాయపూర్‌కు బదిలీ చేశారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్స్‌లో రాష్ట్ర, స్థానిక పోలీసు కమాండో బలగాలు ముందుండగా వారికి సపోర్టుగా అర్ధసైనిక బలగాలు, కోబ్రా కమాండోలు ఉంటాయని ప్రకటించారు. మావోయిస్టు ఉద్యమం బలంగా కొనసాగుతున్న 35 జిల్లాల్లో జిల్లా స్థాయి ఆపరేషనల్ యూనిఫైడ్ కమాండ్స్ ఏర్పర్చాలని నిర్ణయం తీసుకున్నారు.

కేంద్ర హోం కార్యదర్శి నాయకత్వంలో ఆపరేషన్స్‌ను మానిటరింగ్ చేయడం కోసం పర్యవేక్షణ సమితిని ఏర్పర్చారు.

మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్స్‌లో పాల్గొన్న పోలీసు, పారా మిలిటరీ కమాండో బలగాలు ఆత్మరక్షణ పద్ధతులను విడనాడి పూర్తిగా దూకుడుగా (అఫెన్స్‌గా) దాడులు చేయాలని, మావోయిస్టు ఉద్యమ బలమైన ప్రాంతాలలో చొరబడి కార్డెన్ అండ్ సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ దాడులలో వాయుసేనను ఉపయోగించి హెలికాప్టర్‌లపై ఆధారపడి కమాండో దాడులు చేయడం, ఇంటలిజెన్స్ వ్యవస్థను మరింత పటిష్టపర్చడం, కోవర్టులను తయారు చేయడం వీటన్నింటిపై ఆధారపడి రాత్రిపూట దాడులు తీవ్రం చేయాలని, అలాగే ఏక కాలంలో మావోయిస్టు గెరిల్లాలపై భూతల మార్గం, వాయు మార్గం నుండి దాడులు

చేయాలని నిర్ణయించారు.

ఈ సమావేశం అనంతరం వెంటనే సీ.ఆర్.పీ.ఎఫ్. పూర్తికాలం డి.జి.ని నియమించారు. సుక్మా, బస్తర్, కొండగావ్ ఎస్.పీ.లను బదిలీ చేశారు. రాయపూర్, జగదల్‌పూర్‌లను నిరంతరం కేంద్ర పోలీసు అధికారులు పర్యటించడం, కేంద్రంలోని నక్సల్ వ్యతిరేక ప్రత్యేక ఆంతరంగిక సలహాదారు కె. విజయ్ కుమార్, నక్సల్ వ్యతిరేక ప్రత్యేక డి.జి. డి.ఎం. అవస్థీ ఎక్కువగా బస్తర్ సంబాగ్‌లోని 7 జిల్లాలను పర్యటిస్తు కూంబింగ్ ఆపరేషన్స్‌ను మానిటరింగ్ చేస్తున్నారు.

ఏప్రిల్ 25 నుండి 27 వరకు గంగలూర్ తాన పరిధిలోని మెట్టపాడ్, పూంబాడ్ గ్రామాలపై దాడులు చేసి కొందరు రైతులను అరెస్టు చేసి తీసుకెళ్ళారు.

బుర్కపాల్ దాడి అనంతరం ఆ గ్రామంపై పోలీసులు దాడి చేసి ప్రజలను విచక్షణారహితంగా కొట్టారు. ఇళ్ళలో పడి దోచుకున్నారు. ఒక రైతును హత్య చేసి, శవాన్ని పూడ్చి నక్సలైట్లు హత్య చేశారని తప్పుడు ప్రచారం చేశారు. 35 మంది రైతులను బుర్కపాల్ గ్రామంలో అరెస్టు చేసి 25 మంది పోలీసులను హత్య చేసిన ఘటనలో పాల్గొన్నారని అంటూ తప్పుడు కేసులు నమోదు చేసి జైళ్లో వేసారు. ప్రస్తుతం పోలీసుల భయంతో గ్రామంలో రైతులు ముఖ్యంగా యువకులు పారిపోయి తెలంగాణలో తలదాచుకుంటున్నారు. గ్రామంలో ముసలివారు, మహిళలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటు జీవిస్తున్నారు. ప్రతీరోజు పోలీసులు వీరిని వేధిస్తున్నారు.

మహారాష్ట్రలోని గఢ్‌చిరోలి జిల్లా భామ్రాగఢ్ తాలుకాలో సీ-60 కమాండోలు ప్రయాణిస్తున్న మైన్ ప్రూఫ్ వాహనాన్ని పీ.ఎల్.జీ.ఏ. మైన్‌తో పేల్చింది. ఈ ఘటనలో ఒక సీ-60 కమాండో చావగా, 21 మంది కమాండోలు గాయపడ్డారు. ఇదే ఏరియాలో గస్తీ వచ్చిన పోలీసు బలగాలపై చేసిన దాడిలో 3గ్గురు కమాండోలు గాయపడ్డారు.

**మావోయిస్టులను నిర్మూలించాలనే పాలకవర్గాల దుష్ట పథకం పూర్తిగా నెరవేరకపోవడంతో ప్రజలపై, గెరిల్లాలపై ఫాసిస్టు మారణకాండను అమలుపరుస్తున్న పాలకవర్గాలు:**

మే 4న బీజాపూర్ జిల్లాలో భైరన్‌గఢ్ తాన పరిధిలో కోలనార్, పల్లి గ్రామస్థులయిన వేకో సన్ను, మాడవి బామన్ తునికాకులు కోసి కళ్ళంలో టేకదారుకు అమ్మి తిరిగి ఇంటికి వెల్తున్న సమయంలో ఇంద్రావతి ఒడ్డున మాటుగాసిన పోలీసులు వీరిద్దరిని పట్టుకుని చిత్రహింసలు పెట్టి టెండోడ్ అనే గ్రామం వద్ద కాల్చి చంపి ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారని ప్రకటించారు.

మే 11 నుంచి 13 వరకు బీజాపూర్, సుక్మా పోలీసులు అర్థ సైనిక బలగాలు సంయుక్తంగా చిన్న బొడికల్, రాయిగూడెం గ్రామాలపై దాడి చేశారు. రాయిగూడెం గ్రామంలో 11ఇళ్లను తగులబెట్టి, ప్రజలు నిర్వహిస్తున్న ధాన్యం మిల్లును ధ్వంసం చేశారు. కనపడ్డవారినల్లా కొట్టారు. ప్రజలపై కాల్పులు జరిపారు. ఇళ్ళలో చొరబడి ప్రజలు దాచుకున్న డబ్బు, సాదుకున్న కోళ్ళను దోచుకున్నారు. ప్రజలపై దాడి చేస్తున్న ప్రభుత్వ కిరాయి పోలీసులపై పీఎల్‌జీఏ దాడి చేయగా ఒక ఎస్‌టీఎఫ్ కమాండో మట్టి కరిచాడు. ఇద్దరు కమాండోలు గాయపడ్డారు.

బస్తర్ జిల్లాలో బూర్గుం వద్ద పోలీసులు కుట్రపన్ని అరెస్టు చేసిన తూర్పు బస్తర్ డీవీసీఎం కామ్రేడ్ కైలాస్‌ను పోలీసులు పట్టుకొని చిత్రహింసలు పెట్టి మే 14న హత్య చేశారు.

మే 20 నుండి 23 వరకు దంతెవాడ, బీజాపూర్ పోలీసులు సంయుక్తంగా బాస్నీ, పరస్పాల్, మిర్తూల్, పూల్‌గట్ట పోలీసు స్టేషన్ల పరిధిలోని గ్రామాలపై దాడులు నిర్వహించారు. ముగ్గురు రైతులను అరెస్టు చేసి జైళ్లో వేశారు.

భైరన్‌గఢ్ తాన సూరకాడ గ్రామం వద్ద ఇంట్లో ఉన్న మాజీ దళ సభ్యుడు ఊజీ ఐతు (రతన్)ను పట్టుకొని జూన్ 4న ఎన్‌కౌంటర్ పేరున హత్యచేశారు.

జూన్ 5నుండి 7వరకు కటేకళ్యాణ్ ప్రాంతంలో గెరిల్లా దళంపై ముదుసార్లు కాల్పులు జరిగాయి. ప్రాణనష్టం జరగలేదు.

తూర్పు బస్తర్‌లోని కొండగావ్ జిల్లా రాణిడోంగ్రి గ్రామం వద్ద పోలీసులు జూన్ 16న జరిపిన కాల్పుల్లో ఏ.సీ.సభ్యులు కామ్రేడ్ సింగన్న, మున్నాల్, పీ.ఎల్.జీ.ఏ. సభ్యుడు మేంఘనాథ్ అమరులయ్యారు.

రాజ్‌నంధ్‌గాం-మహారాష్ట్ర-గడ్‌చిరోలి బార్డర్‌లో జూన్ 18న జరిగిన ఎన్‌కౌంటర్లో ఏ.సీ. కార్యదర్శి సమీలా పొట్టం, ఏసీ సభ్యురాలు రమ్మీ, సమీరా లు అమరులయ్యారు. జూన్ 19 న కాంకేర్ జిల్లా కోయిలాబేడ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో జయసింగ్ కుంజాం అనే ఏసీ సభ్యుడు అమరుడయ్యాడు.

మాడ్ డివిజన్‌లోని నారాయణపూర్ జిల్లా ధనోరా పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్లో కామ్రేడ్స్ మాలీ, కరుణ అనే దళ సభ్యులు అమరులైనారు.

జూన్ 22 నుండి 24 వరకు బీజాపూర్‌లో పిడియా కేంద్రంగా, సుక్మా జిల్లాలో తొండమార్క, బడే కేడ్వాల్ కేంద్రంగా జిల్లా,

డీ.ఆర్.జీ., ఎస్.టీ.ఎఫ్., సీ.ఆర్.పీ.ఎఫ్., కోబ్రాకు చెందిన దాదాపు 2500 మంది పోలీసు బలగాలు డీ.ఐ.జీ. స్థాయి అర్ధ సైనిక బలగాలు, అధికారుల నాయకత్వంలో కార్డెన్ అండ్ సెర్చింగ్ 'ప్రహార్' పేరుతో పెద్ద ఆపరేషన్‌ను నిర్వహించారు. బీజాపూర్ జిల్లాలో నూకన్‌పాల్, మన్కిల్ నుండి మొదలుకొని గంపూర్ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పరిధిలో గ్రామాలపై దాడి చేసి ఇళ్ళలో ఉన్న సామానును దోచుకున్నారు. దాదాపు 70 మంది ప్రజలను విపరీతంగా కొట్టారు. కొంతమంది మహిళలకు తీవ్రంగా గాయాలయ్యాయి. పిడియా గ్రామం వద్ద అప్కా గుజ్జాల్ అనే రైతుపై కాల్పులు జరపగా అక్కడిక్కడే జూన్ 24న మరణించాడు. పిడియా పై దాడి చేసి తిరిగివెళ్తూ మిర్గన్ గొట్టోడ్ వద్ద గొడ్లను మేపుతున్న 60 సం॥ల ఓయం భీమా అనే ముసలి రైతును పట్టుకొని హత్య చేశారు. ఎన్‌కౌంటర్లో ఇద్దరు నక్సలైట్లు మరణించారని మీడియాలో ప్రకటించినారు. ఈ దాడిలో మురంగ వద్ద గెరిల్లాలు చేసిన దాడిలో ఒక ఎఎస్ఐ తీవ్రంగా గాయపడగా, తర్రెం వద్ద బూబీట్రాప్స్ పేలి 3గ్గురు పోలీసు జవానులు గాయాలయ్యారు.

సుక్మా జిల్లాలో తొండమర్క, పెద్ద కేడ్వాల్, దుర్మా కేంద్రంగా పోలీసు బలగాలు గ్రామాలపై దాడులు నిర్వహించాయి. గ్రామాలపై దాడులు చేస్తున్న పోలీసులపై మన గెరిల్లా బలగాలు కాల్పులు జరిపాయి. పోలీసు కమాండో బలగాలకు మన పీఎల్‌జీఏ కు దాదాపు 9గంటలు హోరాహోరీ పోరాటం జరిగింది. ఆపరేషన్ 'ప్రహార్' పేరుతో వచ్చిన 1500మంది పోలీసులు 5000 వేల తూటాలు, మోటార్ షెల్స్, రాకెట్స్ ప్రజలపై, ప్రజా గెరిల్లాలపై ప్రయోగించారు. కానీ ప్రభుత్వ కిరాయి పోలీసు కమాండోలను 7గురిని చంపి, 4గురిని గాయపర్చి మన ప్రజా గెరిల్లాలు తిప్పి కొట్టాయి. ఈ హోరాహోరీ పోరాటంలో జగురుగొండ ఏసీ సభ్యుడు వీర గెరిల్లా ఊయికే లక్కు అమరులయ్యాడు. ఆపరేషన్ 'ప్రహార్' విఫలం కావడంతో ప్రభుత్వం పోలీసు అధికారులు తొండమర్కలో 15 మంది నక్సలైట్లు మరణించారని మీడియాలో బూటకపు ప్రచారం చేశారు. తమ పోలీసు బలగాల మనోస్థైర్యాన్ని నిలబెట్టుకోవడానికి జిమ్మిక్కులు చేశారు. సుక్మా జిల్లా, కుంట బ్లాక్ కిష్టారం పోలీసుస్టేషన్ పరిధిలోని ఇత్తన్‌పారా గ్రామస్థులు ఇంట్లో నిద్రిస్తుండగా 12 నాడు అర్ధరాత్రి గ్రామాన్ని చుట్టి ముట్టి పొడియామి సన్నాల్, వంజామీ ఉంగాల్ అనే రైతులను ఇంట్లో నుండి పట్టుకెళ్లి ఆగస్టు13న కిష్టారం పోలీసుస్టేషన్ దగ్గర అడవిలో కాల్చి, హత్య చేసి ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారని ప్రచారం చేశారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్.

రాజ్‌నంధ్‌గాం జిల్లాలో జూన్ 29న జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఆగస్టు 6న రాజ్‌నంధ్‌గాం జిల్లా గాథపార అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్లో ఒక ఎస్ఐ, జవాను చనిపోయారు.

భారత విప్లవోద్యమంలో కొనసాగుతున్న ప్రజా యుద్ధాన్ని, పోరాటానికి నాయకత్వం వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర కమిటీల నాయకత్వాన్ని నిర్మూలించడం కోసం 2019లో జరుగనున్న పార్లమెంటరీ ఎన్నికలకు ముందే భారత విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలని సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో దోపిడీ పాలకవర్గాలు రానున్న రెండు సంవత్సరాల విప్లవ ప్రతీఘాతకంలో భాగంగా మిషన్-2017 'సమాధాన్' వ్యూహాన్ని అమలు పరుస్తున్నారు.

విప్లవ ప్రతీఘాతుక పథకాన్ని ఎదుర్కొని ధ్వంసం చేయడం ఓడించడం ద్వారానే విప్లవోద్యమం ముందుకు వెళ్తుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు -ప్రజలు తమకు తాము విముక్తి చేసుకుంటారు- దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలో ప్రజలు, ప్రజా సైన్యమే నిర్ణాయకశక్తి. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో ఎదురయ్యే కష్టనష్టాలను అధిగమించి 50 సంవత్సరాల నక్సల్బరీ మహోత్తర సాయుధ పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ అమరులయిన వందలాది నాయకుల, వందలాది శ్రేణుల, మొత్తం 15వేల మంది ప్రజల, ప్రజావీరుల త్యాగాలను ఎత్తిపడుతు, విప్లవోద్యమంలో వివిధ మలుపులనుండి గుణపాఠాలు నేర్చుకుంటు మన ప్రజా పునాదిని, నిర్మాణశక్తిని, పోరాట శక్తిని పెంచుకుందాం. శత్రువు వేసే ప్రతి సవాల్‌ను సరియైన రాజకీయ సైనిక ఎత్తుగడలతో, అసమాన ధైర్య సాహసాలతో, సరియైన పనిశైలితో బెజ్జి, బుర్కపాల్ లాంటి సాహసిక దాడులతో ఆపరేషన్'ప్రహార్'ను ఓడించిన ప్రేరణతో విప్లవోద్యమాన్ని పురోగమింపచేద్దాం. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను, మిషన్-2017, 'సమాధాన్' పథకాన్ని ఓడిద్దాం. ○

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

# బుర్కపాల్‌లో శత్రువుతో భీకరంగా సాగిన దాడిలో అమరులైన వీరయోధులు

## కా. మడావి బొజ్జ (రవి)

సుక్మా జిల్లా కిష్టారం ఏరియా మైలూరు గ్రామ నిరుపేద ఆదివాసీ కుటుంబం మాడవి కోసి, రమణయ్యలకు మూడవ సంతానంగా బొజ్జన్న (రవి)40 సంIIల క్రితం జన్మించాడు. రవికి ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. బొజ్జన్న కుటుంబం భూమి లేని నిరుపేద కుటుంబం కావడంతో బతుకుదెరువు కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మైలూరు గ్రామం నుండి ఖమ్మం జిల్లాలోని చర్ల మండలం కోనేవాయి గ్రామానికి వలసవచ్చి స్థిరపడ్డారు. కోనేవాయి గ్రామంలో పార్టీ రాజకీయాలు బలంగా ఉండడంతో సహజంగానే బొజ్జన్న బాల్యం నుండే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడయ్యాడు.



దళం వాళ్ళ గ్రామానికి వెల్లిందంటే కా. రవి దళం వద్దకు చేరుకుని దళం పోయే వరకు దళం వద్దనే ఉండేవాడు. బాలల సంఘంలో ఉంటూ గ్రామానికి సంబంధించిన అనేక విషయాలు దళంతో చర్చించేవాడు. పెరిగి పెద్దవాడయిన తరువాత సమాజంలో అసమానతలు చూసి చలించి పోయేవాడు. గ్రామంలోని భూస్వామ్య పెత్తందార్ల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేస్తూ పోరాడాడు. రవి తన చిన్నతనం నుండి తనకున్న కొద్దిపాటి పోడుభూమిలో వ్యవసాయం, కూలీ పని చేసుకుని తన కుటుంబంను పోషించేవాడు.

కా. రవి తన గ్రామానికి దళం వచ్చిందంటే తనకు ఇంటిపనులు ఎన్నిఉన్నా దళానికి రక్షణతో పాటు అనేక పనులు నిర్వహించేవాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలను పార్టీకి పరిచయం చేసే వాడు. గ్రామ సమస్యలను ఎలాంటి కపటం లేకుండా నిస్వార్థంగా, సామరస్యంగా పరిష్కరించేవాడు. అందుకే గ్రామ ప్రజలు కా.రవిని అమితంగా ప్రేమించేవారు. కొనేవాయి ప్రజలు భూమి కోసం అడవి పోడు నరుకుతున్న సమయంలో ఫారెస్టు అధికారులు ఆదివాసీ ప్రజలపై కేసులు పెట్టి అనేక ఆటంకాలు కల్పిస్తుండడంతో అధికారుల జులుంకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించి పోరాడినాడు. జల్-జంగల్-జమీన్, ఆత్మగౌరవం, అధికారం కాపాడుకోవాలని పిలుపునిచ్చాడు.

గ్రామంలో సంఘాన్ని నిర్మాణం చేసినాడు. గ్రామాన్ని గ్రామరాజ్య కమిటీగా అభివృద్ధి చేస్తున్న క్రమంలో ద్రోహి ఇచ్చిన సమాచారంతో 2007లో కా. రవి అరెస్టయ్యాడు.

శత్రువు తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసినా పార్టీ రహస్యాన్ని చెప్పకుండా దృఢ సంకల్పంతో ఉన్నాడు. తన పట్టుదలను చూసిన శత్రువు ఇంకా ఏమి రాబట్టలేమని కా. రవి పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపాడు. సంవత్సర కాలంలో జైలులో ఉండి ఖైదీల హక్కుల సాధనకై పోరాడాడు. రవిలో ఉన్న విప్లవ సంకల్పంతో శత్రువు నిర్బంధం, చిత్రహింసలు, జైలు గోడలు తన పట్టుదలను సడలించలేకపోగా, మరింత వర్గకసిని రగిలించింది.

కా. రవి జైలు నుండి విడుదల అయిన తర్వాత, కోర్టు వాయిదాలకు పోతూనే పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నాడు. రవి కి నలుగురు పిల్లలు, (ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు) ఉన్నారు. రవి పార్టీ పని చేస్తున్న సమయంలో రవి భార్య కోసి కూడా అనేక నిర్బంధాలను ఎదుర్కొంది. రవి కోర్టుల చుట్టు తిరుగుతున్నప్పటికీ పోలీసుల వేదింపులు తగ్గకపోగా మరింత అధికమైనవి. దీనితో రవి పార్టీ పిలుపు మేరకు కుటుంబాన్ని వదిలి భార్యకు ప్రజా పోరాటం గురించి వివరించి భూమి, భుక్తి, విముక్తికై పోరాటమే మార్గమని అర్థం చేపించి పూర్తి కాలం కార్యకర్తగా 2012లో పార్టీలో భర్తీ అయ్యాడు. మావోయిస్టు పార్టీ చెప్పిన రాజకీయాలను వింటు భారతదేశం అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య స్వభావం అని అర్థం చేసుకుని నూతన ప్రజాస్వామిక విప్లవమే ప్రజల విముక్తికి సరైన మార్గమని నమ్మి ప్రజాయుద్ధ బాట పట్టాడు.

పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను మనస్పూర్తిగా స్వీకరించి అంకితభావంతో పనిచేసాడు. కా. రవి జీవితమంతా విప్లవ కార్యకలాపాల నడుమనే వికసిస్తు వచ్చింది. అందరితో కలిసిమెలిసి ఆప్యాయంగా ఉండేవాడు.

కా. రవి ఇంటివద్ద చదుకుకోలేదు. దళంలో రోజు వారి సమిష్టిలో (సెంట్రీ, కోరియర్, వంట) పాల్గొంటూనే పట్టుదలతో చదువు నేర్చుకున్నాడు. తనకంటే చిన్నవాళ్ళు బాధ్యులుగా ఉన్నప్పటికీ వారు చెప్పే పనులు ఓపికగా చేస్తూ రానివాటిని అడిగి తెలుసుకొని నేర్చుకునేవాడు. తనకు తెలియని తెలుగు భాష నేర్చుకుని తన తోటి సభ్యులకు కూడా చెప్పేవాడు. పార్టీలోకి వచ్చిన 3 సంIIరాలకు అతి తక్కువ కాలంలోనే ఏ.సీ. మెంబర్‌గా 2015లో ప్రమోట్ అయినాడు. కా. రవి ఎల్.జీ.ఎస్. కమాండర్‌గా ఉంటూ ఏరియాలో చిన్న చిన్న మిలిటరీ చర్యలు చేస్తూ మిలీషియాకు

మిలిటరీ ట్రైనింగ్ ఇస్తూ రాజకీయాలు చెప్పేవాడు. ఎల్.జీ.ఎస్. కమాండర్‌గా తన బాధ్యతల్లో 2సం॥రాలు పనిచేసాడు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటూ తన కమిటీలో చేసుకున్న తీర్మానాలు, కార్యక్రమాలు అమలు చేస్తూ తన సభ్యులతో చేయించేవాడు.

తన తోటి కమిటీ సభ్యులు, దళ సభ్యులు శత్రు నిర్బంధానికి భయపడి శత్రువు చూపించే ఆశలకు, వాడు ఇచ్చే ఎంగిలి మెతుకులకు ఆశపడి శత్రువు ముందు మోకరిల్లి, వాడి ఆశల ఉచ్చులో చిక్కి ద్రోహులుగా మారినా కా. రవి దృఢంగా నిలబడి పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించేవాడు. శత్రువు పెట్టిన చిత్రహింసలు, వయస్సుతో వచ్చిన అనారోగ్య సమస్యలు ఎన్ని ఉన్నా వాటిని లెక్క చేయకుండా తన దళానికి రోజువారి కార్యక్రమాలకు ఆటంకం కాకుండా చూస్తు ప్రజల కోసం పట్టుదలతో పనిచేసాడు.

శత్రువు నిర్బంధం మూలంగా చాలా మంది నాయకత్వ కామ్రేడ్స్ శత్రువు ముందు దిగజారి పోయి లొంగిపోవడం మూలంగా ప్రజలపై శత్రువు దాడులు పెరిగి నిర్మాణాలు దెబ్బతిని ఖమ్మం జిల్లా ఉద్యమం గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్న క్రమంలో పార్టీ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 2017లో చర్ల ఎల్.ఓ.ఎస్. కమాండర్‌గా బాధ్యతలు అప్పగించగా రవి సంతోషంగా స్వీకరించి ఏరియాలో ప్రజలను సమీకరించి దెబ్బతిన్న నిర్మాణాలను పునర్నిర్మాణం చేస్తూ ప్రజలను నిర్మాణంగా, రాజకీయంగా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేసినాడు.

పట్టుదలతో పనులు చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారం చేస్తూ దోపిడీ పాలక వర్గాల కుటిల నీతి, సంస్కరణలు ఎండగడుతూ శత్రు నిర్బంధం మధ్యలోనే ఏరియాలోని గ్రామాలను తిరుగుతు ప్రజలతో సంబంధాలు, పరిచయాలు పెంచుకున్నాడు. కా. రవికి వర్గ శత్రువు అన్నా, శత్రు నిర్మూలన అన్నా ముందుండేవాడు. అందుకే ఏరియాలో ఇన్‌ఫార్మర్ల, పోలీసుల నిర్మూలనకై ప్రయత్నించేవాడు. అందుకే 2017లో టీ.సీ.ఓ.సీ., మాస్ వర్క్ సంయుక్తంగా నడుస్తున్న క్రమంలో కా. రవి బాధ్యతల రీత్యా ఆర్గనైజేషన్‌కు పోవలసి ఉండే. కానీ శత్రు దాడిలో పాల్గొంటానని పట్టుపట్టి కా. రవి ఏప్రిల్24, 2017న బూర్కపాల్ అంబూష్‌లో పాల్గొని హోరాహోరి పోరాటంలో కా. రవి తలకు తూట తగిలి అమరత్వం చెందాడు. కా. రవి తన నులివెచ్చని రక్తాన్ని ధారబోసి 25 మంది సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలను అంతమొందించి, ఆయుధాల పంట పండించిన వీరయోధుడు. కా. రవి అమరత్వం తెలంగాణ ఉద్యమానికి ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం-ఈస్ట్ గోదావరి డివిజన్ ఉద్యమానికి తీవ్రమైన నష్టం. కానీ భవిష్యత్‌కు బాటలు వేసాడు. కా. రవి త్యాగం, ధైర్యం, సాహసం మనకు ఆదర్శం. ఆ త్యాగాన్ని, ఆదర్శాలను ఎత్తిపడుతు కా. రవి ఆశయాన్ని కొనసాగిద్దాం.

## కా. మడ్కాం దేవాల్ (అనిల్)



మడ్కాం దేవాల్ బుర్‌గుం పంచాయితీకి చెందిన డోరెపార. ఇక్కడ అనేక పేద కుటుంబాల మాదిరిగానే కా. దేవాల్ (అనిల్) కుటుంబం కూడా తమ బతుకుదెరువును వెతుక్కుంటూ బీజాపూర్ జిల్లా ఊసురు బ్లాక్ లింగపురం వూళ్లో స్థిరపడ్డారు. ఆ సమయంలో చిన్న పిల్లవాడుగా వున్న దేవాల్‌ను ఒక గంపలో కూర్చోబెట్టి తీసుకపోయారు. ఇతని తల్లి దండ్రులు దేవాల్ అని పేరు పెట్టారు. పార్టీలో దక్షిణ బస్తర్, దర్భ డివిజన్‌ల్లోని ప్రజలందరికీ అనిల్‌గా పరిచయం.

వర్గ రీత్యా నిరుపేద కుటుంబానికి చెందిన అనిల్ స్వాభావికంగానే విప్లవం పట్ల చిన్న వయస్సులోనే ఆకర్షితుడయ్యాడు. చివరి వరకు అనేక కఠిన పరిస్థితుల్లో కూడా ప్రజల పట్ల విప్లవ రాజకీయాల పట్ల విప్లవ పార్టీపై అచంచల విశ్వాసంతో పనిచేశాడు.

1998లోనే గ్రామంలో బాలల సంఘంలో సభ్యత్వం తీసుకున్న అనిల్ 2004లో వృత్తి విప్లవకారునిగా తన జీవితం మొదలై, అంచెలంచలుగా ప్లాటూన్ పార్టీ కమిటీ కార్యదర్శి స్థాయి వరకు ఎదిగాడు. పామేడ్ ఏరియాలో ఎల్.జీ.ఎస్. సభ్యునిగా పని చేస్తూ ప్రజల విశ్వాసం చూరగొన్నాడు. తర్వాత కంపెనీ-3లోకి నాయకత్వ కామ్రేడ్‌కు గార్డ్‌గా బదిలీ అయ్యాడు. ఇతనిలో వున్న మిలిటెన్సీ, చొరవను గమనించిన నాయకత్వ కామ్రేడ్స్ అనిల్‌ను దక్షిణ రీజయన్ స్థాయి ఏ.టీ.లోకి తీసుకున్నారు. ఆ సమయంలో అనేక యుద్ధ చర్యల్లో పాల్గొన్నాడు. 2008లో గాదేరాస్ వద్ద ఒక ఎస్.ఐ., పోలీసు జవాన్ పై కత్తులతోనే దాడి జరిపి ఇద్దరిని చంపి వారి నుండి ఒక ఎస్.ఎల్.ఆర్. మరొక ఇన్‌సాస్ స్వాధీనం చేసుకున్నారు.

2009లో పార్టీ దళాలు కొత్తగా విస్తరించిన దర్భ డివిజన్‌లోకి బదిలీ అయ్యాడు. ఈ డివిజన్‌లో ముందు మలింగేర్ ఎల్.జీ.ఎస్. కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. 2010 ఏప్రిల్ 6న 75

మంది సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలను మట్టికరిపించిన చారిత్రాత్మకమైన ముకురం దాడిలో చురుకుగా పాల్గొన్నాడు. 2011లో పీ.ఎల్. కమాండర్‌గా 2015లో ప్లాటూన్ పార్టీ కమిటీ కార్యదర్శిగా కూడా బాధ్యతలు చేపట్టాడు. పార్టీ ద్వారా ఇవ్వబడ్డ ఏ పనినైనా ఎటువంటి వూగిసలాట లేకుండా చేపట్టాడు.

కిరందుల్ బస్తీ మధ్యలోనే రోడ్డుపై గస్తీ నిర్వహిస్తున్న పోలీసులపై జరిపిన క్లేమోర్ దాడి అనిల్ నాయకత్వంలోనే జరిగింది. ఇందులో 6గురు పోలీసులు చనిపోయారు. ఇద్దరు పోలీసులు గాయపడ్డారు.

కా. అనిల్ దక్షిణ సబ్ జోన్‌లో జరిగిన అనేక యుద్ధ చర్యల్లో పాల్గొన్నాడు. రాణిబోదిలీ, జీరంఘాటీ, తాడిమెట్ల లాంటి వీరోచిత చారిత్రక ఘటనల్లో పాల్గొన్నాడు. 2007లో జరిపిన ఉర్పల్ మెట్ట యుద్ధ చర్యలో పాల్గొని తన తుపాకిలోని తూటాలు అయిపోయిన వెంటనే గొడ్డలితోనే పోలీసులను చంపి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంలో ముందున్నాడు. కా. అనిల్ పాల్గొన్న ఘటనలు పదుల సంఖ్యలోనే ఉంటాయి. అనేక చర్యల్లో అస్సాల్ట్ పార్టీలో పాల్గొని శత్రువును సంహరించి ఆయుధాలు జప్తు చేసుకోవడంలో ముందుండి పీ.ఎల్.జీ.ఏ.ను సాయుధం చేశాడు. కొన్ని చర్యల్లో స్కౌట్ పార్టీలో ముఖ్య భూమిక నిర్వర్తించాడు.

కా. అనిల్ శత్రువుతో తలపడే యుద్ధంలో శత్రువుపై వర్గ కసితో ధైర్యంగా దూకుడుగా దాడులలో పాల్గొనేవాడు. దర్భ ఏరియాలో శత్రువుపై చేసిన దాడులలో ప్రముఖ పాత్ర పోషించాడు. 2013లో జీరంఘాటీ దాడిలో సల్వాజుడుం నేత, అనేక గ్రామాలను ధ్వంసం చేసిన, ఆదివాసీ ప్రజల ధన, మాన, ప్రాణలను అర్పించిన పరమ కిరాతకుడు మహేంద్రకర్మతో పాటు మరో 30 మంది ప్రజా వ్యతిరేకులను హతం చేసిన ఈ ఘటనలో పాల్గొన్నాడు. 2014లో టాకవాడ లో జరిగిన ఘటనలో కూడా పాల్గొన్నాడు.

యుద్ధ చర్యలు నిర్వహించడానికి ముందు అనేకంగా జరిపిన రెక్కీల్లో దేవాల్ పాల్గొన్నాడు. రెక్కీలో లభ్యమైన వివరాలను బాధ్యుల ముందుంచేవాడు. దానికి సరిపోయే విధంగా ప్లానింగ్ చేయడంలో కూడా అనిల్ పాత్ర వుండేది. పార్టీ క్రమశిక్షణను పాటించడంలో ముందుండేవాడు. రాత్రి, పగలు, అలసటను లెక్క చేయకుండా పని చేయడం కా. అనిల్ అలవాటుగా మార్చుకున్నాడు. ఎంతటి అనారోగ్య సమస్య ఎదురైనా కింద పడిపోయే వరకు కూడా పని చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన ఆదర్శ విప్లవకారుడు.

అనేక మిలిటరీ శిక్షణా క్యాంపుల్లో పాల్గొని మిలిటరీ నిపుణత, మెలకువలు అలవర్చుకున్నాడు. గెరిల్లా యుద్ధ నియమాలు ఖచ్చితంగా పాటించడంలో ముందుండే వాడు. తనకిచ్చిన బాధ్యత నిర్వర్తించడంలో పట్టుదలతో పని చేసేవాడు. తన గురించి ఇతరుల ముందు ప్రదర్శించడం దేవాల్ (అనిల్)కు గిట్టదు. తన వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చేవాడు. ప్రజల్లో ఒకడిగా కల్సిపోతూ కేడర్‌తో కూడ సన్నిహితంగా వుండేవాడు.

దర్భ డివిజన్‌లో 2010 నుండి జరుగుతున్న మెజారిటీ టీ.సీ.ఓ.సీ.ల సఫలతల్లో కా.అనిల్ భూమిక ముఖ్యమైనది. బ్రాహ్మణవాద హిందూ భాజపాకు చెందిన ప్రజా వ్యతిరేకులైన వారిని ఖతం చేయడంలో దేవాల్ భూమిక వుంది. మొత్తంగా దక్షిణ్ సబ్ జోన్‌లో జరిగిన యుద్ధ చర్యల్లో కా. అనిల్ పాల్గొనకుండా వున్నవి చాలా తక్కువ. ఇలాంటి మిలిటరీ అనుభవం కల్గి ఎంతో క్రమశిక్షణ, వినమ్రత కల్గిన కా. అనిల్‌ను కోల్పోవడం వల్ల ఉద్యమానికి జరిగిన నష్టం వెంటనే పూడ్చుకోలేనిదే.

శత్రువు కార్పెట్ సెక్యూరిటీని మరింత విస్తరిస్తూ ఉద్యమ నిర్మూలనకు మిషన్-2017 చేపట్టాడు. నాయకత్వ నిర్మూలనకై శత్రువు దూకుడుగా చేస్తున్న దాడులను ఎదుర్కోవడంలో భాగంగా చేపట్టిన టీ.సీ.ఓ.సీ.లో ఏప్రిల్ 24, 2017వ తేదీన రోడ్డు నిర్మాణ పనుల కోసం రక్షణగా వున్న సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలపై బుర్కపాల్ క్యాంపుకు అతి సమీపంలో చేసిన దాడిలో 25 మంది జవానులు ఖతం అయ్యారు. ఈ దాడిలో కామ్రేడ్ అనిల్ సాహెూసోపేతంగా, అత్యంత ధైర్యసాహసాలతో శత్రువుపై కాల్పులు జరుపుతూ అమరుడయ్యాడు. రాబోయే సమయంలో కా. అనిల్ అమరత్వం స్ఫూర్తితో జరగబోయే యుద్ధ చర్యల్లో, అనేక సెక్షన్ల ప్రజలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై జరిపే ప్రజా పోరాటాల్లో కా.అనిల్‌ను చూసుకుందాం. మనం నిర్వహించే యుద్ధ చర్యల ద్వారా, ప్రజ ఉద్యమాల ద్వారా విప్లవానికి మరింతగా పెరుగుతున్న అనుకూల పరిస్థితులను వుపయోగించుకుంటూ మన శక్తుల్ని పెంచుకుందాం. గ్రీన్‌హంట్ ఆపరేషన్ మూడవ దశను మిషన్-2017ను ఓడిద్దాం.

కా. అనిల్ ఆశయ సాధనకై చివరి వరకు పోరాడుదాం. కా. అనిల్ విప్లవ స్ఫూర్తిని, అంకితభావంతో ప్రజల కోసం పని చేయడాన్ని అలవర్చుకుందాం. ○

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

(..........చివరి పేజీ తరువాయి)

ప్రహ్లాద్ జోషి లక్ష రూపాయల ఆభరణాల విషయంలో మోసం చేసారనే ఆరోపణ చేసింది. దీనిపైన జోషి గౌరి పైన పరువునష్టం దావా వేశాడు. 2016లో కోర్టు తీర్పు గౌరికి వ్యతిరేకంగా వచ్చింది. ఆమెకు కోర్టు 6నెలలు జైలుశిక్ష వేయగా, అదే రోజు ఆమెకు బెయిల్ దొరికింది. బి.జె.పి., ఆర్.ఎస్.ఎస్. నాయకులు అప్పుడే ఈ కేసు ఉదాహరణగా చూపి జర్నలిస్టులందరికీ అదే గతి పడుతుందని హెచ్చరికలు చేసారు. గౌరి హత్య జరిగిన వెంటనే ప్రహ్లాద్ జోషి 'హిందూ రాజకీయాలను వ్యతిరేకిస్తే గౌరికి పట్టిన గతే పడుతుందని' బాహటంగా హెచ్చరికలు జారీ చేసాడు.

గౌరీ లంకేశ్ హిందూవాదుల టార్గెట్‌లో ఉందనే విషయం ఆమెకు, సమాజానికి స్పష్టంగా తెలుసు. అయితే గౌరీ లంకేశ్ తనకు నిరంతరం సెల్‌ఫోన్‌లో వస్తున్న చావు హెచ్చరికలను లక్ష్య పెట్టలేదు. ఆమెకు ప్రాణహాని ఉందని శంకించి-జాగ్రత్త అని హెచ్చరించిన ఒక మిత్రునికి ఆమె "మన మౌనంలోనే అసహన భావజాలానికి శక్తివస్తుంది' అనే సందేశాన్ని పంపింది. అందుకే దేశ ప్రజలు ఈనాడు గౌరి ధీరవనిత అని పొగుడుతూ, 'నేను కూడ గౌరీనే' అంటూ నినదిస్తున్నారు.

ఈ హత్య జరిగిన తర్వాత ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య హత్యపై విచారణకు ఆదేశించడంతో పాటు, గౌరి తండ్రితో గల సాన్నిహిత్యంతో ఆమె అంత్యక్రియలను ప్రభుత్వ లాంచనాలతో జరిపించాడు. అయితే ఇప్పటివరకు ఎం.ఎం. కల్బుర్గీ హత్యపై సాక్ష్యాధారాలు సంపాదించలేకపోయాడు. గౌరీ లంకేశ్ హత్యపై కూడా ఇదే తంతు కొనసాగక తప్పదు. బి.జె.పి., కాంగ్రెస్‌లు రెండు హిందూ ఓటు బ్యాంకు కోసం తాపత్రాయపడేవి కాబట్టి ఈ పార్టీలు హంతకులను పట్టుకుని శిక్షించడంను నెత్తికెత్తుకోవు. నరేంద్ర ధబోల్కర్, గోవింద్ పన్సారే హంతకులను కూడా ఇప్పటివరకు పట్టుకోలేకపోయారు. దీనితో హిందూ పరివార్ శక్తులు పెచ్చరిల్లి ఈ హత్యలకు సిద్ధపడుతున్నాయి. గౌరీ లంకేశ్ హత్య తర్వాత దేశవ్యాప్తంగా పెల్లుబుకిన ఆందోళనతో గగ్గోలు పడిన బి.జె.పి. ఈ హత్య మావోయిస్టులు చేసారని దుష్ప్రచారాన్ని చేపట్టింది.

గౌరికి స్వయాన తమ్ముడైన ఇంద్రజిత్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో 'గౌరి హత్యలో మావోయిస్టుల హస్తం కూడా ఉండవచ్చు' అని అనుమానం వెలిబుచ్చాడు. గౌరి చెల్లి కవిత మాత్రం దాన్ని ఖండించింది. అప్పటికే బి.జె.పి. నాయకులంతా మావోయిస్టులే గౌరిని హత్య చేసారని ప్రచారం చేస్తున్నారు. కాబట్టి తను అలాంటి ఆరోపణ చేయనని కవిత చెప్పింది. ఇంద్రజిత్ బి.జె.పి. పార్టీలో యాక్టివిస్ట్‌గా పని చేయడానికి నిశ్చయించుకొన్నాడు. బి.జె.పి. నాయకులు అత్యంత నీతి బాహ్యమైన పద్ధతిలో గౌరి తన హత్యకు ముందు చేసిన సోషల్ మీడియా పోస్టును ఆధారం చేసుకొని, తమ స్వప్రయోజనాలకు మావోయిస్టులపై ఈ ఆరోపణకు పాల్పడ్డారు. పోస్టులో "మన వారిలోనే కొందరు తమలో తామే కలహడుకుంటున్నారని నాకెందుకో అనిపిస్తుంది? 'పెద్ద శత్రువు' ఎవరో మనందరికీ తెలుసును. దాని మీద మనం దృష్టి పెట్టలేమా? అని గౌరి తన పోస్టులో పేర్కొన్న విషయాన్ని హిందూత్వవాదులు తాము చేసిన హత్యను మావోయిస్టు పార్టీకి అంటగట్టి ప్రచారం ప్రారంభించారు. కాని హిందుత్వవాదుల ఈ అసత్య ప్రచారాన్ని దేశ ప్రజలు నిర్ద్వంధంగా తిరస్కరించారు. మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఈ హత్యకు మాకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటన చేసాడు.

హిందుత్వ వాదులు హిట్లర్ వారసత్వాన్ని ఈ దేశంలో కొనసాగిస్తున్నారు. 'దిగ్భ్రాంతితో, భీభత్సంతో, విద్రోహంతో, హత్యతో శత్రువు మనో బలాన్ని దెబ్బతీయాలని' అనే హిట్లర్ చేసిన భాష్యాలను అనుసరిస్తూ దేశంలో భిన్నాభిప్రాయాలు వుండి, హిందూత్వ ఎజెండాను వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామిక శక్తులను హత్యలు చేస్తున్నారు.

గౌరి హత్య జరిగిన రాత్రి నుండే దేశవ్యాప్తంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలియజేసారు. దేశమంతటా అనేక ప్రదర్శనలు జరిగాయి. ఈ హత్యను దేశ ప్రజలతో పాటు అంతర్జాతీయంగా ప్రజలు ఖండించారు. ఆమెను హిందూ ఫాసిస్టుల బుల్లెట్లు మాట్లాడకుండా చేయవచ్చునేమో గాని, ఆమె దశాబ్దాలుగా వెలిబుచ్చిన అభిప్రాయాలు, ఆమె నిర్వహించిన కార్యకలాపాలు హిందూ ఫాసిస్టులను వెంటాడి వేధిస్తూనే వుంటాయి. గౌరి శారీరకంగా మరణించినా, ఆమె భావాలను హిందూ ఫాసిస్టులు చెరిపివేయలేరు. అవి ప్రజల్లో మరింత ఆక్రోషాన్ని పెంచుతాయి. బి.జె.పి. అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆర్.ఎస్.ఎస్. తన హిందూ రాష్ట్ర నిర్మాణం కోసం దూకుడుగా ముందుకు సాగుతున్నది. సామ్రాజ్యవాదులు తమ ప్రయోజనాల కోసం ఈ విధానాలకు ఊతం ఇస్తున్నారు. హిందూ మత రాజకీయాలకు దేశంలో ఎన్నడూ లేనంతగా బలం పెరుగుతున్నది. హిందూ మత రాజకీయాలకు వ్యతిరేకంగా దేశంలోని, మైనారిటీలు, దళితులు, జాతులు, లౌకిక శక్తులు, దేశభక్తులు, కార్మికులు, కర్షకులు, పెటీ బూర్జువాలు కలిసి మిలిటెంట్‌గా పోరాడడం ద్వారానే గౌరి లాంటి హత్యలను నిరోధించగలం. ○

# ప్రముఖ జర్నలిస్టు, ప్రజాస్వామిక వాది గౌరీ లంకేశ్ హత్యను యావత్తు ప్రజలు ఖండించాలి!

బెంగుళూరు లోని తన నివాసంలో గౌరి సెప్టెంబర్ 5న హిందూ ఫాసిస్టు హంతకుల దాడిలో నేల రాలింది. తన పత్రిక ఆఫీసునుండి గౌరీ లంకేశ్ సాయంత్రం ఇంటికి చేరి గేట్లు తెరిచి ఇంట్లోకి ప్రవేశించే సమయంలో హంతకులు ఆమెపై బుల్లెట్లు కురిపించారు. ఒక బుల్లెట్ తలలోకి, రెండు బుల్లెట్లు చాతిలోకి దూసుకుపోయాయి. గౌరి అక్కడే కుప్ప కూలిపోయింది. గతంలో హేతువాదులు, అయిన నరేంద్ర ధబోల్కర్ (2013), గోవింద్ పన్సారే (2015), ఎం.ఎం. కల్బుర్గీ (2015) లను హత్య చేసిన రీతిలోనే హిందూ ఫాసిస్టు హంతకులు గౌరిని కూడ హత్యచేసారు. ఇప్పటికీ కేంద్రంలో బి.జే.పి., రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హంతకులను అరెస్టు చేయలేదు. సరికదా! ఎవరో కనీసం నిర్ధారించ లేకపోయింది.



కవి, జర్నలిస్టు, 'లంకేశ్' వారపత్రిక స్థాపకుడు అయిన పి. లంకేశ్‌కు పెద్ద కూతురు గౌరి. గౌరీ లంకేశ్ వయస్సు 55 సంవత్సరాలు. ఆమెకు ఒక సోదరి, సోదరుడు ఉన్నారు. వీరిద్దరు కవల పిల్లలు. ప్రముఖ జర్నలిస్టు చిదానంద రాజఘట్టాతో గౌరీ లంకేశ్ వివాహం జరిగింది. ప్రస్తుతం వీరిద్దరు విడాకులు తీసికున్నారు. గౌరి కూడా ప్రముఖ జర్నలిస్టుగా పని చేసింది. మొదటగా బెంగుళూరులో టైమ్స్ ఆఫ్ ఇండియా, వివాహానంతరం ఢిల్లీలోకి మారింది. ఆమె 'సండే' ఇంగ్లీష్ పత్రికతో పాటు, ఈనాడు టి.వి. తెలుగు న్యూస్ చానల్‌లో కూడా పని చేసింది. గౌరి ప్రస్తుతం బెంగుళూరులో తన ఇంటిలో ఒంటిరిగానే నివసిస్తున్నది.

2000 సంవత్సరంలో తండ్రి చనిపోయిన తర్వాత 'లంకేశ్' పత్రిక వారసత్వాన్ని కొనసాగించడానికి గౌరీ 'లంకేశ్' పత్రికకు ఎడిటర్‌గా బాధ్యతలు తీసికొంది. ఈ పత్రికకు ప్రొపరైటర్, పబ్లిషర్‌గా తమ్ముడు ఇంద్రజిత్ బాధ్యతల్లో ఉన్నాడు. వీరిద్దరి మధ్య 2005లో భిన్నాభిప్రాయాలు ముందుకు వచ్చాయి. గౌరి నక్సలైట్లకు అనుకూలంగా పత్రికలో వ్యాసాలు ప్రచురిస్తున్నదనీ, 'లంకేశ్' పత్రిక సైద్ధాంతిక అవగాహనను దెబ్బతీస్తున్నదనీ ఇంద్రజిత్ ఆరోపిస్తూ అడ్డు తగిలాడు. దానితో ఆ పత్రిక నుండి విడివడి ఆమె 'గౌరీ లంకేశ్ పత్రిక'ను ప్రారంభించి కొనసాగిస్తున్నది.

గౌరీ ఫెమినిస్టుగా, దళితులకు మద్దతుగా రచనలు చేయడంతో పాటు, హిందూ బ్రాహ్మణీయ రాజకీయాలకు వ్యతిరేకంగా తీవ్రమైన విమర్శలతో కూడిన రచనలు చేస్తుంది. ఆమె కర్నాటకలోని పూజారి వర్గం అనే గోడను కూల్చివేసి, శివుని ముందు అందరిని ఒకటి చేసిన బసవన్న సంప్రదాయానికి చెందిన భావజాలం కల్గివుంది. ఇప్పుడు కర్ణాటక లింగాయత్‌ల నుండి 'మేము హిందూమతంకు చెందినవారం కాదని, మమ్మల్ని వేరుగా గుర్తించాలనే' డిమాండ్ వస్తోంది.

ఆమె నక్సల్బరీ రాజకీయాల పట్ల సానుభూతి కల్గి ఉంది. కర్ణాటకలో మావోయిస్టు పార్టీ నాయకుడైన సాకేత్ రాజన్‌తో గౌరికి మంచి స్నేహబంధం ఉండేది. గౌరి కంటే రెండేళ్ళు సీనియర్‌గా వారిరువురికి యూనివర్సిటీ లోనే పరిచయం ఉంది. కా. సాకేత్ రాజన్ కర్ణాటక రాష్ట్ర మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా ఆమెతో రాజకీయ సంబంధాలు కొనసాగాయి. 2005లో సాకేత్ రాజన్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన వెంటనే గౌరి ప్రభుత్వ చర్యను ఖండించింది. 'కర్ణాటక రాష్ట్రంలో పుట్టిన గొప్ప మేధావుల్లో కెల్లా ఒక మేధావిగా' ఆయనను ప్రశంసిస్తూ, ఆయన పేద ప్రజల కోసం అడవుల్లో తుపాకి పట్టి పోరాడే యోధుడిగా కూడా కొనియాడింది. సాకేత్ రాజన్ శవాన్ని వారి కుటుంబానికి అప్పజెప్పాలనే ఆందోళనలో చురుకుగా పాల్గొన్నది. కాని ప్రభుత్వం విద్యుత్ స్మశాన వాటికలో కాల్చి వేసిన విషయం తెలిసిందే. దత్తాత్రేయ పీఠం పేరుతో బాబా బుడాగిరి సూఫీ దర్గాను, కొండను సంఘ్ పరివార్ ఆక్రమించుకొని హిందూ దేవాలయంగా మార్చాలనే కుట్రకు వ్యతిరేకంగా కర్నాటకలోని మైనారిటీ, ఆదివాసీ, సోషలిస్టు, వామపక్ష వాదులు, మావోయిస్టులు, పర్యావరణవాదులు జరిపిన పోరాటాలతో గౌరీ లంకేశ్ గొంతు కలిపింది. ఆమె పత్రిక ఈ పోరాటాన్ని ఎత్తిపట్టింది. గౌరి 2008లో తన పత్రికలో బి.జె.పి. ఎం.పి.

(మిగతా 55వ పేజీలో......)